భారతి

సాహిత్య మాస పత్రిక

మార్చి 1985



వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

మార్చి - 1985

సంపుటము : 62 సంచిక : 3

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

మార్చి 1985

శ్రీమతి యామినీ కృష్ణమూర్తి (ముఖచిత్ర వ్యాసం)	"వాసు"	3
గోపీచంద్- సాహిత్య జీవిత దృక్పథం	శ్రీ మాదిరాజు రంగారావు	5
వేదపండితుని కాశ్మీరు జరీ శాలువా	శ్రీ ముదివేడు ప్రభాకరరావు	11
అన్నమాచార్యచరిత్ర-సంకీర్తన అవతారిక-ఒకపరిశీలన	శ్రీ మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యము	13
హళేబీడులో	శ్రీ జె. బాపురెడ్డి	17
వగపేటికి పాలు చిందినన్	శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం	18
శ్యామలాంబాగరీయసి, నీటిబిందువు	శ్రీ కె. కిశోరుబాబు శ్రీ కె. అశోకుబాబు	20
కోకిలపాటల మేటికవి-శ్రీ తురగా!	శ్రీ శివలెంక ప్రకాశరావు	21
ఉపాంతోపద్రవము	డా. చల్లా రామచంద్రశాస్త్రి	26
దేముడా నా దేశాన్ని రక్షించు (పెద్దకథ)	శ్రీ బలివాడ కాంతారావు	27
మంచుబొమ్మ	ఆచార్య తిరుమల	32
నన్నయ నానారుచిరార్థ సూక్తి నిధిత్వం	డాక్టర్. ఎస్. గంగప్ప	33
భాద్రపదంలోని మేఘం	శ్రీ గజానన్ తామన్.	38
నివేదన	శ్రీ యస్. వి. యస్. కిశోర్‌కుమార్	38
దంతకథలు	కన్నడమూలం. డా. యం. చిదానందమూర్తి తెలుగు : శ్రీ ఘట్టమరాజు	39
మధ్యతరగతి హృదయం!	డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు	42
ప్రబంధ రత్నాకరము - తృతీయాశ్వాసము ప్రత్యంతర విశేషములు	ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి	43
విప్పంటుకుంది	డా॥ సి. నారాయణరెడ్డి	49
మినీకవిత	శ్రీ ముదిగొండ ఈశ్వర చరణ్	50
నల్లమబ్బుకో వెండిఅంచు (సీరియల్)	శ్రీ ఘండికోటబ్రహ్మాజీరావు	54
పుస్తకంగా దేశం నమస్తం	శ్రీ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి	60
కలగూరగంప		61
గ్రంథ విమర్శలు		7[illegible]

"వాసం"

శ్రీమతి యామినీ కృష్ణమూర్తి



భావము, రాగము, తాళము ఈ మూడు మిళితమైన నాట్యము లలితకళలలో శ్రేష్ఠమైన కళ. ఉన్నతస్థాయిలో కళకళలాడుతూ భారత దేశమంతట ప్రదర్శనలిచ్చిన కళాకారిణి శ్రీమతి యామిని. అంతియే కాదు, అన్ని విదేశాలలో ఎన్నోసార్లు పర్యటన చేసి, బిరుదులను మన్ననలను అందుకొని, మనదేశపు ప్రాచీన కళల సంపదను విదేశీయులకు పంచిపెట్టి, ఘనసేవచేసిన ప్రౌఢి కూచిపూడి, భరతనాట్య నర్తకి, శ్రీమతి యామినీ కృష్ణమూర్తి.

నేడు న్యూఢిల్లీలో స్థిరపడినప్పటికీ, వీరు కడప జిల్లా రాయచూటి తాలూకాకు చెందిన వారు. ఈమె తండ్రి శ్రీ కృష్ణమూర్తి కళాశాలలో ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు. నాట్యశాస్త్ర సాంప్రదాయాలలో వీరు నిష్ణాతులు. శ్రీమతి యామిని ఎక్కడ ప్రదర్శనలిచ్చినా తండ్రిగారు వ్యాఖ్యాతగా వ్యవహరించెడివారు. ఆ ప్రదర్శనకు అదియే ఒక ముఖ్యత్వము.

ప్రదర్శనలో ఒక్కొక్క అంశమునకును చప్పట్లు జూరుకొనుట పరిపాటి. త్రికాల నృత్తము, నృత్యము. పలుకరించే అభినయము ఈమె సొంత సొత్తు.

వాగ్గేయ త్రిమూర్తులలో ఒకరైన శ్యామశాస్త్రి రచించిన క్లిష్టమైన 'స్వరజతి'కి నృత్యమును సమకూర్చి ప్రదర్శించిన ఘనత ఈమెకే చెందును.

భామాకలాపములోని ఒక దరువులో "భరతశాస్త్రనిధి నీవేరా ' అనుచోట ' 4. 5 సార్లు వేర్వేరు అభినయములను ప్రదర్శించిన మేటి నర్తకీమణి.

సుప్రీంకోర్టు న్యాయవాదిని వివాహమాడి, న్యూఢిల్లీలో స్థిర పడియున్నారు.

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARES ABOUT NEWSPAPER

BHARATI

FORM IV (See Rule . 8)

1. Place of Publication : Vijayawada
2. Periodicity of Publication : MONTHLY
3 Printer's Name : S Radha Krishna
Whether citizen of India : Yes
Address : 14.14.21' Mallikarjuna Rao St., Vijayawada-3.
4 Publisher' Name : Sri S. Radhakrishna
Whether Citizen of India : Yes
Address : 14-14-21, MallikarjunaRao St., Vijayawada-3.
5. Editor's Name : S. Radhakrishna
Whether citizen of India : Yes
Address : 14.14.21, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada.3
6 Names and addresses of individuals who own the news paper and partners or share. holders holding more than one percent of the total capital
   1. Name : S Kamakshmma
   1, Luz Avenue, Mylapur, Madras.600004.
   2. S. Radhakrishna
   Address : 14.14.21, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada.3.
   3. Name : S. Nageswara Rao
   Address : 1, Luz Avenue, Mylapur. Madras-600004.
   4. Name : S. Rajeswari
   Address : 14-14-21, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3.
   5. Name : S. Seshamma
   Address : 1, Luz Avenue, Mylapur, Madrass-600004.
   6. Name : S. Sreerammurthy, Trustee. Kasinadhuni Nageswara Rao, Sivalenka Sambhu Prasad Dhrma Nidhi.
   Address : 42-45, Luz Church Road, Madras-600004.
   7. Name : S. Ramayamma
   Address : 1, Luz Avenue, Mylapur, Madras-600004.
   8. Name : P. Satyanarayana
   Address : 183, 184, Rashtrapathi Road, Secunderabad.
   9. M/s. Sambhu Prasad & Sons P. Ltd. 63, Rayapettah High Road, Madras - 4.
   10. Mr. M. S. Kini, 1-9-1122/3 1, Dayananda Nagar, Hyderabad-4.
   11. Sri Venkata Rao Kordale, 1-1-593/2, Gandhinagar, Hyderabad-38.
   12. Smt. P. Lakshmi Sailaja, P.O. Yellamanchili, Visakhapatnam Dist.
   13. Sri. V. Sundaram, No. 20 First Main Road, Thiruvanmiyar, Madas.41.
   14. Sri R. Gopalakrishna, 79, Venkateswara Nagar, Kottivakkam, Madras - 41.
   15. Sri S. Sreeramamurthy, 63, Rayapettah High Road, Madras-4.
   16. Sri P. Ramaswami, 63, Rayapettah Hjgh Road, Madras-4,
   17. Smt. P. V. L. Ratnam, Sreenagar Colony, Kakinada, E.G. Dist.
   18. Master S. V. S. Arvind, 1, Luz Avenue, Madras - 4.
   19. Sri M. S. Ramesh, 16-11-19/5/2/A, Saleemnagar Colony, Malkpet, Hyderbad - 36.
   20. Smt. P. Nageswaramma, 1, Luz Avenue, Madras - 4.

I, S. Radhakrishna, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA,

1-3-1985 Signature of Pubisher.

శ్రీ మాదిరాజు రంగారావు

గోపీచంద్ - సాహిత్య జీవిత దృక్పథం

గోపీచంద్ సాహిత్య జీవిత దృక్పథం వివిధ పార్శ్వాలతో దృష్టిగోచరం అవుతుంది. ఇది ఈతని వ్యక్తిత్వంలోని వైవిధ్యం వల్ల ఏర్పడింది. ఇది నిరంతరం కదలే ప్రవాహాన్ని భావింపజేసేది. ఎప్పటికపుడు జీవితంలో కొత్త పరిజ్ఞానంతో అనుభవంతో సంచలిస్తూ మార్పులకు లోనవుతూ గతిలో మలుపుల్ని పొందుతూ ఆకర్షిస్తూ ప్రవహించడం ఈతని ప్రత్యేకత. ఈకారణంగా సాహిత్య జీవితంలో వివిధ దశల్లో వివిధ పార్శ్వాలు వెలసాయి. రచయితలను తలచుకుంటే వారి సాహిత్య జీవితం తాము అవలంబించిన అభిప్రాయాలపై సిద్ధాంతాలపై ఎన్నటికీ చలించని ప్రత్యయంతో కదలని గిరిశిఖరంవలె, మరొకరు గతిలో మార్పులతో మలుపులతో కదలే ప్రవాహం వలె, ఇట్లా మరో మరో వ్యక్తిత్వంతో మన ఎదుట సాక్షాత్కరిస్తారు. ఈ రచయిత విషయంలో వివిధ దశల్లో వచ్చిన మార్పులతో ప్రభావశీలం గల సాహిత్య మూర్తిత్వం విస్ఫుటంగా కన్పిస్తుంది. దీన్ని కాలప్రభావం నుండి అంటే ఆ నాటి సాంఘిక రాజకీయ వాతావరణం నుండి విడదీయడానికి వీల్లేదు. రచయిత మనస్తత్వమూ, వెనుకనుండి పని చేసినమాట మరవడానికి వీల్లేదు. ఈ విధంగా ప్రత్యక్షంగా పరోక్షంగా పనిచేసిన అంశాలు విశ్లేషించి చూడవలసి ఉంటుంది. పాశ్చాత్య ప్రభావంతో సాంఘిక రాజకీయ రంగాలతో పాటు సాహిత్య రూపమూ క్రమంగా తీవ్రమైన పరివర్తనకు లోనై అంతకు ముందున్న లక్ష్యమూ చెదరింది. విజ్ఞాన శాస్త్ర ప్రభావం వల్ల ప్రతిదీ ప్రశ్నించడం పరీక్షకు నిలపడం జరిగింది. సమాజంలోని శుష్కమైన ఆచారాలూ, అర్థం లేని అలవాట్లూ, బాహ్యమైన ఆడంబరాలూ హేతుదృష్టిచేత నిశితమైన పరిశీలనకు లోనయ్యాయి. ఈ స్థితిలో పూర్వపు విలువలు అంతరించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పడని అనిశ్చయమైన దశ కన్పిస్తుంది. ఈ దశలో సంప్రదాయ ధోరణిలోని నిజమైన తత్త్వంతో పరిచయం లేకపోవడం, నవ్యధోరణులింకా పాదుకొనకపోవడం అందులోనూ ప్రతిదీ హేతుయుతంగా వితర్కించే తీవ్ర వైఖరితోపాటు సమరస భావమూ లోపించడంతో ఈ పరివర్తనకు చెందిన దశలో ఒక సంక్షుబ్ధ స్థితి ఆవరించింది. ఈ సమయంలో కొందరు ఎంతో విజ్ఞతతో సంస్కరణం - సమన్వయ దృష్టితో మానవీయ భావనతో అధిగమించగలిగారు. వీరివల్ల ఎంతో మేలు చేకూరిన మాట వాస్తవం. సంప్రదాయ వాదుల నిరసన లేకపోలేదు.

గోపీచంద్ సాహిత్య జీవితాని కన్వయిస్తే, నాస్తిక వాతావరణంలో భౌతిక దృష్టితో హేతువాద నైశిత్యంతో ప్రతిదీ ముక్కలు ముక్కలు చేసి చూచే లక్షణం నుండి, సామాజిక స్పందనం - తత్పరతతో, సామ్యవాదం - వివేచనతో, వ్యక్తి స్వేచ్ఛ - నవ్యమానవ వాదం నుండి క్రమించి ప్రపంచంలోని వివిధ తాత్త్విక ధోరణుల ఆలోకనంతో భౌతికమైన విలువలతో పాటు నైతిక ఆధ్యాత్మికమైన విలువలు సమన్వయ భావంతో దృక్పథం పర్యాప్తం కావడం విశేషం. గోపీచంద్ అభడంతోనే రామస్వామి చౌదరి, ఆయనతోపాటు నాస్తిక వాదం దానితోపాటు బ్రాహ్మణ వ్యతిరేకోద్యమం; ఇట్లా ఒక విచిత్రమైన వలయంలోకి ప్రవేశించి స్తిమితమైన అవగాహన లోపించి హఠాత్ వైముఖ్య ప్రదర్శనకు అవకాశం లేకపోలేదు. సాంఘిక పరివర్తనంవల్ల పనికి రాని పాతవిలువలకు స్వస్తి చెబుతూ కొత్త విలువల్ని వేగంగా ఆహ్వానిస్తూ ఆ తరువాత నిదానంగా ఏది అవసరమో నిర్ధారణ చేసికొంటూ జీవితంలో జిజ్ఞాసతో అనుభవంపై వివేచనతో ఒక్క మారు వెనక్కు తిరిగి మానవుని అభిప్రాయాల ఆలోచనల అవలోకనంతో ఎప్పటికపుడు ఒక లక్ష్యాన్ని అందుకోవాలన్న నిశ్చయంతో సాగే యాత్రికుని లక్షణం వివిధ దశల్లో కన్పిస్తుంది. ఈతని సాహిత్య జీవిత వ్యక్తిత్వాన్ని విశ్లేషిస్తే కన్పించే ప్రధానమైన దశలివి. ఇవి తీసుకున్న మలుపులూ దృక్పథానికి వివిధ పార్శ్వాలుగా విలసించాయి.

1) భౌతికమైన విలువలతో నాస్తికుడూ హేతువాదీ ఐన తండ్రి అభిప్రాయాలకు వారసత్వంగా రూపొందిందీ.
2) సామ్యవాద ప్రభావం కలిగిందీ, నవ్యమానవ వాదిగా ఉద్యమం నెరపిందీ,
3) అరవిందుల దర్శనం తరువాత దివ్యజీవనం (డివైన్ లైఫ్) ప్రభావంతో ఆధ్యాత్మిక జగత్తు పరిచయంతో విశిష్టమైందీ.
4) ప్రాచ్య పాశ్చాత్య తత్త్వాల అవలోకనంతో సంపూర్ణమైన సత్యాన్ని అన్వేషించే ఆలోచనా ప్రకాశం కలదీ.
5) భౌతికమూ నైతిక అధ్యాత్మికమైన విలువల సమ్యక్ మేళనంతో జీవితంలో పరిపూర్ణతను సాధించే ప్రయత్నం కలదీ, 'అతీత మానవ' భావనాత్మకమైందీ.

ఈ దశలు ఒకదానినుండి మరొకటి మారడంలో దేనికది విడిగాకాక, ఒకదానికి మరొకటి ఆధారమై, ఈతని సాహిత్య జీవిత రూపం ఏర్పడింది. ఈ దశల్లో ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా ఉపకరించి రచయిత వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడినాయి. "ఈ మార్పులో ఒక క్రమం ఉంది. రేపు జరిగేది, నేటితో ముడిపడి ఉంటుంది. నేడు, నిన్నతో సంబంధం ఉంది. ఇది ఒక అవిచ్ఛిన్న ప్రవాహం"[1] మొదటి దశలో సూత్రాశ్రమంలో ఏర్పడిన హేతు దృష్టి జీవితంలో వ్యర్థమైన ఆచారాలనూ ఆడంబరాలనూ ప్రశ్నకు గురిచేయడంతోపాటు నిజమైన విలువల్ని శోధించి, గుర్తించేందుకు ఉపకరించింది. తండ్రి ప్రారంభించిన తీవ్రమైన ఉద్యమం అప్పటి సమాజంపై శక్తిమేరకు నిశితమైన ప్రభావాన్ని నెరపి తన పాత్రను నిర్వహించింది. ఆపైన సంస్కరణావశ్యకతను భావింప చేసేదిగా నిలిచిపోయింది. ఈ చారిత్రక సంస్థితిలో సంకుచితమైన పరిధిని గుర్తించిన గోపీచంద్ దృష్టి సోషలిజంపట్ల ఆసక్తి, ఆ తరువాత మానవేంద్రనాథ్‌రాయ్ నవ్యమానవ వాదం వైపు ప్రసరించింది. ఈ ఉద్యమంలో పార్టీ కార్యదర్శిగానూ క్రియా శీలత్వాన్ని ప్రదర్శించాడు. అప్పటికి పాశ్చాత్య సాహిత్యంతో ఏర్పడిన పరిచయం గోపీచంద్‌లో వివిధ జాతుల దేశాలమధ్య వైమనస్యానికి నిరసనకూ బదులు సామరస్యానికీ సహనానికీ దారి తీసింది. ఏ దేశంలో ఏ భావజాలం ఏ సిద్ధాంతాలు వ్యక్తమైనా అవి నిఖిల మానవాళికి చెందినవే అన్న విశాలమైన అవగాహన, కొత్త మలుపును తీసుకొని వచ్చింది. ఈ మానసిక వికాసంతో "భౌతిక ఆధ్యాత్మిక వాదాలు పరస్పరం వ్యతిరేకం కాదు. ఈరెండిటిలో ఏది లోపించినా జీవితం అసంపూర్ణమే." అనే భావం ఏర్పడింది. ఈ మలుపు సాహిత్య లోకాన్ని చకితం చేసింది. వేదన చింతన అన్వేషణ లక్షణంగల ఈతని మనస్తత్వానికిమలుపు సహజమైన పరిణామమే. ఇది ఈతని వ్యక్తిత్వానికి ఉదాత్తతనూ సమగ్రతనూ సిద్ధించేందుకు సోపాన పంక్తి ఐంది. ముఖ్యంగా హైదరాబాదు వచ్చాక పరంపరగా వెలువడిన నవలలు అనుభవ వైశాల్యంతో విజ్ఞాన సంపత్తితో ఈ లక్ష్యాన్ని భావింప జేసేవి. ఈ మార్పుకు వెనుక రచయిత మనస్తత్వంలోని స్వేచ్ఛాప్రవృత్తి, ఎదుటి వాదంలోని గుణాన్ని స్వీకరించే సౌమనస్యం ప్రబలంగా పని చేశాయి. తనలో వచ్చిన మార్పును గురించి ప్రస్తావిస్తూ "మార్పు అంటే భయపడనవసరంలేదు. ప్రతిదీ మారుతుంది. మార్పు తప్పదు. ఆమార్పు ఎక్కడినుండో ఊడిపడదు. మార్పుకు క్రమం ఉంది. కారణం ఉంది. మార్పులో ఎప్పటికప్పుడు ఒక పద్ధతి కన్పిస్తుంది. మార్పు మిరాకిల్ కాదు'[2] అని వివరిస్తూ "ఎప్పటికపుడు ఒక సిద్ధాంతాన్ని నమ్మి పనిచేస్తూ ఆ సిద్ధాంతమే సంపూర్ణం అనుకోకుండా ఎప్పటికపుడు నూతన జ్ఞానాన్ని కలుపుకొని మానవుడూ మారుతూ జీవించాలి" అంటాడు. "ఏదేశమైనా ఎక్కడి మానవుడైనా ఈ జీవితం ఏమిటి? ఈ చుట్టూ ప్రపంచం ఏమిటి? అని మొదటి నుండీ తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే ఈ తత్త్వ ప్రపంచం. దీనికి మానవుడు తన సాధనాలన్నిటినీ ముఖ్యంగా హేతువు వివేకం అనుభవం విజ్ఞానం ఉపయోగించి ఎంతో కృషి చేశాడు ప్రాక్ ప్రతీచీ భావ సంపదలను రెండిటినీ సమదృష్టితో పరిశీలిస్తేగాని సంపూర్ణమైన అవగాహన చేకూరదన్న విశ్వాసం రచయితలో దృఢపడింది. తాను విశ్వసించిన ఆదర్శానికనుగుణంగా నిరంతరం ప్రశ్నలు, అన్వేషణంతో ఎప్పటికపుడు పొందే సమాధానాలతో నూత్న నూత్నంగా ఖండఖండంనుండి సంపూర్ణత వైపు ప్రవహించే స్వరూపంతో వ్యక్తిత్వం నిలచింది.

II

చిన్నప్పటినుండీ ఇతిహాస పురాణాలూ సంప్రదాయ ధోరణులను ప్రశ్నించే హేతు దృష్టితో నెలకొన్న భౌతిక నాస్తిక వాతావరణం గోపీచంద్ మనస్సును మొదట్లో ఆవహించింది. ఆకాలంలో సూత్రాశ్రమంలో జరిగే అనేక విధాల చర్చల సందర్భంలో తండ్రి "గోపీ! అని పిలిచి వాటిలో పాల్గొనే అవకాశం కల్పించేవాడు. ఇతడు ధైర్యంతో రంగంలోకి దూకితే తండ్రి ముసిముసినవ్వులతో వెన్నుతట్టేవాడు. ఈవిధంగా తండ్రి నిర్దేశంలో వ్యక్తిత్వం రూపొందుతూంది. ఒకనాడు తండ్రి 'ఒరే! గోపీ! నీ మనస్సుకు ఏది మంచి దనిపిస్తే అది చెయ్యి! నామాట వినవలసిన పనిలేదు. వినలేదని నేనేమీ అనుకోను, ఒకవేళ అనుకున్నా తొందరపడి మార్చుకోకు" మునుముందు ఏర్పడే సందేహమూ దాని నివారణోపాయమూ సూచితం. తండ్రి అభిప్రాయాలపట్ల ఇతడు నిశ్చయభావంతో ఉన్నవాడేనాయె! తన అడుగుజాడల్లో ఇతని వ్యక్తిత్వాన్ని రూపొందింప చేయవచ్చుగా. ఈరకమైన "బ్లాంక్ చెక్" ఇవ్వడంలో ఉద్దేశం? ఆవిధంగా తయారుచేయబడిన ప్రతిరూపంపై విశ్వాసం లేకుండా ఉండాలి. ఈ మాటలు గోపీచంద్‌లో స్వేచ్ఛను గురించి అవకాశం కల్పించాయి. స్వంత అనుభవంపై ఆలోచనకు దారితీసింది. క్రమంగా వ్యతిరేకంనుండి సామరస్యానికీ సంకుచిత వలయంనుండి నిఖిల మానవ క్షేత్రానికి భౌతికంనుండి ఆధ్యాత్మిక తత్త్వానికి ప్రయాణించే అన్వేషణకు దారితీసి ఉంటుంది. మరో సంఘటన! ఉన్నవ గాంధేయవాది, ఆస్తికుడు, ఆధ్యాత్మిక వాసనామతి, గోపీచంద్ తండ్రి పిటికి పూర్తిగా వ్యతిరేకం, అయినప్పటికి ఇరువురికీ మంచి స్నేహం. ఎంతటి వ్యతిరేకినీ 'మేన్‌స్ట్రీమ్'లో కలుపుకొనిపోయే గాంధేయతత్త్వం "ఈ స్నేహాన్ని దృఢతరం చేయగలిగింది. ఒకనాడు ఉన్నవతో కొడుక్కి పెళ్ళి సంబంధం చూచిపెట్టమంటాడు. ఆయన తలచుకుంటే అనుయాయులు ఎంతమంది లేరు! క్షణంలో తన విశ్వాసాలకూ అభి

ప్రాయాలతూ అనుగుణంగా తెచ్చిపెట్టేవాళ్ళు. ఉన్నవకు ఏలాంటి సంబంధం వస్తుందో ఎటువంటిది తెస్తాడో ఎవరూ ఊహించడానికి ఎక్కువ శ్రమపడనవసరంలేదు. ఉన్నవ తాను స్థాపించిన శారదా నికేతన్ ఆశ్రమంలో చదువుకునే అమ్మాయిని సూచిస్తాడు. ఆయన అంగీకరిస్తాడు. ఈ వైయక్తికమైన విషయానికి సంబంధించిన సంఘటనను తేలిగ్గా తీసిపారేయడానికి వీల్లేదు. హేతువాది, నాస్తికుడు భౌతికవాదియైన తండ్రి తన అభిప్రాయాల కనుగుణంగా ఉన్నప్పుడే యోచించి అంగీకరించవచ్చుగా! ఈ అంగీకారంలో కొడుకు భవిష్యత్తుకు సంబంధించిని ఆలోచనతో ఏదో మానసికంగా ఏర్పడిన శూన్యస్థితిని సంపూర్ణంచేసే తృప్తిరేఖ ఉందని నా అభిప్రాయం. తరువాత గోపీచంద్ జీవితాన్ని పరిశీలిస్తే ఈ నిర్ణయం ఎంతో యోగ్యమైందీ సముచితమైందిగా కన్పించడమేగాక, ఈయన సాహిత్య జీవితంలో నైతిక ఆధ్యాత్మికమైన ధోరణినే ఈమె పాత్ర అనల్పమైందేమోనన్న భావమూ కలుగకపోదు. జీవితంలో ఒక్కొక్క ముఖ్యమైన స్థితిలో తీసుకునే నిర్ణయాలు అనుభవంలోకి వచ్చే సంఘటనలు తరువాత జీవిత స్వరూపాన్ని తీర్చేవిగా, మార్చేవిగా పరిణామ శక్తినీ కలిగి ఉంటాయి.

రచయిత విద్యార్థి దశ, ఆ తరువాత పెరిగిన వాతావరణం మౌలికమైన ప్రభావాన్ని నెరపింది షేక్స్పియర్, బెర్నార్డ్‌షా నాటకాలతోపాటు పాశ్చాత్య రచయితల ప్రసిద్ధమైన నవలలతో కథాసాహిత్యంతో బాగా పరిచయం కలిగింది. చాలామందికి పాశ్చాత్య విద్యాప్రపంచంలో పెరిగినవారికి మన సంస్కృతీ తేజాన్ని దర్శించడానికి ఇంగ్లీషు బాష సాధనమైంది. మొదట్లో పాశ్చాత్యులు ఆ తరువాత భారతీయులూ ఈ దిశలో ఎంతో బాధ్యతతో కృషి చేశారు. వివిధ భాషలవారికి తెలిసేందుకు మౌలికంగానో అనువాదంగానో ఇంగ్లీషులో రచనా వ్యాసంగం జరిగింది. ఈ రచయిత మాక్స్‌మూలర్ రవీంద్రనాథఠాగూరు అరవిందులు రాధాకృష్ణన్ మొదలైనవారి ఇంగ్లీషు రచనలద్వారా భారతీయ సంస్కృతీ తేజానికి సన్నిహితుడయ్యాడు. ఈతడు పెరిగిన వాతావరణాన్ని ఊహించి సంస్కృత భాషా పరిచయం లేకపోవడంవల్ల శంకరుల అద్వైతం గురించీ వేదోపనిషత్తుల గురించీ తెలుసునంటే కొందరు విస్తుపోవచ్చు. ఈ అభిలాష తరువాత దశలో బాగా వికసించిన మాట నిజం. ఈయన 'విశ్వరూప సందర్శనం' నాటికలో గీతను ఆవిష్కరించడం జరిగింది ఇట్లా వ్రాసారేం ? అని ప్రశ్నిస్తే "గీత నన్ను అమితంగా ఆకర్షించింది. భగవద్గీతపట్ల నాకున్న భక్తి విశ్వాసాలను ప్రకటించేవరకూ నాకు తృప్తిలేదు." అనీ మనల్ని మనం నిర్నిమిత్తంగా, ఒక సాధనంగా భావించి పని చెయ్యాలన్న అనాసక్తయోగం బాగా ఆకర్షించింది" అని సమాధానం వచ్చింది. నవల "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా" సమాప్తిలో కేశవమూర్తి వ్రాసే రచన ముగింపు మాటలు ఉపనిషద్భావనాత్మకాలు. "ఈ సృష్టి రహస్యం ఆనందం. బ్రతుక్కి గమ్యస్థానం ఆనందం. బ్రతకడానికి కారణం ఆనందం ఈ బ్రతుకులు ఆనందంలోంచి వచ్చినవే. ఆనందంవల్ల నిలబడుతున్నవే. ఆనందంవల్ల అభివృద్ధి చెందుతున్నవే. ఆనందంలో కలిసిపోయేవే."

ఇవి ఆ పాత్ర పరిణామంలో పరిణతినిబట్టి వచ్చినవే

"ఆనందో బ్రహ్మేతివ్యజానాత్ । ఆనందాత్ హి ఏవ
ఖలు ఇమాని భూతాని జాయన్తే । ఆనందేన జాతాని
జీవన్తి । ఆనందం ప్రయన్త్యభి సం విశన్తితి"[3]

భారతీయుల తత్వాలోకనంతోపాటు పాశ్చాత్యుల తత్త్వవిమోచనమూ జరిపాడు. మార్క్స్ మొదలుకొని బెర్గ్‌సన్, సార్త్రె, రసెల్, జిడ్డు కృష్ణమూర్తి, రాధాకృష్ణ మొదలుగా వివిధ వాదాల్లోని ఆలోచనలు నవలల్లో అక్కడక్కడా. ఆయా పాత్రల వ్యక్తిత్వంతో స్ఫూర్తికి వస్తాయి. మొదట్లో ఆధ్యాత్మిక వాదం అంటే శాస్త్ర జ్ఞానంలేని కొందరు సనాతనులవాదం అనుకునే వ్యక్తి ఉన్నవ వారి ప్రేరణతో తన చుట్టూ ఉన్న వాతావరణంనుండి వివేకంతో పరిచయం సంపాదించుకొని క్రమంగా సత్యాన్వేషణతో అధ్యయనం చేయడం జరిగింది. ఈ ప్రస్తావన గోపీచంద్‌లో మౌలికంగా ఆధ్యాత్మిక లక్షణం గర్భితమై ఉన్నదన్న విషయాన్ని భావింప జేసేందుకే ఉద్దిష్టమైంది. ఈ మార్పును గురించి ప్రస్తావిస్తూ "నేను మాత్రం భౌతికవాది తల్లి గర్భంనుండి బయటపడ్డానా"[4] అని సమర్థించుకోవడంలో ఎంతో కాలంగా నిగూఢంగా ఉండి ప్రకాశమానమయ్యే విషయంపై ప్రత్యయాన్ని గుర్తించవచ్చు. ఈతని సాహిత్య వ్యక్తిత్వంలో ఈ రేఖలు దీపిస్తూ నవల్లో పాత్ర చిత్రణంలో ఆంతరమైన స్వరూప నిర్మాణానికి కారణం ఔతున్నాయి. వాటి గమన వైఖరిలో పొందే లక్ష్యానికి ప్రత్యక్షంగానో. పరోక్షంగానో ప్రభావాన్ని నెరపడమూ స్పష్టంగా కన్పిస్తుంది.

III

ప్రతిదాన్ని ప్రశ్నించే లక్షణం, హేతు చర్చ, తండ్రి నుండి సంక్రమించింది, ఈ తీవ్రమైన ధోరణి సంప్రదాయంలోని శుష్కత్వాన్ని, జాతిన్యాన్ని, మౌఢ్యాన్ని ఎక్కడికక్కడ చిన్నచిన్న శాఖలయాబుగా ఏర్పడిన సంకుచిత స్వభావాన్ని నిరసించేందుకు ఉపకరించింది. ఆనాడు నాస్తికోద్యమమూ సమాజంలో పేరుకొన్న కశ్మలాన్ని విధూతంచేసి నైతికమైన విలువల్ని ప్రకాశింపజేసేందుకు సహాయపడిన యథార్థమూ మరచి పోకూడదు. ఇది ఇట్లా ఉంచి మరో వైపునుంచి అప్పటి పరిస్థితుల చారిత్రకమైన ప్రాముఖ్యమూ

ఈ ఉద్యమాన్ని విస్తరింప జేయనీయలేదు స్వాతంత్ర్యోద్యమంలో దేశం నిమగ్నంకావడం, రెండో ప్రపంచ యుద్ధచ్ఛాయలూ, స్వాతంత్ర్యం లభించాక ముఖ్యంగా కొత్త రాజ్యాంగంతో నెలకొన్న ప్రజాస్వామిక వ్యవస్థలో కులమత వర్ణభేద రహితంగా అందరికీ అన్ని రంగాల్లో సమానమైన అవకాశాలూ, ఒక వ్యవస్థను తీర్చే ఉద్దేశంతో రాజకీయ సిద్ధాంతాల ఆకర్షణతో సాంఘిక పరివర్తనంతోనూ కొత్త పరిస్థితులు ఏర్పడినాయి. ఈ మార్పుల్ని ఎప్పటికపుడు గమనిస్తున్న రచయిత ప్రతిదాన్నీ ప్రశ్నించడం నేర్చిన వ్యక్తి భౌతిక వాదాన్నీ, నాస్తిక వాదాన్నీ ప్రశ్నిస్తూ అన్వేషణలో జిజ్ఞాసతో సమభావంతో తన వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే ప్రయత్నం జరిగింది. ఈ కాలక్రమంలో మార్క్స్, లెనిన్ అభిప్రాయాలూ సోషలిజం అవగాహన నుండి క్రమించి రాయ్ నవ్యమానవ వాదానికి చేరుకున్నాడు,[5] ఆంధ్రలో రాడికల్ పార్టీకి కార్యదర్శిగానూ పని చేశాడు. సాంఘిక రాజకీయ పరివర్తనంలో ఆలోచనా ప్రసార రేఖలతో వెలువడిన నవల అసమర్థుని జీవయాత్ర. ఇందులో ప్రధానమైన పాత్ర సీతారామారావు. వంశ ప్రతిష్ఠకోసం తండ్రి అడుగు జాడల్లో నడచి ఆస్తినంతా కోల్పోతాడు. ఉన్నతమైన ఆదర్శాలకూ వాస్తవానికీ మధ్య పూడ్చరాని అఘాతం ఏర్పడుతుంది. తాను సర్దుకొనీ సర్దుచేసుకోలేని స్థితులకూ బాధపడే మధ్య తరగతి వ్యక్తి జీవితం చిత్రితం. ఇతడు క్రియాశూన్యుడు. కుటుంబం గడవడానికి డబ్బు అవసరంతో ఉద్యోగం చేయక తప్పలేదు, ఆ యంత్రంలో ఇమిడే అలవాటు చేసుకోలేక వదలడమూ జరిగింది. "ఏది ఏమైనా జీవితంలో ముందుకు పోవడమే ప్రధానోద్దేశం. పిరికివారికీ అసమర్థులకూ స్థానం లేదు" ఇవి లౌకికుడైన మామయ్య మాటలు. సీతారామారావులో పరిస్థితుల ఒత్తిడికి చీకాకు, కోపం, ఆందోళన, బాధ ఉద్వేగం, వితండ వాదం, ఎక్కువైంది. సంఘర్షణకు దారితీసే పరిస్థితులు వచ్చాయి. మనస్సు అదుపు తప్పి విచిత్రమైన ప్రవర్తనకు దారి తీసింది. ఈ విపరీత లక్షణంతో లోకంలో నిల్వలేకపోయాడు. శ్మశానంలోకి ప్రవేశిస్తాడు. ఎన్నో ఘన కార్యాలు చేసిన తన తండ్రి జిల్లేడు మొక్కలకు ఎరువు అయిన దృశ్యం కన్పిస్తుంది. తల్లి దూరంనుండి వాత్సల్యంతో తన వైపు ఆకర్షిస్తోంది. తన నీడతో యుద్ధం! గొంతు నులిమేసుకుంటాడు! ఆత్మహత్య! ఇతనిలోని పూర్వభావాలు ఏడ రూపంలో తండ్రి ఆకారంలో కలసిపోతాయి. చివరకు వెలుగు రూపం మిగులుతుంది. "సుఖానికీ దుఃఖానికీ, జీవితంలో వ్యక్తి మనస్తత్వం ముఖ్యం" రామయ్య తాత మాటల్లో అస్తిత్వానికీ స్వేచ్ఛకూ ఇచ్చే ప్రాముఖ్యం స్పష్టం. ఆర్. ఎస్. సుదర్శనం మాటల్లో "అసమర్థుని జీవయాత్ర నిజంగా హేతువాది జీవయాత్ర." రామయ్య తాత మాటల్లో రచయిత ఆ మలుపులో విశ్వసించే నవ్యమానవ వాదచ్ఛాయలు ప్రతిఫలిస్తున్నాయి. ఈ నవల 1946లో వెలువడింది. అప్పటికి గోపీచంద్ చుట్టూ ఉంది. నవ్యమానవ వాదం ప్రభావమే.

IV

అసమర్థుని జీవయాత్ర ఒక మలుపును సూచిస్తే, చాలా సంవత్సరాల విరామం తరువాత (సినిమా ప్రపంచంనుండి) అరవిందుల దర్శనంతో 'దివ్య జీవనం' ప్రభావమూ, 'అతీత మానసిక శక్తి' ఆకర్షణచేత, ప్రాచ్య పాశ్చాత్య తత్త్వాలోకనంతో భౌతిక, నైతిక ఆధ్యాత్మికాల సమన్వయ శీలంతో ఇతని సాహిత్య వ్యక్తిత్వం మరో మలుపును పొందింది. భౌతికమూ ఆధ్యాత్మికమూ రెండూ ఒకదాని పోషకాలుగా జీవితంయొక్క సంపూర్ణ స్వరూపాన్ని అవగతం చేసుకోవడానికి తోడ్పడుతుందనే ఇతని నిశ్చయాభిప్రాయం. మెరుపుల మరకలు, ఘిల్ల తెమ్మెర, గడియ పడని తలుపులు మరీ ముఖ్యంగా పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామాలో స్పష్టంగా ఆవిష్కృతమైంది. వీటిలో వ్యక్తి స్వేచ్ఛ ముఖ్యం. తమ స్వంత అనుభవాలపై ఎవరికి వారు సాగించే జీవితం ఉంది. జీవితం ఎంత విస్తృతమూ, వైవిధ్యమూ సంక్లిష్టమూ ఐందంటే దీని గమనం ఈ దిశలో ఉంటుందని ముందుగా ఎవరి ఊహకూ అందదు. ఎప్పుడు ఏమి జరుగుతుందో ఏ మార్గం అనుసరిస్తుందో, ఏ మార్గం వదిలేస్తుందో, చెప్పలేని విచిత్రమైన పరిస్థితులు పరిణమించడంలో ఇతివృత్తం నిర్మితమౌతుంది. ఇందులో వ్యక్తిత్వంగల ఏ ఆ పాత్రకు ఆ పాత్ర వారివారి మనస్తత్వాలను బట్టి వారికి తటస్థపడే వ్యక్తులతో అప్పటి పరిస్థితులు ఆలోచనలను బట్టి సంఘటనల ఒత్తిడిలో, సంఘర్షణనుండి వ్యక్తిత్వం ప్రకాశిస్తూ బయటపడే పాత్రల సృష్టి కన్పిస్తుంది. చర్య ప్రతిచర్యలతో హఠాత్ పరిణామాన్ని పొందడమూ జరుగుతుంది, ఇతివృత్త నిర్మాణంలో సంఘటనల ప్రాబల్యాన్నిబట్టి సంఘర్షణలో అవతరించే పాత్రల వైవిధ్యానికి నిదర్శనంగానూ ఉన్నాయి ఈ నవలలు. మెరుపుల మరకల్లో ప్రధానపాత్ర ఉషారాణి. స్వేచ్ఛాతత్వంతో ఏ నియమాలకూ కట్టుబడకుండా వ్యవస్థకతీతమైన స్వతంత్ర ప్రవృత్తితో విలపిస్తుంది. ఆవేశ ప్రవృత్తి కలదే. భర్త రామానుజం ఆమెను సుఖపెట్టాలనే ఎంతో తహ తహ కలవాడు. అయినా చక్రవర్తిని ప్రేమించింది. తరువాత శ్రీ కాంత్ ప్రవేశిస్తాడు. తాను ప్రవర్తిస్తున్న తీరుపట్ల దోషభావన కలగగానే ఫ్రాయిడ్, యంగ్ మొదలైన మనస్తత్వవేత్తల వివిధ రచయితల భావాలతో సమర్థించుకునే ప్రయత్నమూ చేసేది. ఢిల్లీ వెళ్ళినపుడు శ్రీకాంత్ చెల్లెలి భర్త కమలాకరంతో పరిచయం ప్రణయానందానికి దారి తీసింది. ప్రేమ జీవితంలో తన మనసుకు నచ్చిన విధంగా ప్రవర్తిస్తుంది. అభిలాష

సౌందర్యం ఆకర్షణ ఆనందం అన్న ఏదో ఆదర్శంతో అనుభవంలోకి వస్తున్నట్లు భావిస్తుంది. చివరకు శ్రీకాంత్ విసరిన ఛెంప దెబ్బతో ఆ మదకతో ఆమెలో అనూహ్యమైన హఠాత్ పరివర్తనం కలిగించింది. మెరుపుల్లో మరకలు అనుభవంతో గుర్తించి వాటిని విసర్జించి తీర్థయాత్రలు చేస్తూ హృషీకేశ్‌లో యోగినిగా మారుతుంది. అక్కడ ఆధ్యాత్మిక చింతనతో శేషజీవితం మనోనుగుణంగా గడుపుతుంది. పిల్ల తెమ్మెర నవల్లో చిత్రమైన స్వభావంతో తీర్చిన పాత్ర శ్యమంతకమణి. తనకు వచ్చిన వ్యక్తితో రెండు మూడు నెలలు తిరిగి వస్తుంది. ఏ సంకోచమూ లేకుండా నిర్భయంగా ప్రవర్తించే మనస్తత్వం వల్ల రామనాథంతో వివాహం జరిగాక, తనదైన ఆదర్శంతో స్వేచ్ఛా భావంతో శచీంద్రునితో ఎగసిపోయి మద్రాసులో కళాసేవా సమితి ఔతుంది. శచీంద్రుడామెను భార్యగా భావిస్తాడు. ఆమె స్వేచ్ఛా ప్రవర్తనం అతనికి బాధ కలిగిస్తుంది. ఆమెను హత్యచేస్తాడు. కళ - సౌందర్యమూ, అభిలాష-ప్రీతి మధ్య సంఘర్షణను చిత్రించే నవల. తనకు నిరోధంగా ఉన్న సాంఘిక నీతినియమాన్ని ఛేదిస్తూ, స్వేచ్ఛను అభిలషించే మనస్తత్వంతో తన ఆనందం ముఖ్యం. దీనితో తన అస్తిత్వాన్ని నిర్మించుకునే ఆవేగం ఉంది. గడియపడని తలుపుల్లో కోటేశ్వరమ్మపాత్ర ధనం భోగం లక్ష్యంతో భర్తనువదలి హైదరాబాదు ప్రవేశిస్తుంది. శ్రీనివాసరావుతో పరిచయం ఔతుంది. అందరి మెప్పు కోసం తహతహలాడే ఆమెతో అతడూ సుఖంగా లేడు. భగ్నమైన జీవితంతో ఆధ్యాత్మిక చింతనతో యాదగిరి గుట్టపై స్వాముల దర్శనంతో ఏకాంతం వహిస్తుంది. చివరకు భర్తచిత్రపటం ముందు పెట్టుకొని జీవితం చాలిస్తుంది. ఈ నవలల్లో ఈ రచయిత దృక్పథం అస్తిత్వ వాద ఛాయలతో భౌతిక ఆధ్యాత్మిక భావాల సమ్యక్ మేళనంతో ప్రకాశిస్తుంది. వీటిలో ప్రధానమైన పాత్రలుతమ విలువల్ని తామే సృష్టించుకుంటూ అనుభవం ప్రధానమైన జీవితం లక్ష్యంగా కన్పిస్తాయి. గడియపడని తలుపుల్లో మాత్రం తిరిగి తాను వదలిన భర్తపట్ల భక్తి శ్రద్ధలతో (చిత్రపటంముందు పశ్చాత్తాపంతో అంజలి ఘటించడం) వదలిన భావస్థితిని తిరిగి ఆశ్రయించడం వ్యక్తి ధర్మానికి భిన్నమైన ధోరణిలో ముగింపు సంఘ ధర్మాన్ని సూచిస్తోంది. శ్యమంతకమణి జీవితం ఆమె పొందే అనుభవాల మధ్యలోనే సమాప్తమౌతుంది, దీనికి శచీంద్రుని ఉద్రేక మనస్తత్వమే కారణం. ఉషారాణి సంఘర్షణ నుండి అవలీలగా బయటపడి స్వేచ్ఛకు భంగం రాకుండా తనదైన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటుంది. ఈ పాత్ర పొందిన మార్పు మానసికం. ఒకే ఒక సంఘటన ఆమెలో విరక్తిని అవింపజేస్తుంది. ఈ స్థితిలోనూ తన వివేకంపై ఆధారపడే ప్రవర్తిస్తుంది. భౌతిక లోకాన్ని ఎంత ఆవేశంతో ప్రేమించిందో ఆ మనుషుల్ని ఎంత ఆనందంగా భావించిందో అంత సులభంగా ఆశ్రమానికి శాంత భావంతో అంకితమైంది. ఈమెకు తనదైన వ్యక్తిత్వం ముఖ్యం.

అస్తిత్వ వాదచ్ఛాయల్లో పాత్రలు సంఘం నిర్దేశించిన పద్ధతిలో కాక తమ స్వంత ఆలోచన అనుభవంపై ఆధారపడిన మార్గంలో ప్రవర్తిస్తాయి. ఒక్కొక్కప్పుడు కష్టాలు ఎదుర్కోవలసి వచ్చినా ఈ అన్వేషణలో బాధ అనిపించదు. పైగా అనుభవంలో ఆనందం, ఆనందంలో తృప్తి కలుగుతుంది. తాము చేసే పనులకు సంపూర్ణమైన బాధ్యత వహించడం ఇందులో ముఖ్యం. తమ జీవిత గమనాన్ని తామే రూపొందించుకోవటం ఇందులో విశేషం. మెరుపుల మరకల్లో ఉషారాణి, పిల్ల తెమ్మెరలో శ్యమంతకమణి పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామాలో కేశవమూర్తి పాత్రలు ఈ దృష్టితో విశ్లేషణకు నిలుస్తాయి.

శిధిలాలయంలో నిర్మల (సుభద్ర) పాత్రను దీనికి లక్ష్యంగా తీసుకోవచ్చు. పీతాంబరం భార్య నిర్మల. ఆమె మనస్సు కోరికలకు నిలయం. ఆమె ప్రవర్తనను భర్త అనుమానించగానే "అతనంటే ఇష్టం నాకు. అతనితోనే ఉండిపోతాను" అని మనస్సు విప్పి చెప్పి ప్రేమికుడు నారాయణరావుతో వెళ్ళిపోతుంది. ఆ నారాయణరావుతోనూ ఉండలేదు. ఈ సమయంలో పీతాంబరం సినీ ఆకర్షణలో, వస్తాడు. సినీ వేశ్య. ఆ వృత్తిని వదిలేస్తుంది. పీతాంబరాన్ని విశ్వసిస్తుంది. నిర్మల ఏదో పనిమీద ఢిల్లీనుండి హైదరాబాదు వస్తుంది. పీతాంబరం ఆమెను క్షమించమని అభ్యర్థిస్తాడు. ఆమెను భార్యగా స్వీకరించడానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తాడు. ఆమె తిరస్కరిస్తూ అన్న మాటలు ఆవ్యక్తిత్వంలోని అస్తిత్వ రేఖలను చక్కగా ఆవిష్కరించేవి. "నాకు ఎవరి భార్యగా వుండాలనీ ఆపేక్ష లేదు. ఒకవేళ ప్రయత్నించినా వుండలేను. ఈసంగతి నాకు మొదట్లో తెలియదు. అనుభవం మీద తెలుసుకున్నాను. నేను బ్రతికినా స్వతంత్రురాలిగా బ్రతుకుతాను. ఆ స్వాతంత్ర్యం పోయిననాడు మరణిస్తాను. అది నాస్వభావం. అని నిష్క్రమిస్తుంది. ఈమాటలు విన్న నానా పీతాంబరంతో "అధైర్యంతో జీవితం గడపకు, ప్రతిదానికీ తప్పు తప్పు అంటూ కూర్చుంటావు. తప్పేమిటీ జీవించుకుంటూ పో!!" అని ధైర్యాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తుంది. ఈనవల గురించి "సార్త్రి అస్తిత్వ వాదానికి తెలుగు రచయిత హత్తినమారాకు" ఆర్. ఎస్. సుదర్శనం.

ఈ నవలల్లో ప్రత్యేకత కలిగిందీ, గోపీచంద్ సాహిత్య వ్యక్తిత్వ దృక్పథాన్ని ప్రతిబింబించేదీ "పండిత. పరమేశ్వరశాస్త్రి వీలునామా". కేశవమూర్తి సుజాత ఇందులో ప్రధానమైన పాత్రలు. వివాహ వ్యవస్థను నిరసిస్తూ సంస్కరణ దృక్పథంతో ఆదర్శ

ప్రేమలోని ఔన్నత్యానికి ప్రతిరూపాలు. కేశవమూర్తి సమస్యను వాస్తవ దృష్టితో పరిశీలించే క్రియాశీలి, రచయిత. వ్యక్తి స్వేచ్ఛ, స్వంత అనుభవం, ఆలోచన, ఆన్వేషణతో సాంఘిక పరివర్తనా లక్ష్యంతో ఎదురైన సంఘర్షణలనుండి క్రమిస్తూ విజయంతో వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే మనస్తత్వం కలవాడు. బాధ్యతలను విస్మరించనివాడు. భగవంతుడూ, విధిపై భారంవేసి నిల్చిపోక స్వశక్తిపై విశ్వాసంతో ధైర్యంతో పనిచేస్తూ పోయే లక్షణం ఇతనిలో ఉంది. ఎక్కడ ఉన్నా ఈ వ్యక్తి కలసేదీ జీవించేదీ సమాజమే అన్న స్ఫూర్తి ఈ నవల్లో ఉంది. నవల్లో వ్యక్తి ప్రాధాన్యానికీ సంఘ ప్రాధాన్యానికీ జరిగే వాదోపవాదాల్లో, వ్యక్తి ధర్మంపై మొగ్గు చూపుతున్నట్లు అనిపించినా మొత్తంమీద సంఘ ధర్మంపట్ల అసక్తీ అంతిమ లక్ష్యమూ కలిగి ఉన్నట్లు ఈ రచనబట్టి తెలుస్తుంది. ఈనవల గోపీచంద్ ఆదర్శాలుగా సంపూర్ణంగా ప్రాతినిధ్యం వహించేదిగానూ ఉంది. కేశవమూర్తి పాత్రలో గోపీచంద్ కన్పిస్తాడు కూడా. ఇందులో పాత్రలు ఒక వ్యక్తి లోకంలో ఇతర వ్యక్తులతో కలిగే అనుభవాలవల్ల చర్య ప్రతిచర్యతో (వివాహం కారణంగా శాస్త్రి వైమనస్యం దుష్టచతుష్టయం సేమంతం పురూరవుడు, శారద్వ తుడు (కోలాటం) రాధారమణ అసూయవల్ల సుజాత దూరంకావడం, శాస్త్రిలో చివరి ఘడియల్లో పరివర్తనం రావడం, సుజాత నిజం తెలుసుకొని పొరపాటు సరిదిద్దుకోవడం శాస్త్రి సౌమనస్యంతో వీలు నామా రాయడం), దీనివెనుక నుండి పనిచేసే మనస్తత్వ ప్రసారంతో క్రమిస్తాయి. ఒకవైపు ప్రేమ, స్వేచ్ఛ, సంస్కరణం, పరివర్తనం మరొకవైపు నీతి, ఆధ్యాత్మికం, ఆదర్శం, ఆనందం ప్రముఖంగా మన దృష్టికి గోచరిస్తాయి.

కేశవమూర్తి స్నేహితునితో పాండిచేరీ వెళ్ళి అరవిందుల దర్శనం - దివ్య జీవన గ్రంథ పరిశీలనంతో, ఆతని జీవితం 'అతీత మానసిక స్థితీ, అతీత మానవ సృష్టికీ ఉన్ముఖమైన ఆధ్యాత్మిక భావంతో సంపన్నమౌతుంది. మానవుడు ఏ పరిస్థితుల్లోనైనా ఏ ప్రభావంలోనైనా తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోగలడు. దివ్య జీవనాన్ని స్పృశించగలడన్న నిశ్చయానికి, సూచికే కేశవమూర్తి జీవితం. గోపీచంద్ గురించి శకుంతల "ఆత్మజ్ఞానం అభివృద్ధి చెందినకొద్దీ అహాన్ని ఆడంబరాన్ని పూర్తిగా వదలివేశారు. ఇంటా బయటా అందరికీ సహాయం చేయటం మొదలు పెట్టారు. రానురాను ఈ లోకానికి సంబంధించిన వ్యక్తిగా ఉండేవారు కారు, రేపటి విషయమే ఆలోచించే వారు కారు... అవకాశం లభించినపుడు భగవద్ధ్యానంతో నిమగ్నులయ్యేవారు. ఎన్నో రకాల అనుభూతులు పొందేవారు"[7] కేశవమూర్తిలో గోపీచంద్ ఆధ్యాత్మిక జీవన ప్రతిఫలనం స్పష్టంగా మన ఊహలో నిలుస్తుంది. ఈ నవలగురించీ, ఇందులో తాత్త్విక భూమిక గురించీ, పరిచయంలో రచయిత మాటలు. "భౌతిక జీవితం మానవ జీవితానికి పునాదిగా ఉండాలి. భౌతిక జీవితం ముఖ్యమే. కాని మానసిక జీవితం అరికట్టబడకూడదు. అన్ని విశాలైన పరిస్థితుల్లో సమ్యక్ దృష్టి ఉండాలి.[8] సమాజంలో వీటినన్నిటినీ కలిపి, వలయాల పత్రిక మించి విశాల భావనతో ఉత్తేజ పరచగల వ్యక్తిరూపమే పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామాలో గోపీచంద్ ఆశించింది. ఈ నూతన వ్యక్తి ఆవిర్భావానికి ఇతని దృష్టిలో ప్రజాస్వామిక విధానం ఆధారం. "ఈ నూతన వ్యక్తి అతీత మానవ సృష్టికి ఆధారం,"

అయితే ఒక విషయం ఎప్పటికపుడు ఎన్నో సిద్ధాంతాల వాదాల గురించి పరిశీలనంతో వాటిలో ఎంతో కొంత మంచి ఉంటుందన్న భావంతో ప్రభావానికి గురి ఔతూ నిరంతరం వ్యక్తిత్వ నిర్మాణ ప్రసార రేఖలతో, ఏర్పడిన సంక్లిష్ట (కాంప్లెక్స్) రూపం ఇతనిలో గోచరించకపోదు. వేదన చింతన అన్వేషణతో ఎప్పటికపుడు నవ్యతను ప్రవేశపెట్టాలనే ఆకాంక్ష చేత గుణాత్మకమైన లక్షణానికి అవకాశం ఉంది.

1) వర్తమాన జీవిత స్పందనం - సామాజిక స్పృహ.
2) మధ్య తరగతి మనస్తత్వమూ-జీవిత చిత్రణం.
3) హేతు చర్చ, శాస్త్రీయ దృక్పథం. సంస్కరణ, పరివర్తనంతో ఆధునికత.
4) ప్రజాస్వామిక విధానంపై విశ్వాసం.
5) వ్యక్తి స్వేచ్ఛ, ఆనుభవం, ఆన్వేషణ, ఆనంద భావన.
6) భౌతికం ఆధారంగా మానసిక వికాసం- నైతిక ఆధ్యాత్మిక జీవనం - అతీత మానవ భావన, దివ్యదర్శన స్ఫూర్తి.

ఇవి గోపీచంద్, సాహిత్య జీవితానికి ఉద్దేశించిన లక్ష్యాలు.

సూచికలు :-

1. పోస్టు చెయ్యని ఉత్తరాలు — పీఠిక.
2. పోస్టు చెయ్యని ఉత్తరాలు - పీఠిక.
3. తైత్తరీయోపనిషత్తు - III-IV-I.
4. గోపీచంద్ జీవిత రేఖలు - త్రిపురనేని సుబ్బారావు.
5. పట్టాభిగారి సోషలిజం (విమర్శ) 1938; సోషలిస్టు చరిత్ర. కమ్యూనిజం అంటే ఏమిటి? ప్రజా సాహిత్యం (వ్యాసాలు) 1945 (నవ్య. మా. వా.) కార్యదర్శి.
6. శిథిలాలయం పు, 122
7. గోపీచంద్ జీవిత రేఖలు - త్రిపురనేని సుబ్బారావు.
8. పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా - పరిచయం.

వేద పండితుని కాశ్మీరు జరీ శాలువా

శ్రీ ముదివేడు ప్రభాకరరావు

1

పూర్వజన్మ సముపార్జిత పుణ్యఫలంలా
ప్రాగ్జన్మ సంస్కారంలా వెన్నంటి వచ్చే విద్యలా
అనాయాసంగా తనకబ్బిన వేద విద్యతో
ఎంతో ఆత్మవిశ్వాసియై దేశాటనం చేయసాగాడు
ఒక సనాతన వేద పండితుడు !
'జన్మానికో శివరాత్రి' అన్నట్లు
పండితుని పాండిత్య ప్రకర్షకు
మెచ్చి యిచ్చాడు జమీందారు
ముచ్చటగా ఓ కాశ్మీరు జరీ శాలువా !!
పదిలంగా —
ప్రాణ ప్రదంగా —
ఒక అమూల్య నిధిగా —
సంరక్షిస్తూ వచ్చిన శాలువాను చూచుకొంటూ
పదే పదే జమీందారుగారి దాతృత్వాన్ని పొగడుకొంటూ
పండితు డొకనాటికి గృహస్థుడయ్యాడు !
ఒక సంవత్సరకాలం సంతోషంగా గడిపేశాడు !

2

క్రమ క్రమంగా ఘనాపాఠి ఎందుకో వేదాన్నే
వదులుకొన్నాడు!
వాదాన్నే మానుకొన్నాడు !!
జటావల్లభు డై విరాగిగా మారిపోయాడు !!
పండితుని శాలువా యిప్పుడు బాగా పాతబడిపోయింది !
రోజు రోజుకూ జీర్ణించి శిథిలం కాసాగింది !!
వేద పండితుడది చూచి ఎంతో వేదన పడ్డాడు
తన పాండిత్యపు పాత కథలు
తలచి తలచి కుమిలిపోయాడు
మసిపాత మానికంలా —
చాప చినిగినా చదరంత అవుతుందని
తన వేద విద్యపై విశ్వాసాన్ని మాత్రం
ఆఖరి శ్వాస వరకూ వదులుకోలేక పోయాడు

3

ఇంతకీ పండితుని దుఃఖానికి
కారణం అంతుబట్టలేదు కొందరికి !
జమీందారు బహూకరించిన
జరీశాలువా జీర్ణించి పోతోందనా ?
లేక జీర్ణవస్త్రంలా తన వేదవిద్య
చివికి అంతరించి పోతోందనా ?
అసలు రహస్యం ఆయన
అంతఃపురంలోనే వుందని ఎవరికి తెలుసు ?
ఉట్టికెక్కలేనమ్మ స్వర్గాని కెక్కుతుందా ?
పుట్టెడు రోగంతో పుట్టిన కొడుకు
పురిటి కందుగా వున్నప్పటి నుంచీ
ఎప్పటికీ వదలకుండా
పండితుని భారీ జరీశాలువాను
ముంచుకొచ్చే చలికి వెచ్చగా కప్పుకొంటున్నాడు
వాడొక అన్నార్తుడైన జీవుడు !
అమాయకుడైన పండిత పుత్రుడు !!
కడుపులో సంకటు పడుతూ
గుండెలో గునపాలు దింపుకొన్నాడు వేదపండితుడు !
నానాటికీ శిథిలమౌతున్న శాలువా

రాహుగ్రస్తమౌతున్న చంద్రబింబం లాంటి
తన పుత్రుని ఆయుక్షీణాన్ని స్మృతికి తెస్తోంది !
తన ఆర్థికస్థితి నానాటికీ తీసికట్టయ్యింది !
ఎవరో పుణ్యాత్ములు దయతలచి యిచ్చిన
అంగవస్త్రాలు కూడా నల దమయంతుల వస్త్రంలా
దొంగ లెత్తుకు పోయారు !
చేతి కందిన ఫలాలు
కోతు లెత్తుకుపోయాయి !
'కృష్ణార్పణం' అని కళ్ళు మూసుకొన్నాడు పండితుడు !
అది గాలికి పోయిన పేలపిండని కాదు —
తన గాలి సోకితే గాలికూడా
పేలవమై మైల పడిపోతుందని బాధపడ్డాడు !
దీర్ఘకాల రోగపూరితుడైన
తన కుమారుని శరీరాన్ని
జీర్ణవస్త్రంలా త్యజించి
సుకుమారమైన హంస
ఏ క్షణం లేచిపోతుందోనని
అనుక్షణం ఆందోళన చెందసాగాడు !
వేదనా పూరితుడు - వేద పండితుడు !!
సమస్త లోకానికి సర్వదా సుఖాన్నే కాంక్షించే
వేదవిద్య తన బతుకును
కాశ్మీరు జరీ శాలువాగా మారుస్తుందని ఆశపడ్డాడు !
ఒక్కగానొక్క పుత్రుడు
తన పాండిత్య సౌధాన్ని మణిమండితం చేస్తాడని
కలలు గన్నాడు !
కాని చివరికేమయింది ?
తన జీవిత సౌధమే తలకిందులయింది !
పండితుని దుఃఖానికి అంతులేకపోయింది !!

4

చిట్టచివరికి జీవిత కఠోరసత్యాన్ని గ్రహించి
ఇంగువ కట్టిన గుడ్డలాంటి
తన సంస్కారాన్నే ఆశ్రయించి
యిలా సమాధానం చెప్పుకొన్నాడు పండితుడు !
పాండిత్యానికీ పాపానికీ సంబంధం లేదన్నాడు
'దానికదే' 'దీనికిదే' - పొంతన కుదరదన్నాడు
జగమంతా ఋణానుబంధ మన్నాడు !
ఋణం తీర్చుకోవడమే
మానవ జీవిత ధ్యేయమన్నాడు !
గత్యంతరం లేదన్నాడు !
పూర్వజన్మలో చేసిన పాపమే
వ్యాధిరూపంగా బాధిస్తుందన్నాడు !
ఆ మహాపాప హరణార్థం నిశ్చల ధ్యాన సమాధిలో
మునిగిపోయాడు..
తనకే ఆశ్చర్యకరంగా పండితుడి కొక్కటి స్ఫురించింది
అలనాడు ఆర్తత్రాణ పరాయణుడు
అక్షయవస్త్ర మనుగ్రహించి
ద్రౌపదీ మాన సంరక్షకుడైనట్లు
శ్రీ వేదమాత మానుష రూపంగా
తన కిచ్చిన జరీవస్త్రమే
తన శిశువును నఖశిఖపర్యంతం పొదివి
ప్రాణాన్ని, త్రాణాన్ని నిరంతరం
పరిరక్షిస్తూ వుందని గ్రహించాడు !
తన వేద విద్యాగత హృదయ సంస్కారమే
కాశ్మీరు జరీ శాలువాగా కన్పడినా అది
రక్షాకవచంగా వుందని తెలుసుకొన్నాడు !
"నమామి వేదమాతరమ్" అని
గుండెల నిండా గాలి పీల్చుకొన్నాడు !!

శ్రీ మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యము

అన్నమాచార్య చరిత్ర - సంకీర్తన అవతారిక-ఒక పరిశీలన

'చక్కని గ్రహములుచ్చమున మూడలర। అనుపమలగ్నంబునందు వైశాఖ।మున విశాఖను జగంబున నుల్లసిల్ల। జనియించె నన్నమాచార్యుండు ..। అను చిన్నన్నగారి అన్నమాచార్య చరిత్ర - (చూ. పుట8) తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను-అది మొదలుగా....' అను సంకీర్తనల అవతారిక-అన్నమయ్య జనన కాలావగాహనమున కాధారములు.

అన్నమాచార్యులవారి జనన కాలాన్నిగూర్చి పండిత పరిశోధకులలో భిన్నాభిప్రాయాలున్నవి. ఈ విషయమున గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పొరబడినారేమోయని కొందరందురు. శ్రీ శాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠిక వ్రాయునాటికి ముందే తిరుమల తిరుపతి దేవస్థానమువారి ఎపిగ్రాఫికల్ రిపోర్టునందు—

"ది కంపయిలేషన్ ఆఫ్ దీస్ త్రీ లిటరరీ వర్క్స్ ఫాల్స్ వితిన్ ది పీరియడ్ బిట్వీన్ 1424 అండ్ 1503 ఎ.డి ఫర్ ది బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ ది తాళ్ళపాకమ్ మ్యూసిషియన్ పొయెట్స్ వయిడ్. టి. టి. డి. ఎపిగ్రాఫికల్ రిపోర్ట్, పేజి 279"

అని వున్నది దీన్నిబట్టి ప్రభాకరశాస్త్రిగారు వేంకటేశ్వర వచనములు పీఠికవ్రాయుచు (ప్రచురణ 1945 పీఠిక పుటలు 12, 13) అన్నమయ్య జన్మకాలము క్రీ.శ. 1408 అని వ్రాసియు, అన్నమాచార్యచరిత్ర పీఠిక 2-3 పుటలలో క్రీ. శ. 1424 గా దానిని సవరించినారు. వారట్లేల చేసిరో? కారణము తెలుపలేదు. క్రీ.శ. 1424 నుండి 1503 లోపల తాళ్ళపాక అన్నమయ్య 'శృంగారమంజరి' - ఆధ్యాత్మ కీర్తనలు - శృంగార కీర్తనలు' అను మూడు రచనలు పూర్తిచేసినాడను తిరుమల తిరుపతి దేవస్థానమువారి రిపోర్టులోని వాక్యాలు చూచి ఏమని భావించారో తెలియదు. క్రీ.శ. 1408-1503 అన్నది అన్నమాచార్య జన్మకాలమని తి. తి. దే ఎపి రి.పో. 358 ప్రకటించియున్నారు. ఆ రిపోర్టునకు సంపాదకులైన శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారును, కవి తరంగిణీ పరిశోధకులైన శ్రీ చాగంటి శేషయ్యగారును, క్రీ.శ. 1408-1503 అను కాల నిర్ణయమునే స్థిరీకరించినారు. వీరందరికి రాగిరేకులలో అన్నమాచార్య సంకీర్తనములకు ముందున్న అవతారికా వాక్యములు ప్రమాణము - చూ -

"స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు 1346 అగునేటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారేండ్లకు తిరువేంగళనాథుడు ప్రత్యక్షమైతేను. అది మొదలుగాను శాలివాహన శక వరుషంబులు 1424 అగునేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ (ద్వాదశి) నిరుదానకు తిరువేంగళనాథుని మీదను అంకితముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన అధ్యాత్మ సంకీర్తనలు (శృంగారసంకీర్తనలు)."

ఇందుగల శా. శ 1346 క్రోధి అగునేటికి అన్నమయ్యకు పదునారేండ్లు. అనగా జననము శా. శ 1346లో 16 ఏండ్లు పోగా శా.శ 1330 (క్రీ. శ. 1408)లో తెలియునుగదా. సంకీర్తనాది రచనా కాలం శా.శ. 1346 (క్రీ.శ 1424) నుండి క్రీ.శ 1503 వరకు అనగా 79 సంవత్సరములు సాగినదని తి.తి. దే. వారి రిపోర్టు తెలియజేయుచున్నది. అన్నమయ్య బాల్యము 16 సంవత్సరము సంకీర్తన రచన ప్రారంభ కాలమైనపుడు జీవితాంతము వరకు రచనా కాలము (క్రీ శ 1503) 79 ఏండ్లగును. దీనితో బాల్యము 16 ఏండ్లు కలిసిన 95 ఏండ్లు (క్రీ.శ 1408-1503) అన్నమయ్య జీవించినాడని తెలియవలెను.

క్రీ.శ 1424 సం॥ తర్వాత ఎనిమిదేండ్ల బాల్యమున అన్నమయ్య కొండకు వచ్చినట్లును, వేంకటేశ శతకము చెప్పినట్లును, తర్వాత ఎన్మిదేండ్లకు (16 ఏండ్ల వయసున) స్వామి సాక్షాత్కార మైనంతనే! సంకీర్తన మారంభించినట్లును శ్రీ శాస్త్రిగారు తలంచినట్లున్నదేమో క్రీ. శ. 1424 సంవత్సరమే సంకీర్తనారంభ కాలమని భావింపలేదు. వారి పద్ధతిని బట్టి చూడ క్రీ.శ 1424 సం॥ జన్మము క్రీ.శ, 1440 సంకీర్తనారంభకాలమని యేర్పడును. ఇది సరిగాదు. ఇది సరికాదని తర్వాత శ్రీ శాస్త్రిగారే గ్రహించి సవరించారు. ఇట్లే పెద తిరుమలాచార్యుని జన్మదినమును గూర్చి పలు అభిప్రాయములున్నవి . జననము

క్రీ.శ.1473 శ్రీశాస్త్రిగారి నిర్ణయము. క్రీ.శ.1475,1468,1458-60 నడుమ అని క్రమంగా శ్రీ ఏ.వి. శ్రీనివాసాచార్య, శ్రీ జి.యస్. రెడ్డి, శ్రీ వేటూరి ఆనందమూర్తిగార్లు వారికి తోచినట్లు నిర్ధారించినారు. ఏమైనను, సగటున క్రీ.శ. 1473 నుండి క్రీ.శ. 1554 వరకు పెద తిరుమలాచార్యులుగారి జీవితకాలమని తెలియవచ్చును. 81 సంవత్సరాల ఆయువ్వంతుడు. క్రీ.శ. 1475 అనుకొన్నను రెండేండ్లు తక్కువై 79 అగును.

ఇందొక విచిత్రమున్నది. తాళ్ళపాక వారి జన్మ తిథులెవ్వియు తెలియుటలేదు. పరమపదించిన కాలమే తెలియుచున్నది. శ్రాద్ధకర్మ క్రియలేటా నిర్వహించుటవల్ల కాలము పరంపరగా నిల్చి తెలియగలదు. వివాహకాలమువరకే జన్మ తిథుల యవసరము గాన తర్వాత వానిని గూర్చిన యవసరమంతగా నుండదు. నేటికాలమువలె విద్యాభ్యాసానికి, ఉద్యోగానికి జన్మ తేదీలవసరమైనట్లు లాకాలమున వాని యవసరము లేదుగదా! అందువల్ల జన్మకాలములు విస్మృతిపథమున బడిపోయిన వేమో ! పై విధమున నిర్ణయించినపుడు -

అన్నమయ్య జన్మప్రాప్తి క్రీ. శ. 1408 పుణ్యప్రాప్తి క్రీ. శ. 1503

పెదతిరుమలయ్య ,, ,, 1473 పుణ్యప్రాప్తి క్రీ. శ.1554

దీనినిబట్టి అన్నమయ్య వయస్సు 95 ఏండ్లు. పెద తిరుమలయ్య వయస్సు 81 ఏండ్లు ఈ విధమునగాక శ్రీ కె. ప్రభాకర శాస్త్రి గారి నిర్ణయం 1424 జన్మదినమని భావించినచో పైవయో నిర్ణయమున 16 ఏండ్లు అన్నమయ్యకు తగ్గిపోవును.

చిన్నన్న వ్రాసిన అన్నమయ్య చరిత్రలో సూచింపబడుచున్న యంశములు అన్నమయ్య బాల్య వయో విశేషములు కొంత పరికింతము.—

1. "లక్కమాంబకు బుణ్య లావణ్య నిధికి
చక్కని గ్రహము లుచ్చమున మూ, డలర
అనుపమ లగ్నంబు నందు వైశాఖ
మున విశాఖను జగంబున నుల్లసిల్ల
జనియించె నన్నమాచార్యుండు" —— పుట 9

2. "నింతయై యంతయై యీ దేటి బుద్ధి
మంతుడై పంచసమంబులైనంత
నియతిమై గురుడుపనీతు, గావించి
నయవేది నధ్యయనంబు సేయించె". —— పుట 11

3. "నత్తటి నలుదిక్కులరసి యా శిశువు" —— పుట 18

4. "హరివాసరమ్మె వయమ్మఋనాడు
నీ రీతి నెనిమిదేడులపిన్న —— —— పుట 23

5 "నడుగక సంకీర్తనము సేయు నెపుడు
ముద్దు గారెడు వాడు.... —— పుట 27

ఇవి యన్నియు అన్నమయ్య జన్మప్రభృతి ఎనిమిదేడుల వరకు జరిగిన విశేషములు -

1. "అలమేలుమంగకు నాశు మార్గమున
సలలితంబుగ నొక్క శతకంబు సెప్పె...." —— పుట 18

2. "వేంకటపతిమీద విస్తరముగ
వేంకట శతకంబు విన్నవించుటయు" —— పుట 25

3. "వెంకటప్పకు విన్నవించిన తొంటి
వెంకటశతకంబు విన్నవించుటయు" —— పుట 28

అను విశేషములు జరిగిన పీయెన్మిదేడుల వయసు పైననే యనుట నిర్వివాదము. ఇప్పటినుండి ఆ తర్వాత సంకీర్తనల రేకుల పైని ఆవతారికననుసరించి" తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను" అనుదానిలో "పదారేండ్ల"లో తిరువేంగళనాథుడు ప్రత్యక్షమైన అంశమును పరిశీలించవలెను.

అన్నమయ్య తాళ్ళపాకలో ఐదేండ్ల వయసున ఉపవీతుడై నాడు. ఆనాటికే అన్నమయ్యకు—

"వెన్నని వరముచే విద్యలన్నియును
నమితంబులగుచు జిహ్వారంగసీమ
తము దామె సొచ్చి నర్తన మాడదొడంగె
నా పిన్నప్రాయంబునందు నా మేటి
యేపారం దనమది కిచ్చయైనట్లు
ఆడినమాటెల్ల నమృత కావ్యముగ
పాడిన పాటెల్లం బరమగానముగ
తన కవిత్వమునకుం దనగానమునకుం
గనుగొని సకలలోకములు గీర్తింప -"

గలట్టి విద్యా వైభవము సమకూరింది (అ.చ. పుట ॥) "వేంకటపతి మీద ఎంత వింతలుగ । సంకీర్తనంబులు సవరించుట కల్గింది. కొన్ని పాటలు పద్యాలు పాడేవాడు. అప్పుడతని నోట వెలువడినవే తాళ్ళపాక చెన్నకేశవుని పై చెప్పిన చెన్నకేశవ శతకము *

* ఈ శతకములను గూర్చిన వివరణములతోడి వ్యాసములు తిరుమల తిరుపతి దేవస్థానములవారి 'సప్తగిరి' మాస పత్రిక డిశంబరు 1983 సంచికనుండి ప్రకటింపబడు చున్నవి. చూడుడు.

అచ్చటనే వెలసిన సుదర్శన చక్రాంతరమున గల బాల కృష్ణుని పై చెప్పిన చిన్ని కృష్ణ శతకము-మున్నగునవి. ఇది అన్నమయ్య 5, 8 ఏండ్ల వయసులో జరిగిన సంగతి.

ఇంట కష్టాలు పడి చేలో చెయ్యి కోసుకొని తిరుమల కేగు తైర్థికులవెంట అన్నమయ్య తిరుమల కేగినదీ ఎన్మిదవ యేటనే.

కొండపై మోకాళ్ళ ముడుపు చెప్పు కాళ్ళతోనెక్కి. అలసి ఆకలితో నిద్రించినపుడు అల్మేలుమంగమ దర్శనమిచ్చి లేపి రుచి రాన్నమిచ్చి ఆకలి తీర్పగా" తనకేల నిడు ప్రసాద ప్రభావమున పరమ సారస్వత పారీణుడగుచు, సరస కవిత్వ వాచాప్రౌఢి మెఱపి, ఆమెపేర ఆశువుగా శతకం చెప్పాడు. అనంతరం తైర్థికులతో కలసి స్వామి సన్నిధినిగల దేవతామూర్తులను దర్శించి, ఆలయసొబగు గాంచి అబ్బురం చెందాడు. స్వామి సన్నిధిచేరి "అనుపమ దివ్య భూషాది వైఖరులు, గలిగిన దివ్యమంగళ విగ్రహంబు, గలయంగఁ గన్నుల కరవెల్లఁ దీర, సేవించి తనివోక శ్రీవెంకటేశు, 'దేవుని మఱియుఁ గీర్తింపంప, దొణఁగి" నాథుండు అ. చ. పుట 22. స్వామి దర్శనమున పులకితగాత్రుడైనాడు. అచటగల దేవుళ్ళను సేవించి నాడు ఆకాశగంగ, పాపవినాశము మున్నగు తీర్థాలలో మునిగినాడు. ఈలా కొన్ని దినాలు "హరిచరణ స్మరణాసక్తుఁడగుచు" గడపినాడు. అన్నమయ్య.'హరి వాసరమ్మైన యమ్మఱునాఁడు'— 'ఎన్మిదేడుల పిన్నవాఁడై'న అన్నమయ్య ఒకనాడు— '....దేవతీర్థముల, నవగాహనముచేసి యా తేటనీట, ధవళంబుగా ముసుదాఁ గట్టుచీర, నుదికి యారగవైచి యొకరాతి దండ, నదియెండ నారెడు నంతలోపలనె, వితత వృత్తంబుల వేంకటపతికి, శతకంబు కుతుకంబు సమకూరఁ జేసి" నాడు.

ఆ తర్వాత స్వామిని దర్శించి సేవించుటకై గుడికేగినాడు. గుడి తలుపులు మూసి బీగాలు వేసియున్నవి. అన్నమయ్య గుడి వాకిట నిల్చి "వేంకటపతి మీద వివర స్తవముగ, వేంకట శతకంబు విన్నవించుటయు"— గుడి తలుపుల బీగాలు 'ఫెళ్ళ'ని ఊడిపడినవి. "సదమలాచారుఁడై చనుదెంచి యతఁడు, పరుసతో హరి పరివారంబుఁ గొలిచి, మరు గురుద్వార సీమకు వచ్చి మ్రొక్కి యల వేంకటేశ్వరు నపరంజి తగడు, తలుపులు బీగముల్ దాచి యున్నెడను"[చూ. అ. చ పుట 24] అచ్చట చేరిన వైష్ణవస్వాములు భక్తులు, అన్నమయ్య మహిమకబ్బురమంది. అన్నమయ్యకు స్వామి దర్శనం చేయించకముందు, "గరుడ సేనేశులఁ గపిరాజ ముఖుల, జనకజాసౌమిత్రి సహితు రాఘవుని" చూపించినాడు. అనంతరం ఆనంద నిలయంలోని "శ్రీవేంకటేశు నాశ్రిత కల్పకమును" దర్శింపజేశారు.

అచ్చట— 'నంబిచెంగట' బూజనము సేయు తఱిని, పంచిన భక్తి న బ్బాలుండు మఱియు, వెంకటప్పకు విన్నవించిన తొంటి, "వేంకట శతకంబు విన్నవించుటయు" అన్నమయ్య ఎన్మిదేడుల పిన్న వయసులోనే ! దేవునిపై శతకాలు చెప్పడం దైవసంకీర్తనలుగా పాటలు పాడడం అన్నమయ్యకు పసితనంలోనే అబ్బింది. బాగా ఆశువు చెప్పడంలో అలవాటు పడ్డాడు. తనయూర వెలసిన చెన్నునిపై చిన్ని కృష్ణునిపై శతకాలు చెప్పాడు గదా! ఇట్లే మరే దేవుళ్ళపై ఏఏ శతకాలు చెప్పాడో, ఏ వయసులోనో అంతుపట్టదు

ఇచ్చట నొక విశేషముంది - మోకాళ్ళ ముడుపున అలమేల మంగమ్మ ఆదరణ పొందినతర్వాత అన్నమయ్య తిరుమలలోని దేవతా మూర్తులను దర్శిస్తూ, అర్చకులిచ్చిన స్వామిప్రసాదంతో నాకలి తీర్చుకొంటూ, ఆలయాధిపతుల అనుమతితో నచటి ఆలయమండపాలలో విడిదిగా వుంటూ, పద్యాలతో పాటలతో స్వామిని సేవిస్తూన్నట్లు అన్నమయ్య చరిత్ర తెల్పుతూంది. ఈ విధంగా అన్నమయ్య తిరుమలలో ఎనిమిదేండ్లు గడిపినాడు. ఈ ఎన్మిదేడులలో అన్నమయ్యను గూర్చిన విశేషాలు అన్నమయ్య చరిత్రలోలేవు లుప్తమయ్యెనో, లేక తెలియక చిన్నన్న వ్రాయలేదో, అవి యే మహిమా సమన్వితములో, పాడిన పాటలు పద్యాలెట్టివో, ఆ దేవుడికే యెరుక! ఏమయినా- అన్నమయ్య ఈ ఎన్మిదేండ్లలో తిరుమలలోని కొందరు బుధోత్తముల సాహచర్యమునను, సేవనమువల్లను విజ్ఞాన సంపద సంతరించు కొన్నాడు. దేహపటుత్వముతోపాటు వాక్పటుత్వం భక్తితత్త్వంతో అతని మానసము పరిపుష్టిని సంతరించుకొని యౌవనారంభంలో అడుగు పెట్టింది. అన్నమయ్య చరిత్రకు సంబంధించి తాళ్ళపాకలో పెద్దలవల్ల నాకు లభించిన ద్విపదనీతివాక్యముల "బిట్సు"లో నొకటి—తిరుమలలో దైవదీమంతు లెల్లను ఎరుగజెప్పిన మంచి యెరుకలో నల్ల తిరువెంకటపతిని భక్తిని గొల్చుచుంటి" ఈ అంశాన్ని నిర్ధారిస్తుంది.

ఒకనాడు అన్నమయ్య తన కట్టు వస్త్రమారెడు లోగా వెంకటేశ శతకము సంతరించుకొని, ఆ శతకాన్ని చెప్పి, గుడి వాకిళ్ళ తాళాలూడిపడునట్లు చేసి, వైఖానసోత్తము డైన నంబిచెంగట పూజ చేయువేళ తొంటి చెప్పిన వేంకటశతకము విన్నవించినంతనే—ఒక చిత్రం జరిగింది."పెట్టినముత్యాల పేరా యశోదపట్టి పాదములపై"బడ బ్రసాదించె" — "నదిచూచి అర్చకుండరుదంది వచ్చి ముదమున శఠకోపమును బ్రసాదించె (చూ. అ. చ. పుట 26) అనుటలో పెట్టిన ముత్యాలపేరు-ఎవరు పెట్టిన ముత్యాలపేరు ? అన్నమయ్యపెట్టిన ముత్యాలపేరా? యశోద పట్టిపెట్టిన ముత్యాలపేరా? పాదములపై"బడ బ్రసాదించె" ఎవరిపాదములపై బడ బ్రసాదించెను? అన్నమయ్య పాదములపైననా? యశోద పట్టి పాదములపైననా?

ఈ రచనా వాక్యమున అన్నమయ్య మహిమ యున్నది. యశోదపట్టి అహా కృష్ణరూపుడైన వేంకటేశుడే - (విష్ణువే) (చిన్నన్న భావంలో)

ఆ యశోదపట్టి తాను ధరించిన ముత్యాలపేరు అన్నమయ్య పాదములపైబడ ప్రసాదించినాడా? లేక అన్నమయ్య తాను ధరించిన ముత్యాలపేరు ఆ యశోదపట్టి పాదములపైబడ ప్రసాదించినాడా? అను విచారణలో అన్నమయ్య ఆనాటి కుటుంబ పరిస్థితులను బట్టి ముత్యాలపేరు ధరింపగల సంపన్నుడుకాడు. అదియుగాక 'ప్రసాదించు' అను పదప్రయోగమందుకు తగినదికాదు. 'సమర్పించు' అనునది భక్తునకు తగును. తొలిసారిగ స్వామిని దర్శించినపుడు అన్నమయ్య 'కనక భూషణ వస్త్రఘన వస్తుతతుల మొనసిన బండారమును దేరకొనుచు తడబడఁ జుట్టిన తన పంచ కొంగు, కడనున్న డొక్క కాసు కానుకవెట్టినన్నాడు(అ. చ. పుట 22) ముత్యాల పేరు ప్రసాదించి యుండడుగదా! స్వామివారే కరుణించి తను ధరించిన ముత్యాలపేరు అన్నయ పాదములబడ ప్రసాదించినాడు! అదే స్వామి అన్నమయ్యను అనుగ్రహించుట! సాక్షాత్కరించుట. అదే తిరువెంగళనాథుడు ప్రత్యక్షమగుట! ఆనాటికి అన్నమయ్య వయస్సు పదునారేండ్లు.

అంతవరకు అన్నమయ్య తిరువెంగళనాథునిపై నవి అంకితముగా చెప్పిన కీర్తనలు కాకపోవచ్చు. సంకలితములైనవైనా కావచ్చు. ప్రధానంగా సంకీర్తనల అవతారికా వాక్యములనుబట్టి తిరువెంగళనాథాంకితముగా చెప్పివ సంకీర్తనల ప్రారంభకాల మదే యని నా విశ్వాసము.

అన్నమయ్య ఐదవయేటనే తాళ్ళపాకలోని చెన్నుని సేవించి ప్రత్యక్షం గావించుకొని రుచిరాన్నము తినిపించిన మహిమ కల్గినవాడు (చూ :- తి.తి. దే. వారి "సప్తగిరి పత్రికలో" "చెన్నకేశవ శతకము"ను గూర్చిన నా వ్యాసము, డిశంబరు 83 జనవరి 84నుండి) తిరుమలలో నంబి మున్నగు అర్చకులు స్వామి ప్రత్యక్షమునకు నోచుకొనని వారు కావున వారి చెంగట స్వామి అన్నమయ్యకు ప్రత్యక్షంగాక, ప్రత్యక్ష నిదర్శనంగా తన ముత్యాల పేరు ప్రసాదించి వాడని భావము. అన్నమయ్య బాల్యంలో తాళ్ళపాక చెన్నుడు. అలమేల్మంగమ దక్క మరే దేవుడును. వెంకటేశ్వరుడును ప్రత్యక్షమైనట్లు చిన్నన్న అన్నమయ్య చరిత్రలో లేదు. తాళ్ళపాక చెన్నుని ప్రత్యక్షమైన కథ ఆ చరిత్రలో ఉప్తమైనది. యౌవనంలో వృద్ధాప్యంలో జరిగిన అన్నమయ్య మహిమలు ఆ చరిత్ర పేర్కొనుచున్నవి.

స్వామి సమక్షంలో స్వామి అనుగ్రహము ముత్యాల హార ప్రసాదమున అన్నమయ్య మహిమ చూచిన నంబి "ఈ యన్న బాలుడే యెన్నఁగోనేటి రాయని దివ్య ప్రసాదుండు" అని తలచి అన్నమయ్యకు తీర్థప్రసాదము లిచ్చి ఆదరించినాడు.

ఆ మహిమ జరిగినది "హరివాసరమ్మైన యమ్మఱునాడు; (చూ అ. చ, పుట 28) అర్చకులిచ్చిన స్వామిప్రసాదం కోనేటిగట్టున తిని "అది వరాహుగేహమున సుఖించి । ద్వాదశి నాఁడు నా ధవళాక్షుఁ గొలిచి । దేవుని యా పెద్ద తిరువీధివెంటఁ గోవెల చుట్టును కొని యేఁగి యేగి । సారె సారెకు రాగసంగతిగదుర। నారాయణ స్మరణంబు సేయుచును। నకలంకమై చల్లనై చూడఁదగిన। యొక పంచ తిన్నెపై మండె నుండుటయు"—

ఆ తర్వాతనే ఒకనాటి రాత్రి ఘనవిష్ణుడను మునికి స్వప్నంలో స్వామి కనబడి అన్నమయ్యకు పంచ సంస్కృతి గూర్చుమని ఆదేశించినాడు. అనమయ్య పంచ సంస్కార శోభితుడై వైష్ణవ జన పంక్తి భోజనమునకు అర్హుడైనాడు. పిమ్మట ఒకనాడు తిరుమలకు తల్లివచ్చి వైష్ణవస్వాములనర్థించి అన్నమయ్యను ఇంటికి తోడ్కొనిపోవును.

ఆ పదారేండ్ల వయసున తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైన ఆనాటినుండి అన్నమయ్య దినమున కొక్కసంకీర్తనమునకు తక్కువ కాని పద్ధతి ననుసరించుకొని తిరువేంగళనాథాంకితంబుగ ఆధ్యాత్మిక, శృంగార సంకీర్తన లెన్నో పల్కినాడు.

తాను పుణ్యప్రాప్తి చెందు కాలమున అనగా శాలివాహన శకము 1424 దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళద్వాదశి సిరుధాన సమయమున (క్రీ శ. 1503) తానవలంబించిన సంకీర్తన నియమాన్ని తన పెద్ద కుమారుడు పెద తిరుమలయ్యకు తెల్పి తనవలె సంకీర్తనలు చేయుమని ఆజ్ఞాపించినాడనీ, తండ్రి మాటప్రకారం అట్లే పూనుకొని ఆనాటినుండి పెద తిరుమలయ్య అందులకు శ్రీకారం చుట్టి సంకీర్తనారంభుడయ్యెననీ, చరిత్ర వృత్తాంతము !

"ఎవ్వడో కాని యెరఁగరాదు కడు-
దవ్వులనే వుండు తలఁపులో నుండు-"

అధ్యా. సంకీర్తన-74


హాలే బీడులో

శ్రీ జె. బాపురెడ్డి

హాలే బీడులో కన్నులు అదిరాయి
బేలూరులో గుండెలు బెదిరాయి_
రాళ్లన్నీ గుళ్ళల్లో
రసరాగాలు తీస్తుంటే
కాలమే [illegible]
తాళం వేస్తుంటే
హాలే బీడులో కన్నులు అదిరాయి
బేలూరులో గుండెలు బెదిరాయి-
అందాలన్నీ [illegible]
బృందావనమల్లే
అద్దంముందర నిలిచిన
ముద్దులగుమ్మ
గతకాలన్న [illegible]
కదిలిస్తుంటే
వర్తమాన బంధాలను
వదిలిస్తుంటే
హాలేబీడులో కన్నులు అదిరాయి —
బేలూరులో గుండెలు బెదిరాయి_
స్తంభించిన జడతనుండి
రంభోర్వశి నాట్యాలు
స్పందించిన ప్రస్తరాన
నందీశ్వర నాదాలు
శిల్పకళా తపస్సిద్ధి
చాటుతు ఉంటే
జీవరస రహస్తంత్రులు
మీటుతు ఉంటే
హాలే బీడులో కన్నులు అదిరాయి
బేలూరులో గుండెలు బెదిరాయి

వగపేటికి పాలుచిందినన...

ఇచ్ఛాపురపు రామచంద్రం



ప్రమాదో ధీమతా మపి....

బుద్ధిమంతులకి కూడా తప్పని ప్రమాదం - సామాన్యులకెందుకు తప్పుతుంది?

ఆ కుర్రవాడు బుద్ధిమంతుడిలాగే ఉన్నాడు. చిదిమిన పాల్గారు అన్నట్లు లేత బుగ్గలూ....పదేళ్ళ ప్రాయమూ మోకాలిపై వరకూ నిక్కరూ....మామూలు చేతుల చొక్కా... హిప్పీక్రాపు కాకుండా ముఖం కనిపించే చిన్న జుత్తూ....అలాగ. యత్ర రూపం తత్ర గుణాః అన్నారు గనుక-ఆ బాలుణ్ని చూసి బుద్ధిమంతుడనుకోడంలో విపరీతమేమీ ఉండదు.

రెండుచేతులు కలిస్తే కాని చప్పట్లు కానట్లే —

రెండు కలిస్తే కాని ప్రమాదమూకాదు. ప్రమాదం అనే దానిని - రెండు, లేదా అంత కంటె ఎక్కువ వస్తువులు కాని... ఇద్దరు మనుషులు... లేదా... ఒక పదార్థమూ ఒక వ్యక్తికాని... యిలాగ...వీటి లేదా వీరిమధ్యా-జరిగే ఢీ కొను కార్యక్రమంగా నిర్వచించవొచ్చు స్థూలంగా.

ఆ బాలుణ్ని - సైకిలు ఢీ కొట్టింది.

సైకిలు తొక్కుతున్నవాడు ముప్ఫయ్యేళ్ళ పై బడిన వాడేకాని - ధీమంతుడిలా కనిపించడం లేదు. అతనికి- ముగ్గు బుట్టంత తలకట్టుంది. చెవుల కిందికి .... చెంపలమీదుగా...దాదాపు మీసాల కొసలతో ముద్దులు పెట్టుకుంటున్నాయా అనిపించే సైడ్ బర్న్స్ ఉన్నాయి. చీరేమో అనిపించే ఎర్రపువ్వుల లుంగీమీద—ఆకుపచ్చని బనియన్ లాటి దాన్ని ధరించిన అతన్ని చూస్తే-తెలుగు తెరనుంచి జారిపడిన రౌడీ అనే అనిపిస్తుంది. కానీ సదభిప్రాయం కలగదు. మిన్నూ మన్నూ చూసుకోనంత వేగంగా అతను తన వాహనమయిన సైకిలుని నడుపు తూండబట్టే... వేగము మృత్యువు. నిదానమే. ప్రధానము. మెల్లగా గమ్యమును చేరుము, తొందరపడి స్వర్గమును చేరకుము.... వంటి రాస్తా సూక్తులను పెడ చెవిన పెట్టబట్టే

ఆ ద్విచక్రశకటం - పదేళ్ళబాలుణ్ని ఢీ కొనడం - అతను పక్కకి పడిపోవడమూ....రెప్పపాటులో జరిగిపోయింది. నా కన్నుల ముందరే. మనిషి పతన మయ్యాక కాని వివేకమూ పశ్చాత్తాపమూ కలుగనట్లే సమయం దాటి...పరిస్థితి ముదిరి.... ప్రమాదం జరిగాక కాని సైకిలుకి బ్రేకులు పట్టవు. చేతులు కాలాక, ఆకులు పట్టుకునీ; బాలుణ్ని గుద్దేశాక బ్రేకులు పట్టుకునీ ఏం లాభం?

కుర్రవాడు- రాళ్ళు పొడుచుకు వొచ్చిన రోడ్డుమీద పడిపోవడమేమిటి, సైకిలాగింది...చేయవలసిన ఘనకార్యమంతా చేసేసి ఏమీ ఎరుగని నంగనాచిలా.... వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రిని గద్దె దింపిన ఎమ్మెల్యేలా.

అతను-

రౌడీ రూపంలా ఉన్నా - మామూలు మనిషినే...మనసూ మంచితనమూ ఉన్నవాడినేసుమా అని నిరూపించుకుంటున్నట్లు ...తాను సైకిలు దిగి...దాన్ని వొదిలేసి...బాలుణ్ని లేవనెత్తి..."దెబ్బ తగిలిందా బాబూ?" అని అడిగాడు అనునయంగా.

ఒక్కక్షణం... జరిగిన దేమిటో అర్థంకానట్లు....అయోమయంగా - "లేదు" అన్నట్లు తలూపాడబ్బాయి.

అమ్మయ్య అనుకున్నాను-నేనూను మనసులో.

ఎంతసేపు?

మహాఅయితే-ముచ్చటగా ముప్ఫయ్ సెకండ్లు

ఆ అబ్బాయి కెవ్వుమన్నాడు.

సైకిలు వాలాతో పాటు నేనూ త్రుళ్ళిపడ్డాను.

కుర్రవాడి మోకాలి దిగువ _ చర్మం గీరుకుపోయి - రక్తం కారుతోంది!

నాకు తెలుసు. దెబ్బతగిలిన తక్షణం బాధ తెలియదు. మత్తెక్కడానికి లాగే బాధ తెలియడానికి కూడా కొంత సమయం తీసు

కుంటుంది పచ్చని మోకాలిమీద-ఎర్రనిరక్తం. జాలేసింది. ఎంత బాధ పెడుతూందో ఆ గాయం – పాపం !

ఆ కుర్రాడు – రోడ్డుమీద కూర్చుండి పోయి.... నేలవేపు చూస్తూ - ఏడుస్తున్నాడు. అతనికి కొంచెం దూరంగా స్టీలు కారియర్ ఒంటిగిన్నెది పగటి వేళ భార్యాభర్తలలా-విడివిడిగా ఎదముఖం పెద ముఖంగా గిన్నె....మూత. దిక్కు - తెలియనిపిల్లల్లా ఏం చేయాలో తోచని ఆ దంపతుల సంతానంలా నలుమూలలా పరుగెడుతున్న ప్రవహిస్తున్న - (పిల్ల) పాల కాలువలు. పాలు నేలపాలయ్యాయి.

కుర్రాడికెంత బాధగా ఉందో - వెక్కి-వెక్కి ఏడుస్తున్నాడు.

అప్పటికే - నాతోపాటు నలుగురూ చేరారు,

రౌడీ – సహజంగానే అంతమంచివాడో... లేక యీపరిస్థితిలో బయట పడటానికి మంచి తనం కంటె మరోమార్గంలేదనో...." దా బాబూ...డాక్టరు దగ్గరకి తీసుకువెళ్ళి మందు వేయిస్తాను." అన్నాడు.

అప్పటికే-నలుగురూ-సైకిలు వాలామీద కోపాన్నీ, బాలుడి మీద సానుభూతినీ ధారాళంగా ప్రదర్శించేస్తున్నారు.

సైకిలెక్కి-తేచాలు కళ్ళు మూసుకుపోతాయి. ఎంత స్పీడుగా తొక్కితే అంత గొప్పయిపోయింది. చూసుకోరు –

సైకిలువాలా మీద జాలివేస్తూంది నాకు. ఎందుకంటే –జరిగిన దేమిటోనేను ప్రత్యక్షంగా చూశాను. తప్పు - సైకిలు వాలాది కాదు. కుర్రాడు సైకిలు మీదకు వొచ్చాడు కానీ సైకిలు కుర్రాడి మీదకి రాలేదు. అదీ సత్యం. కాని నేను దానిని బయట పెట్టి వేలి పనిచేయ దలుచుకోలేదు. ప్రజలసానుభూతి అంతా దెబ్బతిన్నవాడిమీదా, తల్లి ప్రేమంతా చెడిపోయిన కొడుకు మీదా-మాత్రమే ఉంటాయన్న సహజ సత్యం నాకు బాగా తెలుసు. అందీకాక యిక్కడ...నేను చెప్పబోయే నిజం వల్ల ఉపయోగ ముండదు.

"కుర్రాడు చూస్తూ చూస్తూ మళ్ళీ నీ సైకిలెలా ఎక్కుతాడు ? చేసిన నిర్వాకం చాలదూ ?

"అదిగాదు...దెబ్బకి మందువేయించి. టెట్ వాక్ ఇంజక్షని ప్పించి..." కర్తవ్యం నిర్వర్తిస్తున్నట్లు చెప్పాడుసైకిలువాలా మెల్లగా భయపడుతూనే.

"ఆ బాధలేవో అబ్బాయి తల్లి తండ్రులే పడతారుకానీ - ఓ పదిరూపాయలిచ్చెయ్...మందుఖర్చుకి" ఎవరో సూచించారు.

బ్రతుకు జీవుడా అనుకున్నట్లుంది సైకిలువాలా. చటుక్కున జేబులోంచి పదిరూపాయలనోటు తీసి అందించాడబ్బాయికి.

సైకిలు యజమాని చేయిదాటి-మరెవరి అధీనంలోనో ఉంది.

అబ్బాయి-పదిరూపాయల నోటందుకున్నాడు-ఏడుస్తూనే.

ఇంక తనసైకిలిచ్చేసి యీ పరిస్థితినుండి విముక్తుణ్ణి చెయ్యమన్నట్లు – తన సైకిలుని అధీనంలోకి తీసుకున్న పెద్దమనిషి వేపు చూశాడు సైకిలువాలా.

"పాలు పట్టుకెళ్ళకుండా గడప తొక్కితే వీపు చీరేస్తాడు నాన్న. అవి- కాఫీ పాలు" ఏడుస్తూ.... భయంగా అన్నాడు దెబ్బ తిన్న బాలుడు. నిజమే.... పాలు వొలికినందు కొక చింత. నాన్న వీపు చీరేస్తాడన్న అసలు చింత. సరే, కాలుమీది చర్మం చీరుకుపోయిన బాధ బాగా ఉండనే ఉంది.

ఆ నాన్నెవడో నాలాటి వాడే. కాఫీ గత ప్రాణిలా ఉన్నాడు. కొందరు 'కోపమొస్తే మనిషినికా 'నంటారు. కోపం రాకపోయినాన్నూ అని సన్నగా చమత్కారంగా చురకవేస్తాడు మా మిత్రుడు. తెల్లవారే సరికి, కన్ను తెరిచేసరికి కాఫీ అందకపోతే నాలాగే ఆ అబ్బాయి నాన్నకి వొళ్లు తెలియదు కాబోలు.

"ఎన్ని పాలవి ?"

"లీటరు ?" చెప్పాడు అబ్బాయి,

"వెళ్ళి- పాలుకొని, అబ్బాయిని యింటివద్ద దింపెయ్." అని ఎవరో పెద్ద మనిషి సమస్యా పరిష్కారం చేసేశాడు సత్వరంగా.

అమ్మయ్య అనుకొని, సైకిలువాలా అబ్బాయిని సైకిలెక్కమని- క్యారేజి హాండిల్ కి తగిలించి- రివ్వున పాలకేంద్రం వేపు లాగించేశాడు. .... యిబ్బందికరమయిన ఆ సన్నివేశంనుంచి బయట పడితే అదే పదివేలన్నట్లు.

అబ్బాయి- చిరునవ్వు చిందిస్తున్నాడు.

ఇప్పుడతని ముఖంలో ఏ బాధాలేదు! కథలో పస, పట్టు లేకపోతే ఏం ?

శ్యామలాంబా గరీయసి

కోమలీ,
నీనల్లని కేశపాశపు ద్యుతులు,
నల్ల కలువల కళ్ళ చూపులు,
నల్లని యమునా వడిపాయలాటి
వీమేవి నైగ నిగ్యాలు
శేషాహిని,

చంద్రికా శిఖల్ని
విద్యుల్లతల్ని
వెలవెల బారిస్తున్నాయి!
నలుపుకే వెల ఉన్నదని చాటుతున్నాయి!
నలుపులోనే వెలుగు ఉందని
చూపుతున్నాయి!
"శ్యామలాంబా గరీయసి" అని ప్రకటిస్తున్నాయి!

నీటిబిందువు

శ్రీకృష్ణ భగవానుని
లలాటు ఫలకమందలి
కస్తూరి తిలకంలా,
వక్షస్థలమందలి కౌస్తుభ రతనంలా,
నాసాగ్ర మంధలి నవమౌక్తికంలా,
కరములందలి కంకణంలా,
తళతళా, ధగధగా,

మిలమిలా, నిగనిగా లాడుతూ,
జీవితంక్షణికమైనా,
పేరుమాత్రం
లీలాశుకుని కవనంలాగే
అచ్యుతమై
సురభిళిస్తుంటుందని
ప్రకాశ పరుస్తున్నది.
"గరిక కొనలమీది నీటిబిందువు"!

శ్రీ కె. కిశోరు బాబు
శ్రీ కె. అశోకు బాబు

శ్రీ శివలెంక ప్రకాశరావు

కోకిల పాటల మేటికవి-శ్రీ తురగా!

ఆధునిక సాహిత్య చరిత్రలో (1) భావకవిత్వం (2) అభ్యుదయకవిత్వం అనేవి రెండూ ప్రముఖమైన ధోరణులు. అందుకే ఆధునికకవులు కేవలం భావకవిత్వాన్నో లేక అభ్యుదయ కవిత్వాన్నో లేదా అదీఇదీ కలగలిపో రచించడం ఒకసాధారణ లక్షణంగా కానవస్తుంది. అలాగే భావకవిగా పయనం ఆరంభించి అభ్యుదయ పథంవైపుగా సంచరించిన వారిలో శ్రీ. శ్రీ తురగా వేంకటరామయ్యగారు ఒకరు.

ప్రాత క్రొత్తలమేలు కలయికగా కవితలల్లిన వీరి భావాలు ముఖ్యంగా 'ఆర్యసంప్రదాయ సిద్ధాలు, రచనలో ఏదో ఒక ఆవేశం పొంగి పొరలుతున్నట్లు కనిపిస్తుంది. శిల్పంలో నాటి మేటికవులకేమీ వీరు తీసిపోరు. ముఖ్యంగా వీరు రచించిన 'కోకిల' అనే గీతాసంకలనం (1935) ప్రముఖమయింది. భారతి, గృహలక్ష్మి మొదలైన ప్రసిద్ధ సాహిత్య పత్రికలలో మాటుమణిగిన మరికొన్ని కవితలలోకూడా వీరి ప్రతిభ కొట్టవచ్చినట్లు గోచరిస్తుంది.

తురగావారి కవిత్వాన్ని స్థూలంగా (1) ప్రణయం (3) ప్రకృతి 3) ఆధ్యాత్మికం, (4) దేశభక్తి (5) అభ్యుదయం అనే విభాగాలుగా చేసి పరిశీలించవచ్చు.

ప్రణయం :

భావకవియుగంలో ప్రణయం ఒక పరమావధి. ఆ యుగధర్మానికి ఎటువంటికవి అయినా తలవంచకతప్పలేదు. అందుకే ప్రపంచమంతా 'ప్రేమమయ'మనీ 'ప్రేమయేదేవుడ'నీ వెంకటరామయ్యగారు కూడా భావించారు. వారు ఆశించిన ప్రేమమయ జీవితంలో స్వేచ్ఛాప్రవృత్తి జీవనాడిగా, సాహసం అంతస్సత్త్వంగా ప్రకటితమవుతుంది.

ఎన్ని 'కష్టాలువచ్చినా', 'కాలం తరిమినా', 'ప్రకృతి రంగస్థల ప్రళయ నాటకం'లో ఆటపాటలకు భయపడనక్కరలేదని చెలిని ప్రబోధిస్తూ.

'నాకు జయమేలనే, నీకు భయమేలనే
వికసించితిమి మహాప్రేమ యోగాలకై
ఏకమై కరుణార
సైకమైన యనంత
జలధిలో మనచూపు
నిలిపి యొకటే పాట
నాలపింతము వీణ
నందుకోవే చెలీ!
మాయలోకము నన్ను మసిచేసి నిల్చునా
ఎకబాటు మన ప్రేమ లెడజేసి గెల్చునా
వెఱ్ఱిపిల్లా ఇంత
వెఱపేల మరుపేల?

ఇత్యాదిగా చెప్పడంలో ఆత్మాశ్రయమైన ప్రణయం తొణికిసలాడుతున్నది. బసవరాజు, దేవులపల్లి,కవికొండల మొదలైన ప్రముఖ భావకవుల ఆశలూ ఆశయాలూ, ఆవేశాలూ పై గీతంలోనూ ప్రకటితం.

అలాగే తన ప్రాణనాథుడు రాలేదని విరహవ్యథను వ్యక్తం చేసే ఒక ప్రేయసి ముఖ్యంగా

'నేడె రాడా మోము చూడనే చూడడా?
ప్రేయసీ! యని నన్ను పిలువనే పిలువడా?
ఏరులై పారు క
న్నీరైన దుడువగా
యుగయుగమ్ముల నుండి
బిగబట్టి యున్న నా
యెదజీల్చు ఈ ప్రేమ
నేని గుర్తింపగా
ఏమి నా పరితాపమేమి కాలమ్ము!'[2]

అంటూ వాపోవడంలోనూ ప్రేమయేకవి గుండె గొంతుకలో ప్రతిధ్వనిస్తుంది. ప్రతి పదంలోనూ ఒక ఆత్మీయత, ఒక సాన్నిహిత్యమూ, ఒక సరస సాంగత్యమూ తొంగి చూస్తూ ఉంటాయి.

ప్రకృతి :

ప్రణయం తరువాత ప్రతిభావ కవినీ లోగొన్న మరో అంశం ప్రకృతి. ప్రకృతిలో పుట్టి, ప్రకృతితో బాటు పెరిగి, ప్రకృతిలో ఐక్యమై పోవాలని నాటికవి ఆకాంక్షించాడు, తనకు వలసిన రూపాన్ని ప్రకృతి ముకురంలో దర్శించాడు. కనుగొన్న స్వరూపాన్ని కవితా రూపంగా ప్రదర్శించాడు, తరించాడు.

ప్రకృతి సోయగానికి వసంతం ఒక ప్రత్యక్ష నిదర్శనం. ఆ వసంతానికి కోయిల ఒక ముఖ్యమైన ప్రతినిధి. అందుకే కోయిల

చక్కగా పాడాలని ఆశపడ్డాడు. ఈ కవి. అంతేకాదు. బాలరసాలం 'చివురుపాన్పు'నూ 'జాతవల్లి' పూలసరాలనూ, మధుపం శ్రుతిగల పాటనూ సమకూర్చాలని అభిలషించాడు.

ఆ సందర్భంలో—

కో'యన 'కో'యటంచు(గడు గొంతెలతో(
దల పట్టు పట్టి; క్రొం
దీయని రాగ సంపదనదేటికి వ్యర్థము సేతువమ్మ! మా
కోయిల పాడు మా మధురకోయల గానము;
భారతీ కరా
బ్జాయిత వల్లకీశ్వేత రవామృతవీచుల మేళవింపుచున్'[3]

ఇత్యాదిగా కోయిలను తురగా వారు ఆహ్వానించడం గమనించ తగ్గ విషయం.

పాటలోనే కాక పద్యరచనలోనూ తన కవిత్వపు రసస్ఫూర్తిని ఈ కవి ప్రదర్శించగలడని ఇలాంటి పద్యాలు నిరూపిస్తాయి.

ఆధ్యాత్మికం !

భావకవులలో ప్రణయాన్ని ప్రకృతిలో ప్రతిఫలింపచేసిన వారు కొందరయితే, ప్రకృతిలో పరమాత్మ తత్త్వాన్ని ప్రతిబింబింప చేసినవారు. మరికొందరు. తురగావారు రెండోకోవకు చెందినవారు.

వీరి 'కోకిల' గీతాలు బాహ్యదృష్టిలో ప్రకృతికి సంబంధించిన విగా కనబడతాయి కాని నిజానికి అవన్నీ ఆధ్యాత్మికతత్త్వ ప్రతిబోధ కాలు. ఈగీతాలలోని 'కోకిల' ఏడాదికోసారి వసంతంలో దృగ్గోచరమై, ఆ తరవాత మాయమయే మామూలు పక్షికాదు. ప్రకృతీ పురుషుల ప్రణయగీతాలాపన చేసే సాధనం అది.

రాధామాధవుల ప్రణయబంధం జీవేశ్వరైక్య సంధానానికి ఒక చిహ్నం. శ్రీకృష్ణవేణు గానామృతంలో లయమొందడమే నాద లయ యోగంలో ఉచ్చస్థితి. అందుకే కామినీకాముడుగా, పాంధులకు సన్మార్గ దర్శకుడుగా; దుడుకు సంద్రపుటుడుకు(గెరటపు సుడుల, 'దడబడు తెలుగు పడవను పదిలంగా'[4] రేవు చేర్చే సమర్థుడుగా మాధవుణ్ని తీర్చిదిద్దాడు ఈకవి.

అంతేకాదు. ఆ స్వామి దివ్యవేణుగానానికి 'భౌతికమైన భాగ్యాల'న్నీ విడిచిపెట్టి, ఆయన దర్శనం కోసం అహోరాత్రులూ తపించే మధురభక్తి పూరితహృదయగా రాధను పేర్కొన్నాడు.

ఆ సందర్భంలో

'నమ్మినానే మాట
కమ్మదనమ్ములు. వలపు
చిమ్మినానే! వాడు
నమ్మడే, కఠినుడే !
రాధమనసెరిగింపవే
కోకిలా!
సాధించలేవటే !'[6]

అంటూ రాధ ప్రాధేయపూర్వకంగా విరహవ్యధను వ్యక్తీక రించినట్లు చిత్రీకరించాడు కవి. "మ్మ"కార ప్రాసతో ఉన్న ఈగీతంలో చక్కనిలయ, తూగూ ద్యోతమవుతున్నాయి.

ఆ మనోహర దృశ్యంలో 'తెనుంగునేల' బృందావనం. అందులో విహరించే రాధ'ప్రేయసి' యదు కిశోరుడు 'నిత్యసత్యరాధికా ప్రేమరాజ్య సామ్రాట్టు' 'రసాస్పద వినూత్నమురళియే విశ్వజీవన విభూతి'[7] అంతేకాదు. 'వెలుగులో ప్రణవాల వేణువూదేవాని పాట కెరటాలలో ఆటలాడా 'లనీ' ప్రేమయోగం నిలపాలనీ, సకల జగ త్తులో కృష్ణుడు ఒక్కడే 'పురుషుడ'నీ తానొక్కతే 'స్త్రీ' అనీ, లోకాలు తమలో 'విలోల' మవుతాయనీ రాధ చెప్పడంలో రాధామాధ వులలో అద్వైత ప్రణయం స్ఫురిస్తుంది.

అలాగే ఒక తుమ్మెదకూ, పువ్వుకూ జరిగే సంభాషణలో[9] కూడా ప్రేమయే కృష్ణుడనీ. ప్రకృతియే రాధ అనీ, ఆనందమే గాన మనీ వ్యక్తపరచాడుకవి.

రాధ తన వియోగ దుఃఖంలో మాధవుడిజాడ చెప్పకుందుకు యముననూ, బృందనూ, గోపినీ కోపగించింది. తనమోముచూడక ఏరులైపారే కన్నీరు తుడవక ఉన్న ప్రియుడి మీది అలకతో ప్రాణ త్యాగానికి సిద్ధపడుతుంది ఆమె.

అయితే ఈ వియోగ దుఃఖం రాధ మాధవుడిలో ఐక్యమయే వరకే!

తరవాత "నీ" "నా" అనే భేదం వారిలో లేదు. వారిద్దరూ ఒకేరూపం, ఒకే భావం, ఒకే జీవం.

అదేజీవుడు దేవుడయేస్థితి, నరుడు నారాయణుడయే స్థాయి, జీవాత్మ పరమాత్మలో లీనమయే పరమ పదం !

అందుకే

'అంతరంగము సంద్రమై పొంగువేళ
మేఘాలు పడవలై మెలగేటివేళ
చంద్రుడు పయనాలు సాగించువేళ
ఆలోక మీలోక మందేటివేళ
ఆకారమేలా? యహంకారమేలా?
జీవితమ్మదియేల? చింతలింకేలా?'[10]

ఇత్యాదిగా ఆనందాన్ని ప్రకటించాడు కవి రాధ ముఖంగా. ఈ రచనా ధోరణి వేంకట పార్వతీశ్వరుల 'ఏకాంతసేవ'ను తలపిస్తుంది.

అలాగే

ఆనందమూర్తీ!

నేను సంపూర్ణప్రకృతిని. సకల సౌందర్య భాసితగు నా హృదయమే నీకు నానందైక నిదానము...." ఇత్యాదిగాగల రాధ ప్రణయలేఖ వేంకటేశ్వర వచనాలను స్ఫురింపజేస్తుంది.

ఈ గీతాలలోనే చోటుచేసుకున్న 'ఓ ప్రణయినీ! నిత్యసీమంతినీ....త్వామ్ శరణం దేవదేవి! రాధే!'[12] అనే రాధాష్టకం కూడా హృద్యమే!

సత్యమైన ప్రేమకోసం నిత్యహృదయం ధారపోసిన భ్రమర జీవం, ఫలశ్రుతితో పసలు చూపిందనీ, పండు వెన్నెల నిండువెలుగున తాండవించే ముగ్ధహృదయం చందమామే పొంగజాలే పసందు చూపిందనీ ప్రకటించడంలో రాధామాధవభక్తి తత్త్వమార్గాన్ని, ధ్వనింప చేశాడు కవి.

ఇదే విధమైన భావస్ఫూర్తి మరికొన్ని ఇతర కవితలలో కూడా ద్యోతమవుతుంది.

'వేదన' అనే ఒక కవితలో

"పొంగిలోకము నింద జాలి త
రంగలించే యూహలన్నీ
మాపుతేపులనే తుపానుల
మాసి రూపే వీడెరా!
పెద్దపులియై పాడు కాలము
గద్ద రించుచు మ్రింగనుంటే
గుండెపగిలే వేళనై నా
కోమలిని దయజూడరా!"[13]

అంటూ విరహాతుర విలపించడంలో మధురభక్తియే తొణికిసలాడుతుంది. మాపుతేపులను తుఫానులుగా, పాడుకాలాన్ని పెద్దపులిగా ఉపమించడంలో కవి ప్రతిభ వ్యక్తం.

వెంకటరామయ్యగారికి బాహ్యలోకంపై రాను రాను ఒక విరక్తి భావం కలిగింది. మాధవుడిపై గల ప్రేమవల్ల తనబాధను విరహవ్యధగా రాధ వ్యక్తీకరించింది. అలాగే ఇహలోకపు బాధలను తన ఆధ్యాత్మిక భక్తిగీతాలలో బహిర్గతం చేసుకొన్నాడు కవి.

ఈ సందర్భంలో

వద్దురా ఈపాడులోకము
వద్దురా కన్నీటి పాటలు
పాడి విఫలమ్మైన జీవము
వీడితేనే మేలురా'[14]

ఇత్యాదిగాగల ముత్యాలసరం ఉదాహరణప్రాయం. అలాగే 'లీలా సాగరము' అనేకవితలో

"నాదుప్రజ్ఞయు నా బలమ్మును
నా మనోరధిమమ్ములన్నీ
వదలితిని భవదీయ లీలా
వనధిలో నిపుడే
....శరణు శరణు మహాత్మ తవ స
చ్చరణ సరసిజముల ప్రాలిన
యార్తునకుఁ జేయూత నీవా
యర్థి మందార! [15]

మొదలైన పాదాలలో కత్తి కట్టినలోకం తనపై చూపే చిన్న చూపునకు కవి హృదయంలో జరిగిన అంతర్మధనం ప్రతిధ్వనిస్తుంది.

ఇదే భావావేశం "అర్హుడను దేవా! మహాప్రభో! ఆదరింపగదోయి తండ్రీ, దుఃఖసాగర వీచికలలో తునియలగుచుంటిన్" ఇత్యాదిగాగల "ఆర్తహృదయం"[16] లోనూ కానవస్తుంది.

పరిస్థితుల ప్రాబల్యంవల్ల 'కళలుదేరే నవ్యకవితా కిలనమంటే వెగటుదోచింది కవికి. ఎన్ని యత్నాలుచేసినా ఏ ఒక్కటీ సఫలీకృతం కాకపోవడంతో కవి హృదయాకాశంలో నిరాశామేఘాలు ఆవరించాయి.

ఆ సందర్భంలోనే

'ఈ సముద్రము దాటగలనా
నా విభుం
డీశ్వరుని దర్శింపగలనా
అంతమెఱుగని దాయెనేమో
యబ్ధియై చెలరేగెనేమో
ఎన్నియుగముల నీదవలెనో
ఈ జీవి
ఇందులోనే మునగవలెనో," [17] అనీ
"ఈ తోటలో నాడగలనా
అందాక
ఈ ధాగముల నాపగలనా?
పూలవీణ ధరింపగలనా,
జీవాలు
పోయినా పాడుకోగలనా?

మాధవుని దర్శింపగలనా
ప్రణయలోకము లేలగలనా
దేవతా
భావాలు వర్ణింపగలనా" [18] అనీ
"ఈయరణ్యము దాటగలనా
ఏనాటి
కేని మార్గము దీయగలనా ?
ఈ కొండ లెగ్రబాక గలనా
హృదయేశ
నీ కంఠ్లతోఁ జూడగలనా ?" [19] అనే
"ఈ లోకము నాదేనా
పాలించే దీవేనా
నీ రాధను నేనేనా ?
నారాజువు నీవేనా ?

నాదేనా ఈ రూపము
నాదేనా ఈ జీవము
నా భావము నీపాటే
నా, గానము నాదేనా ?" [20] అనీ

ఆత్మ విమర్శ చేసుకున్నాడు కవి.

పై పాదాలలో భక్తితత్వంలో కలిగే సంశయాలూ; పొద మాపే నిరాశా నిస్పృహలూ, ప్రకటితమయే ఆత్మీయతా, పొంగి పొరలే ఆవేశమూ చోటు చేసుకున్నాయి. "పూలవీణ" అనే పద బంధం చక్కని భావస్ఫూర్తిని కలిగిస్తున్నది. తురగా వారి మధుర భక్తికి ఈ గీతాలు, ప్రజల నిదర్శనాలు.

దేశభక్తి :

భావ కవులకు నాటి దేశ స్వాతంత్ర్య సమరం ఒక సందే శాన్ని అందించవలసిన బాధ్యతను నెత్తిన పెట్టింది. సాహిత్యాన్ని సామాన్య ప్రజానీకానికి ప్రబోధించే ఒక సాధనంగా ఉపయోగించ వలెననే ఒక కర్తవ్యాన్ని గుర్తు చేసింది.

అందుకే
"కలుకు గత్తులఁ బూవుల సరులుచేసి
దురములందునఁ బేండ్లిండ్లు జరుపుమోయి
ప్రణయ వీణకు శౌర్యంపుఁ బదనుపెట్టి
వీరగీతాలు హాయిగా వినుపుమోయి" [21]
అంటూ ఎలుగెత్తి చాటాడు కవి.

భావ కవులు ప్రణయవీణను రుద్రవీణగా పలికించవలెననే ఒక ప్రబోధం వినవస్తుంది ఇక్కడ.

జననీ, జన్మభూమి స్వర్గంకన్నా మిన్నఅని మన నమ్మకం. అలాగే తాత తండ్రులనాటి తన "జన్మభూమి"ని వీడవలసి వచ్చిన సందర్భంలో

"వీడిపోవుచునుండె నా బంధమ్ము
నేడే, పొమ్మనుచుంటివో
కాలాదదాయె తల్లీ। నిను వీడ
గలనటే । కల్పవల్లి ।
కన్నులెఱ్ఱం జేయకే ! నాగుండె
కమలియొరుగై పోవునే
మరచిపోకే పావనీ ! నీ గర్భ
సరసి బుట్టిన పూవునే !" [22]

ఇత్యాదిగా, తురగావారు పరితపించడంలో ఒక ఆత్మీయత వ్యక్త మవుతుంది.

అభ్యుదయం :

ప్రథమ దశలో భావకవిగాఉన్న వెంకటరామయ్యగారు దేశ కాల పరిస్థితులనుబట్టి తన పంథా మార్చుకున్నారు. దేశదేశాలలో యుద్ధోన్మాదం పెచ్చరిల్లడం, ఎటు చూచినా అయోమయస్థితి గోచరించడం అనే విషయాలు వారిని అభ్యుదయపథం వైపుగా నడిపించాయి.

ఆ సమయంలోనే వారి కలంనుంచి మానవతా వాదం జాలు వారింది అప్పుడే

'ప్రకృతి గుండెలు పగిలెనా? ఆ
ప్రళయ నేత్రము రగిలెనా?
మనుజరుధిరపు జలధులందే
మునుగుచున్నది. లోకమంతా!
మహాభీల ప్రళయశిఖతో
మండుచున్నది విశ్వమంతా
ఏమి భీభత్సం-ఔరా!
ఎంత యుద్వేగం!' [23]

ఇత్యాది గీతాలు ప్రతిధ్వనించాయి.

స్వర్గనరకాలన్నీ అగ్నిజ్వాలల్లో భస్మమై శబ్ద రూపః ప్రపంచమంతా జలధిలో కరిగిపోతే, పునస్సృష్టికి అమృత బీజమైన హృదయ సంగీతమే ఉన్మాద మహాశివనృత్యమని అభిప్రాయ పడ్డాడు. కవి.

అంతేకాదు. నిరాశానిస్పృహలు ఆవరించిన స్థితిలో, తన కలలన్నీ కల్లలయిన అవస్థలో

'నా జన్మ భూమేదిరా
బాపూజీ
నా ముద్దుతోటేదిరా?
నా కోకిలమ్మేదీ, నా పూల మేడేదీ !
నారాణి ఏడేది? నా వలపు పాటలేవీ ?
కలలోని సిరులాయెరా !
బాపూజీ
కాఱడవి పాలైతిరా !'[24]

ఇత్యాదిగా తన దుఃఖావేశాన్ని ప్రకటించాడు కవి. ఆ సమయంలో కవి కళ్ళనుంచి కన్నీళ్ళే కాదు, "అగ్నికణాలూ" ఏళ్లై స్రవించాయి."

"కలుకు కత్తుల దాల్చి
నరహంతకుల యింటి
బానిసై భూదేవి
పడి యుండె నీవేళ
కష్టజీవులమేని
ఉష్ణరక్తము త్రావు
ధనికునకు దైవమే
దాసుడయ్యెను నేడు!"[25]

అంటూ కవి వాపోవడంలో సమ సమాజాన్ని నిర్మించక దేవుడు లోకులలో హెచ్చుతగ్గులు కల్పించాడనే అభిప్రాయం వ్యక్తం.

అంతేకాదు.

"ఓ గాలి యుయ్యేల
లూగేటి మేఘుడా!
ఆధారమే లేని - ఆకాశ సౌధాల
కాపురాలెన్నాళ్ళు? కలుము లెన్నాళ్ళు[26] ఇత్యాదిగా

అన్యాపదేశంలో ధన మదాంధులను హెచ్చరించాడు కవి.

చివరకు హృదయమెరుగని శిలాప్రతిమలను ప్రేమించు పాషాణ లోకమంటూ విరుచుకు పడుతూ ఈశ్వరుని అస్తిత్వాన్నే శపించాడు "గుండెలుంటే! తనతో వచ్చి ఈ లోకాన్నీ, లోకంలో జరిగే కుత్సితాలనూ దర్శించమని దేవుణ్ణి సవాలు చేశాడు. కర్తయే లేని కలుష ప్రపంచాన్ని "ప్రణయ రాజ్యం"గా భ్రమించి కవిలోకం గానం చేయడాన్ని విమర్శించాడు. "విశ్వమంతా ఒకే వేణుగానమ్మైన తాన వర్ణాలు పాషాణాలు పాడతాయనీ, జగమే ఒక మహాప్రేమసామ్రాజ్యమే అయితే అమృతంలో హాలాహలం పుట్టదనీ, లోకమంతా ఒకేతల్లి కంటే ఎంకి అంతఃపురాలు ఏలేదనీ వాదించాడు.

ఈ విధంగా భావకవితా వ్యవసాయం ఆరంభించిన వెంకటరామయ్యగారు అభ్యుదయ ఫలసాయాన్ని అందించారు "కోకిల" కుహూ కుహూ నినాదానికి స్పందించి ఆనందించిన గుండెలోనే అంతర్గతంగా గూడు కట్టుకున్న సమతావాదాన్ని పసిగట్టి బహిర్గతం చేశారు ఆయన.

చివరకు తన జీవితాన్నే మమతకోసం అర్పించారు.

మనిషి పోయినా ఆయన మానసిక సృజనకు ప్రతీక అయిన "కోకిల" మాత్రం వాస్తవానికి సాహిత్యావకాశంలో ఒక ధ్రువ తార!

[ప్రస్తుతం అలభ్యంగా ఉన్న "కోకిల" ను అభిమానంతో రచించి అందజేసిన శ్రీతురగా కృష్ణమూర్తిగారికి (వెంకటరామయ్యగారి సోదరులు) నా కృతజ్ఞతాంజలి]

అధస్సూచికలు :-

1. వెరపేల-భారతి - ఆగ. 1931 -పు.215
2. ఏమి నా కలలు-భారతి-.నవం. 1931. పు 760
3. కల్యాణము - కోకిల పు 1
4. వసంతగానము - ,, (1936) పు - 11
5. ఏడీ? కృష్ణుడు - ,, - పు 14
6. ఈవేళ కనిపించునా - ,, పు 16 - 17
7. విశ్వజీవన విభూతి ,, పు 20.
8. లోకాలు నాకేలనే ,, పు 23
9. ఆనందమే గానమాయెనే ,, పు 27
10. ఆకారమేలా- ,, పు40
11 కోకిల ,, పు 31
12 ,, ,, పు 42
13-14. వేదన - భారతి జూన్ 1930. పు 940
15. లీలాసాగరము - భారతి - నవం - 1929, పు 784.
16. ఆధునికాంధ్రభావ కవిత్వము (అము) - పాటిబండ మాధవశర్మ- పు 107-8.
17. ఈ సముద్రము దాటగలనా - భారతి - సెప్టెం. 1929-పు862
18. హృదయవీధి - గృహలక్ష్మి - ఆగ. 1930-పు 449
19 ఈ ఘోరణ్యము దాటగలనా-గృ.ల - నవం. 1930-పు 743.
20. అవినాభావము - భారతి - జన. 932 - పు 12
21. భారతీ సందేశము -భారతి - డిసెం 1927 - పు 15.
22. జన్మభూమి - భారతి మార్చి 1927 - పు 89
23. మహాశివ నృత్యం - కోకిల - పు 49
24. భారతి - అక్టో 1930 - పు 665.
25. అగ్నికణాలు - అ. బా. క - పు 104
26 తురగా, కృష్ణమూర్తిగారు వ్రాసి పంపిన కవిత.

ఉపాంతోపద్రవము

డా. చల్లా రామచంద్రశాస్త్రి

నౌలో రేగిన అంతర్మధనం
ఏ లోతుల చేరిందో!
హాలాహలమే ఉబికి వస్తోంది
వెల్లగక్కే నురగలతో!
గళమునగ్రసించే గరళభోక్త
కనుపింపడేదిక్కు జూచినా!
ఆ మహా విషజ్వాలలో
దహించుకుంటూపోతే
మిగిలేదేమిటి?
భస్మరాశి! గుట్టగుట్టలై
కొండలై ప్రాణికోటి
మసలిన జాడైనా లేకుండా
మథించిన సదుద్దేశ భావాల
కిసుమంత ఫలంలేకుండా
మిగిలేదేమీ వుండదు.

ఇది స్వయంకృతం
అందుకే ఆ శిక్ష!
ఊర్మిరాశిలో జలచరములూ
అనంతజీవకోటీ, నవనిధులూ
బడబానలమూ, నిబిడమైన
విషజాలమూ – సహజీవనం
సమస్థితీ సంతరించుకొనగా
శీతల వీచికల చిలుకరించే
సాగరమెంత గంభీరం!
దాన్ని కెలికి – చిలికి – చికాకుచేసే
చెలగాటం – జీవకోటికారాటం
ఊసుపోని ఊహాఝరిలో
అదుపులేని అంతరంగమును
ఒక్క ఊపుతో కదిలిస్తే
ఫలితం శూన్యం
మిగిలేది ఆవృతిలేని చరిత్ర.



పెద్దకథ

దేముడా నా దేశాన్ని రక్షించు

బలివాడ కాంతారావు

ఈ గ్రామం రావటం యిది తొలిసారి కాదు. దూరాన వుండటంవలన యీసారి ఐదేళ్ళు దాటాక మళ్ళీ వచ్చాను. అరవయి పడిలో పడిన నేను యీ గ్రామంలో పుట్టి, పదేళ్ళవరకు యిక్కడే గడిపాను. పట్నంలో కాలు పెట్టినప్పుడు తొలిసారి కాలెక్కినంత సంబరపడ్డాను. బొంబాయి మహానగరం ఉద్యోగరీత్యా చేరుకున్నప్పుడు మొదటిసారి విమానం యెక్కినట్లనిపించింది. నా జీవితంలోని ఆరు భాగాల్లో ఐదుభాగాలు పట్నాల్లోనూ, మహానగరాల్లోనూ గడచినా, తలచుకొని శరీరం పుల కింప జేసుకోడానికి, జీవితపు ఒడుదుడుకుల్లో, నిరాశ ఘడియల్లో శాంతి నిచ్చే అక్కడి యే సంఘటనలూ ప్రయత్నించినా అసలు గుర్తుకు రావటంలేదు. మనిషిగా నాకు నచ్చినట్లు నేను బ్రతికాలనే యీ యేభ యేళ్ళ తాపత్రయంలో, నేనెన్నో సార్లు పరాభవింప బడ్డానన్న భావన నన్ను బాధలో ముంచి వేసింది. ఆ సంఘటనలను సంఘటనలుగా తీసు కుంటే అంత బాధ పడవలసినవిగా తోచక పోవచ్చు. కానీ యీ సంఘటనలను ఒక నియమావళికి అలవడ్డ జీవిత విధానపు దృష్టితో చూడటం వలన మనసు క్రుంగి పోతుంది.

ఉదాహరణకు కొన్ని సంఘటనలను చెప్పకుండా వుండలేను. నలుగురి కన్నా ముందుగా నేను రైలు టిక్కెట్ కొన్నవాడిని. నా పేరు వెయిటింగు లిస్టులో వుంది. నాకు కాకుండా నా తరువాత వచ్చిన వాళ్ళు దర్జాగా స్లీపరులో ప్రయాణం చేస్తున్నారు. నేను అదే ట్రెయి నులో ఒక కిక్కిరిసిన సాదా పెట్టెలో నిల్చొని ప్రయాణం చేసా నెన్నిసార్లో. నేనూ ఆ పదో పాతికో చాటుగా అందజేస్తే నాకీ యిబ్బంది కలిగేది కాదు.

నాకు అబ్బాయి ఒక్కడే. వీడు పుట్టి పెరిగిన వాతావరణం వేరు తెలివితేటలున్నా ఒకసారి పరీక్షలో కాపీచేసి రాస్తానన్నాడు. ఎందుకంటే తన ఫస్టురాంకు పోతుందట ఎలా పోతుందంటే తనతో పోటీగా పోటీచెయ్యలేని వాళ్ళు కాపీచేసి తన రేంకు పోస్తున్నారని వాడిగోల. ఏది ఏమైనా కాపీ చెయ్యడానికి వీల్లేదని శాసించాను. తలుపు బిగించుకున్న రోజున యింట్లో వాళ్ళమ్మ దగ్గర విసవిసలాడుతున్నాడు. ఇంకోసారి స్కాలర్‌షిప్‌కోసం జరిగే పరీక్షలో వుత్తీర్ణుడయ్యాడు. ఇంటర్వ్యూ వుంది. ఈ యింటర్వ్యూలకు కావలసిన వాళ్ళను సహాయ పడటానికి ఆయుధాలుగా కొందరు వాడుకోవడంకద్దు. మావాడూ ఫలానా వాళ్ళు యిలా వాడుకుంటున్నారు, మీరెందుకు వాడకూడదని అడిగాడు. ఎప్పుడూ యిలా ఆలోచించక అని కేకలేసాను. వీడికి మెరిట్ స్కాలర్‌షిప్ రాకపోగానే యింట్లో తిరగబడ్డాడు. వాడికి డాక్టరు కావాలని వుంది. ఉన్నవాళ్ళదగ్గర పుచ్చుకుని లేనివాళ్ళకు వుచితవైద్యం చెయ్యాలనీ వుంది. సీటు రావటం యెలా? వాడికి సీటు రానప్పుడు "మీనాన్న వెర్రివాడన్నారట" ఇంటికి వచ్చి ఆదే మాట అప్పజెప్పాడు. ఎవరో కంట్రాక్టరు మొద్దబ్బాయికి వచ్చింది. ఫలానా హోదాలో వున్నవాడి మేనల్లుడికి వచ్చింది. నేను క్లాసుకు ఫస్టువచ్చాను నా కెందుకు రాలేదంటాడు! అలాంటి అనుమానాలు పెట్టుకోకు, ఐతక లేవని సముదాయించాను. రెండో యేడు వెళ్ళాడు. తనదగ్గరకు వచ్చినేర్చు కున్న ఇద్దరికి యీసారి సీట్లు వచ్చాయి. తనకు రాలేదు.... తన కన్నా వాళ్ళకు యిరవై మార్కులు తక్కువ వచ్చాయి. నేను యీ దేశం నించి పారిపోతానని కోపంతోనూ వెర్రెత్తిపోయాడు. అయితే ఆ జాతిలో పుట్టక పోయావా అని మందలించాను. ఆ వేళనించీ చదువు కుని యేం చెయ్యాలని చదువు మీద శ్రద్ధ చూపటేదు.

ఇక మా అమ్మాయి. నలుగురూ చక్కని పిల్ల అంటారు. బుద్ధయినపిల్ల. బాగా వంట నేర్చింది. స్టేటేయెక్కి మూడు భాషల్లో అనర్గళంగా మాటాడగలదు. పాడగలదు. కాలేజీ డ్రామాల్లో కూడా పాల్గొనింది. మర్యాదగా మాటాడటం తనసొత్తు. ఈ కూతురిని నలు గురు మెచ్చేటట్లు తీర్చిదిద్దటంలో పుట్టిన దగ్గరనించీ మా దంపతు లిద్దరం కృషిచేసాం. ఆ కృషితో పెరిగిన బిడ్డ. ఎంద రెళ్ళో తిరిగి తిరిగి వచ్చాడోగానీ మా యింట్లోనూ కాలు పెట్టాడు. అబ్బాయి ఇంజనీరు. అబ్బాయి తండ్రి డాక్టరు. వాళ్ళకు కప్పేసినంత డబ్బు వుంది. ఇదే వాళ్ళకు సంఘంలో ఒక అంతస్థుమీద కూర్చోబెట్టింది. ఇంట్లో కాలుపెట్టి అమ్మాయిని యిటు తిరుగు అటు తిరుగు, గట్టిగా పాడు, డాన్సు వచ్చునా ? యిలా అమ్మాయిని యిన్‌సల్ట్ చేసింది చాలక యెన్నివేలిస్తారని అతగాడు అడిగాడు. వాంతి వచ్చింది. మర్యా దకు వాళ్ళమీద వుమ్మలేక దయచేయమన్నాను. కొడుకు పెళ్ళి పిలుపుకు వచ్చి లక్షన్నర పుచ్చుకున్నాననీ చెప్పాడు. ఎవరమ్మాయి అన్నాను. పెళ్ళి కార్డుచూడండి అన్నాడు. చూస్తే వీడా? పదేళ్ళలో పదిమేడలు కట్టించిన వాడా అన్నాను. ఇంకా మా అమ్మాయి కోసం సంబంధం నేను వెతుకుతూనే వున్నాను.

ఉద్యోగం కావాలంటే పెద్దహర్డ్లయినా పట్టుకోవాలి, పెద్ద మొత్తమయినా ఖర్చు పెట్టాలన్న భావన కొందరిలోనైనా తొలగించా లని ఒకసారి సెలక్షను కమిటీకి పెద్దగా వుండడానికి ఒప్పుకున్నాను. అలా ఒప్పుకుని కోరి బాధలు తెచ్చుకున్నాను. అంత చిన్న ఉద్యోగా లకు అంతపెద్ద రికమెండేషన్లు ఇందులో యెన్ని బోగస్ సర్టిఫికెట్లో. ఎన్ని వేలు డబ్బులు చేతులు మారిపోయాయోగానీ న్యాయంగా పోయి నిందలు తెచ్చుకున్నాను. లంచాలు తినేసారని తెలియగానే శరీరం

పట్టుతప్పింది; ఎవరినైతేనమ్మి యెంపికచేసిన వాళ్ళపేర్లు యిచ్చానో వాళ్ళ వాళ్ళ సహాయంతోనే యీ ద్రోహం జరిగింది. ఒక్క నయా పైసా లంచం తినకపోయినా నా పేరు మీదే అంతా జరిగిపోయింది.

అప్పుడే వచ్చిన ఒక కుటుంబీకుడు డబ్బివ్వకుండానే యింకో గేటు నించి కదిలి స్పెషల్ దర్శనం చేస్తుంటే అధికారంలో వున్న మహానుభావుడొకడు అధికార లాంఛనాలతో కదులుతుంటే – పది



గంటలైక్యూలో కుటుంబంతో దైవదర్శనం కోసం నిల్చున్న నాకు దేవుని దగ్గరకు వెళ్ళేసరికి చేతులైనా యెత్త బుద్ధి పుట్టలేదు.

అద్దెయిళ్లల్లో వుండి ఆరు నెలలకు యేదో ఒక మిషమీద అద్దెపెంచే ఆస్తిపరులతో పడలేక ప్రభుత్వం యిచ్చే అప్పుతో ఒక యిల్లు కట్టుకుంటానని సాధక బాధకాలు తెలుసుకోక దిగితే కాలు బయటకు తీస్తేల్లంచం. లంచం పుచ్చుకోనివాడిని నేను లంచం యివ్వనని భీష్మించుక కూర్చున్నాను. తగువు తెచ్చుకుని చిన్నయిల్లు కట్టుకుంటే నా యింటికి వేసిన ఆస్తిపన్ను, లంచాలు తిని లంచం కట్టిన వాని పెద్ద భవనం కన్నా హెచ్చు. ఇక కోర్టుకు తిరిగే ఓపికా, డబ్బూ లేదు. సీతమ్మవారి శీలం కూడా శంకించే జాతి ఐపోయిందే అన్నదే నా విచారం-కానీ యేం చెయ్యడం ? ఇవన్నీ సామాన్య విషయాలుగా కనిపించవచ్చు కానీ అవి కొన్ని విలువలనూ, స్థిరమైన నడవడికలనూ దైవరూపాలుగా పెట్టుకున్న ఆదర్శాలను వమ్ము చేస్తున్నాయి.

పట్నాల్లో నివశిస్తూ యిలాంటి బాధల బరువుతో సతమత మయ్యే వాళ్ళు నాలా ఎందరెందరో తప్పక వుంటారు. అన్యాయం అవినీతి, బంధుపక్షపాతం ముమ్మరంగా జాతిలో విహరిస్తున్నప్పుడు వాటికి తలఒగ్గని వాళ్ళను కూడా దండనాధికారులు అలవాటు కొద్దీ అనుమానించటం పరిపాటే. నా సంఘంలో నేను నా న్యాయబుద్ధితో నీతితో కలిసిపోవాలని శాయశక్తులా పనిచేస్తుంటే, నాకు తారసపడి ఆవేదన జెంద నిచ్చే విషయాలెన్నో ?

చాలామంది అంతస్తు అధికారాల ప్రమేయం లేకండా యేదో బాధ పడిపోతున్నట్లు గోల చేస్తున్నారు. ప్రతిపూటకు కడుపెలా నింపు తామని బాధపడ్డవాళ్లు తప్పించి, యింకెవరికీ మొర పెట్టుకునే అధికారం లేదు. ఉన్నవాళ్ళ ఫిర్యాదులే హెచ్చు.

ఎక్కడా ద్వంద్వమే. మోసం యెలాంటి యెత్తులకు యెదిగిం దంటే – మాటల్లో, చేతల్లో. విన్నవార్తల్లో చూసే బొమ్మల్లో ఎక్కడా మోసమే! వ్యాపారంలోనేకాదు, వ్యక్తి జీవితంలో ప్రతి అంశమూ మోసం, ద్వంద్వమే. ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో తెలుసుకోలేని పరిస్థితి యేర్పడింది. రాజకీయవాదులు ఆడిన ఆటలు ప్రజల్లోనూ ప్రాకి పోయాయి. ఇవి చదరంగం ఆటలుకావు. ఈ ఆటలకు రూల్సులేవు. ఆలోచించ గలిగిన వాళ్ళను దద్దమ్మలను చేసి చూసేవాళ్ళను. వినేవాళ్ళను గుడ్డి వాళ్ళని చెవిటి వాళ్ళను చేసి, వాళ్ళే తెలివైన వాళ్ళనీ మనం అంతా మూఢులం అనీ, చెప్పేకబుర్లల్లోనూ చేసేపనుల్లోనూ రూల్సు లేని ఆటలు ఆడేస్తున్నారు. నోరెత్తితే "మూగవెధవా – వూరుకో" అంటారు. ఆత్మను చంపుకుని తల ఒగ్గిన వాళ్ళంతా నిజానికి మూగ వాళ్ళేమరి. ఆడిన ప్రతి మాటను ఆత్మపరం చేసిన వాళ్ళే వికాసశీలమైన మానవ జాతిలో పుట్టిన వాళ్ళు. ఎందరిని వికాసశీలురుగా బ్రతక నిస్తున్నాం? మనిషి చిన్నతనంలోనే బహుశః నీతిగా బతికే అవకాశం కలుగ జేస్తున్నారేమో? పదేళ్ళ వయసువరకే హృదయానికి హత్తుకున్న వే. నిజానికి మనిషి జీవితంలో స్వచ్ఛమైన తల్లిపాలులాంటి సత్తువనిస్తుం దనుకుంటాను. న్యాయం నీతి, ధర్మం జీర్ణించుకుని బ్రతికి పసితనం నించి బయట పడిన నించీ ఒక్కొక్క అడుగు ఒక్కొక్క కోరికతో వేస్తూ ఒకే మనిషి రెండుగా చీలిపోవడానికి ఉపక్రమిస్తాడు. ఈ

చీలిక రాకుండా యీ స్పిరిట్ పర్సనాలిటీ కాకుండా కాపాడు కోవటంలోనే మనిషి ప్రజ్ఞ గొప్పతనం వుంది. ఇలా చీలని వాళ్ళే గొప్ప వాళ్లుగా నిల్చిపోయారు. వాళ్లే సనాతన ధర్మాన్ని, పాలించి స్వాతంత్ర్యం కోసం పోరాడి, న్యాయాన్ని కాపాడి, ఋషులుగా మానవ జాతిలో మిగిలి పోయారు.

ఇంచుమించు యేభయ్యేళ్ల పట్నవాసంలో పైన యెగురుతున్న రాబందులనించీ, చుట్టూ మూగుతున్న తోడేళ్లనించీ, అన్యాయం అవి నీతితో అసభ్యంగా కామలీలలు జరిపే అసాధారణ వేశ్యలనించీ, లంచాల రాకెట్లు, ఐద్రుప్రీతి బాంబులు, నల్ల బజారు సాప్లయ్ మంట లతో వుక్కిరిబిక్కిరి చేస్తున్న ఫాసిస్టుల నించీ తప్పించుకోడానికి అంతేకాదు నాలో పెరిగిన ఆత్మస్తుతిని ఆత్మ విమర్శగా మార్చు కోడానికి మా గ్రామం రావటం అలవాటు. ఆ చిత్తక్షోభనించి మన శ్శాంతి కోసమే మళ్ళీ ఐదేళ్ల తరవాత వచ్చాను.

2

మా తాత కట్టించిన సరంబీయిల్లది. ఆ వీధి మధ్యలో వుంది. ఉత్తరంవేపు ముఖద్వారంతో యెత్తుగా వున్న ఆ యింటి గచ్చు వరండామీద తూర్పు పడమరల్లో నిల్చున్న రెండు టేకుకలప స్థంభా లలోపడమర స్థంభానికి ఆనుకుని కూర్చున్నాను. ఈ స్తంబాలను తరిణి బుచ్చెన్న చెక్కాడు, సూది మొన మోపిన ప్రతిభాగా చిలుకుతో, చిలకలతో, పద్మాలతో, పిట్టలతో నిండివున్నాయ్. విశ్వకర్మ హస్తాలు రూపొందించుకున్న మానవహస్తాలకు శ్రద్ధతో భక్తితో నివాళు లర్పించడానికి ఆ స్తంభంవైపు ఒక్కసారి చూస్తే ఆ చేతులు అందవు కాబట్టి ఆ చేతులు చెక్కిన చక్కదనాన్ని ముద్దుపెట్టుకోకుండా వుండ లేకపోయాను. ఇంచుమించు యెనభై ఏళ్లయినా యింకా యెక్కడా చెదని చేరనియ్యని శాస్త్రవిజ్ఞానం ఏమిటో మరి?

ఆ స్తంభానికి చేరబడటమే ఒక వరంగా భావించుకున్నాను. చప్పున తరిణి బుచ్చెన్న విగ్రహం నా కళ్ళ యెదుట పడింది. వాడి జీవితం గుర్తుకొచ్చింది. వెంటనే నా మనసు తొమ్మిదేళ్ళ వయసుతో వెలుగొందే మనసై పోయింది. నా కళ్ళద్దాలు యెప్పుడు తీసేసానో? నేను యీ నాటి వీధిని చూడటంలేదు. నేను ఆనాడు చూసిన వీధి పరిసరాలు, మనుషులూ కదలుతున్నారు. నేను చూసింది చూసినట్లే చెప్తున్నాను. ఎక్కడా ఒక్క పిసరు అతిశయోక్తులుగానీ, అబద్ధాలుగానీ లేవు. నాటకీయత అంతకన్నాలేదు. అంతానిజం, పూర్తి నిజం. నాలో ఎలాంటి భావం కలిగిందంటే నేను యింకా బతికున్నాను. వాళ్ళంతా దూళిలో కలిసిపోయారు. కానీ వాళ్ళంతా నాకు మన ఋషులు వదల్చి వెళ్ళిన ఋక్కల్లాంటి వాళ్ళు. నా ముందు తరాల వాళ్ళు వదలి వెళ్ళిన అజంతా కుడ్యచిత్రాలు. కోణార్క అపూర్వ శిల్పాలు. నా జాతి ఔన్నత్యానికి వారసుడైనట్లే వీళ్ళందరి జీవిత ఔన్నత్యాలకూ నేను వారసుణ్ణి.

ఈ పల్లెలోని వీళ్లే నాకెందుకు కనపడాలి? పట్నాల్లో, మహా నగరాల్లో గడిపిన జీవితం యేమైంది? ఎంచేత ఆ వాతావరణంలో యెవరూ, యే సంఘటనలూ కనబడలేదు. తొలిసారి తాజ్‌మహల్ చూసినప్పటి వుత్తేజం మలిసారి చూసినపుడు వుండనట్లు యీ పట్న జీవితం చప్పగా యెందుకై పోయింది? బహుశః అక్కడ లేనిదేదో యీ గ్రామంలో నాదీ అనేది వుంది. నన్ను విశాలవృక్షం చేసిన వ్రేళ్ళు యీ గ్రామం మట్టిలో వున్నాయి. పచ్చగా వుండి పళ్ళు కాసే యీ వృక్షాలపై పట్నవాసులే రాళ్ళు రువ్వారనుకుంటాను.

మా ముత్తాత తరం గురించి చాలా విన్నాను. ఆ వ్యక్తుల విశేషాలను గురించి నేను చెప్పదలచుకోలేదు. నా వరకూ వచ్చేసరికి ఆ నోటా యీ నోటా పడి అసలు మాట, అసలు పరిస్థితి సంకరం చెందే అవకాశాలున్నాయి. అంచేత నాకు తెలిసిన వీధి పరిసరాలను, వ్యక్తులను, సంఘటనలను చెప్తున్నాను. తూర్పు-పడమరలుగా వున్న వీధిలో దక్షిణదిశ వేపు ఒకయిల్లు వాసఉంది. దక్షిణవేపు గుమ్మాలున్న ఉత్తరవాసలో భోజనాలు, వంటయిల్లు వుండగా దక్షిణవాసలో పడక గదులు. ఈ వీధిలో వున్నవాళ్ళంతా మా చుట్టాలే. మా అమ్మకన్న వారిల్లు పొరుగునే. మాఅమ్మ ఐదుగురు అన్నదమ్ముల్లో పెద్దవాని కూతురు. ఐదుగురు అన్నదమ్ములకు ఐదుయిళ్ళున్నా ఒకడు తప్పించి నలుగురూ కలిసే వున్నట్లులెఖ్ఖ. వాళ్ళకు కాంతమ్మఅనే ఒక చెల్లెలు వుండేది. తూర్పుకు ఒక జామిచెట్టుతో ఒక యిల్లు వుండేది. అందులో సంగీతం మాష్టారువుండేవారు. అతనూ మా బంధువే.. పడమరవైపుకు వస్తే నదికి మాఇంటికీ మధ్యలో రెండుయిళ్ళు. ఒకటి దక్షిణానికీ యింకొ కటిఉత్తరానికీ యెదరెదరవుండేవి. ఉత్తరానికి వున్న యిల్లు చెల్లా ముత్యాలమ్మది. దక్షిణానికి వున్నది నారెమ్మది. నారెమ్మ యింటికీ మా వీధికీ మధ్యలో యెత్తయిన జాగాలో ఒక పెద్ద గుళ్ళిచెట్టు వుండేది. ఏటిలో అదేపనిగా మునుగుతున్న మమ్మల్ని పిలవడానికి మా అమ్మ ఆ చెట్టుకింద నిల్చొనే కేక వేసేది. ఉత్తర వాస వెనుకకు రెండే రెండు యిళ్ళు వుండేవి. ఒకటి జాలారి వెంకన్నది. ఆ ప్రక్కది పాలకుండ్ల యెర్రయ్యది. వీళ్ళుకూడా యీ వీధిలో వాళ్ళ క్రిందే లెఖ్ఖ. ఆ కుటుం బాలు యీ వీధిలోనే మసల్తుతుండేవి.

నేను యిప్పుడు కూర్చున్నగడపలో కూర్చొని చూస్తే తూర్పు వేపు పొరును ఆనుకుని వున్న మా మామిడితోట పచ్చని చిగుళ్ళ కన పడేవి. పడమరవేపు యేరు - దూర దూరాన యిసుక తిన్నెలు, నీలి కొండలు, నేరేగుడు వనాలు కనిపిస్తుండేవి. గుళ్ళి చెట్టుకింద నిల్చొని దక్షిణానికి చూస్తే చరిత్ర ప్రసిద్ధి కెక్కిన సాలెహుండాం కొండ,

వంకలు తిరిగిన వంశధార యేరు, యేటినంటుకున్న పొలాల పచ్చదనం, అరటి తోటలూ, యేటి అవతలి ఒడ్డునే వున్న వూరు శివాలయం ప్రత్యక్షమయ్యేది.

ఈ గుళ్ళచెట్టు వుండేచోట ఒక్క వానాకాలంలో తప్ప మిగతా కాలాల్లో దాని క్రింద నిల్చోనో కూర్చొనో హాయిగా కబుర్లు చెప్పుకునేవారు. దక్షిణగాలి వీచి దాని క్రింద యెంత హాయిగా వుండేదంటే వీధిలో యెవరికైనా కోపతాపాలు మోతాదు మించి పెరిగితే కాస్సేపు గుళ్ళచెట్టు క్రిందకు వెళ్ళిరా అని చెప్పేవారు. ఈ గుళ్ళ చెట్టు క్రింద కూర్చొని నేను అటు ముత్యాలమ్మ యింటివేపు, యిటు నారెమ్మ యింటివేపు చూసేవాడిని. ముత్యాలమ్మ యింటివాకిట ఒక ముసలాడు అన్నికాలాల్లోనూ చారబడి వుండేవాడు. ఎప్పుడు చూసినా మారనట్లు ఒక్కలాగే నా కంటికి కనపించేవాడు. వాడిని సాదోడు అనేవారు. ఆ పండు గెడ్డాం సాధువు గెడ్డంలానే వుండేది. అంత తెలుపు మనిషి మా వూర్లో యింకెవరూ వుండేవారు కారు. కానీ మనిషి యెముకలు కనబడేవి. గోచీతోనే చలికాలంలోనూ వుండేవాడు. అంతదూరంలో వున్నా నన్ను పోల్చేసి పిల్చేవాడు. చెవుడా అంటే అదీలేదు. చీమ చిటుక్కుమంటే అర్థరాత్రప్పుడు కూడా వినపడి లేచిపోయేవాడేమో? వాడి దగ్గర ఒక తంబుర వుండేది. దాని మీద తత్వాలు పాడేవాడు. నాకు అవి అర్థం కాకపోయినా వినసొంపుగా వుండేవి ఆ తత్వాలు పాడి పొద్దున్నకు వరండాలో పడుకున్న నన్ను మా తాతయ్య లేపేవాడు. చీకటి రాత్రులను వెన్నెలగా, వెన్నెల రాత్రులను పట్టపగల్లా ఆ తంబురస్వరం ఆ తత్వాల మధురం మార్చివేసేవేమో ? ఒకోసారి వెన్నెల వుదయించేది ఇంకోసారి తెల్లవారిపోయేది. ఉంటే రోజుకోపూట తినేవాడట. లేకపోతే అదీలేదట. కానీ యేదీ ఆశించకుండా వీధి వీధం తన వెలుగులో ముంచేసేవాడు.

ఇక నారెమ్మ యింటివేపు యెందుకు చూసేవాణ్ణంటే – ఆ యింటికి తరచు ఒకమనిషి వస్తుండేవాడు. నారెమ్మ ఒక్కత్తేవుండేది. నల్లగా వున్నా యెత్తుగా హుందాగా వుండేది. నాకు గుర్తున్నదంతా ఆమె యెల్లప్పుడూ నీటుగా వుండేదని చెప్పగలను. బాగా దువ్వుకుని నల్లని జుత్తుకు మెట్టవేసుకుని సాధారణంగా యెర్రని పువ్వులు ముడిచేది. శీవైనముక్కుకు యెర్ర పొడులు పొదిగిన నత్తు వుండేది. చేతి నిండుగా యెరుపు గాజులు – సాధారణంగా యెర్ర చీరతోనే చూసేవాడిని. ఎరుపురంగంటే యీవిడకెంత యిష్టమో మరి? ఒకోసారి ఆ కళ్ళుకూడా యెర్రగా ఉండేవి. నా కెందు కిష్టమంటే యెర్రటి తీపిపళ్ళు నారెమ్మ తోటలోవి తెచ్చి నన్ను పిలిచి యిచ్చేది. నాకు సువర్ణరేఖ మామిడి పళ్ళంటే యిష్టమని తెలుసుకదా. "సిన్నబాబూ – ఇదిగో సిలక కొరికిన పండు. మారుచిగా వుంటాది – తిను" అని పిల్చిమరీ సువర్ణరేఖ మామిడి పండు యిచ్చేది. యీ తోట నారెమ్మతోట అని పేరు పడినా, అసలు ఆ తోట దబీరోడిదట. ఈ దబీరోడే నారెమ్మ యింటికి తరచు వస్తుండేవాడు. వాడి యెదరగా నారెమ్మ నిల్చుంటే వాడి భుజానికి వుండేది. అంతపొడగరి వాడు. అయితే పొడుగుకు తగ్గ శరీరం వుండటం వల్ల అంత యెత్తుగా కనిపించేవాడు కాదు. వాడి జుత్తూ మీసాలవేపు యెంత సేపైనా చూసే వాడిని. గొత్తిపోతు కొమ్ముల్లా మీసాలు బుగ్గల మధ్య వరకూ ప్రాకి ప్రాకి వుండేవి. గేరా గిరజాలు. నారెమ్మ దబీరోడి కూతురే అనుకునేవాణ్ణి. కాదురా అనేసింది మా అమ్మ. కానీ వాళ్ళ వావి వరసలు చెప్పలేదు.

ఇక యీ గుళ్ళ చెట్టు క్రింద తరచు నిల్చొని కేకలు వేసినట్లు మాటాడేది కాంతమ్మ. మాయమ్మ అత్తని పిల్చేదని నేనూ కాంతమ్మత్త అని పిల్చేవాణ్ణి. ఈ కాంతమ్మత్త ఐదుగురు అన్నదమ్ముల తరవాత పుట్టిన ఒకే ఆడబిడ్డ. పసుపు రాయకపోయినా బంగారం ఛాయతో వుండేది. బొట్టుపెట్టకపోయినా సూర్యునిలా ముఖం మెరిసి పోయేది. అసలు తండ్రి రూపు బిడ్డలందరిలోనూ యీ కూతురికే వచ్చిందనేవారు. తండ్రి రూపు వచ్చిన కూతురు అదృష్టవంతురాలంటారు. కానీ యీవిడ విషయంలో యీ నమ్మకం వమ్ము అయ్యింది. ఈ కాంతమ్మత్త అంటే ఐదుగురు కోడళ్ళకు సింహస్వప్నమే. ఇంట్లో గొడవలని యింట్లో పరిష్కరించేదికాదు. గుళ్ళచెట్టు క్రిందనిల్చొని అరుస్తూ అంతా బయట పెట్టేసేది. ఇంటి గుట్టేకాదు. వీధిగుట్టూ, వూరుగుట్టూ అన్నీ ఆ చెట్టు క్రిందే. వూరంతా వినిపించేటంత వాగ్ధాటితో కడిగి వదిలేసేది" చెట్టుమీద కాకిగోల చెట్టు కింద యీవిడ గోలేమిటని ? మాచిన్నతాత సీతయ్య పెళ్ళాం అమ్మడుండే ఒకసారి అనటం విన్నాను. ఈ అమ్మడు కవీశ్వరుని కూతురట. ఈవిడకీ, కవిత్వం అబ్బినట్టుంది. ఎప్పుడూ, వండుతున్నప్పుడు కూడాను యేవో పద్యాలు పాడుతుండేది. ఒకోసారి పద్యాలతోనే సమాధానం యిచ్చేది. ఆమెకు ఉపమానాలంకారం చాలా యిష్టమేమో ఇంతమంచి గుళ్ళ చెట్టుక్రింద కూర్చునేవాళ్ళమా ! ఆవిడా కూర్చునేది కానీ సీతయ్యతాత పొరపాటున కూర్చున్నా కేక వేసి మరీ లాక్కుపోయేది. సీతయ్యతాత అంటే నాకు చాలా యిష్టం. ఎన్నెన్నో నాకు తినడానికి యిస్తుండేవాడు. ఒకసారి కోపంవచ్చి అమ్మడు అవ్వని 'తాత నెందుకలా లాక్కుపోతావని' అడిగేసాను. నా కోపం చూసి "మీ తాతలాగ నివ్వు పెద్దయ్యాక గుళ్ళ చెట్టుక్రింద కూర్చో, నీ పెళ్ళాం నిన్ను లాక్కుపోకపోతే ఒట్టు" అంది.నాకేం అర్థంకాక చూస్తుంటే–

"అక్కడ ఒక ఊర్వశి వుంది" అంది. అప్పుడు కూడా నాకేం అర్థం కాలేదు. ఆ తరవాత ఆవిడే రంభా, ఊర్వశి, మేనకల గురించి చెప్తేగాని యీ ఊర్వశి యెవరో తెలిసిందికాదు. ఇంతకి

ఆ ఊర్వశిని ఆరోజు చూసినా నాకు యౌవనం వచ్చాక మాఆమ్మడు అవ్వ ఊర్వశి అన్న చెల్లా ముత్యాల్లాంటి ఆడది యెక్కడైనా తారస పడుతుందేమోనని వెతికాను. చెల్లా ముత్యాలు చెల్లాముత్యాలే. ఇంకో ముత్యాలు మరి పుట్టదు. పుట్టడానికి వీల్లేదు. యెప్పుడెదురైనా చివరకు నా మనుమడి యౌవనంలో యెవరైనా ముత్యాలు నిత్య యౌవని – ఊర్వశే. ముత్యాలు బైరాగి కోడలు. బైరాగి తత్వాలెంత మధురమైనవో యీమె అందం. అంతకన్నా మధురాతి మధురమైనది. వాడికున్న పుచ్చి జబ్బులు పెళ్ళానికి సోకనియ్యకండానే పోయాడా మొగుడు. పిల్లలులేరు. ఉన్న అన్నదమ్ముడు వృత్తి సోమరిపోతు. ఇంట్లో కూర్చొని దర్జాగా తింటానంటాడు.

ఒకసారి మా కాంతమ్మత్త యీ సోమరిపోతుకు సవాలు చేసింది. అక్కడ నించి అలాగ సిల్లంగి పెట్టినట్లు సూస్తావెందుకురా? ఈ చెట్టు కిందకు రారా.... గాలి తగిలి చల్లబడతావు. ఇలాంటివేవో కేకలు వేసింది. కాంతమ్మ నోటపడితే అన్యాయం కడిగి వదిలేస్తాదని వూర్లో వాళ్ళ నమ్మకం. పొరపాటునైనా ఒకరు వేలెత్తి చూపినట్లు మొసల్లేదు. నాలుగేళ్ళ వయసులో పెళ్ళి చేసారు. అత్తవారింటికి వెళ్ళే అవసరం లేకుండా తనకన్నా పాతికేళ్ళు పెద్ద అయిన మొగుడు గతించాడు. ఈ వూర్లో పుట్టినా యీవూర్లో బుగ్గవనురా అనేది. ఆమె యీ కసీసపు కోరిక తీరిందన్నట్లు మా పెద్దమ్మ యింటికి సహాయానికి నౌరంగపురం వెళ్ళి అక్కడ మూడురోజుల జ్వరానికే బుగ్గయిపోయింది. ఈవిడే ఒక లాయరుగా మిలిచి వుంటే సంఘానికెంత వుపకారం జరిగేది? పెళ్ళాడ్డానికి యెవరైనా ముందు కొస్తే యీ రూపాన్ని యెంతగా ఆ మగాడు ఆరాధించేవాడు? ఈ అందమైన ప్రతి రూపాలు – ఆ తెలివైన మెదళ్లు యెన్నెన్ని సృష్టింపబడేవి? ఇలా నేను యిప్పుడు అనుకున్నా ఆరోజుల్లో ఆమె, ఆమె బంధువర్గం యిలా తల్చుకునే ఆస్కారంలేదు. అందం వుంది. ఎందరైనా తోడేళ్ళలా వెంట పడగలరు. కోరికలను విత్తనాలలా జల్లలేదు. పిడికిల్లో పెట్టేసి యేదో ఒక ప్రధానమైనది- నవ్వులపాలు కాకుండా నిల్చున్నాను. మీ ఖాతరు నాకేంటంటూ! తన శీలాన్ని గర్వంతో కాపాడుకున్నది.

(ఇంకా వుంది)

మంచు బొమ్మ

ఆచార్య తిరుమల

అనుక్షణం కరిగిపోయే
మంచు బొమ్మలాంటి జీవితానికి
ఆలయం కట్టుటుందేనికి ?
అందులోనూ వేసవిలో_
ఆనంద రస నిమగ్న తకోసం
ఆకాశం అంచుల వరకుచూడు !
నీ చూపుకు గుచ్చుకొని
ఎన్నెన్ని నక్షత్రాలు పరిమళిస్తాయోచూడు !
నక్షత్రర_మనిషి ; నక్షత్రం_ జీవితం !
అంధకారంలో ఎక్కడో దూరంగా
ఆశల కొనఊపిరి మెరుపు !
ఆచరణలో ఆశా నక్షత్రం
అవనికి దగ్గరగా రాగలిగితే
అదేసూర్యోదయం !
ఆచరణలో అమృత ఫలాలు సాధిస్తే
అదేచల్లని చంద్రోదయం !
వీరికాని జీవితానికి
ఆలయం దేనికి ?
చూపులు ఎండల్లాకాసి
దయాపూర్ణ ఆలోచనల్ని
దగ్ధం చేస్తున్న యీ రోజుల్లో_
పతనమైన వారే
పతనమైన వారిని గురించి
మాట్లాడతారన్న సత్యానికి
నివురు గప్పిన యీ కాలంలో_
ముళ్ళకి ఓర్చుకొని
గులాబీల సౌరభాన్ని ఆఘ్రాణించటం నేర్చుకో !
రేయి పగలు సమంగా ఆక్రమించుకొన్న నక్షత్రంలా
రెండు భాగాల జీవితం_
మొదటిభాగంలో అనుభవించే శక్తివుండి
అవకాశంలేకపోవటం_
రెండో భాగంలో
అవకాశం పుష్కలంగా వుండి
అనుభవించే శక్తి లేకపోవడం_
ఈ విరుద్ధసమాసానికి సంధికూర్చే
ఆశ, ఆరాటం తపన, దాహం.
పరుగు - ఇనుప గోడల నడుమ పరుగు !
చూడు !
సముద్రంలో ముత్యాల కోసం వెతకాలిగాని
కెరటాలమీద తేలే గడ్డిపరకల కోసం
చూపుల్ని శూలాలుగా చేసికొని
గాలించటం దేనికి ?
మానసిక వికాసాన్ని
మంచి మాటల ప్రకాశాన్ని
హృదయ పాత్రికలో మధువులా నింపే
ఒక మనిషి కోసం
దగ్గరగా - మరీదగ్గరగావచ్చే
అక్షర నక్షత్రం కోసం - అడుగు వెయ్యి !
కాలాన్ని శాసించిన వారినే
కడుపులో దాచుకుంది యీనేల !
తుఫానువి కాకు,
మలయ మారుతానివి కా !
మంచు బొమ్మకి ఆలయం దేనికి ?
ఆ బొమ్మకి అందాలు దిద్దుతాననంటూ
ఈ అధికార జ్వాల యేమిటి ?
నక్షత్రాలే పరిమళిస్తే
ప్రతిక్షణంలో ఒక తోట !
ప్రతి అడుగుకి ఒక బాట !

డాక్టర్. ఎస్. గంగప్ప

నన్నయ నానారుచిరార్థ సూక్తి నిధిత్వం

(గత సంచిక తరువాయి)

2. 4. విభక్తులు :

ఒక విభక్తికి బదులు మరో విభక్తి వాడి నన్నయ విభక్తి ప్రయోగంలోనూ తన ప్రత్యేకతను ప్రకటించుకొన్నాడు. కొన్ని ఉదాహరణలు :

నా యెడ (1-1-12)– నాయందు అధికధీయుక్తి మెయిన్ (1-1-16)-తోడన్, తోన్: ఇదేరీతిగా ఇంకా "మెయిన్" నావిగా ప్రయోగించాడు నన్నయ ఇలాగే చేన, వలన ప్రయోగం చాలాసార్లు జరిగింది. "అరునను దేవాదియను మతంబున విద్వజ్జనం బుల యనుగ్రహంబునం జేసి నా నేర్చువిధంబున" (1-1-20) "భారత భారతీశుభ గభస్తిచయంబులఁ జేసి" (1-1-22) క్రమంబునఁజతుర్వేద సూత్రం బులఁజేయించి వేదవ్యాసుండై నిజతపో మహత్వంబునంజేసి" (1-1-31) ఇంక "చేత" తక్షకుచే తఁగుండలం బులుగొని (1-1-114); వలన్: నాకుంగరుణింపుడని (1-2-87) నన్ను గరుణింపుడని; నాయందు నీశక్తియింతియు (1-2-109)నాపై; నాయందధిక ధనంబుగొని పొమ్ము (1-2-198) నాయొద్ద, నావలన నాకుఁగొనుట (1-2-187) సేసు పొందుట: నూతిలో వెలువడు (1-3-144) నూతినుండి; సకలవేదంబులు నదివె పశిష్ఠుతో (1-4-169) వద్ద: వివాహంబుచేయు పొంటె (1-4-191) కొరకు.

2. 5. నంధి :

సంధిలో ముఖ్యంగా త్రికసంధిలో నన్నయ ఈ విశిష్టతను సాధించినట్లు స్పష్టమవుతుంది. ఏదో గణం కోసమనికాక, విశిష్టార్థ స్ఫురణార్థమే నన్నయ ఈ ప్రయోగాలు చేసినట్లు గమనించగలం.

అద్దివ్య. అత్తురంగంబు, అయ్యుదంకుండు, అక్కుండలంబులు (1-1-16) అద్దేవయాని (1-3-107); అక్కచునకు (1-3-118); ఇమ్మాత (1-3-143); అవ్విప్ర కన్యక (1-3-143); అవ్వనంబున (1-3-155); ఇన్నాతి (1-3-159); అక్కన్యంజూచి (1-4-26); ఇత్తన్వి (1-4-108), ఇలాగా ఎన్నో ఉదాహరణలు.

2. 6. క్రియలు :

క్రియలు ఏభాషకైనా జీవనాడులు అనడంలో అత్యుక్తిలేదు. క్రియమీదనే ఆయా భాషల స్వరూప స్వభావాల్ని మనం పరిగణించి గుర్తించగలం. అందులోను నన్నయ ప్రయోగించిన క్రియా పదాలు ఎంతో అర్థవంతమై ఒప్పుతూ ఉండడం విశేషం. కొన్ని ఉదాహరణలు పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

'వెలిగించుచు' :

"నిజమహీమండల ప్రజలఁ బ్రీతిఁ బెంచుచుఁ
బరమండలంబుల ధరణీపతుల
నదిమి కప్పంబుల ముదముతోఁ గొనుచును
బలిమినీయని భూమివలయ పతుల
నుక్కడగించుచు దిక్కుల దనయాజ్ఞ
వెలిగించుచును.........'(1-1-6),

దిక్కులన్నిటా తన శాసనాన్ని ప్రకాశింపజేశాడనడానికి 'వెలిగించుమను' అని నన్నయ ఎంతో అర్థవంతంగా ప్రయోగించాడు. ఇలాగే ఈ సందర్భములో లక్ష్మీరంజనంగారు ఉదాహరించిన మాటల్ని ఉల్లేఖించడం సముచితం.

'కడువెలింగె' :

'కౌరవరాజ్యంబు కడువెలింగె'(1-6-8)

లోకమునందు మండుచున్నది వెలుగునిచ్చును. దహనకార్యము లేకయే వెలుగునిచ్చుట ఇచ్చటి చమత్కారము. కౌరవరాజ్యము ప్రకాశించుచున్నది యనుటకు వెలింగె అని కవి ప్రయోగించెను. ఈనాడును మనము దీనినివాడుచున్నాము. 'వాని ప్రతిభ వెలిగిపోతూంది' (లక్ష్మీరంజనవ్యాసావళి-పు.6)

'ఎన్నను, పొందను, ఈదను'

ఇవి ఈనాడు వ్యస్తంగా ప్రయోగిస్తే వ్యతిరేకార్థ ద్యోతకాలు కానీ ఆనాడు నన్నయ ప్రయోగించిన తీరువేరు.

'అమలిన తారకా సముదయంబుల నెన్నను సర్వవేద శా
స్త్రముల యశేషసారము ముదంబున బొందను బుద్ధిబాహు వి
క్రమమున దుర్గమార్థ జలగౌరవ భారత భారతీ సము
ద్రముఁ దఱియంగ నీఁదను విధాతృనకైనను నేరఁ బోలునే' (1-1-19)

ఎన్నను- ఎన్నుటకును అంటే లెక్కించడానికి, పొందను- పొందుటకును, ఈఁదను- ఈదుటకును - అనే విశిష్టార్థాల్లో ఈ పదాలు పై పద్యంలో ప్రయోగించి తన రుచిరార్థ సూక్తి నిధిత్వాన్ని నిరూపించుకొన్నాడు నన్నయ.

నన్నయ కొన్ని క్రియల్ని క్త్వార్థకంలో పునరుక్తిచేసి, తన్మూలంగ విశేషార్థ స్ఫురణకు అవకాశం కల్పించడం ఈ సూక్తి నిధిత్వంలో మరో విశేషం. అలాంటివి కొన్ని :

పర్వంబర్వన్ :

"అప్పులోముండు నిది నాకుఁ దొల్లి వరియింపఁబడిన భార్య పదంపడి భృగుండు పెండ్లియయ్యెనని వరాహ రూపంబున నా సాధ్వి నతిసాధ్వ సచిత్త నెత్తికొని పర్వంబర్వన్" (1-1-131).

ఇక్కడ 'పర్వంబర్వన్' పరుగెత్తి పరుగెత్తి అనడంవల్ల ఎంత వేగంగా, ఎంత దూరంగా పరుగెత్తాడో స్పష్టమవుతుంది. పునరుక్తివల్ల కవి సాధించిన ప్రయోజనం ఇది. ఇలాగే

రోసి రోసి, వచ్చి వచ్చి :

'తిరుగుచుఁ బుట్టలం బొదలఁ ద్రిమ్మరు పాముల రోసి రోసిని
ష్ఠుర తర దీర్ఘదండమున డొల్లఁగ వ్రేయుచు వచ్చివచ్చి య
య్యెడ నొకడుండు భంబను నహింగని వ్రేయఁగ దండ
మెత్తుడున్
హరిహరి యంచు దుండుభ మహాహి భయంపడి పల్కె
భార్గవున్" (1-1-153)

రురుడు పాములపై ఎంతగా రోసినాడో ఇందు స్పష్టమవుతుంది.

త్రచ్చి త్రచ్చి :

ఉరగ పతితల వలనురు
తర జవమున నసురలాఁది తత్పుచ్ఛముని
ర్జర వరులాఁది మహామ
త్సరమున వడిఁ ద్రచ్చిత్రచ్చి జవమఱి యున్నన్' (1-2-13)

"త్రచ్చిత్రచ్చి" అని పునరుక్తిలోని విశిష్టత. ఇలాగే 'తరువం దరువన్'

'ఉడుగక యొండొరుం బిలిచి యొక్క బలంబున దేవదానవుల్
వడిగొని వార్ధినిట్లు దరువం దరువన్....' (1-2-15)

చూడం జూడ :

సురపతి సభ జూడం జూడ నంగార వృష్టుల్
గురిసెఁ గులిశధారల్ కుంఠితంబయ్యె దిక్కుం
జర మదములడంగెన్ సర్వ దిక్పాలకాంతః
కరణములు భయోద్వేగంబు నన్ సంచలించెన్' (1-2-82)

ఇక్కడ 'చూడం జూడ' అని పునరుక్తి విశిష్టార్థ ద్యోతకం. పైపెచ్చు మనం ఈనాడు 'చూడగా చూడగా' అని ప్రయోగిస్తూనే ఉన్నాము.

ఎఱిఁగి యెఱిఁగి వారి నేటికి వారింప
రిట్టి గోత్ర కలహ మేల పుట్టె
దీనికల తెలుంగు దెలియంగ నానతి
యిందు నాకు సన్మునీంద్ర వంద్య' (1-3-5)

ఎఱిగి ఎఱిగి అంటే తెలిసి తెలిసి అనడం మన మీనాడు ప్రయోగిస్తాము, అత్యంత విశిష్టార్థంలో. ఈ ప్రయోగం పలుమార్లు నన్నయ ప్రయోగించడం గమనించ వచ్చు. (1-3-148); (1-4-79); 1-4-267),

తలచి తలచి :

'పలుకుల ముద్దును గలికి క్రొల్లన్నుల
తెలుపును వలుఁద చన్నుల బెడంగు
నలము కాంచీ పదస్థలముల యొప్పును
లలితా ననేందు మండలము రుచియు
నళినీల కుటిల కుంతలముల కాంతియు
నెల జవ్వనంబున్ విలసనమును
నలస భావంబునఁ బొలుపును మెలపును
గలుగు నగ్గిరికన తలచి తలచి'. (1-3-27)

ఉపరిచర వసువు. గిరికా సౌందర్యాన్ని మరల మరల స్మరించి స్మరించి అనడంవల్ల ఆమెపై అతనికి గల వ్యామోహం వ్యక్తమవుతుంది.

చని చని :

పరాశరుడు 'సత్యవతిం జూచి యా మునివరుండు దానియందు మదన పరవశుండై దాని జన్మంబు దన దివ్యజ్ఞానంబున నెఱింగి యయ్యెడ యెక్కి దానితో నొక్కటఁ జనిజని' (1-3-87)

ఇందులో ఆ ముని సత్యవతితో 'చనిచని' అనడంవల్ల ఎంతో దూరం వ్యామోహంతో వెళ్ళాడని స్పష్టమవుతుంది. ఇలాగే :

'చనిచని' : దుష్యంతుడు వేటకై అరిగిన తీరులో ప్రయుక్తం.

'చనిచని ముందట నాజ్య హవి ర్ధృత సౌరభ ధూమలతా
తతులం' (1-4-21)

ఇలాగా క్రియల్ని ద్విరుక్తిచేసి తద్వారా సూక్తి నిధిత్వాన్ని నన్నయ ప్రకటించడమేగాక ముమ్మారు ప్రయోగించి మరింత మనోజ్ఞం చేసిన పట్టు ఒకటుంది.

'రక్షింపుమ రక్షింపుమ రక్షింపుమ :

'తక్షకుఁ డతి భీతుండై
యాక్షణమున నరిగె సురగణాధిప నన్నున్
రక్షింపుమ రక్షింపుమ
రక్షింపుమ యనుచు నప్పురందరు కడకున్' (1-2-217)

ఇది జనమేజయుడు సర్పయాగం చేసిన సందర్భంలోనిది ఇందులో తక్షకుని భయమెంత తీవ్ర తరమైందో విపులంగా మనకు తెలుస్తుంది.

మఱువుసొచ్చిరి:

'పక్షతుండాగ్ర నఖక్షత దేహులై
బోరన నవ రక్తధార లొలుక,
విహగేంద్రునకు నోడి నిహతులై సురవరుల్
సురరాజు మఱువు సొచ్చిరి కలంగి' (1-2-100)

గరుత్మంతుని పరాక్రమానికి తాళలేక దేవతలు పరుగెత్తుకొని దేవేంద్రుని మరువు - అంటే రక్షణను కోరి వెళ్ళారనడానికి మన మీనాడు ప్రయోగించే వాడు ఫలానా వ్యక్తి మరుగున ఉన్నాడంటో న్నట్లే నన్నయ వాడడం గమనించవచ్చు.

ప్రసాదమనుచు మ్రొక్కి :

విష్ణువు గరుడునితో

'అనఘ ! వాహనంబవై మహాధ్వజమవై యుండుమనినఁ బక్షియును బ్రసాద మనుచు మ్రొక్కి పఱచె....' (1-2-108). ఈనాడు మనం అదే ప్రసాదం చాలు అనడం వాడుక.

తలలు వాంచియున్న :

యయాతి తన జరాభారం తీసుకొని యౌవన మిమ్మని తన పుత్రులను కోరగా-

'అగ్ర తనయుఁడయిన
యదువు దొట్టి సుతులు ముదిమికి నోపక
తలలు వాంచియున్న వెలయఁ దండ్రి
పనుపుజేసి ముదిమిగొని జవ్వనంబిచ్చె
బూరుఁడను సుతుండు భూరి యశుఁడు' (1-3-96)

ఇక్కడ 'తలలు వాంచియున్న' ఇష్టంలేనప్పుడు వ్యక్తులు ఎలా ప్రవర్తిస్తారో అలాగే నన్నయ ప్రయోగించడం విశేషం. ఇలాగా ఎన్నైనా ప్రయోగాల్ని ఉదాహరించవచ్చు.

2. 7. వాక్యాలు

క్రియల్లాగానే వాక్యాలు సైతం ప్రతి భాషకీ ప్రాముఖ్యం. అందులో వాక్య నిర్మాణంవల్లనే ఏ భాషైనా మరో భాషనుంచి వేరవుతుందని స్పష్టమవుతుంది. వాక్యాలు కవికృతాలు సందర్భో చితంగా కావచ్చు. అనాడు ప్రజల వ్యవహారంలో ఉండవచ్చు. అలంకారిక భూషితమై ఉండవచ్చు. లేదా లోక న్యాయాన్ననుసరించి ఉండ వచ్చు. ఇంతా సమయోచితంగా సూక్తుల్లాంటి వాక్యాలా ఉండ వచ్చు. ఇన్ని విధాల ఉన్న వాక్య ప్రయోగాల్ని నన్నయ ఎలా ప్రయోగించి తన రుచిరార్థ సూక్తి నిధిత్వాన్ని అభివ్యక్తీకరించె దాన్ని పరిశీలిద్దాం. ఇతః పూర్వం వాక్యగతమైన ఇతర అంశాల్ని పరిశీలించాం. ఇక్కడ వాక్యాల్ని గమనిద్దాం.

2. 7. 1. కవి కల్పిత సూక్తులు :

. విన నభిలాష పెద్దయై యుండు (1-1-11) (వినాలన్న కోరిక అధికంగా ఉంది అనడానికి)

'తగునిది తగదని యెదలో
వగవక సాధులకుఁ జేద వారల కెగ్గుల్
మొగిఁజేయు దుర్వినీతుల
కగుననిమిత్తాగమ మయిన భయంబుల్ (1-1-88)

సరమ కుమారుడు సారమేయుడు అనేవాణ్ణి జనమేజయుని తమ్ముళ్ళు నిష్కారణంగా కొట్టారని జనమేజయునితో సరమ ఫిర్యాదు చేయడం ఇందులోని విషయం. మంచీ చెడ్డా ఆలోచించకుండా నిష్కా రణంగా సాధువుల్ని బాధిస్తే దానికి తగిన రీతిలో తనుభవిస్తారన్న అర్థాన్ని కవి నిబంధించాడు. పద్యమంతా ఒక సూక్తిలా ఉంది.

'అఱుములకు గాన గాదన వద్యా!' (1-1-97).

ఉదంకుని అపవిత్రుడని చెప్పలేక పౌష్యుడు పవిత్ర పతివ్రత అయిన తన ధర్మపత్నిని గూర్చి వ్యంగ్యంగా చెప్పడంలో ఈసూక్తి వైచిత్రి గోచరిస్తుంది.

'ఇది వడిగలదు మనముకంటె గాడ్పుకంటె (1-1-115)

దివ్యపురుషుడు ఉదంకునితో చెప్పిన మాటలు. వాయువేగ, మనోవేగాలకంటే వడి గలదని చెప్పడం ఇందులోని విశేషం. ఇలాగా మన మీనాడూ వాడుతూండడం గమనించదగ్గది.

'అడచినఁ దిట్టినన్ మఱి మహాపురుషంబులు పల్కి-యల్కతోఁ
బొడిచిన మత్తమద్విజులు పూజ్యులు వారల కెగ్గు సేసినం
జెడు నిహముం బరంబు నిది సిద్ధముగావు చిత్తంగి భక్తి నె
ప్పుడు ధరణీ సురోత్తములఁబూజలఁ దృప్తులఁజేయు సోదరుదున్'
(1-1-189)

'మాన్యాస్తు బ్రాహ్మణామమ' అన్న దానికి నన్నయ కాలోచి
తంగా కల్పించిన సుభాషితాలు ఇందులో చూడవచ్చును.

'అమర్త్యులతోఁ జి పొత్తుఁ బలియుదాలు వింతేల' (1-2-21)

రాక్షసులమాటయింది. ఈనాడు వ్యవహారంలో ఇలాంటిమాదిరిత
ఉంది. వాడి పోపాపమింక దాని అనడంకద్దు.

'ప్రొద్దుపుచ్చేవా' (1-3-112)-ఈనాడు పనిలేని సాయంత్రాల
హైందవనరాసికి పొద్దుపోయింది అనడం కద్దు.

'తానిం జూచి కాని కుడువనొల్లను' (1-3-119)-ఇదీ ఈనాడు
వాడుకలో ఉంది.

'నాయొద్దనపలుకనేల నౌవటులేవే'
'మాయమ్మయ్యకుఁ బ్రియసుతవని,
సేయుచు దీవింప ప్రియములేనేవుయచుండయనే
మీయయ్య యేటి మహిమలు
నా యొద్దనె పలుక సీకు వానయులేవే'
(1-3-137)

నా వద్ద పలుకడానికి సిగ్గులేదా అంటుంది. దేవయానితో
శర్మిష్ఠ. ఇవి ఈనాడూ ప్రయోగంలో ఉండడం విశేషం.

'ఎందుబోయి రొకో వారు' (1-4-27)

గౌరవార్థం దుష్యంతుడు కణ్వుని గూర్చి శకుంతలతో నన్న
మాటలు. 'వారు వచ్చునంతకు నొక్క ముహూర్తంబుండునది'
(1-4-28)

శకుంతల దుష్యంతునితో అన్నమాటలు ఒక్క క్షణం ఆగి
వెళ్ళండి అనడం ఈనాడూ ఉంది.

'ఇంతకుసింతయునెఱుగరెజనులు' (1-5-28)

కన్య అయిన కుంతి వాపోయినతీరు

'గత కాలము మేలు వచ్చుకాలము కంటెన్'
(1-5-159)

నన్నయ కృతం. ఇది అత్యుత్తమ సూక్తిలా మిగిలిపోయింది.
కవి ప్రతిభకిది నిదర్శనం. పాండురాజు మృతితో దుఃఖితులైన వారి
నోదారుస్తూ వ్యాసుడు చెప్పిన మాటలు.

'పీరెవ్వరయ్య ద్రుపదము
హారాజులె యిట్లు కృపణులయి పట్టువడన్
పీరికి వలసెనె యహహా మ
హా రాజ్య మదాంధకారమది చేసెనొకో' (1-6-90)

ఇందులో ప్రతిపదం, ప్రతివాక్యం, అర్థయుక్తితో కూడి
ఎంతో వ్యంగ్య స్ఫూర్తితోకూడుకొని ఉంది. నన్నయ నానారుచిరార్థ
సూక్తి నిధిత్వానికిది పరమోదాహరణం.

'దానికి గురులు మంతాపకులంది భూతలేశనన్ను బుద్ధెంచిరి'
(1-2-181)

గౌరవార్థంలో శృంగి శిష్యుడు పరీక్షిత్తునకు తెలుపడం ఇందలి
విశిష్టత.

2-7-2 లోకన్యాయాలు :

1. తనయెఱిగిన యర్థంబొరుఁ
డనఘా యిది యెట్లుసెప్పుమని యడిగిన జె
ప్పనివాఁడును సత్యము సె
ప్పనివాఁడును ఘోరనరక పంకమునఁబడున్'
(1-1-137)

శాపమిచ్చిన భృగు మహర్షితో అగ్నిపల్కిన మాటలు.

2. ప్రమద్వర సర్పదష్ట కాగా రురుడు దుఃఖిస్తుండగా ఆకాశం
నుంచి ఒక దేవత 'అయ్యా! కాలవశంబయిన నెవ్వలికిందీర్పఁ
దరంబు గాదు' అని అంటుంది.

3. శుక్రుడు మద్యపాన దోషాన్ని గూర్చి చెప్పిన మాటలు.
'మొదలి పెక్కు జన్మములఁ బుణ్యకర్మముల్
వరఁగఁ బెక్కు సేసి పడయఁబడిన
యట్టియెఱుకజనుల కాక్షణ మాత్రన
చెఱుచు మద్య సేవసేయ నగునె' (1-3-120)

4. కచుడు దేవయానితో పల్కిన పల్కులు
'గురులకు శిష్యులు పుత్రులు
పరమార్థము లోక ధర్మపథమిది యీలా
బరికింప యిట్టి పలుకులు
తరుణీ గురుపుత్రి, నీకుఁదగునే పలుకన్'
(1-3-131)

5. శుక్రుడు కూతురు దేవయానికి చెప్పినహితం
'అలిగిన నలుగక యెగ్గులు
పలికిన మఱి వినని యట్ల ప్రతివచనంబుల్
పలుకక బన్నము వడియెదఁ
దలపక యున్నతఁడు చూవె ధర్మజ్ఞుఁడిలన్'
(1-3-147)

6. శర్మిష్ఠ యయాతికిఁ జెప్పిన మాటలు.

'చనుబొంకఁగఁ బ్రాణాత్యయ
మున సర్వధనాపహరణమున వధగా వ
చ్చినవి బ్రార్థమున వధూ
జనసంగమమున వివాహ సమయములందున్'

(1-3-178)

7. యదుతుర్వ సుద్రుహ్యానులు యయాతికిచ్చిన సమాధానం.

'నరులు గల కాలమునైనను,
దరుణులు రోయుదురు డాయ ధనపతి యయ్యుం
బురుషుఁడు దుర్వార జరా
పరిభూతి నభీష్టభోగ బాహ్యుఁడుకాఁడే'

(1-3-194)

8. కణ్వుడు శకుంతలకు నచ్చ చెప్పడం.

'ఏట్టి సాధ్వులకును బుట్టిన యిండ్లను
బెద్దకాలమునికి తద్ద తగదు
పతుల కడన యునికి సతులకు ధర్మువు
సతుల కేడుగడయుఁబతుల చూవె'

(1-4-66)

2. 7. 3. సామెతలు :

శకుంతల తన పురాకృతాన్ని గూర్చి చెప్పడం—

'నుడువులు వేయునింకేల యిప్పాటి నోములు
దొల్లి కడకినోచితినిగాక' (1-4-103)

శంతనుని సంతోషం ఇదువ్యక్తమవుతుంది

'తనయు నెమ్మిదోడుకొనుచు నిధిగన్న పేదయ వోలె సంత
సిల్ల భూవిభుండు'

(1-4-169)

వెదకబోయిన తీగ కాళ్ళకు తగిలినట్లు మనుమల విద్యాభ్యాసం కోసం గురువును వెదుకుతుండగా ద్రోణుడు లభించిన సందర్భం లోనిది.

'రోయుతీగ కాళ్ళంబెనగెం దానను చుఁ బొంగి భీష్ముడు'

(1-5-220)

2. 7. 4. అలంకారాన్ని ఆశ్రయించిన రుచిరార్థ సూక్తులు :

1. ఉపమాలంకారము :

కచుని సంజీవని విద్యచేత శుక్రుడు సజీవుడు కావడం :

'విగత జీవుఁడై పడియున్న వేదమూర్తి
యతనిచేత సంజీవితుండై వెలింగె
దనుజమంత్రి యుచ్చారణ దక్షుచేత
నభిహితంబగు శబ్దంబు నట్లపోలె'

(1-3-127)

2. అర్థాంతరన్యాసాలంకారము :

గురువు శిష్యుడైన ఉదంకుని అభినందించడం—

'గురు కార్య నిరతులగు స
త్పురుషుల కగుటరుదె యధిక పుణ్య ఫలంబుల్'

(1-1-120)

కద్రువ పుత్రులు తల్లితో నన్నమాటలు :

'తల్లి పని చెనని యధర్మువు సేయంగ
నగునె యెఱుకగలరె మగువ లెందు'

(1-2-34)

పరాశర మహర్షి మత్స్యగంధిపై వ్యామోహితుడైన సందర్భం లోనిది.

'ఎందుఁగాముశక్తి నోర్వఁగలరె జనులు' (1-3-88)

ఇందులో నన్నయ పద్యరచనా శిల్పం స్పష్టం.

మేనక ఇంద్రునితో నన్న మాటలు

'ఉగ్రతఁబమ్మినయట్టి కోప పరుపాలికి భామలు వోవనోదరే'

(1-4-38)

శకుంతల దుష్యంతుని గూర్చి పల్కిన పల్కులు :

'ముగ్ధలధిపులు మఱవరె బహుకార్యభారమగ్నులు కారే'

(1-4-69)

'మతి యెఱిఁగి యెఱుగనొల్లని
కఱటిందెలుపంగఁ గమల గర్భుని వశమే (1-4-72)

భార్యలయందు కామలీలా వినోదుడైన విచిత్రవీర్యుని గూర్చి పల్కిన మాటలు.

'కామికి నయఁబున నొందుదలంపఁబోలునే' (1-4-215)

3.0. ఇలాగా నన్నయలోని రుచిరార్థ సంభరితాలైన అనేక సూక్తులు నానారీతుల పరిశీలించే వారికి గోచరమై అతని కవితాత్మ స్పష్టమవుతుంది. ఇలాంటి మార్గ దర్శకుడు కావడం వల్లనే నన్నయ ఆదికవి. వాగనుశాసనుడు అయ్యాడనడం సత్యం. ఈనా పరిశీలన ఆదిపర్వం ఐదు ఆశ్వాసాలకు మాత్రమే పరిమితం ఇలాగే పరివ్యాప్తంగా పరిశీలించాలంటే ఒక సిద్ధాంతవ్యాసమే అవుతుంది.

ఇంకా నన్నయ పద్య శిల్పంలో, కథాకథన శిల్పంలో, సన్నివేశాల్లో. సంఘటనల్లో వివిధ ముఖాలా పరివ్యాప్తమై గోచరించి సహృదయ హృదయాలను అలరిస్తాయి. మరి సాహిత్యం ఆలోచనామృతం కదా!

భాద్రపదంలోని మేఘం

శ్రీ గజానన్ తామన్.

ఉన్నట్టుండి - ఓ మాట అయినా చెప్పకుండా_
ఎక్కడికో వెళ్ళిపోయావు ప్రియుడా !
పోతూ, క్షణమైనా ఆలోచించావు కాదు;
ఇన్నినాళ్ళ నెయ్యాన్ని;
సమభావప్రేరిత సహజీవనాన్ని;
కలసి ఇద్దరం నిర్మించు కొనిన
కల్పనా రమ్య హర్మ్యాల్ని;
నిన్ను నిందించి లేదు ప్రయోజనం
నీవు భాద్రపదాంత స్వైర మేఘానివి.
నేటికీ పదిలపరచి వుంచాను
కమ్మ కస్తురిని తలపించే మృత్తికపై
రాజహంస పదచిహ్నాల ...

నియతి నిర్ణేత విధాత భాష
అస్ఫుటం, సంజ్ఞావిహీనం కనుక
చదువుకోలేను

శతప్రయత్నాలు చేసినా !
అయినా, సంధ్య వేళ,
అనాకళనీయ విషాదం ఆవహించు వేళ,
ఏదో - లీలగా
నా మానసపు టంచులను స్పృశిస్తుంది;
మూగవనంలో
లయబద్ధ సంవాదం చేసే
వడ్రంగి పక్షిలా_
వెలుగుతాయి వెనువెంటనె
వేయి స్మృతుల చిరుదివ్వెలు.

నివేదన

యస్. ఏ. యస్. కిశోర్ కుమార్.

విధరోధమై నీ గుండెలో
నిశ్శబ్దమై నిలవాలని
నీలి కురుల ఆకసాన
నెలవంకనై వెలుగొందాలని
మెరిసే నీ కళ్ళలో
కాంతికిరణమై దీపించాలని

నీ వూహాల పందిరిపై
అల్లుకున్న లతనవ్వాలని
నీ భావ చైతన్యంలో
జాగృతినై విలసిల్లాలని
నీకై నా మనోవేదన
ఈ నా అక్షర నివేదన.

దంతకథలు



తెలుగు: ఘట్టమరాజు

కన్నడమూలం. హెచ్.యం.చిదానందమూర్తి

'దంతకథ' అనే పదం వాడుకలో ఉన్న మాట నిజమే. కన్నడంలో ఈమాట ఇరవయ్యవ శతాబ్దం నాటిదని తోస్తుంది. అంతకంటె ప్రాచీన రచనల్లో ఇది ప్రయోగించబడినట్లు కనబడదు. 'దంతకథ' అనేమాట ఎలా పుట్టిందో ఇప్పటికీ బ్రహ్మముడే! 'దంతకథ' అంటే ఆనోటా ఈ నోటా వినవస్తున్న కథ అవా? లేదా 'దత్తి' అంటే ఒక తరం నుండి మరో తరం వారికి అప్పగించబడ్డ కథ అవా? లేదా కొంతమంది తమాషాగా చెప్తున్నట్లు మానవమాత్రుడి మీద కావ్యం రాసినందుకు హరిహరకవి చేతుల్లో పళ్ళూడ గొట్టించుకున్న రాఘవాంకుని కథ అనా?

'దంతకథ' అనే పదనిష్పత్తికి పండితులిచ్చిన వివరణలను జానపదశబ్దవ్యుత్పత్తికి మంచి ఉదాహరణలుగా పేర్కొనవచ్చును. 'దంత' అనే సంస్కృతపదానికి పల్లు, కొండకొమ్ము మొదలగు అర్థాలున్నాయి. 'దంతకథ' అనే మాట సంస్కృతంలో లేదు. కాని 'ఉదంత' అనే పదం ఉంది. (ఈపదంపై పు నా దృష్టి మళ్ళించినవారు డా జి. యస్. శివరుద్రప్ప గారు) 'ఉదంత అంటే వేర్పు' మంచిది అనే అర్థాలకు తోడుగా సమాచారం, వార్త అనే అర్థాలుకూడ ఉన్నాయి. కిట్టెల్ నిఘంటువులో ఈ పదానికి అర్థం దొరుకుతుంది కాని గ్రంథస్థ ప్రయోగాలు లభించవు.

[జన్నకవి అనంతనాథ పురాణంలో (12.22) లో 'ఉదంత' (సమాచారం) అనే పద ప్రయోగం దొరుకుతుంది. "ప్రాణనాథా మరణో దంతాద్భవహ్ని స్ఫుటితహృదయేన్," ప్రాకృతంలో కూడా 'ఉదంత' అనే పదానికి సమాచారం, వృత్తాంతం అనే అర్థాలు ఉన్నాయి. అందువల్ల 'ఉదంత' అంటే జనుల వ్యవహారంలో వున్నది అనే అర్థాన్ని గ్రహిస్తే 'ఉదంతకథా' అనే పదమే 'దంతకథ'గా మారి హిందీ, మరాఠి, గుజరాతి మొదలగు భాషల్లో వాడుకలోకి వచ్చిందని అనుకోవచ్చు. హిందీలో 'దంతకథ' అంటే జనశ్రుతి, కింవదంతి అనే అర్థాలున్నాయి. మరాఠీ, గుజరాతీ భాషల్లో 'దంతకథ' అంటే కట్టుకథ. ఆనోటా ఈ నోటా వినవచ్చే కథ అనే రూఢి. అందువల్ల దంతకథ' అనేమాట హిందీ, మరాఠీ మొదలైన ఆర్యభాషల్నుంచి 19-20 శతాబ్దాల్లో కన్నడంలోకి దిగుమతి అయిందని భావించవచ్చును.

హిందీ, మరాఠీ భాషల్లోని 'దంతకథ' అనే పదం 'వదంత' (రూమర్, రిపోర్టు, ట్రెడిషన్) అనే పదం నుండి పుట్టి వుండవచ్చునని ఊహించేందుకు వీలవుతుంది. 'ఉదంత' 'వదంత' - పదాదిలోని మొదట అక్షరాలు ఉ - వ - ఊనిక లేని స్వరాలు కావడంవల్ల అవి లోపించి 'దంత'గా నిలిచిపోయి వుండొచ్చునని ఊహించవచ్చును.

ఏదేమైనా ప్రజలచే కల్పించబడి, ఆనోటా ఈనోటా వినవస్తూ కొన్ని సందర్భాల్లో గ్రంథస్థమయిన కథను 'దంతకథ'గా పేర్కొనవచ్చును, 'కట్టుకథ' అంటే కొంచెం తప్పేమో! ఎందుకంటారా- దంత కథ—పూర్తిగా కల్పిత కథ అయి, చరిత్రకు విరుద్ధం కానక్కరలేదు. కొన్ని సందర్భాల్లో వాస్తవం కూడ. ప్రజల నోళ్ళలో పడి చిలవలు పలవలై, అద్భుతంగా పరిణమించవచ్చు. అందువల్ల దంతకథలన్నింటిని కట్టు కథలని కొట్టి పారవేయ నక్కరలేదు. దంతకథల్లో కొన్ని పూర్తిగా కాల్పనికాలే కావొచ్చు లేదా వాస్తవానికే కల్పన జోడింపబడి వుండొచ్చు.

ఇలా కథలల్లబడటానికి కారణమేమి? ఆశ్చర్యకరమైన విషయానికి వివరణగా ఒక కథ పుట్టి వుండొచ్చు. ఉదాహరణగా రెండు పెద్ద బండలు కొసలో మాత్రం తాకుతూ నిలబడి ఉన్నాయనుకోండి. అక్కాచెల్లెళ్ళిద్దరు ప్రేమతో ఒకరిగా కూర్చొన్నట్లు భావిస్తుంది ఆ విషయం చుట్టూ కథ అల్లబడవచ్చు. మరో ఉదాహరణ- చెల్లెలింటికి అన్న వస్తే, అన్న-భర్తల మధ్య మాటామాటా పెరిగి, అన్న భోజనం చేయకనే వెళ్ళిపోతుంటే, పొయ్యిమీద అన్నానికి ఎసరు

పెట్టిన చెల్లెలు పరుగెత్తి వచ్చి అన్నను 'భోంచేద్దువుగాని రా' అని పిలువొచ్చు. ఇలాంటి కథ ఎక్కడయినా జరిగి వుండొచ్చును. అయితే అన్న ఇల్లు వదిలి చాలా దూరం పోయివుంటే, చెల్లెలు పక్షిగా మారి 'అన్నా, అన్నం తిందువురా' అంటూ అరుస్తూ, నేటికీ వెదుకుతూవుండే కథ – పాలపిట్ట కథ – జానపదుల కల్పనాఫలంగా రూపొంది వుండొచ్చు. రాతిగుంతలో వూరే పసుపు నీరు, సీతమ్మవారు స్నానం చేసిన చోటని, బండమీదున్న పొడవాటి కోతగుర్తులు రావణుడు సీతమ్మను ఎత్తుకొని పోయ్యేటప్పుడు ఆమె చీర తగలగా ఏర్పడిన చోటని, ఇలాంటిచోట్ల పౌరాణిక కథను ఆయా స్థలాలకు అన్వయించి జనులు కట్టిన కథలుగా భావించవచ్చును.

ఇలాంటి కథలు ఏ ఉద్దేశ్యంతోనైనా కల్పింపబడనివ్వండి, వీటిద్వారా ప్రాకృతిక వైలక్షణ్యాలవైపు, పౌరాణిక కథలవైపు ప్రజల దృష్టిని ఆకర్షించ వచ్చును. 'ఇది ఏమై వుండొచ్చు' అని ముక్కుపై వేలు వేసుకొనేవారికి ఇలాంటి కథలు చటుక్కున సమాధానం చెప్తాయి. 'తెలియదు' అని చెప్పి, అసంతృప్తి కలిగించకుండా ఇలాంటి కథలు ఒక విధమైన సమాధానం కలిగిస్తాయి.

అజ్ఞానాన్ని కప్పిపుచ్చేందుకు కథలు అల్లబడి వుండొచ్చు. ప్రాచీన కాలం నాటి నల్లబండల మీది అక్షరాలను చదవటం వీలు కానప్పుడు ప్రజలు తామేకాదు, మరెవ్వరు కూడ వాటిని చదువలేరు అని భావించి వుండొచ్చును. దాన్ని చదివే బుద్ధిమంతుడికి లంకె బిందెలు వున్న స్థలం తెలుస్తుందని కథ అల్లబడొచ్చు. నా చిన్నప్పుడు అక్క చెల్లెళ్ళను కాలితో కొడితే కాళ్ళలో పురుగులు పడతాయని ఉదాహరణంగా పెద్దలు ఒక శిల్పాన్ని చూపించేవారు. ఆ శిల్పంలో ఒక పురుషుడు పండుకొని వున్నాడు; అతని పాదాలవద్ద ఒక స్త్రీ కూర్చొని వుంది. ఆమె అతని కాళ్ళనుంచి పురుగులను తీసివేస్తుందని అందరం నమ్మేవారం. ఆ శిల్పం చుట్టుప్రక్కల వారికి నీతిబోధకంగా పనికి వచ్చేది. నాకు జ్ఞానం వచ్చిన తర్వాత ఆ విగ్రహాన్ని పరిశీలిస్తే ఆ శిల్పం శ్రీమన్నారాయణుని పాదాలొత్తుచున్న శ్రీ లక్ష్మీదేవి భగ్న విగ్రహంగా తేలింది.

సుందరమైన శివాలయాలన్నింటినీ చోళులే నిర్మించారనీ, అందమైన విగ్రహాలన్నింటినీ జకణాచారి, డకణారులే చెక్కినారనీ కుతూహలపరిహారార్థమై ప్రజలు తటాలున చెప్పే సమాధానాలు శివాలయాన్ని చోళులు 'ఒకే రాత్రిలో' నిర్మించారన్నమాట ప్రేక్షకుల్లో కలిగిన ఉత్కంఠను రెట్టింపుచేసి, వారి ఆశ్చర్యపూరితమైన ప్రశ్నలకు జవాబునిస్తుంది. ఇలాంటిచోట్ల 'ఇది సాధ్యమా'? అనే ప్రశ్నకే తావుండదు. ఈ కథలను ప్రజానీకం వాస్తవాలుగా నమ్మటం మూలాన, చరిత్రకారులకు తప్ప మరెవ్వరికీ అనుమానం కలిగే ఆస్కారం వుండదు.

కొన్ని సందర్భాల్లో ఏదైనా ఘటనకు ధార్మిక ప్రాశస్త్యం కలిగించేందుకు కథలు కల్పింపబడతాయి. ప్రజలు అద్భుతాలన్నా, మహిమలన్నా ప్రాణాలు విడుస్తారు. ఒక వ్యక్తి చేసిన మానవీయ కార్యాల కంటె అతని పేరిట చలామణి అయ్యే మానవాతీత కార్యాలకే ఎక్కువ ప్రచారం లభిస్తుంది. కాలక్రమంలో అలాంటి కల్పిత కథలు నమ్మకాలుగా మారి, భక్తి శ్రద్ధలకు ఆలవాలమై, నిదానంగా వాస్తవఘటనలుగా వేరూనుతాయి. చరిత్ర కారులు అలాంటి కథలను కట్టుకథలని వాదిస్తే, వాటిని నమ్ముతూ వచ్చిన భక్తులు ప్రతిఘటించవచ్చును. ఎందుకంటారా, చరిత్రకారుని మాటలను విశ్వసిస్తే, తాము తరతరాలుగా నమ్ముతూ వచ్చిన విషయాలను నిరాకరించవలసి వస్తుంది. తాము ఏర్పరచుకొన్న భక్తి శ్రద్ధలు మటుమాయం కావలసివస్తుంది.

కొన్నిచోట్ల సంఘస్వరూప స్వభావాలను సమర్థించుకొనేందుకై దంతకథలు కల్పింపబడతాయి. ఒక సంఘంలోని జనులంతా నల్లగా వుంటారనుకోండి, ఆ సమాజంలో పూర్వం ఒక అందమైన యువతి వుండేదని ఆమె నొక దుష్టుడు బలాత్కరింపబోతే, ఆమె మానాన్ని కాపాడుకొనేందుకై అగ్ని ప్రవేశం చేసిందనీ, నిప్పుల్లో దూకడానికి ముందు తాను అందంగా వున్నందుకే ఈ కష్టం దాపురించింది కాబట్టి ఇక ముందు తన కులం వాళ్ళంతా నల్లగానే పుట్టి మానరక్షణ పొందుతారని ఆశీర్వదించింది. అనే కథ పుట్టవచ్చు. ఇందువల్ల ఆ జనులు నల్లగా, వికారంగా ఉన్న విషయం సమర్థింపబడుతుంది. ఆ దృష్టితో చూస్తే ఆ సంగతి తర్కానికి నిలబడుతుంది. అలాంటి కథలవల్ల ఆ సంఘం తృప్తిపడే అవకాశాలుంటాయి.

దంతకథలు ఎలా పుట్టుకొస్తాయో అని గ్రహించేందుకు సాక్ష్యంగా ఒక ఘటనను వివరిస్తాను. హుబ్లి నుంచి కార్వారుకు పోయే త్రోవలో మాస్తిగుడి దగ్గర సాధారణంగా బస్సులన్నీ కాస్సేపు నిలుస్తాయి. నేను పదకొండేళ్ల క్రితం ఆ దారిన పొయ్యేటప్పుడు మాస్తికల్లు (మహాసతి స్మారక శిల) చూశాను. దాని చుట్టూ ఒక చిన్నగుడి కట్టి ప్రజలు పూజించేవారు. మాస్తికల్లును పూజించకుండా వెళ్తే ఆ దోవలో వచ్చిపోయే బండ్లకు అపాయం కలుగుతుందని ప్రజలు నమ్మేవారు. ఆ మాస్తికల్లును ప్రక్కవూరి నుంచి తెచ్చారని, దానికి మొక్కుబడి చెల్లించిన కంట్రాక్టరొకరికి చాలా లాభం కలగటం మూలాన అతడు దాన్ని ఆ వూరి నుంచి తెచ్చి రోడ్డు ప్రక్క ప్రతిష్ఠించారని బస్సులోని ప్రయాణీకులొకరు నాతో అన్నారు.

ఆ రోడ్డులో ఒకటి, రెండు అంగళ్ళు వున్నట్లు గుర్తు. ఆరేళ్ళ తర్వాత, ఆ మార్గంలో పోతే, మాస్తి గుడి చుట్టుప్రక్కల ఒక వూరే పుట్టుకొచ్చింది. చిన్న గుడి అందచందాలు దిద్దుకొని పెద్ద దేవళంగా మారిపోయింది. ఆ గుడిలో ఒక మలయాళ సన్యాసి పూజ చేస్తుండటం

చూశాను. మాస్తికల్లుకు కాకుండా, మరో కొత్త విగ్రహానికి పూజ జరుగుచుండటం చూసి ఆశ్చర్యపడ్డాను. దాక్షాయణి అగ్ని ప్రవేశం చేసి, ఆకాశానికి ఎగిరిపోయిన స్థలం ఇదే అని ఆ మలయాళ సన్యాసి చెప్పాడు. (అక్కడి స్థల పురాణం వినేంత వ్యవధి నాకు లేక పోయింది.) 'మాస్తికల్లు ఎక్కడ?' అని అడిగితే 'వెనకాల వుంది' అని కోపంగా అన్నాడు ఆ పూజారి. వెనుక వెళ్ళి చూస్తే, ఆ సన్యాసి వుంటున్న ఇంట్లో వాకిలి ప్రక్కన మాస్తికల్లు కనపడింది. బస్సులో కూర్చున్న తర్వాత సాటి ప్రయాణికులొకర్తు ఇలా చెప్పారు! "అక్కడున్న మాస్తికల్లు కూడ అసలైనదికాదు. దాన్ని ప్రతిష్ఠించిన కంట్రాక్టరు తాను మొక్కుకున్న మాస్తికల్లును పల్లెనుంచి పెకలించుకుని రాపోతే, ప్రజలు అడ్డుకొన్నారట. అప్పుడు అతడు కొత్తగా మాస్తికల్లును చేయించి తెచ్చి, ఇక్కడ పాతించాడు," నకిలీ మాస్తికల్లు, దానికే పూజా - పునస్కారాలు, ఓ పూజారి పుట్టుకు రావడం, దేవస్థాన నిర్మాణం, అసలైన మాస్తికల్లు మూలపడటం, సన్యాసి జీవితం సాఫీగా సాగిపోవటం, పల్లెకు పల్లే పుట్టుకురావటం, కుతూహలం కలిగించే ఈ సమాచారం వింటుంటే నాకళ్ళ ముందే ఏదో మహిమ జరిగినట్లనిపించింది.

చాలా గుళ్ళ - గోపురాలు, మఠాలు, వూర్లు - ఇవన్నీ ఇలాగే (భ్రాంతివల్ల) పుట్టుకొచ్చాయేమో అనిపిస్తుంది. ఉడుతడి గ్రామములో దొరికిన మాస్తికల్లొకదానిని అక్కమహాదేవి విగ్రహంగా భావించటం పాతపాదుకలకు బసవణ్ణ పాదుకలుగా ప్రచారం కల్పించటం గతంలో జరిగింది ఇలాంటి కథలు అమాయక ప్రజలను బాగా ఆకట్టుకొంటాయి.

దంతకథలను కేవలం కట్టుకథలుగా తిరస్కరించే రోజులు పొయ్యాయి. చరిత్రకు చెందకపోయినా, సంఘంలోని కొన్ని వర్గాలను అర్థం చేసికొనేందుకు ఇవి ఉపయోగపడతాయి. ప్రజలు తమ ప్రశ్నలకు, జిజ్ఞాసకు సమాధానం వెతుక్కునే విధానాలను పురాణాలపట్ల వారికి గల శ్రద్ధాసక్తులు, సంఘటనలను సమర్థించుకొనే రీతి, వారి ఆదర్శాలు — ఆంతర్యాలు, పురోహిత వర్గీయుల స్వార్థ చింతన ఇవన్నింటినీ దంతకథలు వెల్లడిస్తాయి. అలాంటికథలు చరిత్ర కారులకు తలనొప్పిగా పరిణమించవచ్చు.చరిత్రకారుడు ఆ కట్టుకథలనే నీటి బుడగలను పగులగొట్టవచ్చు. చదువు సంధ్యలు ఎక్కువయ్యేకొ అలాంటికథలు మాయమవచ్చు. కాని అవి ప్రజల అభిరుచిని, అంతరంగాన్ని, నైతిక దృక్ పథాన్ని తెలియ చేస్తాయనే దృష్టితో వాటి పరిశీలించవలసి వుంటుంది.బేలూరు, హళేబీడు దేవాలయాల్లోని అద్భు శిల్పాలను చూచినప్పుడు మానవులు ఇలాంటిదేవాలయాలను నిర్మిం లేరనే భావన పుట్టి, ప్రజలు జకణాచారివంటి అపూర్వ వ్యక్తిని సృష్టి చటం జరుగుతుంది. అలాంటి కథలు ప్రజల సౌందర్యానుభూతికి ప్ర కలు కావొచ్చును. ఊరిపేరు గురించి ప్రజలు అల్లినకథ, వారి భౌ వివేచనపై వెలుగు ప్రసరింపచేస్తుంది. అంటే దంతకథలద్వారా ప్రజ చిత్తవృత్తిని మరింత సూక్ష్మంగా అర్థంచేసుకొనేందుకు వీలవుతు దన్నమాట.

మానవ సముదాయం తన అనుభవాల్ని, సంఘం తన చరిత్రను దంతకథల గర్భంలో పది కాలాలపాటు దాచిపెట్టుకొని మనకందిస్తున్న ఎన్నో కావ్యాలకు, మహాకావ్యాలకు దంతకథలు మూలసామగ్రి సమకూర్చాయన్న సంగతి మనం మరువకూడదు.

మధ్యతరగతి హృదయం !

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

వృష్యమానం

కృష్ణపంచమి నాటి

క్షీణచంద్రుని

మసక వెలుతురులో

పొరలుపొరలుగా అల్లుకొన్న

మంచుతెరలు మధ్యతరగతి కోరికలు !

దూరాన నక్షత్రాల గుడ్డికాంతిలో

పిచ్చిగా కళ్లుతెరుస్తున్న కొబ్బరితోపుల ఆశల నీడలలో

ఊహల జలతారు కప్పుకొన్న

కనుల నీటి నీలి కొలనులో

పసిడి కలల ప్రకృతి నిండుకొన్న

గుండె కొండల జారిపడే సెలయేటిలో

వెన్నెల వెండిగుట్టల భవిష్యత్తు

మురిపెంగా మురిపాల దొరలాడుతుంది !

కష్టసుఖాల తలపండిన వర్తమానం

ఎముకలు కొరికే మంచు బిందువుల్లో హైరాణాపడుతుంది

నల్లని మబ్బుల గతం

తూరుపు దెసన బంగరుకెంపు కోసం రంపు పెడుతుంది

అయినా తెల్లారితే తెమలని (బతుకు

రావద్దు రావద్దని వేగుచుక్కని (బతిమాలుతుంది

ఆకలి నిద్దురను తింటూ

నిలకడలేని నిశిని నిగ్గదీస్తున్నా

నిట్టూర్చే ప్రతిక్షణం

తెల్లారగట్టుకు పెందలకడనే చేరుకొంటుంది !

రేపు చేరుకొనే

ప్రాప్తమున్నా లేకపోయినా

రేపును చూడవలసిన

ప్రారబ్ధం మాత్రం ఉంటుంది

అది నడుస్తూ ఉంటుంది

చరిత్ర చెబుతూ ఉంటుంది !

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి

ప్రబంధరత్నాకరము - తృతీయాశ్వాసము ప్రత్యంతర విశేషములు

తెలుగు సంకలన గ్రంథములందు పెదపాటి జగన్నాథకవి ప్రబంధ రత్నాకరము నిజముగ రత్నాకరము. అది నన్నయ భారతము మొదలు నెల్లూరి ముత్తరాజు పద్మావతీ కళ్యాణము వఱకు, లబ్ధాలబ్ధ ముద్రితాముద్రిత గ్రంథములలోని అనేక పద్యరత్నములకు ఆకరము. అంతేకాదు. ఆంధ్రకవుల చరిత్రకు, ఆంధ్రసాహిత్య చరిత్రకు ఆవశ్యకములైన అంశములకు కాణాచి. ఉపరి, ప్రసిద్ధ కావ్యములలోని ఛిన్న, భిన్న పాఠముల పరిశీలనమునకు కరదీపిక. ఇంత విశిష్టమైన, ప్రయోజనకరమైన ప్రబంధరత్నాకరమునకు ఒక్కగా నొక్క తాళపత్ర ప్రతి తంజావూరు సరస్వతీమహలు గ్రంథాలయమునందు కలదు. అది కూడ అసమగ్రము. అక్కడక్కడ గ్రంథపాతరాహుగ్రస్తమును. దాని నకలు కాగితపుప్రతి ఆంధ్రవిశ్వ కళాపరిషత్ గ్రంథాలయమునందు కలదు. అంతే. ఇంతవఱకును ప్రబంధరత్నాకరము ముద్రితము కాలేదు. ఎంత శోచనీయము !


అసలు పెదపాటి జగన్నాథకవి ప్రబంధరత్నాకరమును ఆంధ్ర సాహిత్య జగత్తునకు ప్రథమతః పరిచయము చేసినవారు మానవల్లి రామకృష్ణకవిగారు[1] (1909) తదుపరి ప్రబంధరత్నాకరమునకు - ఎంత ప్రయత్నించినను - పుత్రికయైనను లభింపలేదని వ్యథ చెందినవారు కందుకూరి వీరేశలింగముగారు[2] (1917.) అనంతరము ప్రబంధ రత్నాకరములోని అలబ్ధ, అముద్రిత గ్రంథములలోని పద్యములను మాత్రము - అవి కూడ అనుక్రమణికను మార్చి, ప్రకరణమును వదలి - ప్రకటించినవారు వేలూరి ప్రభాకరశాస్త్రిగారు[3] (1918.) తన్మూలము తంజావూరి ప్రతియే. ప్రబంధరత్నాకరములోని అవతారికనుబట్టి, అది నాలుగైదు ఆశ్వాసముల గ్రంథముగ అనుమేయము. కాని, తంజావూరి ప్రతియందు మూడు ఆశ్వాసముల గ్రంథము మాత్రమే కలదు. తతిమా గ్రంథము కవిగారికి కానవచ్చిన జాడ కానరాదు. 'కడమ గ్రంథ మెక్కడను గానరాలేదు' అని ప్రభాకర శాస్త్రిగారి స్పష్టప్రతిపాదనము.[4] అదృష్టవశాత్తు, ఉన్న గ్రంథములోని పెద్ద గ్రంథపాతము పట్టు, కడమ గ్రంథములోని కొంతభాగము - ఇంచుమించు చతుర్థాశ్వాసము - నాకు కానవచ్చినది.


సుమారు ఇరువది సంవత్సరముల క్రితము - మా విద్యార్థిని శ్రీమతి ఎ.ఆండాళ్ళమ్మ ఒక వ్రాతపుస్తకమును నాకు ఒసగినది. ఆమె మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారి మనుమరాలు. ప్రస్తుతము విశాఖపట్టణములోని మిసెస్ ఎ.వి.యన్. కళాశాల యందు తెలుగు లెక్చరరు. ఆమె ఒసగిన వ్రాత పుస్తకమునందు ఒక విడి కాగితంమీద 'పెదపాటి జగ్గన్న ప్రబంధ సారం' అను శీర్షికను ఇరువదియారుగురు కవుల పేరులు, ఇరువదితొమ్మిది కృతుల పేరులు కలవు. సరే పెదపాటి జగన్నాథకవి ప్రబంధరత్నాకరము కద, అముద్రిత పద్యములు సుముద్రితములైనవి కద, అయినను పాఠాంతర పరిశీలనమునకు పనికిరావచ్చునని అప్పుడే అతిభద్రముగ దాచితిని. అతిభద్రముగ దాచుట వలన కొంటోలు అస్తినాస్తి విచికిత్సాహేతువో అయినది. ఇంత కాలము మధురలాలస యొద్ద మణిహారము వలె మఱుగున పడినది. ఇట్లు పాతిక సంవత్సరముల క్రితము, రంగనాథ రామాయణమునకు సంబంధించిన ఒక అముద్రిత వచన గ్రంథములోని సమాచారమును వ్రాసిపెట్టుకొన్న మరొక వ్రాతపుస్తకమును మరుగున పడిన మాణిక్యమయినది. ఇటీవల దానికోసము పాతపుస్తకముల, కాగితముల కట్టలు వెదుకుచుండగ, అది దృగ్గోచరము కాలేదు గాని, అదృశ్యమైపోయిన 'పెదపాటి జగ్గన్న ప్రబంధసారం' అమాంతము ప్రత్యక్షమయినది. అందు కాలదోషము పట్టిన కామశాస్త్ర విషయము కాసంత యున్నను,

ప్రత్యంతర విశేషములెల్ల ఆంధ్రసాహిత్య జగత్తునకు అందీయవలసిన ఆవశ్యకము కలదు గావున, అశ్లీలమైనను సుశీలమైనను ప్రకటించుట అవశ్యకర్తవ్యము.

ప్రత్యంతరస్వరూపము :

పావుటావు సైజు కాగితపు ప్రతి. ముప్పదితొమ్మిది పావు టావుల మీద రెండువైపుల గ్రంథము కలదు. కనుక మొత్తము డెబ్బది యెనిమిది పుటల గ్రంథము. మొదటిపుట కుడిప్రక్క నడిమినుండి ఏటవాలుగ చిరిగిపోయినది. కాని చిరిగిన ముక్క చెదరిపోలేదు. నడుమ ఒక పుట, చివర పదియేడు పుటలు కుడిప్రక్కపైన అంగుళము వెడల్పు, మూడున్నర అంగుళముల పొడవు చిరిగి ముక్కలు పోయినవి. ప్రతి పుటకు సుమారు ఇరువదిమూడు పంక్తులు కలవు. పదొకండవ పుటను మాత్రము అయిదున్నర పంక్తులే కలవు. మొదటి పుటను విటశృంగారము అను శీర్షిక కలదు ముప్పదినాల్గవ పుటను తృతీయాశ్వాసాంతగద్య కలదు. అందు 'పెదపాటి జగ్గన నామధేయ ప్రణీతంబైన ప్రబంధసారంబు నందు–' అనియే కలదు. ముప్పది యైదవపుట నుండి డెబ్బదియెన్మిదవపుట వఱకు చతుర్థాశ్వాసముకలదు





ఇది తంజావూరి ప్రతియందు లేదు. అవతారికయందు 'వివరించెద' నన్న 'మధ్యాహ్నసూర్య విడంబంబు' కలదు. 'సూర్యోదయము' అను శీర్షికతో పాటు ఆశ్వాసాదిపద్యము తదుపరి, 'దేవా సూర్యోదయాది వర్ణనంబులు విన్నవించెద నవధరింపుము' అను కవివచనము కలదు. వర్ణనమును కలదు. తుదిని వ్రతమాహాత్మ్య వర్ణనము కలదు. అరువది యైదవ పుట ఆఖరిపంక్తి అనంతరము 'మార్చి 13– 1892' అని కలదు. కనుక ప్రతి రచనాకాలము 13–3–1892 ప్రాంతము. తన్మూలమైన తాళపత్రగ్రంథము తంజావూరి ప్రతి కాదనుటకు వక్ష్యమాణవిషయమెల్ల తార్కాణము. అనగా గత శతాబ్ది తుదిభాగము నందు పెదపాటి జగన్నాథకవి ప్రబంధరత్నాకరమునకు ప్రత్యంతరము దేశమునందు కలదని అవగాహన మగును.

తంజావూరి ప్రతి యందులేని చతుర్థాశ్వాసము చాలవరకు లభించుట మాత్రమే గాక, ఉన్న తృతీయాశ్వాసములోని గ్రంథపాత మును లభించినది. తృతీయాశ్వాసములోని విశేషములను ముందు తెలిపి, చతుర్థాశ్వాసములోని విశేషములను తర్వాత వివరింతును.

దిబ్బలెల్లను వినువారి కుబ్బుగాఁగఁ
బదను పదనున నంతలఁబరయుఁ జింత
గవయ కూడల మదనుండు కలయ నెఱచి
గుదియఁగొను మోదుపువ్వుల కోలవిడిచి -7

వేశ్యమాత - కళావిలాసము :

చదురలు దేవహేతువులు సాయలు మాయలు కోరదంబు లె
ల్లిదములు గానముల్ కపటలీలలు దాలలు తీపు లోపికల్
పదరులు వేసటుల్ బహువిలాసముల్ లాసలు రచ్చమెచ్చులున్
బొదవుగఁగూడియున్న పెమబొల్లులు లంజల తల్లులెల్లడన్ -8

(ఇది తంజావూరి ప్రతి యందు కలదుగాని ఆకరములేదు)

భద్రదత్త కూచిమారపాంచాలురు - కళావిలాసము :

బాలల రూపు చూపుకొని భద్రుఁడు మాటలబెండువెట్టి పాం
చాలుఁడు వశ్యమంత్ర జపసాధ్యదయంబులఁ గూచిమారుఁడా
భీల ధనాంబరావళులఁ ప్రీతులఁజేయుచు దత్తకుండు లీ
లాలలితానురాగరతులన్ సుఖియింతు రనంగ సౌఖ్యముల్

చిత్తిని - కళావిలాసము :

తిలకించియుండు వన్నెలు గట్టి పువ్వులఁ
దుఱుము వెండ్రుకలపై నెఱలుఁదోఁచుఁ
దియ్యని పలుకులు దేశీయముగనాడుఁ
బలుమారు గ్రుమ్మరు బహువిధములఁ
బెనగంగనేర్చు నెవ్వనికైనఁ గిన్నార్చు
వలయు మృదువులయి దలముగలిగి
పలుచని రోమముల్ మొలిచి లోపెడలపు
నయ్యుండు నచ్చటి నెయ్యమొప్పఁ
దేనెకంపు వొల్లుచు మానితకామ జ
లంబు గలిగియుండు లలన సుమ్ము
చిరయ శోవిలాస చిత్తినియగు నిది
వనితఁదీర్ప వంత వలపులకును -10

హస్తిని కళావిలాసము :

చన్నులు నధరంబు జఘనచక్రంబును
దాడలు నంగుళములు వడులు నారు
వలుదలు గుజ్జులు వలయంబునగు మెడ
వెడఁదకన్నులు నడవెడఁగు వేదు
సన్నవెండ్రుకలు నొసలు మిట్ట యతియు
గ్మముఁ గొంతిచాలదు కడుపు నిడుపు
గజమదగంధి చిక్కని మేను గర్కశ
(మాడు) క్రియ భుజించుఁగూడు మిగులఁ
గుడుచు నొక్కని లోపల పెడఁదయైన
కామమందిర మెంతయు గవులు దెగులు
తొగరుఁజీరకుఁ ప్రేమంబు మిగులఁగలదు
హస్తినీభామ కామతంత్రాభిరామ

శంఖిని - కళావిలాసము :

జఘనంబు లఘువు భాషలు మార్దవము కేశ
ములు దీర్ఘములు దేహంబు కృశము
కన్నులు మెఱుఁగులు చన్ను లున్నతములు
బొమలు వాలికలు కర్ణములు చెలువు
లుదరంబు పలుచన పదములు కఠినంబు
లారు నున్నము నాభియంద మొందు
కారంబు గలిగిన సీరు పెల్లై, సన్న
మై మీఁద రోమంబు లధికమగుచు
నుండు నుద్యానవన కేలి నుండఁగోరు
నధికమును గొంచెమును గాని యట్టి కుడుపు
గుడుచు రతివేళఁజాల నెక్కుడు మదంబు
గలుగు శంఖిని చెలువగు వలుద మేను

పద్మిని కళావిలాసము

రమణీయ మృదుమధురాళి బాలకి గుణ
రత్న సాగర మృగరాజమధ్య
రాజన్యవిస్ఫురద్రావిజ (?) శుభగంధి
రాగానురక్త మరాళయాన
రాగసంయుత మృగార్భకనేత్రి శుభశ్రీవ
స్త్రీప్రియ కోప దుర్వ్యసన జార
రాజకీరాలాప రసిక నిరంతర
రతి(శి?) మత్తకేళినిరతియనంగ
ధరజ నిచ్చునట్టి వరపద్మినియు మధు
రములు గోరు నా శరమునఁజిత్త
రంజనంబులేదు ప్రీతిదిన[ంబున ?] శీలకా
ర్యముల మెలఁగు బుధులు ప్రీమద మెసఁగ -18

అజ్ఞాతకవి కళావిలాసము

పెదపాటి జగన్నాథకవి ప్రబంధరత్నాకరము తంజావూరి ప్రతిలోని ప్రథమాశ్వాసమునందు 'మదనస్తుతి - కళావిలాసం' అను శీర్షికను 'పృథుల విశ్వంభరారథమున' అను పద్యము, ద్వితీయాశ్వాసము నందు 'తాంబూలానకు - కళావిలాసం' అను శీర్షికను 'తలపోయంగ' అను పద్యము. తృతీయాశ్వాసమునందు 'విటలక్షణం-కళావిలాసం' అను శీర్షికను 'శ్రీమంతుడు' అను పద్యము, 'క్షుద్రదత్త కూచిమారపాంచాలులు' అను శీర్షిక, అనంతరము గ్రంథపాతము, తదుపరి ఇంచుమించు ఒక చంపకమాల ఉత్తరార్థము, తదనంతరము 'కళావిలాసము' అను శీర్షికను 'తొడవులు పెట్టు' అను పద్యమును కలవు. మఱి గణపవరపు వేంకటకవి ఆంధ్రప్రయోగరత్నాకరము నందు 'నన్నెచోడ కళావిలాసము' అను శీర్షికను రెండు పద్యములు కలవు. అవి నిమిత్తముగ ప్రబంధరత్నాకరములోని మొదటి మూడు కళావిలాస పద్యములు, 'లలనలు గొందఱు' అను మఱొక పద్యమును కలిపి, నాలుగు పద్యములును నన్నెచోడుని కళావిలాసములోని పద్యము లని ప్రథమతః మానవల్లి రామకృష్ణకవిగారి ప్రతిపాదనము.[5] తదుపరి ప్రబంధరత్నాకరములోని నాలుగు కళావిలాస పద్యములును నన్నెచోడుని కళావిలాసములోని పద్యములని వేటూరి ప్రభాకరశాస్త్రిగారి స్వీకరణము.[6] ఆమీద కళావిలాస పద్యములు నాలుగు, 'లలనలు గొందఱు' అను మరొక పద్యమును కలిపి, అయిదు పద్యములును నన్నెచోడుని కళావిలాసములోని పద్యములని నిడుదవోలు వేంకటరావు గారి నిర్ణయము.[7] కాని, 'ప్రబంధరత్నాకరములోని కళావిలాసము ప్రయోగరత్నాకరములోని నన్నెచోడ కళావిలాసము కాదు. కళావిలాసము కామశాస్త్రము, నన్నెచోడ కళావిలాసము నానాపురాణ కథావిలాసము' అని పూర్వోక్తము.[8] అది ప్రబంధరత్నాకరము ప్రత్యంతరములోని అప్రకటితపూర్వములైన అనేక పద్యములనుబట్టి నిర్ధరింపబడునది.

ప్రబంధరత్నాకరము ప్రత్యంతరములోని తృతీయాశ్వాసము నందు ఇట్లు కలదు—

విటులక్షణము - కళావిలాసము :

శ్రీమంతుడు గుణవంతుఁడు
ధీమంతుఁడు రూపయుతుఁడు ధీరుండు కళా
ధాముండును గావలయును
దా మహిఁగాముకుడు కామతంత్ర వివేకి -1

కులశీలంబులు వదలక
యిలుదురనక పనులయందు నేమఱక పయిన్
వలపులు చల్లిన భ్రమయక
మెలగంగా నేర్చువాఁడె మిండఁడు జగతిన్ -2

కలఁగఁడు దీరఋంగళము గట్టఁడు ముప్పలుచూడఁడుబ్బునన్
జెలఁగఁడు రిత్తచందములు సేయఁడు పెల్లుగఁజాల మత్తుఁడై
పలుకఁడు మేనజెన్నుగల పట్టుల చూపెడు నవ్వటుండు మిం
చులనగు మంచి సుందరుతిమాఫులు పై పయిఁబాఱ తెంచినన్ -3

డిచ్చంబు పట్టక తుచ్చాలు పలుకక
యెమ్మెలఁబోరలక యెఱుక చెడక
తఱుచుల్క సేయక తబ్బిబ్బులాడక
వెలనాడితప్పక వేసరిలక
గలిగలి కర్మాక ()? కంటసాలాడక
గొంద్రతి (?) గూడక గుణము చరక (?)
తనవారి మఱువక ధర్మంబుఁదప్పక
పలుమాటు గర్వరవాటుపడక
వట్టి దొగ దొలు సేయక పరుసగలిగ
దిట్టతనమున మదిలోన గుట్టుతోడి
... ...
జరుపనేర్చినవాఁడువో చండవిటుఁడు -4

విటశృంగారము - కళావిలాసము :

పొఱుతెంచు మార్గము నేఱునూతులు దాఁటి
బండియెత్తు నాఁడుఁబాటవాఁడు
రిత్తనగవు నవ్వ మత్తిల్లి కువిటుఁడు
సుదతు లెదురనున్నఁ జూచెనేని -5

వన్నెలు మీదుగఁ గట్టును
కిన్నెలు వెసఁద్రిప్పఁజేతఁగంభము ప్రేయన్
దన్నెదుఁగఁడు వనితలఁబొడ
గన్నను గువిటుండు కుప్పిగంతులపై చున్ 6

కుటిలవేశ్య లక్షణము - కళావిలాసము :

పదనిల్చి పాపిటపట్టు నున్నఁగ దువ్వి
చెదలఁద్రొక్కెడు కొప్పు చెంపఁదాపి
వదలి కంకటి తొడవులుగాఁగ నొసలిపై
పొసగఁగఁగాటుకబొట్టు పెట్టి
పనిలేక తిరుగుచుఁ బాటలు పాడుచుఁ
బదురొడుచును దీగ సాగఁబెట్టి
నవ్వుచు ముదిసి సన్నలఁజేరి పలుచని
మరువునఁ దనుబొందు మత్తికాని

బాలకు కళావిలాసము :

అమిత స్వచ్ఛ మచుంబితాధర మపూర్వాసంగవిద్యా సురం
గ మదంతక్షతకంఠ మగ్రహణ కక్షస్థానయుగ్మం బని
ద్య మహేయం బవలంబనాంకురిత రోమాంచంబు బాలాంగనా
గమసంభోగము నింపుసొంపు విటలోక ప్రీతిగాకుండునే 14

వలరాజునకుం గట్టిన
యిలు సంసారపు సరకు లెక్కించెడి పె
న్గలము సమస్తసుఖంబుల
మొలకసుమీ బాలయైన ముద్దియఁ దలఁపన్ -15

యౌవన కళావిలాసము

ఎడపక తియ్యవింటి తెగఁగ్రిక్కిన బాణము దుఃఖవార్ధికిన్
గడపయి దాఁటరాని సుడిగాలి విరక్తులకెల్ల గుండె త
ల్లడము శరీరలక్ష్మికి విలాసము లోకవికాసమాన పెన్
బొడవుఁ దలంచి చూడఁ బువుబోఁడుల జవ్వనమెవ్విధంబునన్ -16

చన్నులంటురాలు కన్నులు కలుకులు
మాటలెల్ల మదనతంత్ర రతులు
తొడవులేల పెట్టఁ బడతులకెల్లను
అదరి జవ్వనంబ యొదలి తొడవు -17

ప్రౌఢకు కళావిలాసము

నెఱినాటి మెఱుఁగులు గిఱిగొన రోపంపుఁ
    జూపుల రూపుగఁ జూడనేర్చుఁ
గుటంబు మీఁదటి కూటంబులకుఁ బ్రోది
    గాఁగ నింపుల ముంపి గదియనేర్చు
దేనియకంటెను దియ్యనౌ పల్కులు
    చెవులకుఁ బువులుగాఁ జెప్పనేర్చు
వేడుకయై వింత వింత చందంబులు
    ప్రేమంబు మొలిపించి పెనఁగనేర్చుఁ
దగులుఁ జేయనేర్చుఁ దగిలి పాయఁగనేర్చు
దవియెఱుంగనేర్చుఁ దగవు నేర్చు
మాయఁ దెలియనేర్చు మాయ సేయఁగనేర్చు
ప్రౌఢఁ దెలియలేఁడు మూఢవిటుఁడు -18

మలయసమీరణంబునకు మానము దూలదు తేఁటిమ్రోఁతకున్
గలగదు పుష్పదామములు గన్నఁ జలింపదు తీపిపుట్టఁగాఁ
బలికెడు రాజకీరముల పల్కుల కుల్కదు చందమామకుం
దలఁకదు దర్పకుండనినఁ జల్లదమందదు ప్రౌఢ ప్రౌఢిమన్ -19

లోలకు కళావిలాసము

వేడుక మీఁదుకొల్పియును వేగిరియంగ ననంగకేళికిన్
దార్కొడువడంగ నా బలిమిఁదా విటులం గరగించు లోలపై
యోడక మన్మథుండు తన యుబ్బున నేసిన మర్మకర్మముల్
గాడవు వాడవల్ల కసుగందిన యా వెదపూవు టమ్ములే -20

కూర్మి కళావిలాసము

తొడవులు పెట్టి సంభ్రమముతోఁ దిలకించు మడుంగుఁగట్టుఁ బై
పడుఁ దడవోర్చు దెంపెఱిఁగిపట్టదు నేర్పులు గట్టిపెట్టుఁ బ
ల్కెడు నెడఁదొట్రుపాటొదవుఁ గింకకు బెగ్గిలమై చెమర్చుఁగ్రాఁ
జిడుముడిఁ బొందుఁగాంత పతిఁ జేరిన కూరిమిగల్గెనేనియున్ -21

ఇట్లు పెదపాటి జగన్నాథకవి ప్రబంధరత్నాకరము ప్రత్యంతరములోని తృతీయాశ్వాసమునందు, కళావిలాసము నందలి విట, విట శృంగార, కుటిలవేశ్యా, వేశ్యమాతృ, భద్రదత్తకూచిమారపాంచాల, చిత్తినీ, హస్తినీ, శంఖిణీ, పద్మినీ, బాలా, యౌవనా, ప్రౌఢా, లోలా - అనురాగ లక్షణములు మొత్తము ఇరువదియొక్క పద్యములు కలవు. ఇందు. 2, 3, 4, 6, 15, 17, 19 సంఖ్యల ఏడు పద్యములకును ప్రత్యేకముగ ఆకరములు లేవు. కనుక అవి కళావిలాసములో పద్యములు కావచ్చును. కాకపోవచ్చును. ఇట్టివి పూర్వాకరపురస్కారములు అయిన సందర్భములు, కాని సందర్భములును ప్రబంధ రత్నాకరమునందు కలవు. అయినను, కాకపోయినను, పయి ఇరువదియొక్క పద్యములందును ఆద్యంత పద్యములు (1,21) రెండు మాత్రమే ఇంతవఱకు వెలుగుముఖము చూచినవి. మిగిలిన పంధొమ్మిది పద్యములును ఇంతకాలము పేటికాంతర్గత రత్నములే.

పంధొమ్మిదవ పద్యము నందు ప్రౌఢిమశబ్ద ప్రయోగముకలదు. ప్రౌఢశబ్దము కంటె భావార్థమునందు ప్రౌఢి అను శబ్దము నిష్పన్నమగును. అది ప్రసిద్ధము. సలక్షణము. ఇమనిచ్ ప్రత్యయమును చేర్చినచో, భావార్థమునందే ప్రౌఢిమ అనుశబ్దము వ్యుత్పన్నమగును. ఇది ప్రసిద్ధము కాదు. విలక్షణము కూడ. అయినను శ్రీనాథుని కృతులందు అనేక స్థలములందు ప్రయుక్తము. అది శ్రీనాథునికి పూర్వము ఆంధ్రకవులు ప్రయోగింపలేదు. శ్రీనాథుని తర్వాత ప్రయోగింపక పోలేదు. సంస్కృత కావ్య సహస్రమును కొల్లగొట్టిన శ్రీనాథుని ప్రయోగమునకు మూదల మూకపంచశతి (94 శ్లోకములు 5 స.) అందలి ప్రౌఢిమ శబ్దమును ప్రథమతః చర్వణ మొనర్చిన శ్రీనాథుని ప్రయోగమును, తదనంతరాంధ్ర కవులు చర్వితచర్వణము చేయుట ప్రసిద్ధము ఏవంవిధమైన ప్రౌఢిమశబ్దము ప్రయుక్తమైన పంధొమ్మిదవ పద్యము కళావిలాసములోని దైనచో, ప్రబంధరత్నాకరములోని కళావిలాసము శ్రీనాథుని గ్రంథముల కంటె తర్వాతి గ్రంథమగుట తథ్యము.

ప్రయోగరత్నాకరములోని 'నన్నెచోడ కలావిలాసము' కూడ శ్రీనాథుని భీమఖండము కంటె మాత్రమేగాక, అల్లసాని పెద్దన మనుచరిత్ర కంటె గూడ అర్వాచీన గ్రంథమని పూర్వోక్తము.[9] అయినను ప్రయోగరత్నాకరములోని 'నన్నెచోడ కలావిలాసము' ప్రబంధరత్నాకరములోని కళావిలాసము ఒకటికాదు. అది నానాపురాణ కథావిలాసము. ఇది కామశాస్త్రము. అజ్ఞాత కర్తృకము.

నారాయణ దేవుని కళాభిరామము

అజ్ఞాతకవి కళావిలాసముతోపాటు, అవిజ్ఞాతకవి నారాయణదేవుని కళాభిరామమును కామశాస్త్రము. ఇది కూడ పెదపాటి జగన్నాథకవి ప్రబంధరత్నాకరము ప్రత్యంతరము నందు కలదు. అది తృతీయాశ్వాసములోని గ్రంథపాత ఘట్టములోనిదగుట వలన తంజావూరి ప్రతి యందు లేదు. అందువలన ప్రభాకరశాస్త్రిగారు సంఘటించిన ప్రబంధరత్నావళియందును లేదు. అన్యథా కూడ అశ్రుతపూర్వము.

నారాయణదేవుని కళాభిరామము ప్రబంధరత్నాకరము ప్రత్యంతరము నందు ఇట్లు కలదు –

చిత్తిని నారాయణదేవుని కళాభిరామము

తగఁబొలు పొడవైన తనుతల్లి మధురతను
ఇంపైన కడుపు సొంపెసఁగు నడుము
జంఘంబు క్రొవ్వారుఁజన్నులు వలుదలు
చారు చకోరికాచతుర నయన
వ్రటువపొడవైన వలరాజు సదనంబుఁ
బలుచని కప్పుతోఁ బదను మిగులు
కలికిచూపులతోడఁ బలువురఁజూచును
మధుగంధమొప్పు మేన్మతుకలంబు
పొడవు నెమ్మోవి బాహ్యసంభోగమునకుఁ
జెలఁగునప్పుడు సరిదిపాటలకు నెలఁగుఁ
జిత్రమగు నెవ్వి యవి గోరు చిత్రజాత
శాతతర హేతి చిత్రినీజాతి నాతి –1

హస్తిని నారాయణదేవుని మదనకళాభిరామము

బలసి చెక్కిలి కూరగిలఁబడ్డ మేదయును
వలుద పదాంగుళ వక్త్రోష్ఠములును
కపిల కచంబును గద్గద లాపముల్
క్రూరచేష్టలు నతి కుటిలగతియు
సింధుర మదగంధ బంధురంబై యుండు
మదన జలంబును మగువయెడలు
నంగజాతుని సాల యతి విశాలత నొందు
కప్పు నిబ్బరముగాఁ గలిగి యుండు
తిండికేనుఁగుగతి పైనఁ డవిరి దానిఁ
దనుప నొకపాటి వానికిఁ దరముగాదు
చెకులు విననగోరు నేర్పడ సిగ్గులేదు
వెంగలొరుండు హస్తిని వెక్కసముగ

శంఖిని నారాయణదేవుని మదనకళాభిరామము

అడుగును నడుము దేహంబును దీర్ఘంబు
లంగంబు నరములుఁబొంగియుండుఁ
గొండె మెప్పుడు వినుఁ గోపించుఁబలుమారు
నొకపాటి వెచ్చనై యురడు మేను
దట్టమైయుండుఁ గండర్ప నింటికిఁగప్పు
బొడుకు ముంగిటఁజాల నొదిగియుండు
గావిగానికి సరిగాఁబట్టి చూవాడు
నంగజ జలములు నారతావి
యరుణ కుసుమాంబరంబులు కాసజేయు
మెసఁగు నొకపాటి ఘనముగాఁగొసరి కొసరి
తలుచు పదనిచ్చు నఖములు దనివినొంచు
సురతవేళల శంఖిని సొంపు మిగిలి

పద్మిని నారాయణదేవుని మదనకళాభిరామము

క్రొవ్వాడు చనుఁగవ నవ్వుమారెడుఁబండ్లు
కడు నెఱ్ఱనై యుండు వేడదఁకేసులు
తిలపుష్ప సౌభాగ్య మేలవడు నాసంబు
కలహంస వోలిక గలుగు నడపు
అరవిరి కెందమ్మిమరయును మరునిల్లు
కువలయ రుచిమించు క్రొత్తమెరుపు.
చెలువంబుఁగల మేనుఁజిత్తజ జలమును
గమలగంధము గల్గి యమరు, సిగ్గు
గలిగి యొప్పెడు గతిగలికలను జెలఁగు
వెల్లఁజీరలుఁ దెల్లని విరులుఁగోరు
కడుపుకొని పేద (బేజ), విప్రులగురుల సురల
సరవితోఁగొల్చుఁ బద్మినీజాతి నాతి

ఆలంతులు నారాయణదేవుని మదనకళాభిరామము

తలకొని యంగుటంబును బదంబును గుత్తియు జానువుల్ విని
ర్మల జఘనంబు నాభియు నురంబుఁ గుచంబును బాహుమూలముల్
గళమును జెక్కు మోవియును గన్నులికంబుఁ దిరంబు నెక్కుడాం
తల వలదిక్కు వెన్నెలను దర్పకుఁ డివ్వల డిగ్గుఁ జీకటిన్ –5

ఇట్లు పెదపాటి జగన్నాథకవి ప్రబంధరత్నాకరము తృతీయాశ్వాసమునందు నారాయణదేవుని కళాభిరామము ఉరపు మదనకళాభిరామములోని పద్యములు అయిదు కలవు. కనుక మదనకళాభిరామము ఉరపు కళాభిరామము కామశాస్త్రము.

(ఇంకా ఉంది)

నిప్పంటుకుంది

డా॥ సి. నారాయణరెడ్డి

నిప్పంటుకుంది
మౌనంలాంటి మంచులో
మగతతో లాలూచీపడ్డ
మనిషి వెన్నెముకలో.
బద్దలయ్యింది గొంతు
నిద్దర్లేచిన అగ్నిపర్వతంలా.
నరాలు బిగించుకున్న తీగల్లో
జ్వాలా స్వరమేళ.
కరిగిపోయిన నక్షత్రాలు
రాలుతున్నాయి బొట్లుబొట్లుగా.
ఒంటిమీద రాలిన ఒక్కొక్క చుక్క
ఓ రాగ పతాక.
గుండె చేసింది జెండా వందనం.

చెమట చుక్కలు బారులు తీర్చాయి
జెండానీడలో బాలబాలికల్లా.
రగులుతూనే వుంది నిప్పు
రక్తాన్ని శిల్పాల్లా చెక్కుకుంటూ.
ఈ నిప్పు కాల్చేది కాదు
మార్చేది.
మార్పు నిప్పు
మార్పును నినదించేదే మాటనిప్పు
చీకటి కటకటాలను చీల్చే
తొలిపొద్దు నిప్పు.
కాలాన్ని దూసుకుపోయే కనుగుడ్డు నిప్పు.
ఆ నిప్పే అంటుకుంది
మౌనంలో మనిషిలో
మనిషికి మగత ఎక్కించే ప్రకృతిలో.

శ్రీ ముదిగొండ ఈశ్వర చరణ్

మినీకవిత

సమాజం - సాహిత్యం. ఒకటి ఆధారం. మరొకటి ఆధేయం! సమాజం మారుతుంది. సమాజంతోటే సాహిత్యమూ మారుతుంది.

ఒకప్పుడు లక్షలకు పైగా శ్లోకాలుకల ఇతిహాసాలు-పురాణాలు వ్రాసేవారు. వాటిని మక్కువతో చదివేవారు. కాని, నాగరికత బలసినకొద్దీ మనిషికి తీరకలేమితనం ఎక్కువైంది. లక్షలు క్రమంగా వేలకు, ఆ తర్వాత నూర్లకు దిగజారి చివరికినాటికి అక్షరాలు లెక్కపెట్టుకొనే మినీకవితగా రూపొందింది.

నిజమాలోచిస్తే అసలు కవిత్వమే మినీ కవిత్వంతో ప్రారంభమైంది. నడుమ విశాలమై తిరిగి యథాస్థితికి వచ్చింది. చరిత్ర పునరావృత్తమౌతుందని నిరూపించింది.

భావం లావా లాంటిది. అన్ని అడ్డంకులు అధిగమించి ఎగదన్నుకొని వస్తుంది. ఆ తీవ్రతలో భాష తడబడుతుంది. మాటలు కరువౌతాయి. ఆ సమయంలో వెలువడేవి ఒకటి రెండు మాటలే అయినా తీవ్రంగా, బలంగా బాంబుల్లా పేలుతాయి

ఆనాడు తమసాతీరంలో సరిగ్గా ఇదే జరిగింది. ఒక గువ్వ ఆర్తనాదం విని వికలుడైన ఒక మనస్వి నోట వెలువడ్డ వాక్కు శాపమై, బాణమై కిరాతకత్వాన్ని రూపుమాపి కవితకు కల సామాజిక బాధ్యతను చూపించింది. అదే తొలి కవిత. అదే మన తొలి మినీకవిత.

అది మొదలుగా మినీకవిత మెనీ రూపాలతో సాక్షాత్కరిస్తున్నది. సప్తశతిగాథలు, చాటుశ్లోకాలు, ప్రాస్తావిక పద్యాలు, వేమన్న ఆటవెలదులు, చౌడప్ప కందాలు, తెలుగు సాహిత్య చరిత్రకే వన్నె తెచ్చిన శతకాలు ఈ కోవకే చెందుతాయి.

పారిశ్రామికీకరణం, మార్క్సిజం జీవిత విధానాన్ని, సామాజిక వ్యవస్థను, రాజకీయ ఆర్థిక సిద్ధాంతాలను ఊచముట్టుగా కదలించి ఆలోచనలను, ఆచారాలను అలవాట్లను గణనీయంగా మార్చివేశాయి.

ఈ మార్పులు సాహిత్యరంగాన్ని కూడా ప్రభావితం చేశాయి. కొత్తకొత్త వాదాలు, కొత్త కొత్త ప్రక్రియలు వచ్చాయి.

ఆనాడు కవిత్వమంటే 'ఆద్యసత్కథ'. రాణివాసపు ప్రేమ పురాణాలు, రాచరికపు ముట్టడులు వస్తువులై రాణించాయి.

ఈనాటికవి - విరిగిపోయిన అగ్గిపుల్లలను, అరిగిపోయిన సబ్బుబిళ్ళను స్వీకరించి ధర్మజలానికి ఘర్మజలానికి ఖరీదు కట్టడంలో తానుకూడా పాత్ర వహించాడు.

భావం భాషను వెతుక్కుంటుంది. భాష రూపాన్ని అన్వేషిస్తుంది. ఫలితంగా కవిత్వం ఛందోపరిష్వంగాలను, వ్యాకరణ సూత్రాలను, గణ యతి ప్రాసలను త్రోసిరాజని బజారున పడ్డది. స్వచ్ఛమైన నీటికి రంగు, రుచి, వాసన లేవు. అచ్చమైన కవితకు నిష్ఠతా, నియమాలు, నిబంధనలూ లేవు. రూపం ఏదైనా కావచ్చు. అది విషయానికి అతి సన్నిహితంగా ఉండాలి. ఎవరి నుద్దేశించి చెబుతున్నామో ఆ పాఠకుడి మీద బలమైన ముద్ర వేయగలిగి ఉండాలి. ఈనాటి మినీకవితకు ఇది అక్షరాలా అన్వయిస్తున్న ఏకైక సూత్రం. అందుకే ఇది మినీకవితా యుగమంటున్నారు సాహిత్యకారులు.

మినీ కవిత ప్రకృతి ఒడిలో తమసాతీరంలో పుట్టిన అడవిపిల్ల, గుండెనిండుగా ఆవేశం-ఆనందం-ఆవేదన-ఏదైనా కలిగినప్పుడు నయాగరా జలపాతంలా, వరద గోదావరిలా నింగినుండి నేలకు దూకి పరుగెత్తడమే దాని సహజలక్షణం. దానిని నిర్వచించడం నిబంధించడం ఆకాశపుదారులంట స్వేచ్ఛగా ఎగిరే గువ్వను పట్టి పంజరంలో బంధించడం. అయినా ఏ కొత్త విషయాన్ని గమనించినా దాని స్వరూప స్వభావాలను విశ్లేషించడం, నిర్ణయించడం మానవునికి పుట్టుకతో వచ్చిన గుణం. అందుకే ఆధునిక కవిత్వానికి నిర్దిష్ట లక్షణాలు లేవంటూనే, మరోవంక అత్యంత ఆధునికమైన మినీకవితకు లక్షణాలను వెదకడం ప్రారంభమైంది.

సున్నితమైన హాస్యం, తీవ్రమైన వ్యంగ్యం, కొద్ది మాటల్లో కొండంత భావం, అభియుక్తిలో వైదగ్ధ్యం, అభియుక్తిలో వైవిధ్యం, సమాజంపట్ల నిశితమైన పరిశీలన ఈ ఆరూ-మినీ కవితకు ఆరు ప్రాణాలు. ఏది చెప్పినా తుపాకీతూటాలా గుండెను తొలుచుకొని పోవడం మినీకవితకు ప్రత్యేకం.

"మనీకవితల - స్టీరియో అట్టహాసాలలో
మూగవోయిన గుణ - శాలీనుల
సేదతీరిచే - మోనోసుగాలు) - మినీకవిత" అని

నిర్వచించాడు ఈ వ్యాసకర్త. శబ్దాలంకారాల అట్టహాసాలు, అర్థా

అలంకారాల చమత్కారాలు అక్కరలేదు మినీ కవితకు, సుగాత్రిలా సహజ సుందరంగా భావావేశాన్ని కల్పించగలిగితే - అదీ అసలైన మినీ కవిత !

మినీ కవితలో హాస్యముంటుంది. తీవ్రమైన వ్యంగ్యముంటుంది. తమిళ బాలకుమారన్ కవిత ఇందుకు ఉదాహరణం.

"పత్రికలలో పడినవార్త - దేశంలో వస్త్రోత్పత్తి ఈ ఏడు రెండింతలైంది - ప్రజలకోసం కాదు - పార్టీ జండాలకోసం !"

మొదటి మూడులైన్లు ఏ పత్రికలోంచైనా! ఎత్తి వ్రాసుకోవచ్చు. కాని వాటిని క్రింది రెండు పంక్తులతో కలిపి చదివితే, అర్థం చేసుకోగలిగితే ఎన్నిగుండెలు మండుతాయో, ఎన్నిహృదయాలు మూగ పోతాయో? కవి కలంకారీ తనమంతా చివరి లైనులో ఉంది; కనీసం "పార్టీల జండాలకోసం" కూడా కాదట. కేవలం "పార్టీజండాల" కోసమట. వచనాల ఈ ప్రయోగ వైశిష్ట్యమే ఆ కవితకు ప్రాణం. ఇందులోని వ్యంగ్యం, హాస్యం అనుభవించలేకపోతే మనదుస్థితికి మనమే జాలి పడాలి,

"కింకవేస్తేన కావ్యేన - కిం కాండేన ధనుష్మతః
పరస్య హృదయేలగ్నం - నఘూనయతి యచ్ఛిరః

పరుని హృదయంలో లగ్నంకాకపోతే, శిరస్సును చలింపచేయ లేకపోతే అది కవిత్వమూ కాదు. అది బాణమూ కాదు అంటున్నాడు ఈ చాటు కవి.

తక్కిన కవిత్వం సంగతి ఎలా ఉన్నా అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని పొసగించవలసినది మినీకవిత. మినీకవితను హ్రస్వకవిత అన్నారు కొందరు పండితులు. నిజమేకాని ఆ హ్రస్వ పదరాశిదేకాని భావవాసిది కాదు.మరికొందరు సౌదామినీకవిత అన్నారు. కొద్దిగా తెలుగు చేసుకొంటే మెరుపు కవిత అవుతుంది. అది మెరుస్తుంది. కళ్లు జిగేలుమంటాయి. అది ఉరుముతుంది. గుండె ఝల్లుమంటుంది.

జె. పి. మరణించాడు. ఎన్ని ఎలిజీలైనా వ్రాయవచ్చు. కాని కవి కాళోజి కేవలం అక్షరాలా పదిహేడక్షరాలలో ఈ లోకంలోని బాధనంతా వెలిగక్కాడు.

"చావునీది - పుట్టుక నీది
బతుకంతా దేశానిది

వాడితనం - పనివాడితనం ఉన్నరచన యిది. ఆ ఆవేదనను అనుభవించగలవాడు వ్రాసుకోవచ్చు ఎన్ని వ్యాఖ్యానాలైనా?

మినీకవితకు అభియుక్తికన్నా అభివ్యక్తిముఖ్యం. అభివ్యక్తికి ప్రాణం వక్రోక్తి. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చింది. కాని ఇంకా ఎన్నో బానిసత్వాలు పట్టి పీడిస్తూనే ఉన్నాయి. ఈ దృశ్యాన్నే రెండే రెండు వాక్యాలలో విశ్వరూపమంత చిత్రం వేశాడు మరో తమిళ సోదరుడు బాలస్వామి.

"రాత్రివేళ వచ్చింది - ఇంకా తెల్లారనే లేదు!" కవి చెప్ప వలసింది, చెప్పగలిగింది చెప్పాడు. ఆలోచించడమా, మనకెందుకులే అని నిదురపోవడమా పాఠకుడి బాధ్యత.

మినీకవి జీవితాన్ని చాలా దగ్గరనుండి చూడాలి. చూడటమే కాక ఆత్మీయంగా అనుభవించాలి. ఈ సృష్టిలో ఎనుబదినాలుగు లక్షల జీవ రాసులున్నవట. అన్నింటిలోకి మానవకీటం మహోన్నతమైనదట. మరి అలాంటి మానవుడు పుట్టిన నాడినుండీ చచ్చేవరకూ ఆశయాలతో - ఆదర్శాలతో అనుక్షణం పోరాడి అలసి సొలసి బ్రతికిచచ్చి, చచ్చి బ్రతుకుతున్నాడు. అయితే నిజంగా అతడు బ్రతికిందెన్నాళ్ళు?

"నేను చచ్చి పోతానని
కదూ - నీ బాధ
పిచ్చివాడా!
ఈ వ్యవస్థలో
బ్రతికింది
తొమ్మిది మాసాలే!" అంటున్నాడు?

నిజమే! తల్లికడుపులో ఉన్న ఆ తొమ్మిది మాసాలే కడుపులో చల్ల కదలకుండా ఉన్నది.

జీవితసత్యాలను అనూహ్యంగా అత్యంత ప్రతిభావంతంగా మలచి చెప్పడం మినీకవిత. మృత్యువు మనవెంట నీడలా వెన్నంటు తూనే ఉంటుంది. ఇది పచ్చినిజం. ఆసురాజేంద్ర ఈ నిజాన్నే చమ త్కారంగా చెప్పాడు.

"మృత్యువు - నా ముంగిలి ముందునిలుచొని
ఓరగా చూస్తున్నది - నేనెప్పుడు తలుపులు
తీస్తానని — నేను తలుపు తీశాను-
అదిలోపలికి - నేను బయటకు!"

ప్రపంచం పుట్టినప్పటినుండీ అన్యాయాలు - అక్రమాలు - అధిపత్యాలు ఉంటూనే ఉన్నవి. "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" అని ఎందరు మహానుభావులు పుట్టినా-గిట్టినా ప్రపంచం మారలేదు. సరికదా పులిపోతే భూతం పట్టినట్లు ఒక దురాచారంపోతే అంతకన్నా మరో ఘోరాచారం మొదలౌతున్నది. "మరో అంచున-"

అయినా రామగిరి శివకుమార్ ఎన్నిసార్లు "సారీ"లు చెప్పుకొన్నా లోకముందైనా మారుతుందో? లేదో?

"మతాలు మసి అయి పోయాయి
సారీ! పార్టీలున్నాయి,
యుద్ధాలు నిద్దుర పొయ్యాయి
వెరీసారీ! ఆందోళనలున్నాయి.
ముప్పైమూడుకోట్ల దేవతలు మూలపడ్డారు
క్షమించాలి! ప్రత్యక్షదేవుళ్ళే పుట్టుకొచ్చారు.
బాల్య వివాహాలు రద్దయ్యాయి
మాఫ్‌కరో! మానభంగాలున్నాయి.
స్త్రీలు నిన్నటికంటే సేదు ముందున్నారు
స్ట్రికెట్ ప్లీజ్! పురుషుడు 'రేపు'లనే
నేడుగా వాడు కొంటున్నాడు!"

ఇదంతా నిజమే! కాని ఒకచిన్న ప్రశ్న మిగిలిపోయింది, కవిగా కవి బాధ్యత ఏమిటి? శోభను తెలియచేయడమేనా? క్షాళనం చేయ నక్కరలేదా! దైన్యాన్ని నిరూపించడమేనా? ధైర్యాన్ని రంగరించ నక్కరలేదా? "ఇదీ సమస్య" అని చెప్పడానికి కవియే కానక్కర లేదు. ఏ రాజకీయ నాయకుడైనా చేసే పని అదే!" ఇదే పరిష్కారం" అని మేధావి చెప్పగలగాలి, కవిచూపగలగాలి. మళ్ళీ ఉదయిస్తానవే సూర్యుడ స్తమిస్తున్నాడని, ఈ చీకట్లుతొలగి తిరిగి వెలుతురు కమ్ము కొంటుందని చెప్పాలి. మనిషి జీవితానికి ఆశపట్టు కొమ్మ. ఆ ఆశలను కలిగించలేని కవి ఆత్మహత్యలను ప్రోత్సహిస్తున్నాడు. ఈ సత్యాన్ని గుర్తించిన కనపర్తి రామచంద్రాచారి —

"చీకటి వ్యవస్థకు పెట్టిన
చివరిపులి స్టాపులా

వేగుచుక్క పొడుస్తున్నది" అంటూ బంగారు భవిష్యత్తును చూస్తున్నాడు. చూపిస్తున్నాడు.

ఏది వ్రాసినా అది గద్యమో, పద్యమో, గద్యపద్యమో, పద్యగద్యమో అయితీరుతుంది. అందులో సందేహంలేదు. కాదంటే లక్షణసారాలను వెతుక్కొమ్మని దబాయించవచ్చు. కాని కవికి తాను వ్రాసేదానిని గూర్చిన సరియైన అవగాహన ఉండాలి. ఇక్కడ ఏ లక్షణాలు, ఏ సారాలు, ఏ దబాయింపులు పనికిరావు. అవగాహన లేని రచన అపార్థాలకు కాక అనర్థాలకు దారి తీస్తుంది. జె. తిరుమల రావుగారి ఈ మినీకవితను పరిశీలించండి. వ్రాయకముందు ఆయన ఏమనుకున్నాడో తీరా వ్రాశాక అదెలా తయారయిందో ఆలోచనా శీలికి ఆవేదన కలిగిస్తున్నది. నాతిని చేయపోతే కోతి తయారయింది.

"ఆకాశం చుక్కల - రవికనువిచి
వెన్నెల బ్రాహుక్కు - చంద్రుణ్ణి పీకి
నీలం లంగా - నలుపోణీ లాగిపారేస్తే
గాని రేపు కాదు!"

వింటే సొంపుగా ఉంది. ఆలోచిస్తేనే కంపు! ఆయన 'రేపు' ను ఆహ్వానిస్తున్నాడు. ఆ 'రేపు' తెలుగుదైతే అందరికీ ఆనందమే.

చుట్టూ ముసిరిన చీకటితొలగాలని. తిరిగి వెలుతురు రావాలని కోరుకోనిదెవరు? కాని ఆయన తెలుగు 'రేపు'లో ఇంగ్లీషు 'రేపు' ను కూడా కలిపాడు. అంటే 'రేపు' లకు వలెనే 'రేప్' లను కూడా ఆయన ఆహ్వానిస్తున్నాడా? ఏ సామాజిక స్పృహ, ఏ మార్క్సు వాదము సమర్థించలేని ఈ అనర్థం కవికి లోపించిన అవగాహనా ఫలితం నాడు కాని నేడు కాని వాగర్థాల సమ్యక్ సమన్వయమే కవిత్వం! అదే కూరుస్తుంది ప్రజాహితం.

మినీ కవిత అంటే చాలా ఈజీగా వ్రాయగలమన్న చులకన భావం ఏర్పడుతున్నది. సమాజానికి సాహిత్యానికి ప్రమాదం కొని తెస్తుంది.

మినీకవిత అంటే ఎకానమీ ఆఫ్ వర్డ్స్ ఎండ్ ఎక్సప్లోషన్ ఆఫ్ థాట్స్ ఆ ఎక్స్‌ప్లోషన్ హిరోషిమాను ధ్వంసం చేయవచ్చు. మరు భూములను సస్యశ్యామలం చేయవచ్చు. ఏదైనా మన చేతుల్లో ఉంది.

"పురాణ మిత్యేవ నసాధుసర్వం
నచాపి కావ్యం నవమిత్యవద్యమ్
సన్తః పరీక్ష్యాన్యతరద్భజన్తే
మూఢః పరప్రత్యయనేయ బుద్ధిః

(మార్చి 1984, నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయబడ్డ ఏ. పి. ఓరియంటల్ కాన్ఫరెన్సులో సమర్పించిన ప్రసంగ వ్యాసం.)



(గత సంచిక తరువాయి)

రామాచారి భార్య పొట్టిగా వలంగా ఉంది. ఆమె చేతులు గుండ్రంగా ఉన్నాయి. వాటికి నాలుగు జతల బంగారు గాజులున్నాయి. ఒక గాజుల జతలో అక్కడక్కడ ఖరీదైన రాళ్లు మెరుస్తున్నాయి. ఆమె మెడలో పొళ్ల నెక్లెసు ఉంది. ముక్కు పుడకలో వజ్రం మెరుస్తున్నది. ఆమె తెల్లగా ఉంది. కంచిపట్టుచీర, రెండు వేల రూపాయల ఖరీదు చేసేది కట్టుకుంది. ఆవిడ పుట్టింటి వాళ్లు చాల సంపన్నులు. రామాచారికి ఏభై వేల రూపాయలు కట్నమిచ్చి మద్రాసులో చాల వైభవంగా పెళ్లిచేశారు. ఆ పెళ్లికి మినిస్టర్లు కూడా వచ్చారు.

సరస్వతి ఆలోచించింది. తనతో అతనా రాత్రి పారిపోతే ఇవేవి జరగవు కదా! రామాచారి ఆ విషయమే తనకు వ్యక్తం చేస్తున్నట్లని పించింది. తనను కనీసం సక్రమంగా పలకరించలేదు. భార్యావిధేయుడై బరువుగా వున్న కూతుర్ని ఎత్తుకొని తన్మయత్వంతోనే కాలం గడిపాడు. ఇటువంటి వాడిని పెళ్లాడితే తనవంటి దురదృష్టవంతురాలి జీవితం ఎలా గడిచేదో!

మనోహర్ చాలా గొప్పగా వ్యవహరించాడు - స్టాఫ్‌కి హార్దిక స్వాగతం చెప్పాడు. చక్కని ఉపన్యాసం ఇచ్చాడు. కడుపునిండా తిని, పని సంగతి ఈరోజు మరచిపోమన్నాడు. తరువాత వెంకటాయుడుతో కలిసి వంటల దగ్గిరికి వెళ్ళిపోయాడు. అతని భార్య రాజకుమారికి అతిశయం ఉండటం సహజమే. జమీందారీ సంతతిలో పుట్టిన వారందరూ తన భృత్యులే అన్న భావంతో ఆమె సంచరించింది. రామాచారి భార్య ఇంగ్లీషులో ఆమెను విసిగిస్తుంటే, వెంటబడుతుంటే చీపురుపుల్లను పక్కకు నెట్టినట్లు ఆమెను తోసిపుచ్చింది. ఆమె కొడుకుని భూమిమీద దింపకుండా ఇద్దరు ఆయాలు వచ్చారు. అందరికి నేలను జంబుఖానాలు పరుచుతే ఆఫీసర్ల పెళ్ళాలకి గార్డెన్ చెయిర్సు వేశారు. పిక్‌నిక్ కేవలం పాలకులకు పనివాళ్ళకు కల భేదం వ్యక్తం చేయడానికి ఏర్పాటయినట్లనిపించింది.

సరస్వతి నిలబడింది. ఈ తమాషాలో తనకూ భాగముందని ముందుకు నడిచింది.

17

రెండవ అంతస్తులో నున్న మీటింగ్ రూము బయట ఎర్రలైటు వెలుగుతున్నది, లోపల ఎమర్జన్సీ మీటింగ్ జరుగుతున్నది.

సత్యనారాయణ, మరొక అటెండెంటు కాఫీలు తెచ్చి ఆఫీసర్లకి ఇచ్చారు. లోపల మేనేజింగ్ డైరెక్టరు మనోహర్, ఛీఫ్ ఆర్కిటెక్ట్ రవీంద్ర, ఛీఫ్ ఎకౌంట్సు ఆఫీసరు రామాచారి, పెర్సనలు ఆఫీసరు కిషన్, స్టోర్స్ ఆఫీసరు సుబ్బారావు ఉన్నారు.

"ఆఫీసరు క్వార్టర్సునీ, లేబరు కాలనీ- ఈ రెండూ మనం షిప్‌యార్డు వాళ్ళ నిర్మించడానికి కంట్రాక్టు తీసుకున్నాము. ఇరవై ఆఫీసర్ల బంగళాలు, ఆరువందల వర్కర్ల యూనిట్లు మనం కట్టవలసి ఉంది - ఆఫీసర్ల కాలనీ పూర్తి అయింది. చాల చక్కగా ఆ బంగళాలు ఉన్నాయని మంత్రిగారు మనను మెచ్చుకున్నారు. లేబరు కాలనీ కాంట్రాక్టు దొరకడానికి కూడా ఇదే కారణం.

ఆఫీసర్ల బంగళాలు ఒక్కొక్కటి లక్ష పాతికవేలకు బదులు లక్ష ఏభై వేల వరకు ఎగబాకాయి. అయిదు లక్షల రూపాయలు మనకు వాళ్ళవలన రావలసి ఉంది. ఆరువందల యూనిట్లలోను ఇప్పటికి వంద మాత్రం పూర్తి అయాయి. యూనిట్‌కి పాతికవేల

చొప్పున మనకు ఇరవై అయిదు లక్షల రూపాయలు రావాలి. అందులో అడ్వాన్సుగా ఇచ్చిన అయిదులక్షలే మనకు ముట్టాయి. మిగిలిన ఇరవై లక్షల రూపాయల బిల్లులు, ఆఫీసర్ల బంగాళాలకు అదనంగా ఖర్చు పెట్టిన అయిదు లక్షల రూపాయిల బిల్లులు తిరిగి వచ్చాయి.

మీరందరూ ఖర్చులు పెట్టడంలో కొంచెం జాగ్రత్త వహించి, చేయవలసిన పని సకాలంలో పూర్తి చేస్తారని నమ్ముతున్నాను. రవీంద్ర ఓవర్ టైము మొదలయినవి తగ్గించాలి. సుబ్బారావు స్టోరు సామానులు కొనడం కొన్నాళ్ళు మానివేయాలి, కిరణ్ స్టాఫ్ బిల్లులు ఓవర్ పేమెంటు లేకుండా చూడాలి.

మిగిలిన విషయాలు నేను రామాచారి మాట్లాడతాము. మన పరిస్థితుల గురించి ఏవంకీ తెలియకూడదు."

ఇంతవరకు చెప్పి మేనేజింగ్ డైరెక్టరు కూర్చున్నాడు. సుబ్బారావు, రవీంద్ర, కిరణ్ వెళ్ళిపోయారు.

"రామాచారి, ఈ బిల్లులు ఎవరు తిప్పి పంపించారు ?"

"అసిస్టెంటు యింజనీరు ఆర్ ఎస్ మూర్తి."

"మన సరస్వతి మొగుడు కాడా?"

"ముమ్మూర్తులా సరస్వతి మొగుడే!"

"ఇంత పొగరా వీడికి!"

"ఛీప్ ఇంజనీరుగారు ఈ మూర్తిమాటకు చాల విలువ యిస్తారు"

"పెద్దవారి అండ చూసుకొని ఏన్నాళ్ళు బతుకుతాడు? ఇతనిని బదిలీ చేయించే అవకాశాలున్నాయా?"

"ప్రయత్నించాను. ఇతనిని ఈ మధ్యనే ఈ కాలనీ పనికి బదిలీ చేశారు. అందుచేత మరొక సంవత్సరం వరకు అటువంటి బదిలీ అవకాశాలు లేవు."

"ఛీప్ యింజనీర్‌ని బదలీ చేయించగలమా!"

"ఈ ఛీప్ అంటే అందరికి చాల గౌరవం హిందూదేశంలో చాల కొద్దిమంది ఇతనితో సరిపోయే ఇంజనీర్లు ఉన్నారు."

"ఏంచేయడం - మన బాంక్‌లలో నిలువ కేవలం పది లక్షల మేరకు ఉంది. తొందరలో మనడబ్బు రాబట్టుకోకపోతే చాల ఇబ్బందులు పడవలసి వస్తుంది."

"అదే! ఒక చిన్న సలహా! మీరు సరస్వతితో మాట్లాడి ఈ బిల్లులు ఆమె ద్వారా పంపించండి. పెద్దగొడవ చేయక కార్యం సాధిస్తే గాని పెద్ద మొత్తాలురావు. మనం చేయవలసినదంతా మూర్తి లెవెలు లోనే చేయాలి."

మనోహర్ బెల్ నొక్కాడు.

"నారాయణ్! మన స్టోర్ గుమస్తా సరస్వతిని పిల్చుకునిరా!"

సత్యనారాయణ కాళ్ళు ఏగరేస్తూ వెళ్ళిపోయాడు. తరువాత రామాచారి కూడా వెళ్ళిపోయాడు.

సరస్వతి భయపడుతూ వచ్చింది; వెంకునాయుడు తనమీద ఫిర్యాదు చేశాడేమోనని అనుమానించింది,

కూర్చొండి! సరస్వతిగారూ! మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. సాయంకాలం నాతో మా పద్మకుంజం వరకు కారులో రావలసి ఉంది. మరోవిధంగా అనుకోకండి! ఇక్కడ ఆ విషయం మాట్లాడదగినది కాదు,"

"మీకు అభ్యంతరం లేకపోతే ఇప్పుడు చెప్పవచ్చుకదా!

"కారులో కూడా ఆ విషయం చెప్పరాంది. క్షమించి సాయంకాలం నాతో రండి"

సరస్వతికి మారు పలకడానికి అతను అవకాశమివ్వలేదు.

సాయంకాలం వరకు సరస్వతి మనసు ఆందోళనతో కొట్లాడింది. సరీగా ఆరుగంటలకు అందరు ఆఫీసర్లు వెళ్ళిపోయిన తర్వాత యండీగారి కారు బయలుధేరింది, వెనుకసీట్లో ఒక మూలకు మనోహర్ కూర్చున్నాడు. రెండవమూలకు సరస్వతి కూర్చుంది.

కారు 'పద్మకుంజ' చేరుకునేవరకు మనోహర్ ఏమాటలు ఆడలేదు. చాల సీరియస్‌గా ఆలోచిస్తూ కూర్చున్నాడు. మధ్య మధ్య ఒకసారి సరస్వతి ముఖంలోకి చూడటం తప్ప మరేవిధమైన ప్రస్తావన చేయలేదు.

'పద్మకుంజ' రీమోడలయి చాల అధునికంగా కనిపించింది సరస్వతికి. కింది గదులలో పెద్ద రాజావారి వీర విక్రమాలను తెలుపుచేసే ట్రోఫీ లేవీ విచ్చలవిడిగా పడిఉండలేదు. వెళ్ళగానే రిసెప్షన్ హాలు, దాని తరువాత లైబ్రరీ, ఒక పక్కను గెస్టు రూములు, రెండవవేపు కన్సల్టింగ్ రూము ఉన్నవి. అన్నిటికీ ఎయిర్‌కండిషనర్లు అమర్చారు. గోడలకు అక్కడక్కడ నిలువెత్తు తైలవర్ణచిత్రాలున్నాయి. లైబ్రరీలోమాత్రం రెండు పులిచర్మాలు, ఒక లేడిచర్మం. ఖడ్గాలు. డాలులు చాలచక్కగా గోడలకు వ్రేలాడగట్టినారు. ఖడ్గాలు, డాలులు పాలిష్‌చేయడం వల్ల మెరుస్తున్నవి.

మనోహర్ రెండవ అంతస్తు మీదనున్న తన గదిలోకి తీసుకొనిపోలేదు. గెస్టురూములు ఖాళీగా ఉన్నవి. ఒకదానిలోకి ఆమెను తీసుకొనిపోయి లోపల తలుపులు గడియ పెట్టాడు. సరస్వతికి గుండెలు కొట్టుకున్నవి. కాని మనోహర్ ముఖంలో ఏలను మానభంగం చేసే సూచన లేవీ కనిపించనందున స్థిమితపడింది. ఆ గదిలో ఒక టేబిలు

రెండు కుర్చీలు ఉన్నవి. ఫోమ్‌బెడ్‌మీద మనోహర్ కూర్చున్నాడు. సరస్వతి కుర్చీమీద కూర్చోమని చేయి చూపించాడు. ఫ్రిడ్జ్‌లోంచి రెండు డ్రింకులు తీసి కార్కులు విప్పి గ్లాసులో పోసి ఒకటి సరస్వతికి అందించి తానొకటి తీసుకున్నాడు.

"సరస్వతీ! మీ ముఖంలోకి చూస్తుంటే ఏదో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఏ విధంగా నాదగ్గిర మీకాభయంలేదు. నేను చాలా సూటిగా మాట్లాడవలసినవాడిని. ఈరోజు మధ్యాహ్నం ఎమర్జన్సీ మీటింగ్ ఒకటి జరిపాము. అప్పుడు చాల ముఖ్యమయిన విషయాలు బయటపడ్డవి. మనకు బాంకులలో పదిలక్షల కన్న హెచ్చుడబ్బులేదు. మనకు రావలసినవి చాల వున్నాయి. కాని వాటిలో షిప్‌యార్డు కాంట్రాక్టువల్ల రావలసినవి పాతికలక్షలు-అయిదులక్షలు ఆఫీసర్ల బంగళాలను కట్టినందుకు. ఇరవై లక్షలు లాబర్‌కాలనీ ఇళ్ళను పూర్తి చేసినందుకు వెంటనే మనకు రావలసి ఉన్నవి. మనకు ఈ డబ్బు తొందరలో చేరకపోతే ఇబ్బంది పడవలసి వస్తుంది.

"ఎందుకీ డబ్బు మనకు అందకుండా ఉందని చర్చచేశాము. దానిలో ఒక విషయం తెలిసింది. ఈ బిల్లుల నన్నీ ఒక అసిస్టెంటు ఇంజనీరు తిప్పిపంపుతున్నాడట. అతని పేరు సత్యమూర్తి."

మనోహర్ సంభాషణ ఒక్కసారిగా ఆపి సరస్వతి ముఖంలోకి చూశాడు.

ఆమె గతుక్కుమంది. ముఖంలో రక్తప్రసరణ ఆగిపోయి పాలినట్లు కనిపించింది. అంతవరకు కొంచెం కొంచెంగా త్రాగుతున్న డ్రింకులో మిగిలిన సగం భాగం ఒక్క గుక్కలోనే తాగి, గ్లాసు టేబిలుమీద పెట్టింది. తరువాత వానిటీబాగ్ లోంచి రుమాలు తీసుకొని ముఖం తుడుచుకొంది.

"అయామ్ సారీ! మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్లున్నాను" అన్నాడు మనోహర్ చాల మామూలుగా.

"లేదు. లేదు...." అంది సరస్వతి.

"అతను మీవారని కూడా నాకు తెలిసింది. ఇంతవరకూ నాకీ విషయం మీరు చెప్పలేదే!"

"అవును. అటువంటి అవకాశము రాలేదుకదా!"

"మీరు మరోవిధంగా అనుకోవద్దు! నన్ను ఇప్పటికైనా మీరు అర్థం చేసుకున్నారని తలుస్తాను. మనవాళ్ళను అభివృద్ధిలోకి తేవాలనే అభిప్రాయంతోనే ఈ సంస్థను స్థాపించాను. మీ భర్త క్వాలిఫయిడ్ ఇంజనీరని, ఏదో తక్కువ జీతంలో పని చేస్తున్నారని తెలిసి చాల విచారించాను. మన చీఫ్ ఆర్కిటెక్టును ఫారిన్ ట్రెయినింగ్‌కి పంపి, ఆ జాగాలో మీవారిని వేయాలని నిశ్చయానికి వచ్చాను. ఇది మన ఫామిలీ ఎఫెయిర్ కదా!

సరస్వతి మనోహర్ ముఖంలోకి చూచింది. ఏ జవాబు చెప్పలేకపోయింది. తన విషయం వేరు. తన బావ విషయం వేరు. సాధారణంగా అతను ఎవరి సలహాలు వినడు.

"బహుశా మీరు ఏ విధమైన నిర్ణయానికి రాలేకపోతున్నారు. మూడువేల రూపాయల నెల జీతం, కారు, మంచి బంగళా, ఇంకా పెర్క్స్ చాల ఉన్నవి. ఇది చాల కాన్ఫిడెన్షియల్‌గా ఉంచాలని మిమ్మల్ని ఇక్కడికి పిలిచి చెప్పాను. ఇక మీరు చేయవలసినది చాల చిన్నపని. మీ ఆయన సాధారణంగా రాత్రి ఎనిమిది దాటనిదే ఆఫీసునుండి కదలరు. మన కారు తీసుకోండి. ఇప్పుడింకా ఆరున్నరే అయింది. ఇవిగో మన బిల్లులు. బిల్లులు పాసయేలోగా శ్రీ సత్యమూర్తికి చీఫ్ ఆర్కిటెక్ట్‌గా ఉద్యోగం ఇస్తూ ఆర్డర్లను పంపుతాము".

మనోహర్ బ్రీఫ్‌కేసులోంచి రెండు ఫైళ్ళు తీసి సరస్వతికి ఇచ్చాడు.

"మీరు వచ్చేవరకు వెయిట్ చేస్తూ ఉంటాను. టేక్ యువర్ ఓన్ టైమ్! మరేం తొందర లేదు. ఇది మన యింటి వ్యవహారం".

సరస్వతి 'పద్మకుంజ'కు తిరిగి వచ్చేసరికి తొమ్మిది గంటలయింది. అప్పటికి మనోహర్ స్నానం అది ముగించి, పైజమా తొడుక్కొని కల్లీ లాల్చీ వేసుకున్నాడు. మనిషి చాల అందమయినవాడు. ఆరోగ్యం గురించి చాల శ్రద్ధ తీసుకుంటాడు. స్నానం అయిన తరువాత కడిగిన ముత్యంలా తళతళలాడుతున్నాడు.

తిరిగి ఇద్దరు గెస్టు రూములోకి వెళ్ళారు. తిరిగి మనోహర్ లోపల గడియ పెట్టాడు.

సరస్వతి రెండు ఫైళ్లు అతనికి ఇచ్చింది.

"నేను చాలసేపు సత్యమూర్తిగారితో చర్చించాను. చాలా శ్రమపడిన తరువాత ఒక పేమెంటు విషయంలో అతను అంగీకరించారు. ఆఫీసర్ల బంగళాల నిర్మాణంలో మనకు రావలసిన ఐదు లక్షల రూపాయల బిల్లును పాసు చేయిస్తానన్నారు. బంగళాలను కట్టడంలో ఎస్టిమేటుకి మించిన వ్యయమయినా, సమర్థనీయమని ఆయన అన్నారు. నిర్వివాదంగా చాల మంచిపని చేయించినందుకు ఆయన మిమ్మల్ని అభినందించారు".

"చాల థ్యాంక్స్!"

"తరువాత - లాబర్ కాలనీ గురించి - ఆయన ఏ విధంగా బిల్లులను పాస్ చేయడానికి అంగీకరించలేదు. ఆరువందల యూనిట్ల

లోను ఒక్క వంద మాత్రమే ఇప్పటికి నిర్మించాము. వాటిలో ఒకటి కూడా సరిగా తయారుకాలేదు. గోడలు పెద్ద పగుళ్ళు చూపెడుతున్నాయి. ప్లాస్టరింగ్ ఊడిపోతున్నది. అన్నిటికన్న ముఖ్యమయినది పునాదిలోకి నీరు చేరుతున్నది. అందుచేత వాటిని పూర్తిగా మరమ్మత్తు చేసి అప్పచెప్పేవరకు పేమెంటు ఉండదన్నారు".

"మీ ఆయన చాల పట్టుదల గల మనిషిలా ఉన్నారే!"

సరస్వతి ఏమీ జవాబు చెప్పలేదు. కొంచెంసేపు ఆలోచిస్తూ అతని ముఖంలోకి చూస్తూ కూర్చుంది.


సరస్వతి లేచింది వెళ్ళిపోవడానికి.

మనోహర్ ఆమె వేపే చూస్తున్నాడు శ్రద్ధగా.

"మనోహర్! అయామ్ వెరీసారీ! నేను ఏవిధంగా సహాయం చేయలేకపోయాను. క్షమించండి!"

మీరు ప్రతివిషయం సీరియస్‌గా తీసుకోకూడదు. పని సాధించడానికి చాల మార్గాలున్నాయి. మరేం వర్రీ అవకండి."

ఇంకే మార్గాలున్నాయో సరస్వతికి తెలియలేదు.



"మరొక్క ముఖ్యవిషయం. ఇది మీకు చెప్పవచ్చా, చెప్పకూడదా అని సందేహించాను. ఇది మన సంస్థకు చెందిన సమస్య. కాబట్టి నేను ఈ రహస్యాన్ని గుండెలలో దాచుకోలేను. మిగిలిన అయిదు వందల యూనిట్లకు మన కంట్రాక్టును రద్దుచేయడానికి ఛీఫ్ ఇంజనీరుకు రాస్తానని అన్నారు. మనం కొంచెం శ్రద్ధ తీసుకొని ఈ వంద యూనిట్లు బాగుచేస్తే, పరిస్థితులలో మార్పు రావచ్చునేమో."

"మీ సిన్సియారిటీకి చాల సంతోషిస్తున్నాను. తప్పకుండా ఆ ప్రయత్నమే చేద్దాం."

వెలుపల కారుడ్రైవరు ఆమెకోసం వేచి యున్నాడు.

ముందు సరస్వతి. వెనుక మనోహర్ బయటికివచ్చారు.

"అమ్మగారూ! రండి ఇంటి దగ్గిర దింపివెళ్ళిపొమ్మని దొరగారు చెప్పారు.' అన్నాడు డ్రైవరు.

"వద్దండీ! కారు గారేజిలో పెట్టి వెళ్ళిపొండి. ఇప్పుడింకా తొమ్మిదిన్నరే అయింది. జంక్షన్‌లో ఆటోరిక్షాలున్నాయి. మరేమీ ఇబ్బంది ఉండదు.

సరస్వతి తొందరగా గేటువేపు అడుగులు వేసింది.

మనోహర్ పెదవులమీద చిరునవ్వుతొలిచింది. తలపంకించి అతను లోపలికి వెళ్ళిపోయాడు. లైబ్రరీలో కూర్చొని బెల్ నొక్కాడు. వెంటనే తెల్లటి దుస్తులలోనున్న బేరరొకడు వచ్చాడు.

"స్కాచ్ అన్‌రాక్స్"

వాడు వెళ్ళి చాలతొందరగా బాటిలు, రెండు గ్లాసులు, చిన్న బల్లనొకదాన్ని ముందుకులాగి, దానిమీద పెట్టి వెళ్ళిపోయాడు.

ఆ గోల్డెన్ లిక్విడ్ గ్లాసులోపోసి, చప్పరిస్తూ, ఆలోచనలో మునిగిపోయాడు మేనేజింగ్ డైరెక్టరు.

18

రోజ్‌కి కొన్ని సంగతులు అర్థంకావడంలేదు.

పదకొండుగంటల ప్రాంతంలో అర్జెంటు లెటరు ఒకటి టైపు చేసి రాజకుమార్‌గారి సంతకానికి తీసుకొనిపోయింది. పైన ఎర్రలైటు వెలుగుతున్నది. కాని అత్యవసర పరిస్థితులలో తను లోపలికి వెళ్ళడానికి అభ్యంతరముండదు.

తలుపు తెరచుకొని లోనికి ప్రవేశించింది. రాజకుమార్‌వేపు చూచింది. ఆయన చాలశ్రద్ధతో నారాయణ్ చెప్పుతున్నమాటలు వింటున్నాడు. తనను వెళ్ళిపోమని చెప్పలేదు. అందుచేత టేబిలు వరకు నడిచి, లెటరు చేతితో పట్టుకొని నిలబడింది.

"సార్! ఈ సరస్వతి కున్న పొగరు ఎవరికి లేదు సార్."

తాను గతుక్కుమంది. రాజకుమార్ మాత్రం చాల పొలైటుగా నవ్వుతూ ఆ కుంటివాడి మాటలకు చెవులప్పగించి వింటున్నాడు.

"ఇది మరెవరూ కాదు సార్. మాబావకూతురు అంటే మా అక్క సవతి కూతురు – దీనితో నాకు పెళ్ళి జరపడానికి అన్నీ నిశ్చయమయాయి. కాని, నేనే దీని తల బిరుసుతనానికి ఇష్టపడక పెళ్ళికి ఒప్పుకోలేదు."

"ఇన్నాళ్ళు ఈ విషయం చెప్పలేదేం?" పెద్దబాస్ ప్రశ్నించారు.

"ఇది స్వంత విషయంకదా, తమతో చెప్తేబాగుండదు.

"అవునవును."

అప్పుడు రాజకుమార్ తలెత్తి తనవేపుచూసి ఉత్తరం తీసుకొని, చదివి, సంతకం చేశాడు.

మళ్ళా తను పన్నెండు గంటలకి రాజకుమార్ ఛాంబరువేపే వెళ్ళవలసి వచ్చింది. ఛాంబరు తలుపులు తీసుకొని వెంకునాయుడు వచ్చాడు. వాడు కోపంతో పళ్ళు కొరుకుతున్నాడు ఎడమ అరచేతిలో కుడి పిడికిలితో కొడుతూ, 'సరస్వతి ! ఈ సరస్వతి అంతు నేను కనుక్కుంటాను.' అంటూ కోపంతో నడిచిపోయాడు.

మధ్యాహ్నం టిఫిన్‌రూములో సరస్వతి కలిస్తే ఈ విషయాలు చెప్పి కొంచెం జాగ్రత్త పడమని చెప్పాలనుకుంది. కాని ఆ మధ్యాహ్నం సరస్వతి టిఫిన్ రూమ్‌కే రాలేదు.

లంచ్‌అవర్‌లో జరిగిన సంగతి రోజ్‌కి గాని, సరస్వతికి గాని తెలియదు. ఒంటిగంటవేళ రాజకుమార్ ఒక్కడూ ఛాంబరులో నున్నప్పుడు రామాచారి లోపలికి వచ్చాడు.

"మనోహర్! ఈ లవ్‌లెటర్సు చూడు! పెళ్ళి అవగానే పెట్టినుండి తీసి ఆఫీసులోకాన్ఫిడెన్షల్ అల్మిరాలో సీక్రెట్ డ్రాయర్‌లో దాచాను వీటిని. ఇవాళ కాగితాలన్నీ తీసి చూస్తుంటే ఇవి కళ్ళపడ్డవి. నీతిమంతులు మాటాడటం చేస్తారు. కాని నేతి బీరకాయలోని నేయివలె వీళ్ళలో నీతికూడా ఉండదు. మామూలుగా రెండు బిల్లులు పాసు చేయించడానికి కావలసినన్ని ధర్మసూత్రాలు చెప్పిన మనిషి పూర్వచరిత్రకివి సాక్ష్యాలు.

రాజకుమార్ రామాచారి ముఖంలోకి చూచాడు. ఆ ఉత్తరాలు అందుకుంటూ.

"ఇవి చదవచ్చా!"

"అందుకే కదా ఇచ్చాను."

రామాచారి వెళ్ళిపోయాడు. మేనేజింగ్ డైరక్టరు ఛాంబరు రెడ్ లైట్ రెండుగంటలవరకు వెలుగుతున్నది. రెండుగంటలు కొట్టగానే కారులో వెళ్ళిపోయాడు రాజకుమార్.అతను మధ్యాహ్నం లంచికూడా తీసుకోలేదు. ఆఫీసులో వాళ్ళకు చాలా ఆశ్చర్యం వేసింది. దొరగారి ప్రవర్తన పట్ల.

ఆ మధ్యాహ్నం సరస్వతి టిఫిన్ రూముకు వెళ్ళలేదు. స్టోరులోనే కూర్చుంది. టిఫిన్ తినాలనిపించలేదు. కాఫీమాత్రం తాగింది. కుర్చీలో నీరసంగా కూలబడింది.

గడచిన సాయంకాలం సంగతులింకా ఆమె కళ్ళకు కట్టినట్లే ఉన్నవి.

కారు తీసుకొని బావ ఆఫీసు చేరేసరికి ఏడుగంటలయింది. టేబిలుమీద డ్రాయింగొకటి విప్పి, అతనుచాల నిశితంగా పరీక్ష చేస్తున్నాడు.

తనను చూడగానే అతను ఆశ్చర్యపడ్డాడు. ఏదో ప్రమాదం జరిగితే ఆమె చెప్పడానికి వచ్చిందేమోనని అనుకున్నాడు. తరువాత తను ఆఫీసు పనిమీద వచ్చానని చెప్తే. కూర్చోమని, పావుగంట వరకూ డ్రాయింగ్ చూచి, తరువాత తనతో మాట్లాడడానికి ఉపక్రమించాడు.

"ఇప్పుడు విషయం చెప్పు ! సావధానంగా వింటాను" అన్నాడుబావ.

తను వచ్చిన పని గురించి చెప్పింది. మొదట అయిదు లక్షల బిల్లు గురించి చెప్పింది. తరువాత ఇరవై లక్షల బిల్లు గురించి చెప్పింది. తరువాత సందేహిస్తూ, అతని ముఖంలోకి చూస్తూ ఊరుకుంది.

బావ ముఖంమీద ఒక క్షణం కోపం తాండవించింది, అతను దాన్ని అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. తన ముఖం నుంచి చూపులు మరల్చుకుంటున్నాడు.

"ఇంకేమేనా చెప్పవలసినవి ఉన్నాయా ?" అడిగాడు.

"వీటికి సమాధానాలు ప్రోత్సాహకరంగా ఉంటే తరువాత సంగతి మాట్లాడుకోవచ్చు."

"దానికి వీటికి సంబంధం ఉందా ?

"ఉంది ! ఇవి సవ్యంగా పరిష్కారమైతే, ఆ ప్రస్తావన చాల వరకు మనకు అనుకూలిస్తుంది."

అతను తన ముఖంలోకి పదినిమిషాలు చూచాడు. చీకటి తొలగి మెల్లగా వెలుతురు వచ్చినట్లు, అతని ముఖంలోని కోపరేఖలు క్రమంగా మాయమయి చిరునవ్వొకటి వెలిగింది.

"అయితే ఆ ప్రస్తావన చేయనక్కరలేదు."

"కోపం వచ్చిందా ?"

"కోపమే వచ్చింది. మరెవరైనా అయితే ఆఫీసునుండి బయటికి పంపించేవాడిని. కాని సరస్వతి వచ్చింది. నేనాపని చేయలేను."

"నిన్ను బావా అని పిలవవచ్చా ;?

"బహుశా సత్యమూర్తి అని అంటే బాగుంటుంది. ఇది కేవలం ఆఫీసు వ్యవహారం."

"కాని, నేను చెప్పబోయేది, మన ఇరువురి భవిష్యత్తుకి ముఖ్యమైనది. ఆ విషయం ఆఫీసుకే పరిమితమైనది కాక, మన జీవితాలనే మార్చగలది."

"సరస్వతీ ! గెలుపునీదే !

"అయితే విను బావా ? మా చీఫ్ ఆర్కిటెక్ట్ అమెరికా వెళ్తున్నారు. ఆయన జాగాలో నిన్ను వేసుకుంటానని మా మేనేజింగు డైరెక్టరుగారు చెప్పారు. మూడువేల రూపాయలు నెలకు జీతం. కారు బంగళా ఇంకా చాలా చాలా సదుపాయాలు. ఈ సంస్థ పెరిగినకొద్దీ మన భావి కూడా బాగుంటుంది. ఇటువంటి అవకాశం జీవితంలో లభించదు. కాబట్టి నువ్వీ సంస్థకు చెందినవాడివిగా భావించి, ముందు చెప్పిన బిల్లుల గురించి పరిష్కార మార్గం ఆలోచించు. ఇది ఏమంత పెద్ద పనికాదు."

అతను తన ముఖంలోకి చాల కోపంతో చూచాడు. తరువాత కుర్చీమీదనుండి లేచి కూర్చున్నాడు అతని ముఖం ఎర్రబడింది. పెదవులు కంపిస్తున్నవి. తనకి చాలా భయం వేసింది.

అతను మూలనున్న కూజా లోంచి గ్లాసునిండా నీళ్ల పోసుకొని తొందరగా తాగి, తిరిగి కుర్చీలో కూర్చున్నాడు. అతని ముఖంలో నవ్వులేదు. కోపంకూడా కరిగిపోయింది.

"సరస్వతీ !"

అతడేదో చెప్పరాని బాధ పడుతున్నాడు.

"నా జీవితంలో నేను నెలకు మూడువేల రూపాయలు వచ్చే స్థితికి చేరలేను. చక్కటి బంగళా, మంచికారు, అందమైన నీవంటి భార్య, ఆ పెద్ద ఉద్యోగం – వీటినన్నిటినీ ఎవరూ నిరాకరించరు".

"మరి నువ్వుమాత్రం సంతోషంగా లేవేమి ?"

"అదే నేనెప్పుడూ తేలికగా వచ్చే సంపదకోసమని నా ఆదర్శాలను బలియిచ్చుకోలేకపోతున్నాను."

"బావా ! నాకేమీ అర్థమవడంలేదు."

"నీకు అర్థంకాదు. నీకు దీనిలోని నిజం ఏ కొంచెం తెలిసినా, వచ్చేదానివి కావు." తనకి ఏమీ బోధపడడంలేదు తనెందుకు ఈ పనికి అంగీకరించానని బాధపడింది.

"సరస్వతీ ! విను. ఈ మూడు విషయాలకు నేను సమాధానాలు ఇస్తాను. వాటిని అర్థంచేసుకొని, మీ మేనేజింగ్ డైరెక్టరుతో ఎంతవరకు చెప్పాలో ఆలోచించి జాగ్రత్తగా చెప్పు"

తాను ఏమీ జవాబు చెప్పలేదు. సావధానంగా అతని జవాబుల కోసం ఎదురు చూచింది.

"సరస్వతీ ! మొదటిది అయిదు లక్షల రూపాయల బిల్లు ఆఫీసర్ల బంగళాలను నిర్మించారు. ఎస్టిమేటుకు మించి ఖర్చుపెట్టారు. నిర్మాణం బాగుంది. ఇంటికి వినియోగించిన సామగ్రి మేలురకమైంది. ఆడంబరాలకు పోయినా, బంగళాలు చాల బాగున్నవి. అయిదు లక్షలు అదనపు ఖర్చు సమంజసమని రేపే ఛీఫ్ యింజనీరుగారికి వ్రాసి, ఒక్క వారంలో పేమెంటు అయేటట్లు చేస్తాను."

రెండవ బిల్లు ఇరవై లక్షల రూపాయలకు. దీనిని పాసు చేయించడం సాధ్యంకాదు. లేబరు కాలనీలో నూఘ యూనిట్లు మీసంస్థ వారు నిర్మించారు. ఇవి చాల చాల రకాలుగా నిర్మించారు. మొదట నిర్మించిన పది యూనిట్లు ఒక మాదిరిగా ఉన్నవి. తరువాత కట్టిన నలభై యూనిట్లు ఒకమాదిరిగా ఉన్నవి. ఆఖరున కట్టిన ఏభై యూనిట్లు చాల అధ్వానంగా ఉన్నవి."

"ఇవికట్టినప్పుడు మీతరపునఇంజనీరు కూడాపర్యవేక్షించడా?"

"నాకు ఛార్జి యిచ్చిన అసిస్టెంటు ఇంజనీరు పర్యవేక్షణలోనే ఇవి పూర్తి అయాయి. అతను రిటైరయిన తరువాత నన్నీ జాగాలో వేశారు. అతనే ఉన్నట్లయితే మీ సంస్థకీసరికి పేమెంటు జరిగి ఉండేది."

"మరి నీ ఆక్షేపణ ఏమిటి ?"

"ముందుగనే చెప్పాను కదా ! ఈ ఇళ్ళన్నీ చాలవరకు మరామ్మత్తులు చేయాలి. మొదటిపదియూనిట్లు కొద్ది మరామ్మత్తులతో, తరువాత నలభై భారి మరామ్మత్తులతో, ఆ తరువాత ఏభై ఎందుకూ పనికి రానివయి పునర్నిర్మాణం చేయవలసి యున్నవి. కొద్దిసేపు శ్రమ పడితే నువ్వే చూడవచ్చు"

తనకు కట్టిన ఇళ్లను టార్చిలైటు పట్టుకొని చూపించాడు, ఆ సంస్థ చేస్తున్న దేశద్రోహానికి తాను కారణం కాకూడదన్నాడు.

"ఇక మూడవ విషయం" తిరిగివచ్చి ఆఫీసులో కూర్చోగానే చెప్పడం మొదలు పెట్టాడు.

"నేను ప్రస్తుతం మీ సంస్థవారు ఇస్తానన్న పదవికి అర్హుడిని కాను. నాకు అనుభవం తక్కువ. జీతాలకు భ్రమసి ప్రయివేటు సంస్థలలో చేరి మూడునాళ్ళకే ధనవంతుడనవడం నాకు నచ్చదు. లోకాన్ని వంచింపలేను., అంతకన్న ముఖ్యమయినది ఆత్మవంచన. వీటికి నేనంగీకరించను. నిన్ను డిసెపాయింటు చేస్తున్నాను."

అతను మరి మాట్లాడలేదు. అప్పటికే తొమ్మిది కావస్తున్నది. తను లేచింది. అతనూ లేచాడు. ఆఫీసు వెలుపల వరండాలో ఇద్దరూ కొంచెంసేపు నిలబడ్డారు. తనకే చాల కష్టమనిపించింది. అతని చేతులను తన చేతిలోనికి తీసుకుంది.

బావా ? నిజం తెలుసుకున్నాను. నిన్ను చాలఇబ్బంది పెట్టాను. క్షమించు."

"సరస్వతీ ! నువ్వు తెలుసుకున్న నిజం చెప్పడానికి ధైర్యం తెచ్చుకో ! ఆత్మవిశ్వాసం మాత్రం కోలుపోకు."

తరువాత తను తిరిగి వచ్చింది. అపజయమన్నది ఎరుగని మనోహర్‌తో ధైర్యంగా తాను చూచినదాని గురించి చెప్పింది. అతని ముఖంలో కలిగిన మార్పులు అతని చిరునవ్వు ముసుగు కప్పలేకపోయింది.

తన నిస్సహాయస్థితికి తనపై తనకే జాలికలిగింది. మనోహర్ తలపెట్టిన కుట్రలో తనొకపావు అయినందుకు విచారించింది. తాను ఆటోలో ఇల్లు చేరేసరికి పదిగంటలు కావస్తున్నది. తొందరగా మేడమెట్లెక్కి గదిలోకి వెళ్ళింది. బావ అప్పుడే అరగంటయి వచ్చినట్లున్నాడు. బట్టలుకూడా మార్చుకోలేదు. అలాగే తనకోసమే ఎదురుచూస్తున్నాడు. తాను గదిలోకి అడుగు పెట్టగానే అన్నాడు.

"సారీ! సరస్వతి!"

తరువాత తన ముఖం వేపు పదినిముషాలుతేరి చూచాడు. తన కంటినీరు కపోలాలమీద పడుతుంటే దగ్గరగా వచ్చి చేతితోతుడిచాడు.

"ఇది జీవితంతో మనమాడుతున్న ఆట! ఈ సమస్యలన్నిటిని నవ్వుతూ ఎదుర్కోవాలి. విచారించవలసిన సమయం కాదిది."

తన ముఖంలోకి చూచాడు. నవ్వమంటున్నట్లు సౌంజ్ఞచేశాడు. అప్రయత్నంగా తనకు నవ్వు వచ్చింది. కొండంత ధైర్యం వచ్చింది....

సరస్వతి ముఖంలోని విచారరేఖలు తొలగిపోయాయి. లేచి రిజిస్టర్లు సరిచేసి స్టోరు లోపలికి నడిచింది. (ఇంకా ఉంది)

పుస్తకంగా దేశం సమస్తం

శ్రీ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి

నిన్న మొన్నటిదాక నాప్రవాహానికి అడ్డువేసి
కొన్ని చేలే నవ్వుకున్నాయి.
ప్రక్కచేలకు తడి ఇప్పుడిప్పుడే అందుతున్నా
ఒక్క నీటిబొట్టూ అందని పొలాలు ఇప్పటికీ ఎన్నో
ఉన్నాయి.

నన్నడిగితే - నేను లేని ప్రదేశం
మిన్నాగులు తిరుగాడే చీకటి కుటీరం.
నాజ్ఞాతిరత్నాలు వెలిగించిన దివ్వెని నేను !
నానా యుగలతలు ప్రసవించిన పువ్వుని నేను !
పురులు విప్పి నర్తించే మయూరాలు
పటులు విదిల్చి లంఘించే సింహకిశోరాలు
పుటలుగా ఉన్నాయి నాలో.

అయినా ఇదేమి దుర్ముహూర్తమో
అర్థం కావడం లేదు
వేల వేల అక్షరాలు విహ్వాలిస్తున్నాయి
వేదవతిలాగా సీతలాగా ద్రౌపదిలాగా

ఈ మధ్య నా గుండెల్లో గునపాలు గుచ్చుకుంటున్నాయి
ఇన్నన్ని చెప్పలేనన్ని!
చెదపురుగుల నురుగులుగా
చిట్టెలుకల పరుగులుగా
ప్రతిపూటా విడిపోతానని శివమెక్కి చిందులు త్రొక్కే
ప్రతిపుటగా
ఎన్నిముళ్ళు చుట్టూ ఉన్నా
వన్నెల గులాబినై వికసిస్తానని ఉన్నాను
వజ్ర సంకల్పంతో

కలగూరగంప

ఎఱ్ఱన గారి అక్రూరుడు

నందవ్రజంలో బాలకృష్ణుని లీలావిలాసాలు "జనముద్దులై" దివ్యత్వ మానుషత్వాలకు హద్దులు చూపుతున్న సమయంలో, ఆకాశవాణి చెప్పిన అష్టమగర్భం తాలూకు బాలుడు వీడేనని పసిగట్టి అట్టట్టవుతున్న కంసరాజు కాపట్యం నటించి ధనుర్యాగ సందర్శనకు గాను రామకృష్ణులను తోడితెమ్మని నయాన పురమాయింపగా.... ఒక గోధూళివేళ మఖమంత పట్టెవర్ధనాలు, ముచ్చటైన పట్టంచుల పట్టు బట్టలు, గిల్కు గిల్కుమనే పావుకోళ్ళు ధరించి హుటాహుటిగా ఎత్తైన రథం ఎక్కి వ్రజానికి బయలుదేరారు అక్రూరయ్యగారు. తీరా వ్రజం చేరాక బాలకృష్ణునికి మ్రొక్కి మోకరిల్లడమా! అక్కునచేర్చి లాలించడమా! అన్న సందేహంతో ఊగిసలాడాడు. ఇక్కడ మొదటిసారిగా సర్వమార్గేచ్ఛా విధాతృడైన ఎఱ్ఱన తాను ముందు ముందు సాగదీసి నిరూపించబోయే ఒక సమగ్ర సంకీర్ణ పాత్రావిష్కరణకు చిన్న బీజం నాటాడు. అప్పటికే బాలస్వామి పరతత్త్వ ప్రతీక అని ఊరూ నాడూ చెప్పుకుంటున్నారు. అనేక యాతుధాన రక్షస్సంహరణ కేళీవిలాస శ్రవణం చేత కంసుని ప్రాణాలు కడబట్టుతున్నవి. బాలురను రావించడంలో కంసుని గుండెల్లో ఎంత పాపచింత గూడుకట్టుకొని ఉన్నదో ఎరుగనివాడుకాడీ అక్రూరుడు. మరి అలాంటి పనికి తాను నిమిత్తం కావడం ఏపాటి ఔచిత్యం? ఇక్కడ అక్రూరుని మనస్సు లోలోతు పొరల్లో ఇరుక్కొని ఉన్న లౌక్యాన్ని వ్యాసమహర్షి గంభీరవాణిలో పొదిపిపెట్టగా ఎఱ్ఱన ఒక్కొక్కపొరే ఒలిచి కుప్ప పోశాడు. పాపం పిచ్చిబ్రాహ్మడు పోతనగారికి భక్తుల పేరు చెప్పగానే, వాళ్ళ నుదుట ఊర్ధ్వపుండ్రాలు కనిపించగానే భక్త్యావేశం వచ్చి మనసు పొర సంధుల జోలికి పోడు. ఎఱ్ఱన మాత్రం ఇలాంటి లౌక్యం గల భక్తులు చిక్కారంటే కమ్మచ్చున సాగదీయక వదలడు. ఇంతకీ చెప్పవచ్చింది ఆచార్యస్వామి "మోక్షసాధన సామగ్ర్యాత్ భక్తిరేవ గరీయసి; స్వస్వరూపాను సంధానం మోక్షమిత్యభిధీయతే" అని వేరు సందర్భాలలో ప్రవచించినా, సగటు మనిషి దృష్టిలో అన్ని మార్గాలలోకి భక్తి చాలా సులభం అనిపించినా, అదేమీ అనుకున్నంత తేలిక కాదని తెలీడానికి హరివంశంలో అక్రూరఘట్టాలు ఆకళింపు చేసికోవాలి. అందుకే ఈ అనుశీలనము.

భక్తుడైనవాడికి స్వామిని సర్వాత్మనా శరణు చొచ్చటం ముఖ్యమైన యోగ్యత. కంసుడు తనను వ్రజానికి పంపినప్పుడు ఒక చిన్న మరతపేచీ మనసులో కుదుర్చుకున్నాడు అక్రూరుడు. బాలుడు నిజంగా దేవుడే అయితే కంసుణ్ణి చంపి తాను బ్రదికి బట్టకడతాడు. కాకపోతే కథ మారుతుంది. పర్యవసానం తేలేలోపున భక్తిప్రపత్తుల విన్యాసము, స్తోత్రపాఠాలు, స్నానసంధ్యలు ప్రదర్శిస్తూ ఉండవచ్చు. ఇలా అనుకొని వ్రజంలో రాత్రి విడిది చేసి కంసుని కథాకమామిషు చెప్పి, పెద్దదిక్కుగా వ్యవహరించి, రామకృష్ణులను రథంమీద తీసికొని పోతూ తెలతెలవారుతున్నవేళ కాళింది నదిలో సాంగోపాంగ స్నాన సంధ్యాద్యనుష్ఠానకార్యక్రమం మొదలెట్టాడు అక్రూరుడు. ఈ తతంగమంతా చూచిన బాలకృష్ణుడు తన పరస్వరూపాన్ని నదిలోను ఇహ స్వరూపాన్ని రథంమీద ఇంద్రజాలికునిలాగ ప్రదర్శించి అక్రూరుని అట్టట్టు చేశాడు. అక్రూరుడు వేడ్కతో గొల్చినా భోగ విభుని, "అతని యంక తలమ్మున ప్రీతింగూర్చున్న దేవుఁబ్రదు మేచక జీమూతనిభుఁగమలలోచనుఁ బీతాంబరుఁ గృష్ణుఁ బ్రక భృత్కరుఁ గాంచెన్. (హ. వం. 8-191). ఈ దివ్యదర్శనంతో "అంతర్బహిశ్చ యత్సర్వం వ్యాప్య నారాయణస్థితః" అన్న సూక్తి అక్రూరునికి భాసించింది. ఆవేశంతో ఇలా స్తుతించాడు.

> "జయసర్వాత్మక, సర్వరూప, విభుతాసంభావ్య సర్వజ్ఞ న
> ర్వ యుగోత్పత్తి సమాప్తి కలనా వర్ధిష్ణు విష్వ విని
> శ్చయ ధౌరేయ సమస్త విస్మయవిధా సంధాయక ప్రక్రియా
> నయనిష్ఠా వనతార్తి నోదన ధురీణ వ్యాప్తి రంజత్కృపా".

ఈ స్తుతిలో అచ్చుగట్టినఆవేశముమెచ్చుగొల్పే తత్త్వపరిజ్ఞానము స్వామి గమనించాడు. ఇలాంటివాళ్ళంటేస్వామికి అలుసు. కావలిస్తే వీరికివిశ్వరూపసందర్శనం నాటకదృశ్యాలలాగ చూపించి, నయ,భయ, హాస్యావంచనాదులతో మంచి మార్గాన పెడతాడు. బలవత్కార్యులైతే వాళ్ళ మానానవాళ్ళని వదలివేస్తాడు. అనుష్ఠానకార్యక్రమం అయిన తరువాత మళ్ళీ ప్రయాణానికి అక్రూరుడు హెచ్చరించగా స్వామి చిరునవ్వు నవ్వుతూ"....అది యట్ల నీవు దెలిపిన త్రోవంబోవఁగలవార మేమనగా వేరొకఁడెద్దియైన గలదే" (202) అంటాడు. తీరా మధుర చేరాక పుట్టిపెరిగి పట్టణాల మెట్టినవారం కాదు. తాతగారు! కాసేపు అలా తిరిగి ఎస్తాం అంటాడు. ఇలాంటి ఛలోక్తులు పరిపాకం పొందనున్న భక్తులమీద విసరి సన్మార్గంలో పడేస్తాడు స్వామి. మధురలో అనుకున్నంత అయింది. కంసుడు తనువు చాలించాడు. తనం టే ఏమిటో ఇప్పుడు అక్రూరునికి బాగా తెలిసి ఉండవచ్చుకదా! అని భావించి హస్తినకు అతని పాండవుల యోగక్షేమాలు విచారించి, ధృతరాష్ట్రునికి సన్మార్గం ఉపదేశించడానికి పంపాడు. ధృతరాష్ట్రుడు

అక్రూరుడు చెప్పిందంతా విని అలాగే అంటాడు కానీ అలా వర్తించడు. ఈ ఇద్దర్నీ ఒకేచోట పెట్టిచూస్తే ఎలా ఉంటుందో అన్న చిలిపి తలపు స్వామిది. ధృతరాష్ట్రుడు స్వామి విశ్వరూపాన్ని చూడటానికి తెరుచుకున్న కళ్ళు మూసుకున్నాడు. అక్రూరుడు అనంతర కాలంలో కళ్ళు తెరిచాడు. ఆ వైనం ఇలా ఉన్నది :

బాలకృష్ణుడు శృంగారకృష్ణుడు అయిన తరువాత సత్యభామను చేపట్టిన ఘట్టం, అనంతర కథాసంవిధానం ఈ అక్రూరపాత్రకు గీటురాయి. ఒకవిధంగా చూస్తే ఈ కథకి శ్యమంతకమణి కేంద్రం. అందువల్లనే "శ్యమంతక మణేర్హర్తా నరనారాయణాకృతిః" అన్న కృష్ణాష్టోత్తర స్తోత్ర వాక్యంలో నరుడు అక్రూరుడు. కృష్ణుడు నారాయణుడు. మొదట మొదట సత్యభామను వివాహమాడదామనుకున్న ప్రముఖులలో కృతవర్మ, అక్రూరుడు, శతధన్వుడు ఉన్నారు. కృతవర్మ భారతయుద్ధంలో శత్రుపక్షంలోచేరాడు. శతధన్వుని స్వామి చంపాడు. అక్రూరుని ఉద్ధరించాడు.

సూర్యుని ఆరాధించి సత్రాజిత్తు దివ్య శ్యమంతక రత్నాన్ని పొందాడు. దాన్ని ధరించి ద్వారకకు వస్తున్న సత్రాజిత్తును చూచి సూర్యుడు స్వామి దర్శనార్థం వస్తున్నాడని భావించారు యాదవులు. స్వామి మణిని కోరడం, సత్రాజిత్తు నిరాకరించడం, ప్రసేనజిత్తు మరణం, స్వామి పొందిన అపనింద, శ్యమంతకమును స్వామి తిరిగి తీసికొని రావడం, సత్యావివాహం, స్వామి కన్యారత్నాన్ని స్వీకరించి సత్రాజిత్తు ఇవ్వజూపిన శ్యమంతక రత్నాన్ని అతనికే ఇచ్చివేయడం– అన్నవి అనంతర కథాంశాలు. తాము పెళ్ళాడదలిచిన కన్యను కృష్ణుడు పెండ్లాడాడని కోపించిన మిత్రత్రయం ఇలా అనుకున్నారట,

"....విచారమేమిటికిఁ దుచ్ఛున్ వీనిద్రుంగించి యెందు నలభ్యంబగు మానికంబుఁగొని సంతోషింత మంతర్గతిన్". (201)

సత్రాజిత్తును చంపాలని అనుకున్నారే కానీ ధైర్యం చాలలేదు. శతధన్వుడు సత్రాజిత్తును చంపిన తరువాత కృష్ణుని చేతిలో తన చావు తప్పదని తెలిసికొని మిత్రుల దగ్గరకు పోయి తమ ఒప్పందాన్ని జ్ఞాపకం చేశాడు. కృతవర్మ తప్పుకున్నాడు. అక్రూరుడు అంతవరకూ తాను వీరితో కలవడమే తప్పనీ, ఇకముందు తప్పులు చేయననీ, స్వామిని శరణు పొందుతాననీ చెప్పి మళ్ళీ కృష్ణస్తుతి చేశాడు.

"అసురీహార మృణాళహంసము, మహేంద్రాంతః పురీకర్ణప
త్ర సమున్మీలన మూలశిల్ప, కుమత ధ్వాంత తార్క బింబంబు, దు
ష్టప్రసహం బెవ్వని చక్రమట్టిహరికిం బ్రత్యర్థియై నిల్వఁగా
వసమే యెంతటి వానికిన్ వెరతు నవ్వైరస్య మింబూనఁగన్".

(207)

శతధన్వుడు భయపడి శమంతకమణిని అక్రూరునికిచ్చి "నీవీ అలభ్య రత్నంబును డాఁపవలయుఁ బ్రాణంబుపై వచ్చునంతటి పోరామియందును నెవ్వరికి నెఱిఁగింపకుండునది" అని వెళ్ళిపోయాడు. అంటే తను తిరిగివస్తే మణి తనకే చెందుతుందనీ, రాకపోతే కనీసం మిత్రుడయిన అక్రూరుని దగ్గరయినా మణి ఉంటుందనీ అతని ఆశ. ఇలా శతధన్వుని దగ్గర నుండి మణిని తీసికొని ఇల్లడ పెట్టుకోవడంతో ఆ భక్తుని భక్తి భేషజము ప్రారంభమవుతుంది. లోతుగా పరిశీలిస్తే అక్రూరుని ఆలోచన సవ్యంగా లేదు. సర్వాంతర్యామి అయిన కృష్ణుడు (తాను స్వయము స్వామి దివ్యదర్శనము పొందాడు కదా!) మణి తనదగ్గర ఉన్నదని తెలిసికోలేనంత మూర్ఖుడు కాదు కదా!. ఒకవేళ మిత్రవాక్యం పాటించి రత్నాన్ని దగ్గిర ఉంచుకున్నా శతధన్వుని మరణవార్త విన్న తరువాత దానిని కృష్ణునికి చేర్చాలికదా! అలా చేయకుండా యజ్ఞయాగాది క్రతువులు, దానధర్మాలు ముమ్మరంగా కొనసాగించి మంచిపేరు తెచ్చుకున్నాడు. అంటే తన తప్పులను సద్ధర్మాచరణం అనే కవచంతో కప్పిపుచ్చాడు. అంతమాత్రంచేత స్వామిపరిధిని దాటిపోగలనని అనుకున్నాడు. అక్రూరుని శరణాగతుని చేయడానికి స్వామి చక్కని వలపన్నాడు. అక్రూరుడు ద్వారకలో లేనప్పుడు దుర్భిక్షం తటస్థించింది. (ఇది స్వామి మహాత్తు కావచ్చు. లేకపోతే ఆయన అధివసించినచోట ఉపద్రవాలేమిటి?) యదువృద్ధుల ఆదేశాన్ని పురస్కరించుకొని అక్రూరుని ద్వారకకు పిలిపించి "దానపతీ!" అని సంబోధించి (ఎంత ఎగతాళి? తనకి అన్యాయంగా సంక్రమించిన ఇతరుల ఐశ్వర్యంతో దానధర్మాలు చేసేవాడా! అని వ్యంగ్యము) ఇలా అంటాడు.

"సకల జగంబులందుఁగడు సారమనందగు నుజ్జ్వల శ్యమం
తకమణి నీకునిచ్చె శతధన్వుఁడు నీవును డాఁచినాఁడ వి
య్యకుటిల కర్మమున్వేఁగల యంతటికిన్ హితమేనునాత్మ దీ
నికిఁ గడుసంత సిల్లితిమి నిక్క మెఱుంగుదు మింత యెప్పుడున్."

(288)

ఇది చావగొట్టి చెవులుమూసేవాక్చాతుర్యము. ఒక్కమాటలో: నీ రహస్యాలన్నీ నాకు తెలుసు. కాని దానివల్ల మాకేర్పడిన కుటుంబకలహం బలరాముడు, సత్యభామ మణి తమకు చెందాలని ఆశతో అల్లాడిపోయారు, సమసిపోవడానికైనా ఒక్కసారి చూపు అన్నాడు. దీనితో ఇన్నాళ్ళనుండి ఈ భాగవతోత్తముడు గుండెల్లో కట్టుకొన్న అడ్డుగోడలన్నీ వరుసగా కూలిపోయి అచ్ఛమైన హృదయార్ద్రిత భక్తి శరణాగతి తత్త్వము పెల్లుబికాయి. స్వామి పాదాల చెంత శ్యమంతక రత్నాన్ని సమర్పించుకున్నాడు అక్రూరుడు. అక్రూరుని ఉద్ధరించడం మాత్రమే ఆశయంగా కలిగిన స్వామి కొంత ఏదో విలాసం నెఱపి తమకి, సత్యకి, బలరామునికి రత్నాన్ని గ్రహించే అర్హత లేదని నిరూపించి, ఇప్పుడు పరిశుద్ధభావుడైన అక్రూరునికే దానిని తిరిగి ఇచ్చివేశాడు. ఇలా చిత్తశుద్ధితోని సాంప్రదాయిక

సత్కర్మాభిరతికీ, నరుల్లోని కపట భక్తిభావానికి ప్రతీక అయిన అక్రూర పాత్రను కరగించిన బంగారం లాగా శరణాగత పథానికి పట్టుబట్టి మరలించాడు స్వామి.

సంయమనశీలి, ధర్మాద్వైతమూర్తి, ప్రబంధశిల్ప పరమేశ్వరుడు అయిన ఎఱ్ఱన మానవ మనస్తత్వపు లోతులను తరచి, సజీవ శిల్పాకృతిగా తీర్చి దిద్దిన పాత్ర అక్రూరుడు. వాని కథ నరుని కథ. వాని ఉత్థానము నారాయణుని కథ. వెరసి ఈ కథ నరనారాయణాత్మకము.

డా॥ దార రామనాథశాస్త్రి

చిలకమర్తివారి ప్రహసనాలు

తెలుగు సాహిత్యంలో ప్రహసనం ఆధునిక యుగంలో విరివిగా పండిన పంట. ఈ ప్రక్రియ ప్రచారానికి కందుకూరి వారు నాందిని ఆలపిస్తే, చిలకమర్తివారు ప్రస్తావన నిర్వహించారు. ఈ యుగంలో ప్రహసనం నవ్వు పుట్టించడానికే పుట్టలేదు. సాంఘిక వ్యవస్థలోని వికృతిని వేదికమీద ప్రదర్శించిగాని, శ్రవణం వల్ల సూచించికాని, ప్రజలకు చెప్పడానికి ప్రహసన ప్రయోగం పుట్టింది. సాంఘిక సంస్కరణ దాని ధ్యేయం. వికృతితో బాటు సామాజికులకు వినోదంతోబాటు వివేకం కలగాలని, ప్రాచీనులు చెప్పిన ప్రహసన లక్షణాలను పేర్కొని, వాటిని చిలకమర్తివారి ప్రహసనాలకు, సమన్వయ పరచటం ఒక పద్ధతి.

"భరతుని నాట్యశాస్త్రము ప్రకారము ప్రహసనం లక్షణములు శుద్ధ, సంకీర్ణ భేదములచే ప్రహసనము రెండువిధములు- భవత్ తాపస విప్ర, శాక్యాదులను గూర్చిన హాస్య వాదములతో కూడినదియు, కుత్సితపురుషులతో కూడినదియు పరిహాస సంభాషణతో కూడినదియు విశిష్ట భవద్యోతకములగు కథాఖండములను, నియతగతిగల ఇతివృత్తములు గలదియు, శుద్ధప్రహసన మనబడును. అని భృత్యములైన వేష, పరిచ్ఛద, చేష్టితములు కల వేశ్యా, చేట, నపుంసక, విట, ధూర్త, బంధకాసంకులమగుననియు సంకీర్ణ ప్రహసన మనబడును. లోక వ్యవహార సిద్ధమగు వార్తయును, దంభమును, ధూర్తుల వివాదములును ప్రహసనము లందుండవలెను."

భరత మహర్షి హాస్యం కలగడానికి గలకారణాలు వివరించాడు.

"సహ వికృతి వేషాలంకార దార్ఢ్యలౌల్యకలహాసత్ప్రలాప వ్యంగ్య దర్శనదో షోదోహరణాది ఖిర్విభవైరుత్పద్యతే"- విపరీతాలంకారైర్వికృతాచారాభి దానవేషైశ్చ - వికృతైరంగ వికారైః హసతీతి రసస్మృతో హాస్యః" -

(నాట్యశాస్త్రము భరతమహర్షి - 312; 49శ్లో)

సాహిత్యదర్పణంలో,

"వికృతాకార వాగ్వేషచేష్టా దౌర్వృత్త కార్యవేత్
హాస్యోహాసస్థాయి భావః"

(సాహిత్య దర్పణం 207. 214శ్లో)

హాస్యోత్పత్తికి ముఖ్యమైన మార్గములు మూడు-వికృతమైన ఆకారం వేషము, చేష్టలు.

ఈ హాస్యం రెండు విధాలు,

"ద్వివిధాశ్చయ మాత్మస్థః పరిస్థశ్చయ
దాస్యయం తా సతియాత్మస్థ, యదాతువరం
హాసయతి తదాపరస్థః"

అంటాడు భరతమహర్షి.

స్వకీయమైన హాస్యకల్పన తనను నవ్వించి, ఎదుటివారిని నవ్వించవచ్చు. పరస్థహాస్యం ఉద్దేశపూర్వకమైందై, పరులకు హాస్యం కలిగించి తీరుతుంది.

"దైనందిన జీవితంలో ఒక ఆచారాన్ని, ఆదర్శాన్ని మనం ఆచరిస్తాం" దానికి విరుద్ధమైన స్వల్ప విషయమైనా అపహాస్యాన్ని కలిగిస్తుంది. అందుకే నవ్వు సంఘంలోని వ్యక్తుల్ని విమర్శించడానికి ఉపయోగించే ఆయుధ మవుతోంది. నవ్వటంలో ఒక సత్య పరిశీలనా దృష్టి ఒకనీతిబోధ లేకపోలేదు." అంటారు మునిమాణిక్యం నరసింహారావుగారు (మనహాస్యము - మునిమాణిక్యం నరసింహారావు-ఆంధ్ర సారస్వత పరిషత్తు-తిలక్ రోడ్ హైదరాబాద్).

అందుకే ప్రహసనకర్త కేవలం హాస్య వాఙ్మయ నిర్మాతగా మాత్రమే కాక నీతి బోధకునిగా ఎక్కువగా భాసిస్తాడు.

ప్రాచీనులు ప్రహసన పాత్రల ప్రవృత్తులను అప్పటి సామాజిక పరిస్థితులనుబట్టి వివేచించారు. చిలకమర్తి ఆధునికునిగా వికృతి స్వభావమున్న ప్రతిపాత్రనూ సమకాలీన సమాజం లోనే ఎన్నుకున్నారు. అధికారాలను బట్టి వాటిలో ఉత్తమ మధ్యమాధమపాత్రలున్నాయి. స్వీయస్థ, పరస్థ హాస్యప్రయోగాలున్నాయి.

సమకాలీన సమాజంలోని వివిధ పాత్రలను, ప్రవృత్తులను, భాషావేషాలను, సంభాషణా చమత్కారాలను, శబ్దాశ్రిత హాస్యాన్ని భావాశ్రిత హాస్యాన్ని అర్థాశ్రితహాస్యాన్ని ఎన్నో విధాలుగా చిలకమర్తి వారు వారి ప్రహసనాలలో ప్రయోగించారు.

చిలకమర్తివారి ప్రహసనాలు రెండువిధాలుగా విభజించాలి :- హాస్యప్రహసనాలు, విమర్శనాత్మకాలు.

హాస్యప్రహసనాలలో కేవలం హాస్యాన్నే దృష్టిలోపెట్టుకుని అందులోని వ్యక్తుల్ని, పరిస్థితుల్ని, సంభాషణలను హాస్యాత్మకంగా సృష్టించారు.

చిలకమర్తివారు విమర్శనాత్మక ప్రహసనాలలో తనకు నచ్చిన పాత్రలద్వారా విమర్శన చేయించారు. అక్కడ విమర్శకే ప్రాధాన్యమిచ్చారు.

చిలకమర్తి వారి ప్రహసనాలలో ఇరవై అయిదువరకు కేవల ప్రహసనాలు. ఇరవై వరకు కేవల సంభాషణాత్మకాలు. తక్కినవి వ్యాఖ్యానాత్మక వ్యాసాలువున్నాయి.

హాస్య ప్రహసనాలలో బధిర చతుష్టయము గయ్యాళి గంగమ్మ జనాభానాటకము, అద్భుతకవిత్వము ముఖ్యమయినవి, బధిర చతుష్టయ ప్రహసనంలో చెవిటి శంకరప్ప, అతనిభార్య సింగమ్మ, ఒకరితో ఒకరు సంభాషిస్తూ వుంటారు. ఒకరిమాటలొకరికి వినపడక పోవటంవల్ల వారి అర్థంలేనిమాటలు హాస్యాన్ని కల్గిస్తాయి. కథలో విశేషం లేకుండా హాస్యంతో రక్తి కట్టించారు చిలకమర్తి.

"కడియాలవారింటికి భోజనానికి వస్తారా అంటుంది భార్య.

"కడియాలు కాదు అందెలు చేయిస్తాను" అంటాడు భర్త.

"అందాలా, ముసలిదానికి అందాలెందుకు, నేను సంసారిని"

"కంసాలిని పిలవమంటావా"— ఇలా సాగిపోతుంది సంభాషణ.

రెండోరంగంలో శంకరప్ప రావిచెట్టు నీడను పడుకుంటాడు. గంగన్న ప్రవేశిస్తాడు.

"నీవు నరసాపురంనుంచా రావడం— అంటాడు శంకరప్ప.

"నరసరాజుగారింట్లో పెండ్లయింది"— అంటాడు గంగన్న.

"అయ్యో: నరసింహంగారు పోయారా"

గంగన్న వివాహం గురించి మాట్లాడుతుంటే, శంకరప్ప శవాన్ని గురించి మాట్లాడతాడు.

ఇక్కడ వినిపించే హాస్యము శబ్దాశ్రయ హాస్యము, ఇక్కడ అసందర్భ సంభాషణయందు హాస్యమే కాకుండా, బధిరునియందు జాలి కూడా కలుగుతోంది.

చిలకమర్తివారి మరొక ప్రహసనం గయ్యాళి గంగమ్మ, అమాయకుడైన భర్తని భార్య పెట్టే బాధలు చూపించారు. ఆమె మాట చెల్లించుకోడానికి చేసే విపరీతపు పనులు కొన్ని వివరించారు. అందులో గంగమ్మ భర్త స్నేహితుడికి భోజనం పెట్టడం ఉంటదు. ఆమె సన్నికల్లుకు పూజసేసి, అమ్మవారు నరబలి కోరిందని, దానికి తగినవాడు భర్త స్నేహితుడైన జగన్నాధమేనని, ఆ విషయం భర్త చెప్పాడని, అంటుంది. దాంతో స్నేహితుడికి గంగమ్మ మీద గౌరవం పెరిగింది.

"మాతల్లి నువ్వు భూదేవతవు, మహా పతివ్రతవు. నీవుండబట్టే వానలు కురుస్తున్నాయి, పంటలు పండుతున్నాయి. నాకు కూతురు పుడితే నీపేరు పెట్టుకుంటా, ఇంకోజన్మన నీకడుపున కొడుకై పుడతా. నా చర్మము కోసి చెప్పులు కుట్టించినా నీ ఋణము తీరదు తల్లీ" - అని పల్కుతుంటే పాఠకుడికి నవ్వాగదు.

ఇది భావాశ్రయ హాస్యం, ఒక స్థితి సహజమైన ఔచిత్యాన్ని, గాంభీర్యాన్ని, ఉదాత్తతనం కోల్పోయినప్పుడు ఆ స్థితికి ఆభాస రూపం సిద్ధిస్తుంది.

జనాభా నాటకంలో నాంది, ప్రస్తావనా, విష్కంభాలు ప్రవేశపెట్టారు చిలకమర్తి. ప్రహసనానికి ప్రాణమైన హాస్యాన్ని నాందీపద్యంలోనే సూచించారు.

"ఒక్క మట్టి సిరాబుడ్డి యొక్కచేత
దస్తరాలు రెండవ చేత దాల్చుకొంచు
తిరుగు నెన్యూమరేటర్ల దీర్ఘమైన
వగరపులు, విసుపులు మిమ్మేలుగాత"-

ఒక సంభాషణ సందర్భంలో ఎన్యూమరేటరు ఒక ఇంటాయన పేరు అడుగుతాడు.

"రమణయ్య" - అంటాడు,

"మర్నయ్య" - అంటాడు రహిమాన్.

ఇంకో పేరు "రత్తమ్మ" అంటుంది ఇల్లాలు.

"రక్తమ్మ" - అరే, రక్తం పేరు ఎవరూ పెట్టుకోరోయ్, ఎంత కాఫిర్లోయి మీకి" - అంటాడు రహమాన్.

ఇక్కడ హాస్యం శబ్దాశ్రయ హాస్యం. అన్యభాషా పద ప్రయోగం వల్ల జనించింది. ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ, సంస్కృత పదాలు కలగా పులగంగా వాడటంవల్ల హాస్యం జనిస్తుంది.

"హిందూల్ పేర్ల లిఖోమని మాకీ ఆర్డరుంది" -

ఆడంబర పద ప్రయోగం శబ్దాశ్రయ హాస్య విభాగంలో వస్తుంది.

"దుష్కవి ఖల్లాక నిప్పుపెట్టి"

"ప్రతివాద భయంకర దుడ్డుకఱ్ఱ" మొదలైనవి.

చిలకమర్తివారి విమర్శనాత్మక ప్రహసనాలు తన చుట్టు ఉన్న సంఘాన్ని దృష్టిలో పెట్టుకున్నవి. వరదక్షిణ అనే ప్రహసనం చాలా కటువైంది. క్షయరోగం వున్న పిల్లని కుదర్చమంటాడు పిల్లాడి తండ్రి. దానికి పురోహితుడు,

"మీరు చెప్పింది చాలా బావుంది. ఇది తోలు వ్యాపారం. చచ్చిన జంతువుల తోళ్ళతో వ్యాపారం చేసేవాళ్ళు కొందరయితే, బ్రతికిన తోళ్ళతో వ్యాపారం చేసేవాళ్ళు కొందరు" అంటాడు.

ఈ ప్రహసనాలలో వరకట్నం చెల్లించలేక బాధలుపడే మధ్యతరగతి కుటుంబాలు కనిపిస్తాయి. ఇక్కడ హాస్యం పాలు చాల్తా తక్కువ. కొండూరి జానకిరామయ్యగారి పెళ్ళి ప్రహసనంలో అరవై ఐదేళ్ళ జానకిరామయ్య పదిహేనేళ్ళు తగ్గించి జాతకం రాయించి, కన్యాశుల్కమిస్తానని ఆశచూపించి పదేళ్ళ పిల్లను చేసుకోడానికి సిద్ధమవుతాడు. సిద్ధాంతి పిల్ల తండ్రితో "నేను అమంగళం పలికానని అనుకోకండి. అతిమూత్ర రోగమున్నది- మహా బతికితే ఐదేళ్ళు .... ఏరాచపుండో వేసి చస్తాడు - మీకు అమాంబాపతు పాతికవేలు ముడతాయి. ఇంతకీ పిల్ల జాతకం మంచిది" అంటాడు. పెళ్ళి విశేషాలు చెప్పుకుంటూ,

"ఆయన పదికాలాలబాటు బతుకకూడదా"

"ఈ పిల్ల కడుపున పదికాయలు కాయకూడదా" అంటూ ఒకరంటుంటే, మరొకరు -

"లేకపోతే వితంతు శరణాలయంలో ఆ పిల్ల మళ్ళా పెళ్ళి చేసుకోకూడదా" అంటాడు. ఇది పాత్ర పేరున చిలకమర్తి పలికిందే. ఈ ప్రహసనం సంఘ సంస్కరణ వివేకాన్ని సున్నితంగా సూచించింది. చిలకమర్తికి వృద్ధ వివాహాలపట్ల విపరీతమైన వైషమ్యముంది. చిలకమర్తివారి అనుభవాలు వివాహ ప్రహసనాలలో కనిపిస్తాయి. చిలకమర్తివారి తండ్రి పినతండ్రి కుమారుడు వరదకుటుంబరావుకి వివాహము చేయాలనుకున్నారు. అయితే, నల్లగబడి, శరీరంపైన దట్టమైన తామర ఉండి, ఏ సంపదా లేని అతనికి వివాహమవడం కష్టం. అందుకని ఫిరాయింపు పెళ్ళి చేయ నిశ్చయించారు. వయసు మీరిన రాయప్పావధానికి ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు. భార్య పోయిన అతనికి చిలకమర్తివారి చెల్లెలయిన సుబ్బమ్మను, వరదా కుటుంబరావుకి రాయిప్పావధాని కూతురు పళ్ళాలమ్మను, ఇచ్చి ఫిరాయింపు పెళ్ళి (కుండమార్పిడి) నిశ్చయించారు. అప్పటికి సుబ్బమ్మకి తొమ్మిదేళ్ళు. ఆ సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని "మొదటి కళత్రము పోయినపుడు రెండవ పెండ్లి చేసుకొనుటకు ఎంత వయసు గలవారైనను సందేహింపరు. పిల్లనిచ్చుటకు సిగ్గుపడక, ధనమున కాశపడియో, బంధువుల ప్రేరణకు లొంగియో, తమ కూతుని ముసలి దయ్యములకిచ్చి ముడివేసి బలియిత్తురు కదా" అన్నారు. స్వీయచరిత్రతో చిలకమర్తివారి చెల్లెలు, ఆ ముసలిమగనితో కాపురము చేయక్కరలేకుండ, వైధవ్య మనుభవింపనక్కర లేకుండా రెండు నెలలు తిరక్కుండా మరణించింది. ఈ సంఘటన జరిగి నప్పటికి చిలకమర్తి వయసు ఐదు సంవత్సరాలు. వారి పసి మనసును కదల్చివేసిన ఆ సంఘటనే చిలకమర్తిచేత అన్ని ప్రహసనాలు రాయించింది.

వివాహ ప్రహసనాలు అర్థాశ్రయహాస్యాన్ని కలిగినది. అర్థాశ్రయ హాస్యము ఉక్తిమూలము, శక్తిమూలము అని రెండు విధాలు. ఇక్కడ హాస్యము వెక్కిరింత: వేళాకోళములకు చెందింది.

చిలకమర్తి వారికి శ్రాద్ధకర్మలలో నమ్మకములేదు. 1895 లో చిలకమర్తి వారి తండ్రి మరణించారు. కర్మయథాప్రకారంగా జరిపించారు. కర్మలమీద నమ్మకములేకపోయినా, తల్లికి బంధువులకు ఆగ్రహము కలుగకూడదని యధావిధిగా జరిపించినట్లు స్వీయ చరిత్రలో తెల్పారు.

బలవంత బ్రహ్మణార్థ ప్రహసనంలో అన్నంబొట్లు "మీరన్న మాట నిజమే. మీ శ్రాద్ధమే వొచ్చిందిలెండి" అంటాడు దామోదరయ్యతో, ఇక్కడ అర్థగతహాస్యంలో అపహాస్యభేదముంది.

వృత్తిస్పర్ధలను, వృత్తులను చేపట్టే వారిలోనుండే ఈర్ష్యలను నిశితంగా విమర్శించారు. వివిధ ప్రహసనాలు, మనుష్యులలో ఈర్ష్య ఎంతటి దుర్నీతికి దారితీస్తుందో తెల్పేది కనకశునక ప్రహసనం, కామశాస్త్రి ఇంటికి రామదీక్షితులు వస్తాడు ఒకరోజు కుక్కపాలు తన పిల్లాడుతాగాడని. దానికి ప్రాయశ్చిత్తం చెప్పమని అడిగాడు. రామదీక్షితులపై తనకున్న కసి తీర్చుకోడానికి ఇదే సమయమని తలుస్తాడు కామశాస్త్రి. శాకటాయన శాస్త్రం ప్రకారం నాలుక కొయ్యాలని, భాండాయనుల ప్రకారం ఎర్రగాకాల్చిన ఇనుపముక్కతో నాలుక కాల్చాలని, చెప్తాడు. ఈ శిక్షచాలా కఠినమైందని, చెప్తూ, కుక్క పాలు తాగిన పిల్లల్లో కామశాస్త్రికొడుకు కూడా వున్నాడంటారు. వెంటనే శాస్త్రార్థాన్ని మార్చేస్తాడు గండాయన శాస్త్రం ప్రకారం, ఆదివారంనాడు ఎనిమిదేళ్ళపిల్లాడు నాల్గుఘడియలవేళ కుక్కపాలు తాగితే తప్పులేదని, ఉందని కనకశునకదానాదులు, కఠినమైన శిక్షలు అక్కరలేదనిచెప్తాడు. శాస్త్రార్థాలు స్వార్థ లాభాల కోసం ఎంత తేలికగా తలక్రిందులు చేయగలరో పండితులు అనడానికి ఇది నిదర్శనం.

ఆనాటి సంఘంలో ప్రబలిన దురాచారాలలో భోగం "మేళాలొకటి, మేళం పెట్టించటం ఘనత అని భావించే రోజులవి. శ్రీరామ

నవమి పందిరి అనే ప్రహసనంలో పందిరిలో రామాయణం చెప్పిస్తున్నా ఎక్కువమంది రాలేదు. దానికి కారణం "సీ పందిట్లో ఏం గొప్ప వుందని, అప్పో సొప్పో చేసి భోగంమేళం పెట్టవోయి బాబూ అంటే విన్నావా.... వాళ్ళు శోభన దేవతలు-వాళ్ళతోనే పందిళ్ళకి కళాకాంతు లొస్తాయి. నీవీమధ్య ఇగ్లీంషు చదువుకున్న నిర్భాగ్యులను చేరదీసి భోగము మేళముడు పెట్టనన్నావు, అరుణాచలం వంటి భోగంది వచ్చి మన పందిట్లో క్షణంసేపు నిల్చుంటే చాలు మహలక్ష్మి తాండవ మాడి పోదా" అంటాడు. ప్రహసనాల్లో యువకుల్ని సంఘసంస్కరణవైపు మరల్చడంకోసం చిలకమర్తి చాలా ప్రయత్నం చేశారు. కందుకూరి వారి అనుయాయిలుగా సంఘసంస్కరణ, నీతిబోధ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఔషధ ప్రకటనలు, పెండ్లికొడుకుల ధరలు, సప్తగహ కూటమి, గొప్ప వైద్యుడు, ఆకాశ విశ్వవిద్యాలయము, లండను సంకల్పము, పితృదేవతల మహజరు, చాకలిపురాణము, రాక్షస సంవత్సర పంచాంగము.— ఇలాటి వెన్నెన్నో ప్రహసనాల జతలో చేరినా, పూర్తిగా ప్రహసన లక్షణాలు లేకపోబట్టి వ్యాసలక్షణాలు కొంత వరకు కలిగివుండబట్టి, వ్యాఖ్యానాత్మకాలు కాబట్టి. వీటిని వ్యాసాలు అనటానికి వీలులేదు. వ్యాసరూపాన్ని వెలిగిన ప్రహసనాలవుతున్నవి, వీటిల్లో హాస్యం శబ్దాశ్రయ, అర్థాశ్రయాలను కలిగిందే ఎక్కువగా వినిపిస్తుంది.

ఔషధ ప్రకటన లలో, మందులు—

"జ్వరమాషిక పూర్ణాలము—దీనిని సేవించినవారికి సమస్తమైన రోగములు నశించును. దీని పథ్యము సులభము, అన్నము, రొట్టి, సమస్తమైన కూరలు, సమస్తమైన పండ్లు, పాలు పెరుగు, మజ్జిగ, నెయ్యి. నూనీ, దుంపలు, ఉప్పు, పులుపు, కారము, పిండివంటలు, కందులు, శెనగలు, మినుములు, పెసలు, మంచినీళ్ళు వర్జింప వలయును. తక్కినవన్నియు పుచ్చుకోవచ్చును."

అజీర్ణము పోగొట్టే మందుల పేర్లు—

"అజీర్ణ మహాజీమూత ఝంఝామారుతము, అగ్నిమాంద్య వృశ్చిక కుక్కుటము. వాతసర్పగారుడము—ఈ మందులు పుచ్చుకొన్నవాని కడుపు వేసవికాలమున పగలు రెండు జాములవేళ యిసుక తిప్పపై ఎర్రరాళ్లు ఎలాగున భగభగ కాలుచుండునో అలాగు కాలుచుండును" ఈ మందు తయారగుటకు వాడిన వస్తువులు - కస్తూరి కుంకుమపువ్వు, పచ్చకర్పూరము మొసలి చేదుకట్టు, పాము చేదు కట్టు, నెమలిఈకలభస్మము, పెద్దపులి పాలజున్ను, పిల్లిపాలమీగడ, సివంగి పాలవెన్న, సింహము గుండెకాయ, ఏనుగు దంత చూర్ణము.

ఈ ప్రహసనాలలో శబ్దాశ్రయ హాస్యముంది. ఆడంబర పద ప్రయోగంవల్ల హాస్యం జనిస్తుంది. అలాగే క్లిష్టపదప్రయోగం కూడా హాస్యానికుపయోగిస్తుంది. యమకంతోకాని, అను ప్రాసతోకాని శబ్దవైచిత్రిని సాధించవచ్చు. అర్థాశ్రయ హాస్యంలోని ఉక్తి హాస్య విభాగం ఉంది. అవి ప్రగల్భోక్తి నమ్మటానికి వీల్లేని విషయాన్ని నమ్మించటం,

చిలకమర్తి వారి ప్రహసనాలన్నీ సంఘసంస్కరణ నుద్దేశించి రచింపబడినవే. నవ్వు అనేది సంఘము వ్యక్తిని విమర్శించడానికుపయోగించే ఆయుధంలాంటిదే, ఒకవ్యక్తిని చూసికాని, సంఘటన చూసికాని నవ్వుతున్నామంటే ఒకవిధంగా విమర్శిస్తున్నామని అర్థం. ఇలా నవ్వటంలో ఒక సత్యపరిశీలనా దృష్టి, ఒక బోధనీయమైన నీతి లేకపోలేదు. ప్రహసనాలన్నీ ఆ ప్రయోజనాన్ని సాధించాయి. ఈ హాస్యాన్ని ఎన్నోరకాలుగా విభజించినప్పటికీ, అన్నిటి వెనక కనిపించేది. ప్రబోధాత్మకతే, అర్థాశ్రయ, శబ్దాశ్రయ, భావాశ్రయ హాస్యాలు చిలకమర్తివారి ప్రహసనాలలో ఎక్కడ చూచినా, కనిపిస్తాయి. హాస్యాన్ని తన రచనలో పొందుపరిచేందుకు కవికి ప్రతిభతోపాటు భాషలో ఉండే వడుపు పలుకుబడి తెలిసివుండాలి.

మన సాహిత్యంలో హాస్య రసపోషణ రాజులకాలంలో ఉదాత్త సాహితీ ప్రయోజనాన్ని ఆశించాలి. సంధియుగంలో హాస్య రసపోషణ వినోదార్థం బయలుదేరింది. కందుకూరి వారి యుగం లో హాస్యరస పోషణ సంఘసంస్కరణార్థం బయలుదేరింది. ఆధునిక యుగంలో బయలుదేరిన ప్రహసనాలన్నిటిలోనూ కనిపించే హాస్యం వినోదార్థకంగా కన్నా, సంఘ విమర్శనార్థకంగానే ప్రయోగింపబడింది.

డా|| ముక్తేవి భారతి

సమగ్ర గ్రామీణాభివృద్ధిలో గిరిజన ప్రాంతాలు

భారతదేశము అధిక గ్రామాలతో కూడిన వ్యవసాయ ప్రధాన దేశము మన ఆర్థికవ్యవస్థ అభివృద్ధితీరు గ్రామాలఅభివృద్ధిపైననే ఆధారపడివుంది. ఈనాడు ప్రపంచము అంతట ఆర్థికాభివృద్ధికి గ్రామీణాభివృద్ధి అనేది ఒక ప్రాథమిక వ్యూహముగా పరిగణించడము జరుగుతూ వుంది. మన దేశములోని గ్రామీణ ప్రాంతాలలో జనబాహుళ్యం వలన నిరుద్యోగము మరియు పేదరికము దృష్ట్యా గ్రామీణాభివృద్ధి సాధించవలసిన అవసరము ఎంతైనా వుంది. గ్రామీణ పేదరికమును రూపుమాపి నిరుద్యోగ సమస్యను నివారించే ప్రధాన లక్ష్యాలతో "సమగ్ర

గ్రామీణాభివృద్ధి పథకము" ప్రారంభించబడినది. ఈ పథకము 1978–79 సంవత్సరములలో ప్రారంభించబడి అక్టోబర్ 2, 1980 నుండి వరంగల్ జిల్లాలోని అన్ని బ్యాంకులకు విస్తరించబడినది. ఈ పథకము సార్థకమైన స్థానిక ప్రణాళిక ద్వారా అందుబాటులో ఉన్న స్థానిక వనరులను ఉపయోగించుకుంటూ దారిద్ర్యాన్ని నిర్మూలించుటకు ఉద్దేశింపబడినది. ఈ పథకము చిన్న ఉపాంత వ్యవసాయదారులు, భూమిలేని వ్యవసాయ శ్రామికులు, వ్యవసాయేతర శ్రామికులు చేతి వృత్తులవంటి ప్రత్యేక వర్గాల వారికి ఉద్దేశించబడినది. 1980 సంవత్సరమునుండి సమగ్ర గ్రామీణ అభివృద్ధి పథకము అమలుకు గాను వరంగల్ జిల్లాలో గుచ్ఛదృక్పథము క్లస్టర్ అప్రోచ్ ను అనుసరించబడుతు వున్నది. ఈ దృక్పథము క్రింద వరంగల్ జిల్లాలోని ప్రతి పంచాయితి సమితిని [మొత్తం పంచాయితి సమితుల సంఖ్య 15] 4 భాగాలుగా విభజించబడినది. సమగ్రగ్రామీణాభివృద్ధి పథకమును అమలు చేయుటకై జిల్లాలోని ప్రతి బ్యాంకులో మొదటి భాగము 1981 – 82 సంవత్సరములో చేపట్టడము జరిగింది. 1982–83 లో 2 వ భాగమును చేపట్టడము జరిగినది. 1983-84 మరియు 1984–85 సంవత్సరములలో వరుసగా 3వ, 4గవ భాగాలను సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకమును అమలు చేయుటకు నిర్దేశింపబడినది.

వరంగల్ జిల్లాలో గూడూరు మరియు ఏటూరు నాగారములను రెండు పంచాయితి సమితులను గిరిజన ప్రాంతాలుగా గుర్తించబడినవి. ఈ రెండు ప్రాంతాలలో అధిక సంఖ్యాకులు గిరిజనులు. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకము క్రింద ఈ రెండు గిరిజన ప్రాంతాలను ప్రజల సమగ్ర అభివృద్ధికి గాను అన్ని విధాల ఆర్థిక సహాయము చేయబడుతున్నది. గిరిజన పేద వాళ్ళలో అతి పేదవాళ్ళను దారిద్ర్య రేఖపైకి తెచ్చేందుకు వరంగల్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సబ్సిడి రూపంలో అన్ని విధాల ఆర్థిక సహాయమును సమకూర్చడమేకాకుండా వాణిజ్య బ్యాంకులు లేదా సహకార బ్యాంకుల నుండి సంస్థాపరమైన పరపతిని షెడ్యూల్ కులాల, వెనుకబడిన తరగతుల సహకార సంఘముల నుండి మార్జిన్ మని [మార్జిన్ద్రవ్యం] అందజేయడము జరుగుతుంది.

ఈ రెండు గిరిజన ప్రాంతాలలోని జనాభా, మొత్తము గ్రామాలు ఉపాంత చిన్న మధ్యరకం వ్యవసాయదారులు మరియు వ్యవసాయ శ్రామికుల వివరాలను పట్టిక–1 తెలియజేస్తుంది.

మొత్తం వరంగల్ జిల్లాలో స్థానిక వనరులను, అభివృద్ధి సంభావ్యతను పరిగణనలోకి తీసుకొని సాధ్యమైనంత వరకు తగిన కార్యక్రమాలకు రూపకల్పన చేసి–ఈ క్రింది ముఖ్యమైన 9 రంగాలను సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకము క్రింద చేపట్టడము జరిగింది. అవి 1. వ్యవసాయ రంగము 2. పశుసంవర్థక రంగము 3. చిన్నతరహ నీటి పారుదల రంగము 4. మత్స్యరంగము 5. సెరికల్చర్ రంగము 6. సామాజిక అడవుల రంగము 7. ట్రైసెం 8. పరిశ్రమల–సేవ వ్యాపారరంగము 9. ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగము 1982– 83 సంవత్సరములో ఏటూరు నాగారము మరియు గూడూరు గిరిజనసమితులలో వివిధ రంగాల క్రింద ఎన్ని కుటుంబాలకు ఎంత పరిమాణములో ఆర్థిక సహాయము సమగ్ర గ్రామీణాభివృద్ధిక్రింద చేయబడినది. అనే అంశాన్ని తులనాత్మక దృక్పథముతో పట్టిక–2 తెలియజేస్తున్నది.

జిల్లాగ్రామాభి వృద్ధి సంస్థ వరంగల్ ఐ. ఆర్. డి. పి. క్రింద సమకూర్చిన ఆర్థిక సహాయము వలన ఏటూరు నాగారము – గూడూరు లను సరిపోల్చినపుడు ఏటూరు నాగారం సమితిలోనే అధికముగా ఆర్థిక సహాయం గిరిజనులకు సమకూర్చబడినది. అని పట్టిక–2 తెలియజేస్తుంది. జనాభాను బట్టి గూడూరులో అధిక జనాభా ఉన్నట్లు తెలియుచున్నది. అయితే పట్టిక–2ను పరిశీలిస్తే అంతిమ లక్ష్యంగా పెట్టుకున్నా మొత్తం కుటుంబాలకు లాభము సమకూర్చబడలేదు. ప్రతిర ంగములోను వాస్తవముగా సాధించిన ప్రగతికి, ముందు నిర్ధేశించుకున్న అంతిమ లక్ష్యానికి ఎంతో వ్యత్యాసం ఉన్నట్లు పట్టిక–2 తెలియజేయుచున్నది. ముందు నిర్దేశించుకున్న లక్ష్యాలను కనీసము 50 శాతము అయినా సాధించలేదని పట్టిక–2 తెలియచేయుచున్నది, అందువలన అన్ని కుటుంబాలకు లాభం కల్గక ప్లోవడము గాకుండా వారిని అప్రతిష్ఠ చేయుటవలన వారికి నిరాశ నిస్పృహలు బయలు దేరి గ్రామీణ వాతావరణము కలుషితము అయ్యే అవకాశమున్నది. ఇది గ్రామీణాభివృద్ధిని నిరోధించును. కావున ముందుగానే నిర్దేశించుకున్న కుటుంబాలకు అన్ని విధాల ఆర్థిక సహాయము అందేలా కనీసము 1983-84, 1984 – 85 సంవత్సరాలలో మూడవ, నాల్గవ భాగం చేపట్టినపుడే గూడూరు – ఏటూరు నాగారం గిరిజనులకు సమగ్ర గ్రామాభివృద్ధి పథకము వలన లాభము చేకూర్చినపుడే ఆ పథకానికి సార్థకత సమకూరుతుందని ఆశిద్దాము.

పట్టిక – 1

క్రమ సంఖ్య	సమితి పేరు	మొత్తం జనాభా	మొత్తం గ్రామాలు	ఉపాంత వ్యవసాయదారులు	మధ్యరకం వ్యవసాయదారులు	చిన్న వ్యవసాయదారులు	వ్యవసాయ శ్రామికులు
		1981 ప్రాథమిక జనాభా లెక్కలుఆధారము		భూకమతాల లెక్కలు		ఆధారము	
1.	ఏటూరునాగారం	65,548	103	4,788	1,880	2,984	12,279
2.	గూడూరు	1,02,508	106	16,484	3,056	5,842	17,423

పట్టిక – 2

ఆర్థిక సహాయము చేసేందుకై ఎన్నుకున్న రంగము మరియు సమితి	ఐ. ఆర్. డి. పి. క్రింద ఎన్నిక చేయబడిన గ్రామాలసంఖ్య	సహాయము చేసేందుకై లక్ష్యంగా పెట్టుకున్న కుటుంబాల సంఖ్య	సహాయము చేయబడిన కుటుంబాల సంఖ్య	సబ్‌సిడీ రూపములో అందజేయబడిన ఆర్థిక సహాయము లక్షల రూపాయలలో
ఏటూరునాగారం సమితి				
వ్యవసాయరంగము	37	215	108	1,580 లక్షలలో
చిన్నతరహా నీటిపారుదల రంగం		74	24	0,519
పశుసంవర్ధక రంగం		125	95	1,209
పరిశ్రమసేవ – వ్యాపారరంగం		160	59	0,800
ట్రైజం		–	–	0,125
గూడూరు సమితి	20			
వ్యవసాయ రంగం		195	85	0,924
చిన్నతరహా నీటిపారుదల రంగం		90	18	0,362
పశుసంవర్ధక రంగం		100	45	0,674
పరిశ్రమ సేవా వ్యాపార రంగం		185	12	0,078
ట్రైజం		–	–	0.005

ములుకల ఉపేందర్
అర్థశాస్త్ర విభాగములో రిసెర్చ్‌స్కాలర్

ఎ. సదానందం
అర్థశాస్త్ర విభాగములో ఉపన్యాసకులు
కాకతీయ విశ్వవిద్యాలయము.

ఆనంద భిక్షువు-విశ్వప్రేమతత్త్వము

"కిమపి న బహువదేయం ధర్మం యుష్మాకమర్థ నరయుక్తం
నచ తత్ర ప్రతిక్షేధా నత్ర ధర్మస్య అపరాధః"

అని బోధించిన బుద్ధభగవానుని ప్రధాన శిష్యుడగు ఆనంద భిక్షువు పేర వెలసిన ఈ కావ్యము శ్రీ వానిలి వేంకట లక్ష్మీనరసింహారావు గారిచే విరచితము. ఏకాశ్వాసముల ఈ బౌద్ధ కావ్యమునకు రవీంద్రుని రెండంకముల "చండాలిక" యను నృత్యనాటిక యాధారము. మంత్రశక్తికి, ధ్యానశక్తికి గల తారతమ్య వివరణము ఈ కావ్యేతివృత్తము.

పలువురు ఆధునిక కవుల వలె వీరును బౌద్ధము నందలి త్యాగావిష్టమగు మానవత్వముచే నాకర్షితులు. సర్వసమానత్వ సంఘ స్థాపనకు తోడ్పడిన పెక్కురు బౌద్ధ భిక్షువులలో ఆనందభిక్షువు వీరి నాకర్షించినారు.

బుద్ధభగవానుని ప్రధాన శిష్యుడగు ఆనందుడు ప్రకృతి యను చండాల కన్యక చేత నీరు పోయించుకొని త్రాగినాడు. అంతకు పూర్వమే ఊరివారిచేత కులహీనురాలని అవమానముల పొందియున్న ఆమె, ఆనందుని సర్వసమానత్వ భావము నెరుగలేక, అతనిని ప్రేమించినది. మాంత్రికురాలగు ఆమె తల్లి, తనయకై ఆనందుని మంత్రబలముచే నాకర్షించి యతని ధ్యానశక్తి కెదురు నిలువలేక తన ప్రాణముల కోల్పోయినది. అప్పటికిగాని తన కోర్కె యందలి యనౌచిత్యము నెరుగలేని ప్రకృతి, తనయందలి ప్రణయమును, విశ్వప్రేమగ పరిణమింపచేసికొనినది. ఇది 'ఆనందభిక్షువు' నందలి యితివృత్తము. బౌద్ధ గ్రంథమగు క్షేమేంద్రుని "అవదాన కల్పలత" యందు శార్దూల వర్ణావదానమున చండాలకన్యక వృత్తాంతము ప్రసక్తమై యున్నది. రవీంద్రకవి 'చండాలిక'కు ఈ యవదానమే ఆధారము.

ఈ కావ్యమునకు వ్రాయబడిన 'ముందుమాట'లో కీ.శే. విశ్వనాథవారి పలుకులిట పరిశీలనార్హములు. "రసగంగాధర కర్త సూక్తి ననుసరించి, ప్రతిభావంతుడైన మహాకవి, కావ్యానుగుణముగ నేదేని శాస్త్రమును ప్రవచింపవలసి వచ్చినపుడు, పూర్తిగ వివరింపక వదలుట అతని వ్యుత్పత్తి జ్ఞానవిహీనతకు సూచకమగును. కనుకనే కులాచారముగ బహుమంత్రశక్తుల నెరిగిన నీకవి తనకు పరిచయముగల మంత్రశక్తిని గూర్చి విపులీకరించినారమట విశ్వనాథవారి మతము. కాని ఆధునిక కావ్యలక్షణములను పరిశీలించిన యిట్టి వర్ణనాదుల విపులీకరణ కావ్యత్వభంజకమగునని తెలియును. సంక్షిప్తతయే కావ్యజీవముగ భాసించు ఆధునిక యుగమున, కవి మంత్రశక్తిని, ఆ పూజావిధానము నింతగ వర్ణించుటకు కారణము, అట్టి బలవత్తరమైన మంత్రశక్తి ఎట్లు ఆనందుని ఆత్మశక్తి ముందు నిర్వీర్యమై పోయినదో చూపి, బౌద్ధము నందలి ధ్యానశక్తి మహిమను విపులీకరించుటకే అని నా యభిప్రాయము.

ఈ కావ్యనాయిక యగు చండాల కన్యక పేరు ప్రకృతి. ఆమె తల్లిని మాత్రమే ఎరుగునది. తండ్రి ఆమె చిన్నతనముననే మరణించినాడట! ఈ తల్లి అవిద్య. కర్మ ప్రవాహరూప కామ్యాభి పరతంత్ర. ఆ తల్లి గర్భము నుండి జననమందిన జీవనశక్తియే ప్రకృతి. ఈ ప్రకృతికి తల్లి బ్రదికియున్నంతకాలము ఆనందుని చేరు భాగ్యము లేదు. ఈ ఆనందుడే పరమానంద స్వరూపమగు నిర్వాణము.

కవి, నాయిక యగు ప్రకృతికి సంబంధించిన అవిద్యను వర్ణించుటయందు మిగుల శ్రద్ధ కనబరచినారు.

అవిద్యానాశమునకు విశుద్ధిమార్గము నవలంబించి విజ్ఞానము పొందుట తగినది. ఈ సిద్ధాంతమే తరువాతి బౌద్ధశాఖలో విజ్ఞానవాద మను పేర తలసూపినది. "పరమ విజ్ఞానశేవధి యట నా తండ్రి కలవయిపోయె మా కండ్ల నెపుడో"- అనిన ప్రకృతి పలుకులలో, ప్రకృతియు, నామె తల్లియు నెట్లు జ్ఞానరహితులై యవిద్యచే నావరింపబడియున్నారో- సూచించినారు కవి.

తన కుమారై కోరునది ఆనంద భిక్షువని తెలియగనే ప్రకృతి మాత "హృదయం బాకంపముంబొంద" తడబడినది. ప్రకృతి తన మాల కరమెత్తి నీరువోసి తపసి వర్యుని పావనత్వంబు భంగపరచినదని వెఱగందినది. దీనికి ప్రకృతి యొసగిన జవాబు ఆమెలోని ఆత్మ చైతన్యమునకు గీటురాయి.

మాలను మాలనంచు మతిమాలిన మాటల నాత్మనిందకున్
బాలుపడంగనేల ? భువిపై జనులందరికున్న జీవమే
మాలకునుండె జీవములమధ్య నభిన్నత గల్గ జీవులం
దేల విభిన్నతల్? సమతయే సుమతమ్మని నమ్మమమ్మరో! 5-17

అనుచు "జన్మములర్థశూన్యములు, జ్ఞానవివేకములే సమర్థముల్" అనియు చాటినది. ప్రకృతి అంతకుముందు ఆమెకు బౌద్ధధర్మముతో పరిచయము లేదు. ఇపుడు కూడ ఆమెకు బౌద్ధమును గూర్చి విపులముగ తెలియదు. మానవులందరు సమానమన్న బౌద్ధభావము మాత్ర మామెలో బలబడినది. కవి యిట్లు సమయము వచ్చినపు డంతయు బౌద్ధ ప్రధాన సిద్ధాంతములను చెప్పుట మరచిపోలేదు.

ఆనందభిక్షువునుండి ప్రకృతి ప్రణయ భావమును మరలింప ప్రయత్నించియు, కుమారైకై తన మంత్రశక్తిని ప్రయోగింప సమకట్టినది ప్రకృతిమాత. ఎంతో ప్రయత్నముమీద గాని అంజన పేటి

కలో ఆనందుని రూపమును ప్రకృతికి చూపలేకపోయినది. కుమార్తె యసంతృప్తినిగాంచి, సత్యశౌచదయం ధర్మసాధుశీలియితడు, అంజ నల కంతగా నందడ" ని పలికి దివ్యదర్పణమున నతని రూప మును చూపినది. బౌద్ధమున నిర్వాణ సాధకమగు ఆర్యాష్టాంగ మార్గవైశిష్ట్యము నిట ఆనందుని ప్రశంసలో కవి ప్రస్ఫుటము గావించి నారు. అంతేగాక ప్రకృతి వృత్తాంతమున నొక చమత్కారమును చూపినారు. అంతవరకు నూహ తెలియని ప్రకృతికి ఆనంద భిక్షువు పరిచయమున నొక చైతన్య మబ్బినది. ఆ వ్యక్తి నిష్ఠమైన ప్రణయ మును సంఘనిష్ఠమైన విశ్వప్రేమగ పరిణమింప జేయవలయును. అదియే బౌద్ధధర్మ ధ్యేయము. దానికి వలసిన అంగముల నన్నిటిని కవి సమకూర్చు కొనుచునే వచ్చినారు. ఆమెలో చైతన్యము పొడ సూపెనదేగాని, అవిద్యానాశము జరుగలేదు. కాని అవిద్యచాటున ఈ చైతన్యము మేఘముల మధ్యమున మెరుపుతీగవలె నటనట ప్రతిఫలించి నది. ఆనందుని మనోజ్ఞ మానసమునందు తానొక సుందరరాజ హంసియై జీవనతత్త్వమరయవలెనని ఆశించినది. ప్రేమమూర్తియౌ అమ్మని కోసమై బ్రదుకునైన త్యజింతుననినది. ఇట కవి యొక సుందరతమమైన బౌద్ధతత్వరహస్యమును చెప్పినారు.

ఆనందభిక్షువు సాహచర్యముచే ప్రకృతియు నిర్వాణపథగామిని కాబోవుచున్నది. అమెకు తెలియనట్టి ఆగామ కర్మము నామె నోటనే పలికించి, బౌద్ధధర్మమున కొక పరిపుష్టిని గూర్చినారు కవి.

జీవ కారుణ్యతత్త్వము నాలపించు ఆనందునితో ఆమె మొదటి పరిచయము జరిగి, అతని మాటల వలన బౌద్ధ ధర్మ పరిచయము లభించి వికసిల్లిన చైతన్యమింకను అవిద్యావృతమే. అయిఉన్నది. కనుకనే ఆమెకు దివ్యదర్పణమున కవి ఆనందుని చూపించుటతోబాటు బుద్ధుని ధర్మసూక్తులను గూడ వినిపించినారు.

కలయనేసిన గృహము పైకప్పునుండి
వానచినుకులు జొచ్చి రాలేని యటులు
స్థిరవివేక సంపన్నుని చిత్తమందు
విషయవాంఛలు ప్రసరింప వీలుపడదు. (6-5)
మల్లికావల్లికలు కన్న మమత విడచి
వాడినట్టి పూవులు రాల్చివైచు నటులు
భిక్షులెల్లరు తెగ ద్రుంచి వేయవలయు
రాగ విద్వేషములు పరిత్యాగబుద్ధి" (6-8)

అను సూక్తులందు కవి సందర్భానుసారముగ ధర్మపదసూక్తులను కావ్యమున చొప్పించి, వలసినంత ప్రయోజనమును సాధించినారు.

ధర్మచక్ర ప్రవర్తన నాలకించుచున్న నానందునిలో హఠాత్తుగ నేర్పడిన సంచలనము ప్రకృతి మాతచే ప్రయోగింపబడిన అభిచార ప్రయోగ ఫలితమని బుద్ధుడు గురుతింపగలిగినాడు. కనుకనే జీవ బలిసేయు జన్నముల కన్న స్థిత ప్రజ్ఞత గొప్పదని బోధించినాడు.

ఆనందమౌని ఆత్మశక్తి కద్భుతమందిన ప్రకృతి కొన యూపిరితో నున్న తల్లిని గాంచి భీతిల్లినది. ఈ భీతివలన నేర్పడిన ఆత్మవిమర్శలో ఆమెలోని అవిద్యకొంత పలుచనైనది. కాని ప్రకృతి తల్లియందు పట్టుదల పెరిగినది. ఇటనుండియే ఆ యిరువురి మార్గ ములు వేరైనవి. ప్రకృతి తల్లి మరింత నిష్ఠతో పూజచేసి "మాణిక్యదోదార మంత్రరాజమున" కును ఆనంద భిక్షువు లొంగకుండుటకు సివమెత్తి, త్రైపురాకర్షగోదాత్త మంత్రమును పఠించినది. సత్త్వ సంత్రాసమై తోచిన తమః ప్రకృతిలో పిడుగులతో వర్షము కురియ నారంభించినది. బుద్ధబోధలో మునిగియున్న ఆనందమౌని "నటదుల్లోల నదీతరంగములపై నర్తించు రాయంచవలె" ఆ ప్రవాహమున తేలియాడుచు, "పాతకలి జీపమెడలిన చూతము పెనువెల్లి సుడియంచు వచ్చినటుల - అచేతనుడై ప్రకృతి చెంత వ్రాలినాడు.

దర్పణమున అనందుని రాకను గమనించుచున్న ప్రకృతి బుద్ధబోధను సమిత మాలకించినది. ఆమె యెరుగకయే ఆమెలోని చైతన్యము జాగృతమైనది. ఆనందభిక్షువు తనచెంత చేరినందులకు సంతసించుచు అతని మోము గాంచిన ప్రకృతి సర్పదష్టవలె భీతిల్లినది. కళలుడిగిన ఆనందమౌని మోమును, ప్రణయశూన్యమ్ము, శవ సన్నిభమునైన అతని వికారపు దనువును చూడలేకపోయినది. అచేతనుడైన యానందుని దర్శనముచే అవిద్యావిముక్తి నందిన ప్రకృతి మొదలో తనకై అత్మశక్తిని బలివెట్టి జీవముల కోల్పోయిన తల్లి శరీరము వైరాగ్య కేల నుదయింపజేసినది.

ఈ వైరాగ్యభావ మెంతవరకు వ్యాపించినదనగా, "ప్రాణము ప్రాణమౌ అమ్మ విడిచి యెందుబోవుడు" నని యొకప్పుడు చింతించిన ప్రకృతి, తన ప్రాణమౌ అమ్మ, తన ప్రాణముల కోల్పోయినపుడు ఒక్క కన్నీటి బొట్టునైన విడువలేని స్థితినందినది. ఆ యనుభూతిలో ఆమెకు ఆనందభిక్షువుపైగల స్వార్థప్రేమ, జాతిమత వర్ణాది స్వార్థ రహితమైన విశ్వప్రేమగ పర్యవసించినది. అట్టి విశ్వప్రేమయే మహాకరుణ. బుద్ధుడు మానవత్వమునకు ప్రథమ సోపానముగ అభివర్ణించిన మహాయాన శాఖాపరిధికి కేంద్రబిందువైన మహాకరుణ పరిణామ మిచట స్పష్టముగ చూపబడినది. విరక్తచిత్తయై మహా కరుణపూరిత ప్రణయధర్మము నరసిన ప్రకృతికి దీక్ష యనుగ్రహింపబడినది.

విహరింపుడీ మీరు విశ్వభిక్షావాటి
నకుటిల ప్రణయ భిక్షుకులుగాఁగ

పూరింపుడీ మీరు భువన భిక్షాపాత్ర
ప్రేమాన్నదాన సంప్రీతి గాఁగ
చరియింపుడీ మీరు జగతీ కుటుంబాన
పరిణత ప్రణయ సోదరులుగాఁగ
సాగింపుడీ మీరు శాంత సౌగతయాత్ర
పుడమి బౌద్ధారామ భూమిగాఁగ
ప్రకృతి నొదవెడి రాగవిరాగములకు
వికృతి నొందని యానంద విమల మతికి
శరణమగు బౌద్ధ ధర్మమ్మె శరణమగును
ప్రణయ పరితప్త నీరస ప్రకృతికైన

అన్న బుద్ధుని వాచలో బౌద్ధమునందలి విశ్వసౌభ్రాతృ భావము నిర్వాణ సాధకమగు ఆనంద విమల మార్గములు సూచితములైనవి. అంతేగాక కవి మహాయానము నందలి శూన్యము. తంత్రయానమున వికసిల్లిన విధము నిట సూచించినారు. బౌద్ధమత శాఖయగు తంత్రయానము నందు శూన్య ప్రతీకయగు భిక్షువు మహాకరుణ ప్రతీకయగు ప్రకృతితో తాదాత్మ్యము చెందినపుడు నిర్వాణార్హుడగును. ఈ సిద్ధాంతము నందలి బీజరూపమునీ సీసమున దాచినారు కవి.

రక్కసి రాతి గుండియలు ద్రవియించునట్లు గౌతమర్షి వచ శ్రుతి విశ్వవీధులందెల్లెడ మాఱుమ్రోగుచుండ కావ్యము ముగిప బడినది. క్షుద్రమైన మంత్రశక్తి, అష్టాంగ మార్గసాధకమగు ధ్యాన శక్తి ముందు ఓడిపోయిన విధమును చూపి, బౌద్ధధర్మ ప్రాభవమును నిరూపించినారు కవి.

మొదటిది నాయికకు ప్రకృతియని నామకరణము చేయుట ! స్థవిరవాదము నందతర్గతమై, మాధ్యమిక వాదమున వెలికి వచ్చి తంత్రమున విస్తరిల్లిన శూన్యవాదమిట సూచింపబడినది. నియమ శీలియగు భిక్షువు ప్రజ్ఞను సాధించి, ప్రకృతి స్వరూపిణియగు ఉపాయ, మహాకరుణ సంయోగముచే నిర్వాణార్హుడగును. ఇట ఆనందునిలోని ఆత్మశక్తిని ప్రస్ఫుటము గావించిన దర్పణమైనది ప్రకృతి. ప్రకృతి యనగ అవ్యక్త మనియు నొక యర్థము. ఆనందమౌని ధ్యానశక్తిచే వ్యక్తము చేయబడిన ఆమెలోని అవ్యక్త చైతన్యమిట సూచితము.

రెండవమార్పు కావ్యాంతమున ప్రకృతి తల్లి మరణము. ప్రకృతి మాత జన్మచే అజ్ఞానురాలుగాదు. ప్రపంచపు పోకడ తెలిసినది. కనుకనే కుమార్తె కోరిక యందలి యనౌచిత్యము నెరిగి ఆమెనా ప్రయత్నమునుంచి మరల్ప జూచినది. చివరకామెలోని వాత్సల్యము ఔచితీజ్ఞానమున కడ్డు నిలిచి అవిద్యను పోషించినది. వాత్సల్యముచే జనించిన మూర్ఖపు పట్టుదల జ్ఞానమును పూర్తిగా నశింపజేసెనని. ఇప్పుడామె పూర్తిగ అవిద్యాస్వరూపిణి. తల్లిని వదలి నిముసమేనియు నుండలేని ప్రకృతి స్వయం నిర్ణయములు చేసికొనలేని అసహాయురాలు. ఇంత యవిద్య ఆమెలో నున్నది గనుకనె మొదటిసారి ప్రయోగాకృష్టుడైన ఆనందునిమోము ఆమెలోని స్వార్థమును రూపుమాపలేకపోయినది. అవిద్య పూర్తిగ నశింపనిదే నిర్వాణోపలబ్ధి సాధ్యము గాదు. ఈ సూక్ష్మము నెరిగిన కవి ప్రకృతి తల్లి మరణమును చిత్రించి ప్రకృతిలోని అవిద్యా నాశమును సూచించి, మూలమునకు మెరుగులు దిద్దుట మాత్రమే గాక, బౌద్ధమునందలి సిద్ధాంతముల ప్రస్ఫుటీకరించినారు.

డా॥ రాయదుర్గం విజయలక్ష్మి

లేఖలు

రాయవాచకంలో అన్యదేశ్యాలు

పైశీర్షికతో నవంబరు 84 "భారతి" లో ప్రచురింపబడిన శ్రీరామాంజనేయులుగారి వ్యాసం ఆసక్తిదాయకముగా నున్నది. రాయవాచకములోని అన్యదేశ్యముల రూపాంతరములను వారు చక్కఁగా వివరించినారు.

అయితే అన్యదేశ్యాలుగా ఈనాడు వ్యవహారంలో ఉన్న ఉర్దూ ఫారసీ వంటి భాషలలోని పదాలనే కాక, భేరి, ధూళి వంటి తత్సమ పదాలను, ద్రావిడభాషాకుటుంబంలో చేరిన తమిళ, కన్నడ భాషల లోని పదాలను అన్యదేశ్యాలుగా శ్రీరామాంజనేయులుగారు చూపటం వింతగా నున్నది.

ఇక అన్యదేశ్యములు తెలుగు లోనికి వచ్చినపుడు పొందిన మార్పులను గురించిన కొన్ని వివరణలు సంతృప్తికరముగా లేవు. ఉదాహరణకు 2_8 లో లోపదీర్ఘతకు చెప్పిన సూత్రానికి, ఇచ్చిన ఉదాహరణలు కొన్నిటికి పొంతనలేదు. "కొన్ని అన్యదేశ్య పదాల్లో ఒక వర్ణంలోపించి దాని పూర్వాచ్చు దీర్ఘం కావటం కనిపిస్తుంది." అన్నదానికి ఉదాహరణగా ఇచ్చిన 'ముస్తయిద్' లో యి లోపించి పూర్వాచ్చుదీర్ఘమయితే 'ముస్తాదు' కావలయును. ఇట్లే 'దునియదార్' 'దునీదారు' కావలయును. ముస్తీదు, దునేదారు అను రూప సిద్ధికి పైసూత్రము సాధకము కాజాలదు.

చుబుకు అను అన్యదేశ్యమునకు మూలమైన చబుక్ 2 - 1 లో మరాఠీ పదమని, 2 - 10 లో ఫారసీ పదమని చూపబడగా శబ్దరత్నాకరములో ఇది హిందీభాషాపదంగా చెప్పబడినవి. ఇట్లేమరికొన్ని అన్యదేశ్యాలకు మూల భాషను గుర్తించటంలో రాయవాచకమున

ఇటీవల పరిష్కరించిన శ్రీరామచంద్రరావుగారిది ఒక దారికాగా శ్రీరామాంజనేయులుగారిది మరొకదారి అయినది.

రాయవాచకములోని మాటలకు రామాంజనేయులుగారు చూపిన పుట, పంక్తుల సంఖ్యలు ఇప్పుడు అందుబాటులో ఉన్న అకాడమీ ప్రతి ననుసరించి చూపినచో పాఠకులకు సౌకర్యముగా ఉండెడిది.

సూర్యదేవర రవికుమార్
కొల్లూరు

చింత్యము

భారతి జులై సంచికలో కత్తి పద్మారావుగారి - 'సాంఘిక విప్లవ రచయితలు' పుస్తకంపై శ్రీ మాలకొండయ్య గారి సమీక్ష చదివి ఈ లేఖ రాస్తున్నాను.

తెలుగుతో సాహిత్య విమర్శ దిగజారిపోయిందనడానికి చక్కని నిదర్శనం ఈ సమీక్ష.

జాతీయ భద్రతా చట్టం క్రింద నిర్బంధించదగిన వాడీ సమీక్షకుడు!

"హిందువులకు ఓర్పు ఎక్కువ. అందువలన పద్మారావుగారి వంటి వాళ్ళ 'మూర్ఖపు' వ్రాతలు క్షమించబడుతుంటాయి. రక్షింపబడుతుంటాయి. ఏమైనా హిందువులు ఉదాసీనతను మానాలని పద్మారావుగారు పరోక్షంగా హెచ్చరిస్తున్నారనుకోవాలి"— అంటూ సమీక్షకుడు భారతి సాహిత్య పత్రికాముఖంగా, ప్రత్యక్షంగా మతోన్మాదులను పద్మారావుగారి పైకి ఉసి గొల్పుతున్నారు.

సెక్యులర్ దేశంలో, మతకల్లోలాలు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ఇలాంటి సమీక్షకుల్ని జాతీయ భద్రతాచట్టం క్రింద ఎందుకు నిర్బంధించకూడదు.

"మనదేశంలో వ్యక్తిస్వేచ్ఛ పరిమితులు తప్పుతుంది."— అంటున్నారు మాలకొండయ్యగారు.

పరిమితులు తప్పుతుంది వ్యక్తి స్వేచ్ఛగాదు. మతస్వేచ్ఛ. పంజాబ్, భివాండి, హైదరాబాద్ మత కల్లోలాలిందుకు మంచి ఉదాహరణ.

హిందూమత సంస్కృతిని - భారతీయ సంస్కృతిగా బుకాయిస్తున్నారు మాలకొండయ్యగారు.

మార్క్సిస్టులకు, హేతువాదులకు కొన్ని పడికట్టు పదాలుంటాయని హేళన చేస్తూ. వాళ్ళ "పడికట్టుపదాలయిన" అశాస్త్రీయం, శాస్త్రీయ విశ్లేషణ, అశాస్త్రీయదృష్టిలాటి వాటిని అరువు తెచ్చుకొని పద్మారావుగారిని విమర్శిస్తున్న మాలకొండయ్యగారి భాషా దరిద్రానికి జాలిపడుతున్నాను. నవ్వుకొంటున్నాను.

ఆధునిక యుగంలో జీవిస్తున్న మాలకొండయ్యగారు యుగకర్త గురజాడకు- దుర్మార్గత్వాన్ని అంటగట్టడం, మహాకవి వేమనను, అభ్యుదయ రచయిత కొడవటిగంటిని తెగడటం చూస్తే, ఈయన ఈ యుగంలో వుండాల్సిన వ్యక్తి కాదనిపిస్తుంది.

ఏ రంగంలోనయినా మార్పు సహజం జుట్టు పీక్కున్నంత మాత్రాన పరిణామం ఆగిపోదు.

భారతి లాటి సాహితీ పత్రికలో ఈ తరహా సమీక్ష చదవాల్సి వచ్చినందుకు విచారిస్తూ—

స్వాజిన్
రేపల్లె

ఒక మనవి

జూన్ నెల భారతి 'కలగూరగంప'లో శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌గారు' రస సమీకరణము-భవభూతి' అన్న శీర్షికలో ఉత్తరరామచరిత్రపై ఒక సమీక్ష యొనర్చుచు - చివరగ "వీరరాఘవీయ పండితుని వ్యాఖ్య"ను ఆధారముతో వ్రాసినట్లు తెలిపినారు. ఉత్తరరామచరిత్రకు 'భవభూతి భావతల స్పర్శి' అని యొక వ్యాఖ్య కలదు. అద్దానిని వావిళ్ళవారు ముద్రించారు.

తరువాత మా మాతామహులు 'కవిభూషణ' శ్రీశైలాద్దంకి కుమారతాతాచార్యులవారు 1906న ఉత్తర రామ చరిత్రకు 'కలాఒఖ్య' వ్యాఖ్య వ్రాసి ప్రచురించారు. కాని ఇద్దానికి తగినంత ప్రచారము రాలేదు. పైన నీవ్యాఖ్యయున్నట్లు సంస్కృత సాహిత్య లోకమునకే తెలియదనుకొందును. పైన వీరు కేరళ వర్మ అను మళయాళదేశ మహారాజు వ్రాసిన "భారతీకాళిదాసః" అన్న వ్యాసమును ఖండించుచు 'భవభూతి భారతి' అను వ్యాసమును వ్రాసిపంపగా సంతసించిన రేడు 'కవిభూషణః' అను బిరుదము నిచ్చి సత్కరించినారు. దీని మలిముద్రణ యత్నము చేయు దాతలకై నిరీక్షించుచున్నది. వీరి గ్రంథములు జీవిత విశేషములనుగూర్చి నేను 'సమాలోచన' ఒక వ్యాసం వ్రాశాను.

విద్వాన్ కొమాండూరి రామానుజాచార్యులు
తా. ర. సం. అధ్యక్షులు —కందుకూరు (ప్రకాశంజిల్లా)

గ్రంథ విమర్శలు

యువభారతి ప్రచురణలు - 6

1. సంస్కృతి

[రచన : డాక్టర్ ప్రసాదరాయకులపతి వెల 3 రూ. ప్రాప్తి స్థానం : (ఆరింటికి ఒకచే) 5 కింగ్స్ వే, సికిందరాబాదు-3]

'సంస్కృతి' అనే పదం ఇప్పుడు తెలిసినవారికీ తెలియని వారికికూడ ఊతపదం అయి బాగా చలామణీ అవుతున్నట్టు తెలుస్తోంది. ఈ పదమును సంస్కృతభాషా స్వరూపము గ సాధించడమే తప్ప ప్రాచీన గ్రంథాల్లో నాకు తెలిసినంతవరకు దేనిలోనూ కనిపించ లేదు. దీనికి ఒక 'సంస్కారం'- 'కల్చర్' - అనే ఆంగ్ల పదానికి 'సంస్కృతి' అని అర్థం చెప్పటం ఆంగ్ల భాషావేత్తలవల్ల వింటున్నాను. నా మాటకేమి ! చాలామందిని సామాన్యపద్ధతిలో అర్థం అడిగితే నిజాయించి చెప్పలేనివారిని నేనెరుగుదును. కానీ నేడు నూటికి తొంభై మంది యీ పదాన్ని ఊరగాయలాగ వాడుతున్నారు. భవతు.

శ్రీ ప్రసాదరాయ కులపతి రచన ఏదైనా అర్థగాంభీర్యముతో ఉంటుందని నేనీనాడు 'సర్టిఫికెట్టు' ఇవ్వనక్కరలేదు. ఆయన నిజానికి సరస్వతీ పుత్రుడు. అతని చిన్నారికృతి యీ 'సంస్కృతి'.

దీనియందు 'భారతీయ సంస్కృతి' శీర్షికతో ఆయన ఆనాటి భారతజాతి మనుగడకు సంబంధించిన సంప్రదాయాన్ని 'ఆంధ్ర సంస్కృతి' శీర్షికతో మనజాతి సంప్రదాయాన్ని వివిద రీతుల సోదాహరణంగా రచించి పాఠకులకు అనిర్వాచ్యమైన ఆనందానుభూతిని కలిగించినట్టు నేను తరచి చదివి చెప్తున్నాను.

భారతీయ సంస్కృతి ఏకజాతీయమూ - ఏకభాషీయమూ కాదని వాదించేవారెవరైనా ఉంటే వారికీరచన విజ్ఞానదాయక మౌతుంది. ఆంధ్ర సంస్కృతి గురించి ఆయన యిచ్చిన విషయం వర్ణాశ్రమాచారాల మాటకేమిగాని ప్రపంచములో వైదిక లౌకిక ప్రవృత్తిలో ఆంధ్రజాతి ఎంత ఉత్తమస్థాయిలో ఉన్నదో అనరాదు గాని ఇప్పుడెంత అధమస్థాయికి దిగజారిందో తెలుసుకోడానికి ప్రధాన సూత్రపాఠం అవుతుంది. నేటి దుర్గతి ఆయన చెప్పలేదుగాని వ్యంగ్య శక్తితో పాఠకుడు ఇట్టే గ్రహించవచ్చు. పాశ్చాత్య దేశీయ సంస్కృతికి ఆయన ఇచ్చిన ఉదాహరణకు సమన్వయించుకొని తెలివైన పాఠకుడు దీనిని నిర్ణయించుకోవచ్చు. పరిపాలకులూ పాలితులూ కూడా చదవవలసిన ఉదాత్త రచన.

2. స్వామి వివేకానంద - కవితా వైభవము

[రచన :- శ్రీ జోగేటి అచ్యుతరామశాస్త్రి వెల 4 రూ.]

తానెవరో తెలియని అధోగతికి దిగజారిన చైతన్యాన్ని తన సునిశిత దివ్య వాక్శక్తితో లేవనెత్తిన దివ్యవాఙ్మూర్తి వివేకానంద స్వామి. తాను మానవుడుగా కనిపిస్తూ తన వాక్కుల్లో మెరుపులూ ఉరుములూ కురిపించిన బ్రాహ్మీమయ పర్జన్యుడు వివేకానందస్వామి. భారతజాతికే కాదు విశ్వమూర్తికే వివేకవర్ధనుడైన అపర సనకుడు వివేకానందస్వామి. దివ్యదర్శనుడు గురువుకాగా గురువునందు దివ్య దర్శనుడైన ప్రాగ్జ్యోతిమూర్తి వివేకానందస్వామి. ఆయన సంస్కృతంలో చెప్పిన కవిత

అంబాస్తోత్రంలో ఏడు శ్లోకాలు, శివస్తోత్రంలో ఆరు, ఎవరికి భయపడుట అనే శీర్షిక క్రింద నాలుగు శ్లోకాలు రామకృష్ణ స్తోత్రములో ఎనిమిది ఉన్నాయి. ఇవికాక గురుస్తుతిగా

స్థాపకాయచ ధర్మస్య సర్వధర్మస్వరూపిణే
అవతార వరిష్ఠాయ రామకృష్ణాయ తేనమః

అనేది ఒకటిన్నీ వీటికి అర్థ తాత్పర్యాలు ఇవ్వడమే కాక అలంకారాలు కూడా ఇచ్చి శాస్త్రిగారు పాఠకుని హృదయానికి ఆనంద ముద్ర వేశారు. ఆంగ్ల కవితలో పదకొండు పద్యాలున్నాయి. వీటిలో ఆరవది ఆ ధీర గంభీరమూర్తి వ్యక్తిత్వాన్ని చెప్తుంది. అందరూ ఆ ధైర్యాన్ని అలవర్చుకోవాలి. అది అందరికి అబ్బకపోవచ్చు.

' ఈమాయ, ఈ ఛాయ, నన్ను భయపెట్టలేవు. నేను అతడే (అహం బ్రహ్మాస్మి)- అనేభావం.

శాస్త్రిగారు వీటినిగూడా చక్కగా వివరించారు. యువభారతి ప్రచురణల్లో ఇది శాఖోల్లీఢమైనది.

3. వాగ్భూషణం భూషణం

[రచన 'డాక్టర్. ఇరివెంటి క్రిష్ణమూర్తి, వెల. రు.2-00]

'లక్ష్మణా! ఈయనమాట విన్నావా? అనిరాముడు బ్రహ్మచారి వేషముతో వచ్చి రామలక్ష్మణుల ఎదుటనిల్చి మటాడిన హనుమ ద్వాశిని ప్రశంసిస్తూ లక్ష్మణుడితో హెచ్చరికగా అంటాడు జాగ్రత్తగా మాటాడాలి అని

వాల్మీకి రామాయణములోని ఈ మాటలు చదివి యీ రచన చేయాలని తలంపుకలిగి భర్తృహరి శ్లోకములో నాల్గవపాదమందలి 'పదాలు' రెండూ తన రచనకి పేరుపెట్టినట్టు రచయిత శ్రీ కృష్ణమూర్తి మాట.

'వాగ్భూషణమే సుభూషణము'

'భూషణములో నశియించు నన్నియున్'— అని భర్తృహరి శ్లోకానికి శ్రీ ఏనుగు లక్ష్మణకవి తెలుగుసంతరించాడు.

మనిషి ఎలామాటాడాలి ? ఆ మాటకారితనానికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి ? ఏలా మాటాడగూడదు ? అభినయం వాచికంగా ఆంగికంగా ఎంతవరకువక్తకు అవశ్యకం? స్వరస్థాయి ఎలాఉండాలి. అనే ప్రశ్నలకు యీ రచన చక్కని సమాధానం ఇస్తుంది.

'టెంకాయపిచ్చికొండి' అన్నాడట ఒకపురోహితుడు. ఆదేమిటలా అంటున్నాడని ఎవరో అడిగితే సహాయపురోహితుడన్నాడట 'ఆయనకి ఛసాపంకం' అని.

ఇలాంటి ధోరణిలో మాటాడేవారుంటారు. నిజమే బాగా చదువుకున్నవారు కొందరు సభలో భసాపంకంగానే మాటాడుతారు. కొందరు తల గోక్కుంటూ నీళ్ళనములుతూ మాటాడుతారు. మాటాడే చాకచక్యం కావలసినంత చదువు లేనివారి ప్రసంగంలో కానవస్తుంది ఏది ఎలా ఉన్నా చదువు సంస్కారం ఉండాలి. మాటాడే క్రమశిక్షణ కూడా ఉండాలి. ఏది లోపించినా వక్త వక్త అనిపించుకోడు. 'మాట వలన వచ్చు మన్నన ధరణిన' 'తల విలువ నోరు చెప్తుంది' 'నీ నోరు మంచిదైతే యీ వూరు మంచిదే' - ఇలాంటి ముత్యాల్లాటి లోకోక్తులు ఊరక పుట్టలేదు.

మంచి మాటకారితనానికి వేసవి చదువులు పనికిరావు. చదువూ మంచి మైత్రీ సమృద్ధిగా ఉండాలి.

ఈ గ్రంథం ముఖ్యంగా నేటి కళాశాల విద్యార్థులకు పాఠ్యంగా వెయ్యవలసేది. అలాగే పిన్నా, పెద్దా, స్త్రీ, పురుషులు శ్రద్ధగా చదివి రచయిత చెప్పిన లక్షణాలను అలవరుచుకోవాలి.

4. మాఘకావ్య వైభవం

[రచన : శ్రీ కె.వి. రాఘవాచార్యులు — వెల రూ. 4-00]

అతరం కవులలో మాఘుడు సకల లక్షణాలూ సమృద్ధిగాగల సరస్వతీ పుత్రుడు.

ఉపమకు కాళిదాసు, అర్థగౌరవానికి భారవి, పదలాలిత్యానికి దండి పేరొందిన కవులు. ఆ మూడు శక్తులూ కలవాడు మాఘుడని విద్వదుక్తి అది యధార్థం అనిపించాడు వాఖ్యాత మల్లినాథసూరి.

'మేఘే మాఘే గతం వయః' మేఘసందేశానికి మాఘ శిశుపాలవధకి వ్యాఖ్యానం వ్రాయడానికి కావలసిన గ్రంథాలు చదవడంలో మల్లినాథుని వయోబలం చాలా తరిగి పోయిందట !

కాళిదాసుకి దీపశిఖా కాళిదాసన్, భారవికి 'ఛత్రభారవి' అనే విశిష్ట బిరుద నామాలున్నాయి. ఆ తీరుగానే 'మాఘునకు' ఘంటా మాఘుడు' అనేపేరు ప్రసిద్ధమైంది.

ఈ మహాకవి కావ్యం శిశుపాలవధ. తగిన వర్ణనలతో తన కావ్యాన్ని సలక్షణంగా రూపొందించాడు. అంతేకాదు శాస్త్రవైదుష్య ప్రదర్శనకు తన కావ్యం క్రీడారంగం చేశాడని గట్టిగా చెప్పవచ్చు. ఇందలి శ్లోకాలను కొన్ని తీసుకుని శ్రీరాఘవాచార్యులుగారు తాత్పర్యం, విషయ వివరణ ఇచ్చి శిశుపాల వధ క్షుణ్ణంగా ఆమూలచూడం చదవాలని అనిపించారు. ఇంకొకటి.

భారవి కావ్యానికి పైచేయిగా మాఘుడు తన కావ్యాన్ని సంతరించాడని ఆచార్యులుగారు చూపిన విషయం స్రోపపత్తికంగా ఉంది. అది శ్రీశబ్ద ప్రయోగం.

అలాగే అలంకారిక సౌందర్యం కూడా చూపించి జిజ్ఞాసువులకు విషయబోధ చేశారు.

భారతభాగవతాల్లో ఉన్న శిశుపాలవధ విషయానికిన్నీ మాఘ కావ్యానికిన్నీ (శిశుపాలవధ విషయమై) మార్పు ఉంది. వ్యాసులవారి కథనం కన్న మాఘకవి చేసిన మార్పు సమంజసంగా ఉందని లాక్షణికదృష్టితో అంగీకరించవచ్చు.

గీర్వాణవాణీ గమనం కుంటువడిన యీ కాలములో యీలాటి కావ్యాల పరిచయం ఎంతైనా అవశ్యకం. దానికి తగినట్టు యువ భారతి వారు చేస్తూన్న సాహితీ ప్రచారకృషిలో యీ 'మాఘకావ్య వైభవం సత్ఫలదాయకం అని నొక్కి వక్కాణించవచ్చు.

అంత ఓపికగా ఎంతో విషయం వ్రాసి పాఠకలోకానికి అందించిన ఆచార్యుల వారి సత్కార్యధురీణత అభినందనీయం.

5. అన్నమయ్య

[రచన : డా॥ ముట్నూరి సంగమేశం | వెల : రూ. 3/-]

పద కవితా పితామహుడుగా పేర్గాంచిన అన్నమయ్య జీవితములో ఎలాటి ఎగుడు దిగుడులూ లేక రక్తి భక్తి సమృద్ధిగా కలవాడై జీవితాన్ని పునీతం చేసుకున్న విశిష్టాద్వైతి. దివ్యాంశ సంభూతుడుగా అతని చరిత్ర చెబుతుంది. నిజానికి ఏడుకొండలరాయణ్ణి అలా పొగడిన భక్తుడు ఇంకొకడు లేడంటే ఎవరూ ఎదిరించరనుకుంటాను. ఆయన పదాలు సంకీర్తనలుగా చెప్తారు గాయకులు.

పద కవిత నన్నయ్యకి కన్న మున్నే మన తెలుగు నాట విరివిగా పల్లెల్లో వినిపిస్తూ ఉండేది అని చరిత్రకారులు చెబుతున్నారు. అలాటి పదకవిత అన్నమయ్యధర్మమా అని ఆంధ్ర జాతి పున్నెమా అని నిండైన పండువెన్నెల్లా వెల్లి విరిసింది. అన్నమయ్య సంకీర్తనలు రాగిరేకులపై అక్షరాకృతి ధరించి యే గుహలోనో గృహంలోనో కనుచాటుగా ఉండగా వెలుగులోకి తెచ్చిన మహానుభావుడు మా అన్నయ్య. వాటిని తిరుమల తిరుపతి - దేవస్థానం వారు పుస్తకరూపంగా వెలువరించి ఆంధ్రజాతికీ సాహిత్య జగతికీ అనిర్వచనీయమైన ఉపకారం చేశారు.

భక్తి ఎన్ని విధాలు ? అనే చర్చ నాకు అనవసరం. భక్తిని ప్రతిఫలించే కవిత ఎలా వుంది? అనేది నాకు కావలసినది. దానికి ప్రథమోదాహరణం పోతనామాత్యుని భాగవతకృతి.

'ఇందు గలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోప గతుం
డెందెందు వెదకిచూచిన
అందందే కలడు-

అని నిర్ణయించి చెప్పి 'వెదకి' చూడమన్నాడాయన.

అలాటి అవ్యభిచార భక్తి 'అన్నమయ్య' సంకీర్తనల్లో కనిపిస్తుంది. ఆయన శృంగార కీర్తనలు మాధురీరస పట్ట మహిషులు. ఆయా విషయాలను శ్రీసంగమేశంగారు సుష్ఠుగా వివరించారీ చిన్నారి కృతిలో.

'మురిపెంపు నటనతో ముత్యాల మలగుపై పరవశంబున తరుణి పవళించెను. తిరువేంకటాచలాధిపుని కౌగిట గలసి ఆవిగైనను జెమటరించినదిగాన - దీనిలో చివరి పాదం ఎంత మనోజ్ఞమో వివరించాలా ?

ఇప్పుడిప్పుడే యీ సంకీర్తనలు వినవస్తున్నాయి. చాలదు ప్రచారం........ యువభారతివారు తగిన రచయితచే ఆకృతికి చిన్నదైనా చక్కని కృతి వ్రాయించారు. పొడనక్కరలేదు. చదివి ఆనందించవచ్చు. తెలిసిన వారికీ తెలియని వారికి కూడా అన్నమయ్య హృదయాన్ని తెరచి చూపిన సంగమేశంగార్ని ప్రత్యేకించి అభినందిస్తున్నాను.

6. సంస్కృత సాహితీలహరి

[వెల : రూ. 16-00]

సుప్రసిద్ధములైన ఆరు సంస్కృత నాటకాలను గూర్చి సుప్రసిద్ధులైన ఆరుగురు సాహిత్యవేత్తలు ఉపన్యసించిన విషయం గ్రంథ రూపంధరించింది. అదే యీ 'సంస్కృత సాహితీలహరి'-

భాసుని 'స్వప్నవాసవదత్తం'- ఉపన్యసించినవారు శ్రీ మానాప్రగడ శేషశాయి.

వాల్మీకి వ్యాసుల తరువాత వినిపించే పేరు 'కాళిదాసు' ఆలాటి విశ్వవిఖ్యాత కవికులపతికి కావ్యరచనలో మార్గదర్శి భాసుడు. అంతే కాదు భారతీయనాటక రచనకి ఆద్యుడు భాసుడన్నది నిర్వివాదాంశం. ఆ భాసుని నాటకాలలో ప్రథమగణ్యం 'స్వప్నవాసవదత్తం'-

మానా ప్రగడవారి తీర్పు యీ నాటకానికి సంబంధించిన లక్షణంగా ఉందని యీ వ్యాసం చదివాక అందరూ అంటారు. అనవలసిందే. కానీ విశేషించి పొగడ్తధ్వనిస్తూన్నదని నేననుకున్నాను.

కథాకథనం, పాత్రసృష్టి సంభాషణలతీరు తియ్యగా చక్కగానే వివరించారు.

రెండవది : మృచ్ఛకటికము. విమర్శకులు శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు. రూపకాలూ వాటిభేదాలూ వాటిలో ప్రకరణలక్షణానికి చెందిన మృచ్ఛకటిక స్వరూప స్వభావాలు శ్రీరామచంద్రులు వివరించిన తీరు. ప్రత్యక్షరమందూ ఆయన విద్వద్విశిష్టతను నిరుపమానంగా చాటుతూంది. పుల్లెలవారి యీ వ్యాసములో ముఖ్యంగా గ్రహించవలసింది.

'మృచ్ఛకటికంలోని కొన్ని సూక్తులు' అనే శీర్షికలో ఇచ్చిన విషయం, ఇంతలోతుగా ఒకకావ్యాన్ని విమర్శించి వివరించి విషయ ప్రదర్శనం చెయ్యడం అనేది సుఖసుఖాలఅయేపనికాదు.

ఏపాత్రచిత్రణ ఎలా జరిగింది ? దాని ప్రయోజనం ఏమిటి ? అది కథకి ఎలాసమన్వయిస్తుంది ? యీ ప్రశ్నలు ముందుంచుకుని

శ్రీరామచంద్రుల వ్యాసం చదివితే పాఠకుడు ఆమాత్రం యీ మాత్రం అక్షరాస్యుడుకూడా కృతార్థుడౌతాడని నా అభిప్రాయం. సులక్షణమైన ఆరూపకానికి సర్వలక్షణ సంపన్నమైన విమర్శవ్యాసం ఇది.

మూడవది : అభిజ్ఞాన శాకుంతలం డా॥ దివాకర్ల వేంకటావధాని. కాళిదాసకాలం, భారతకథకూ యీ నాటకకథకూ గలభేదాలూ మార్పునందలి ప్రయోజనాలూ నాటకీయతలో విశిష్టత-వివరిస్తూ దివాకర్ల వారిచ్చిన విషయం నిండుకుండలా ఉన్నది. అలాగే రసవిషయం ఆనాటి సాంఘికపరిస్థితులూ కాళిదాస కవితారీతులు వాటికి తగిన 'అనాఘ్రాతం' ఇత్యాది శ్లోకాల విషయవివరణ ప్రతీఅంకమునందలి కథా పాత్రసృష్టిలో ప్రయోజనం తొణుకూ బెణుకూలేకుండా ఉటంకించటం దివాకర్ల వారి నైజశక్తిని చక్కగా చూపుతుంది....

నాల్గవది : ఉత్తరరామచరిత్రము : డాక్టర్. ధూళిపాళ శ్రీరామమూర్తి. శ్రీరామమూర్తి విద్వత్తుకు తగిననాటకం ఆయనచేతికి వచ్చిందని సంతోషించివ్యాసం నిదానంగా చదివాను. పటిష్ఠమైన రచన.

నాటకకర్తయైన భవభూతిని గురించి ఆయనచెప్పినది 'ఔను' అని అనిపించింది.

దీనిలో కాళిదాసు ప్రస్తావన అనవసరం అనుకున్నాను. ఆ ఇద్దరూ సమకాలికులు కారుకనుక.

'వాక్ప్రౌఢి, వాగ్గాంభీర్యము, పాండిత్య వైదగ్ధ్య,స్ఫోరకత్వము' ఇవి భవభూతి కవితాత్మను పట్టియిచ్చు గుణములు -

అని యెంచి భవభూతి రచనను పిడిచి సారం ప్రదర్శించి ఆ గుణాలను సందర్భానుసారంగా చూపించి భవభూతి దర్శనంచేయించిన ఆ ధూళిపాళవారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

అయిదవది : నాగానందము. శ్రీ కొత్తపల్లి ఘనశ్యామల ప్రసాదరావు.

నాటక రచయితయైన శ్రీ హర్షుని గురించి రసమునుగురించి శ్రీ రావుగారు చెప్పినది. సర్వసమ్మాన్యమే. సందేహం లేదు.

"నాటకరచయితలలో శ్రీ హర్షునిదొక ప్రత్యేక స్థానము. కథ క్రొత్తది కాకున్ననూ నాటకముగా దానిని మలచుటలో అతని ప్రతిభ వ్యక్తమగును. కవిగా శ్రీహర్షుని స్థానము సమున్నతమని చెప్పక తప్పదు. సందర్భోచితమైన సరసమైన భాషను సహృదయ రంజకముగా అతడు ప్రయోగించుటలో చతురుడని చెప్పక తప్పదు.

శ్రీ ప్రసాదరావుగారన్న మాటలు వ్యాస సారం. ఈ విషయం అంతా వ్యాసములో చూపించారు. చక్కని వ్యాసం.

ఆరవది : ముద్రారాక్షసం. శ్రీ అవధానం చంద్రశేఖరశర్మ. నిజమే. సంస్కృత భాషలో వచ్చిన ఏకైక రాజకీయ నాటకం ఇది.

ఈ విమర్శ వ్యాసములో ముఖ్యముగా చూడవలసేది చాణక్య రాక్షసులను గూర్చి శర్మగారిచ్చిన వివరణ.

ఇరువురూ మహామంత్రులే. మహామేధావులే. రాజ్యతంత్రముల గడిదేరినవారే. ఇరువురిలోనూ స్వార్థకాంక్షలేదు. ఒకరి యుద్యమమునకు శిష్యవాత్సల్యము కారణమైనచో మరి యొకరిదానికి స్వామిభక్తి. రెండును ప్రశంసింపదగిన గుణములే.

ఈ సూత్రాలను ముందుంచుకుని శ్రీ శర్మగారు విశదీకరించడములో అద్వితీయమైన వాగ్వైశారద్యం ప్రదర్శించారు. గణనీయమై మాననీయమైన వ్యాసరచన యిది అని విషయజ్ఞుడు ముక్కువేలితో అంగీకరిస్తాడు.

యీ ఆరు నాటకాలపై వచ్చిన యీ విద్వాంసుల రచనలను పరిమితాక్షరమైన యీ సమీక్ష సమీక్షగా కాక పరిచయ వాఙ్మాత్రముగా గ్రహించవలసిందని కోరుతున్నాము.

ఈ లాటి ఉత్తమ ప్రసంగవ్యాస కృషితో భారతీయ వాఙ్మయానికి సేవచేస్తూన్న యువభారతి యాజమాన్యాన్ని విశేషించి అభినందిస్తున్నాను. ఆరిపోతూన్న దీపానికి అమరజ్యోతిగా 'యువభారతి' అంజలి ఘటిస్తూందనీ ఆవ్యవసాయానికి ఆంధ్రఘాతక సమాజం అన్నివిధాల చేయూత ఇవ్వాలనే కోరుతున్నాను.

యామిజాల పద్మనాభస్వామి

ఎచ్చరిక

[రచన:- బోయ జంగయ్య ప్రచురణ: సాహితీమిత్రులు : నల్లగొండ. వెల: రూ: 7 00]

66 పేజీల యీ పుస్తకంలో అయిదు కథలున్నాయి. కథలు తెలంగాణా రైతాంగానికి చెందినవి. కామందుల క్రింద తరతరాలుగా వెట్టిచాకిరీచేసే జీవితాలు 'ఎచ్చరిక' కథలో అతి సున్నితంగా రచయిత చిత్రించారు. 'దొంగలు' కథలో దొంగలు ప్రభుత్వ వుద్యోగులు, అమాయక రైతుని పట్టుకుని లంచాల రూపంలో కొల్లగొట్టే దొంగలు.'చెదలు' కథలో వో సామాన్య రైతు ఎన్ని విధాల బాధ పడతాడో రామన్న జీవితకథ చెప్తుంది.

ఈ అయిదు కథలూ అయిదు ముత్యాలు. రచయిత బోయి జంగయ్యగారు తాను రాసిన విషయాలలో, పల్లె జీవితాలలో పాలు పంచుకున్న వ్యక్తిగా కథలు చిత్రించారు.

ఎద్దు పుండు కాకికేం సలుపు అన్న ధోరణిలో పల్లెవాసుల కష్టాలు వారి ఖామందులకు, అప్పివ్వబోయిన ప్రభుత్వ వుద్యోగులకూ ఎందుకు అన్నసత్యాన్ని చక్కగా చూపారు.

ఇది చక్కని సంకలనం.

షాలాక్షుడు

"హంసలదీవి"

["రావూరు వెంకట సత్యనారాయణరావు. దివిసీమసాహితీ సమితి. అవనిగడ్డ. రూ 5-00.]

ఈ పుస్తకంలో ముందు 12 పేజీలలో మండలి వెంకటకృష్ణా రావుగారు "సాహితీ తపస్వి – రావూరు "అనీ, భావరాజు నరసింహా రావుగారు "పరిచయం" అనీ, రచయిత "అహోదివిసీమ" అనీ, ప్రచురణకర్తలు "మామాట" అనీ రాశారు.

అమరేశ్వరుని కొడుకు సహజానందుడు తనకవిత్వానికి ప్రాణమివ్వగల నాట్యమయూరి కోసం వెతుకుతూ నాట్యసుందరి బృందను కలుస్తాడు. ఆమె సహవాసంలో తలిదండ్రులనొదిలి వోఏడాది గడిపి, తనామెను పెళ్ళాడే విషయం తలిదండ్రులతో చెప్పడానికి వెళ్ళి, వారితో చెప్పేసరికాతని తల్లి శారదాంబ కెవ్వున కేక వేసి, చని పోతుంది. ఈ సంఘటనతో సహజానందునికి పక్షవాతం వస్తుంది. ప్రియుడు రానందున ఆత్మత్యాగం చేసుకోబోయిన బృందను అమరేశ్వరుడు ఆపి, తత్వబోధ చేసి, ఆనక కొడుకు రుగ్మత తగ్గాక వారిరువురనూ చేరుస్తాడు.

ఇది 88 పేజీల కథ. కథలో కొత్తదనం లేదు కథనం కూడా మామూలుగా వుంది. హంసలదీవి గొప్పదనమూ, ఆ స్థల వివరాలూ వున్నాయి. రచయితకు హంసలదీవి మీద నున్న మక్కువ యీ కథలోని ప్రతి పంక్తిలోనూ కనుపిస్తుంది.

భూపతి

అక్షరాస్త్రాలు

[కవితా సంకలనం] రచన: టి. గౌరీశంకర్, వెల. రు. 8-00 ప్రతులకు ; 1) రచయిత ఇం. నెం. 1-8-78/79, చిక్కడపల్లి, హైదరాబాద్-500020. 2) ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, 3287 రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్. 3) నవయుగ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సుల్తాన్ బజార్ హైదరాబాద్-500001]

అప్పుడప్పుడు రాసిన కవితలను అన్నింటినీ కలిపి అక్షరాస్త్రాలు అనే పేరుతో ఈ కవి వచన కవితా సంకలనంగా సంకలించారు. కావ్య ఇతివృత్తం – సమాజం కథాగమనం సమాజంలోని అసమానత, పాత్రలు సంఘంలోని జీవితాలు : సంఘటనలు రోజువారీ జరుగుతున్నవి.

ఈ కాలంలో కవిత్వంలో ఎవరెన్నిసార్లు చెప్పినా సంఘస్థితినే చెప్పేతీరులో వ్యత్యాసం ఒక కవిని మరో కవినుంచి వేరు చేస్తున్నది. శ్రీ గౌరీశంకర్ కవిత్వాన్ని చెప్పగల సమర్థుడు. అయితే లాంగ్ పోయెమ్‌లోకి వచ్చేసరికి వచన కవిత్వం వచనోపన్యాసంగా మారేస్థితి ఈయన కవిత్వంలో అక్కడక్కడా కనబడుతుంది. కవిత్వంలో ఉపన్యాసధోరణి అంతమంచిదిగాదు. అయినప్పటికీ గౌరీశంకర్ తన భావాలను కవిత్వంలో బలంగా చెప్పగలడనటానికి ఈ కావ్యంలోంచి చాల్తా ఉదాహరణలు ఇవ్వవచ్చు.

గుండె మంటలముందు వీళ్ళకు
ఎండ వేడిమి ఎంత?
కన్నీళ్ళలో తడిసే వీళ్ళకు
వానజల్లు ఓ లెక్కా
ఆకలి మంటలతో పిల్లు
చలిని కాచుకుంటారు
కోరికలను చంపుకొని
ఒళ్ళు ముడుచుకుంటారు

ఇట్లాంటి ఎక్స్‌ప్రెషన్ కవిత్వాన్ని కవిత్వంగా నిలుపుతుంది. తన కలమే బాణంగా, ఆలోచనే దానికి ప్రాణంగా, ఆవేశమే దాని వేగంగా ఆవేదనే దానిపదునుగా, అన్యాయంవైపు దానిని గురిపెట్టి అక్షరాస్త్రాలను వదులుతున్నారు. గౌరీశంకర్. తన అక్షరాలు ఎక్స్ కిరణాల్లై, ఎక్కు పెట్టిన బాణాలై అణువణువును శోధిస్తాయని అనుకున్నది సాధిస్తాయని ఈ కవి ఆత్మవిశ్వాసం.

చీకటి వాకిట అరబెట్టిన
రేపటి ఉదయపు కాంతివస్త్రాలివి

అన్నారు గౌరీశంకర్ తన కవిత్వాన్ని గురించి. అక్కడక్కడ కనిపించే వచనత్వాన్ని. ఉపన్యాసధోరణిని పరిహరించి ఇకముందు ఇంతకంటె శక్తివంతమైన కవిత్వాన్ని రాస్తారని ఆశిస్తున్నాను.

విద్యార్థిచతుశ్శతి (లోకాదర్శము)

[సహజకవి బాలాంత్రపు వీర్రాజు, మూల్యము రు. 9-50 ప్రతులకు : బాలాంత్రపు వీర్రాజు, శ్రీ రాజ్యలక్ష్మి నిలయము, 179/ ఎస్. ఆర్. టి., సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-500038]

ఇవి సుమారుగా నాలుగు శతకాల సమాహారం. ఒకే శతకంగా కనిపిస్తుంది. లోకం ఒక్కొక్కరికి ఒక్కొక్క పద్ధతిగా కనిపిస్తుంది. కవి తన దృక్పథంలోంచి లోకం ఎలావుండాలో చెబుతాడు. వర్తమాన సమాజం లోపభూయిష్టమయినది కనుక దానిని సరిదిద్దటానికి విద్యార్థులే సమర్థులు కనుక ఈ కవి విద్యార్థులకు అనేక విషయాలపై తన కింద పద్యాలద్వారా నీతిని, సందేశాన్ని, ఉపదేశించారు. ఉపదేశంబుద్ధి జీవులది. అనుష్టానం మిగతావారిది. ఈ చతుశ్శతిలో వివిధ అంశాలపై నీతులు, ఉపదేశాలు సూక్తులు చాలా ఉన్నాయి. మచ్చుకొక పద్యం-

"నీతులు కోతుల కొలకా
భూతలమున మనుజజాతి పుణ్యము కొలకా ?
నీతులు మనుజోన్నతికే
కోతుల కొలకేమిగాదు గో! విద్యార్థీ!"

పాట వెన్నెల మీంద నడుస్తుంది

[అజ్ఞాతసూరీడు వెల : రు. 8-00 ప్రతులకు : సృజన; హనుమకొండ-506001]

విప్లవ రచయితల సంఘం ఏర్పడిన తరువాత ప్రజాపోరాటాలు, కథలుగా, గేయాలుగా, పాటలుగా అనేక సాహిత్య రూపాల్లో ప్రజల్లోకి వ్యాపించటం మొదలైంది. జనాల బాధల గాథల్ని జనాలకు పరిచితమైన పదజాలంలో, కళారూపంలో జనాలకు అందించి వారిని ఆలోచనాపరులుగా, ఆచరణశీలురుగా తీర్చిదిద్దాలనేది విప్లవ రచయితల సంఘ ప్రధాన ఉద్దేశం. పాటనో, నృత్య గేయ నాటికనో, మరో జానపద సాహిత్య కళారూపాన్నో సృష్టించటం విప్లవ భావం ఉన్న ప్రతి రచయితకు సాధ్యం కాదు. జన జీవితంలో, వారి భాషలో వారి అభిరుచులతో, వారి అలవాట్లతో అతి సామీప్యంగా ఉన్నవారికి మాత్రమే సాధ్యపడే విషయం ఇది. ప్రతి సాహిత్య కళారూపం కూడా దాని పరిధిలో అది తన ప్రయోజనాన్ని సాధిస్తుంది. పాట ఒక సమూహాన్ని ప్రభావితం చేస్తే, వచన గేయం మరొక సమూహాన్ని ప్రభావితం చేస్తుంది. అంచేత వి.ర.సం. ఆవిర్భావంతోనో, తదనంతర కాలంలోనో వచన గేయం నిష్ప్రయోజనమైంది అనే వాదం సమంజసమైనది కాదు. అజ్ఞాత సూరీడు సృష్టించిన ఈ కవిత్వం అంతా వచన గేయ కవిత్వమే.

కవిత్వానికి వస్తుపరంగా హద్దు లేదు అని ఎవరిపరకూ వారు వారి వారి పరిధుల్లో అనుకున్నా విమర్శ వచ్చేసరికి 'కవిత్వంలో రాజకీయాలు ప్రవేశించకూడదు' 'కవిత్వం నినాదం కాకూడదు' ఇత్యాదులైన నీతిసూత్రాలను ప్రతిపాదించటం జరుగుతోంది. వర్తమాన కాలికమైన జీవితం రాజకీయమైనప్పుడు కవిత్వంలో రాజకీయం ఉండకుండా ఇంకేం ఉంటుంది? జీవితానికి, కవిత్వానికి ఏమిటి సంబంధం అనేవారితో పేచీపడవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ఈ సంకలనంలోని ప్రతి గేయం ఈనాటి పీడనకు, దాని విముక్తికి సంబంధించినదే. పీడితులు సాయుధులైతే తప్ప పీడనకు విముక్తి లేదనే విశ్వాసంతో రాసిందే. దేశాలు స్వాతంత్ర్యాన్ని కోరటం, జాతులు విముక్తిని కోరటం, ప్రజలు సాయుధ విప్లవాన్ని కోరటం ఈనాటి ప్రపంచ దేశాల మనుగడలో మహత్తర అధ్యాయం. "మావో ఆలోచన తాత్విక రంగాన్ని భయ సంకోచాల నుంచి విముక్తం చేసి, ఆలోచించడానికి సాహసించమని ఆచరించి చూపక పోతే విప్లవ జీవితంలోనూ పోరాటంలోనూ ఇంత గగుర్పాటు, పులకింత ఉండేవికావు ఉద్యమ నెలవంకలోంచి శివసాగర జల పాతాలు దూకేవి కావు. అజ్ఞాతసూరీని పాట వెన్నెలమీద నడిచేది కాదు. భూమి, సూర్యుడు, చంద్రుడు పరస్పర ఆకర్షణానుబంధంలో తిరుగుతున్నట్లే విముక్తి పోరాటమూ, విప్లవ రాజకీయ నాయకత్వమూ, పాట పెనవేసుకొని మునుసాగుతున్నాయి" అని వరవరరావు చెప్పటంలో ఈ దశాబ్దపు తెలుగుకవిత దశ, దిశ సూచింప బడుతున్నాయి.

మేం
కొందరు దౌర్భాగ్యులం
కోట్లాది నిర్భాగ్యుల కోసం
చీకట్లో, చలిలో, ఆకలితో
దోపిడీ హద్దుల్ని చెరిపెయ్యటానికి
మృత్యువుకు ఎదురు నడుస్తున్నాం

అనటానికి ఎంత దేశభక్తి, ఎంత త్యాగశక్తి ఉండాలి ? ఆ రెండూ లేని వాళ్ళు, స్వార్థమే పరమార్థమైన వాళ్ళు, సన్మాన సంరంభాలే భుజకీర్తులుగా భావించేవాళ్ళు ఇదేం కవిత్వం అని ఎగతాళీ చెయ్యవచ్చు కాని-

బతుక్కీ చావుకీ మధ్య వూపిరిపీల్చే
విశ్రాంతి సమయాల్లో రాస్తున్నానిది
నా మెదడులో కిక్కిరిసిన వేలాది ఆలోచనలు
నా కళ్ళ ముందు పరచుకొని ఉన్న
కోట్లాది ప్రజల బాధలు
ఆలోచనల్ని ఆచరణకు ముడిపెట్టే
బాధలకు పరిష్కారాలు వెతుకుతున్నాను

నే కవుల్ని ప్రజలు విస్మరించలేరు.

పర్యా

[సాగర్. వెల: రు 2-00లు. ప్రతులకు-1)పీస్‌బుక్ సెంటర్ -5-421, సుల్తాన్‌బజార్ హైదరాబాద్-1, 2) సృజన, హనుమకొండ -506001]

నక్సల్బరీ పోరాట గమనంలో
అడుగిడిన పాదాలు
అడవినీ, ఊళ్ళనూ
సొంతం చేసుకొనే తీర్తాయి
ఈ నేల సమస్తం
గెలుచుకునే నిలుస్తాయి

అనే సిద్ధాంత విశ్వాసంలోంచి ఈ కవితా సంకలనం వెలువడింది. విప్లవకవిత్వంలో కవిత్వం లేదనే అపోహ ఒకటి ఇటీవల తీవ్రంగా ప్రచురితమై ఉంది. ఒక పోరాట భావాన్ని కవిత్వంగా మలచేటపుడు విప్లవకవికి ఒక రొమాంటిక్ ఇమేజరీ కనబడుతుంది. ఆ ఇమేజరీ విప్లవభావాన్ని విప్లవకవితగా నిలబెడుతుంది. తన మార్గాన్ని ప్రకృతి ఏ విధంగా నిర్దేశిస్తున్నదీ ఈ కవి క్రింది పాదాల్లో చెబుతున్నాడు.

మహాప్రవాహాన్ని మోసే ఇసుక తిన్నెలు
మబ్బులకేసి ఆశగా, అవసరంగా
నడినెత్తిని సూరీడి కేసి ఆశావహంగా
తమ దారి స్పష్టంచేస్తూనే ఉంటాయి
అప్పుడు నీటికోసం

నా నడక అసంకల్పితం కాదు, అనివార్యం. విప్లవకవిత్వమంటే 'నరుకు' 'తెగెయ్యి' 'పొడు' 'చంపు' ఇట్లాంటి కేకలని చాలామందికి తుద్రాభిప్రాయాలున్నాయి. అవి వారు ఈ కవిత్వం మొహం కూడా చూడకుండా ఏర్పరచుకున్నవి. వస్తుద్వేషమే కవితాద్వేషంగా మారుతోంది. విప్లవకవిత్వమన్నా, విప్లవకారుడన్నా ఆషామాషీ వ్యవహారం కాదు. అది రచనలో ఒక ఫాషన్‌గా మారిన వాళ్ళసంగతి అలా వదిలితే నిజమైన వారి విషయంలో ఈ కవి చెప్పేది అక్షరాక్షర సత్యం.

కందిన చర్మం, చిట్లిననరం
రక్తపుచారిక, విప్పుకొన్న నేత్రం
ఇంకెంత మాత్రం మిమ్మల్ని వివశుల్నిచేయదు
గంటలు గడుస్తాయి - రోజులు నడుస్తాయి
చిత్రహింసలు ఆగవు, చంపవు రికార్డుకెక్కవు
అవి చరిత్రలో హంసపాదులు, చర్విత చరణాలు
ఏ విప్లవకారుడు వీటికి అతీతుడైనాడుకనుక
ఈ గానుగలో మీరు తిప్పబడరని గ్యారంటీ (!)

సత్యాదర్శనము

[కరుటూరి సత్యనారాయణ వెల : రు. 20-00 లు ప్రతులకు : 'పద్మప్రభాస' 25-7-9/1 వేమూరి వారివీధి, జయకృష్ణపురం, రాజమహేంద్రవరం - 533105]

కరుటూరి వారు మంచి కవిత్వం రాయటంలో మంచి పేరున్నవారు. తిష్యరక్షిత ఆమ్రపాలి మొదలైన వారి కావ్యాలు వారి కవితా మహత్తును తెలియచెప్పేవి. కీర్తిమీద ప్రాపగాండా మీద కాంక్షలేని కవులు ఎవరైనా ఉంటే ఆ వరుసలో కరుటూరివారు ముందుంటారు

సత్యదర్శనము అనే ఈ కావ్యం రామాయణ కథా ఘట్టానికి సంబంధించినది. రామకథను ఇప్పటికి ఎందరో తెనింగించారు. ఇది అనువాదం కాదు. స్వచ్ఛంద రచన. అందరికీ తెలిసిన కథనే కొత్త ఊహతో కల్పనతో రాయటం ఇందలి ఇది వృత్తం. తీసికొన్న కథాభాగం చాలా చిన్నది. కైక పాత్ర చిత్రీకరణ ఈ కావ్యానికి ఆయువుపట్టు. కైక దుర్మార్గురాలిగా, రాముణ్ణి తన స్వార్థంతో అక్రమంగా అడవులకు పంపిందనే భావం లోకంలో ప్రచారమై ఉంది. దానికి విరుద్ధంగా కైకను పవిత్రురాలిగా, దైవకార్యమును జరిపించుటకు ఉద్దిష్టమైన పాత్రగా కరుటూరివారు ఆ పాత్రను తీర్చిదిద్దారు.

శ్రీరామ పట్టాభిషేక సన్నాహంతో ఆరంభమైన ఈ కావ్యం భరద్వాజుని బోధతో ముగుస్తుంది. ఆయా ఘట్టాల్లో కథను నడిపిన తీరు, పద్యరచనా సంవిధానం విద్వల్లోకం మెచ్చతగినదిగా ఉండటం

ఈ కావ్యలక్షణం. భరతుడు తల్లిమీద కోపగించినపుడు కైక తన అంతర్యాన్ని భరతునికి చెప్పే తీరును కవిగారు ఎంతో ఉదాత్తంగాను, ఉచితంగానూ తీర్చిదిద్దారు.

"నాకున్ రామునిపైని బ్రీతి గలుగన్
నా తండ్రి నేనేమియున్
సాకుల్ చెప్పి వనప్రవాసమును మో
సంచేదో సేయంగ లే
దే కైలాటము గానిపింప దెవరిన్
హింసించు ధ్యేయమ్మా లే
దే కార్పణ్యము గోచరింప దెచటన్
హేయమ్ముకాదెమ్మెయిన్"
"మానవేంద్రుని మృతిమౌని శాపమ్మును
దప్పింప నెవ్వరి తరముకాదు
పుత్రశోకము కాక పుత్రి వియోగమ్ము
కారణమ్ముగ రాజు ...."

కాలధర్మం చెందేటట్లు చెయ్యటం కైక తన బాధ్యతగా స్వీకరించింది. భరతుడికీ సత్యదర్శనం తరువాత భరద్వాజుడు కూడా కలగ చేస్తాడు.

ఈ కావ్యానికి దివాకర్లవారు మంచి పీఠిక రాశారు. మధునాపంతులవారిక ఈ కావ్యం అంకితం అవ్వటం వారి మైత్రికి నిదర్శనం. కరుటూరివారు ముందు ముందు వారి కావ్యరచనతో ఇంకా మహత్తర కావ్యాలు అందిస్తారని ఆశిద్దాం.

"పుష్యమి"

రక్తనేత్రోదయం

[రచన : సుమనశ్రీ వెల : రు. 5-00. ప్రతులకు :
1. దేశీ బుక్‌హౌస్; నారాయణగూడ; హైదరాబాద్ - 500029.
2. నవయుగ బుక్‌హౌస్; సుల్తాన్‌బజార్, హైదరాబాద్ - 500001.
3. దేశీబుక్ డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ-2.

కన్నుపొడుచుకున్నా కానరాని చీకటి
నిరాశలు బుసలుకొడుతున్న వాకిలి
వర్తమాన జీవితం ఊసరవిల్లి!
పొడుపు కొండమీద పెద్ద ప్రశ్నార్థకం
ఇదే నేటి సమాజం అడ్డుకోత"

సమాజపు అడ్డుకోత పటంచూచి ఉగ్రరూపం దాల్చి ర నేత్రంతో ఉదయించిన కవి సుమనశ్రీ. వృత్తి ఇంజనీరు; ప్రవృ కవిత్వం. కవులు రెండు విధాలు. సమాజాన్ని పట్టించుకొనే కవు పట్టించుకోని కవులు. సమాజాన్ని పట్టించుకొనే కవుల్లో మళ్ళీ రెం రకాలు. కాలాన్ని ముందుకు నడిపే కవులు. వెనక్కు మళ్ళి ప్రయత్నంచేసే కవులు. సుమనశ్రీ గారు సమాజాన్ని ఏ కొంచెమై ముందుకు నడిపించాలనే ప్రయత్నంతో కవిత్వం రాస్తున్నారు.

వచన కవిత్వం కవిత్వం కాదనే వాదులతో పేచీ లే అలాగే వచన కవిత్వం ఎవరైనా రాయవచ్చు అనే వాదులతో కూ పేచీ లేదు. సుమనశ్రీ గారు రాసింది వచన కవిత్వం. ఆ కవిత్వంలో కవిత్వం ఉంది; కథనం ఉంది; సమాజం పట్ల త వేదన ఉంది. ఈ వ్యవస్థాపీడిత దయనీయ గాథల్ని తన కవిత్వ చిత్రించాడు. ఈ సమాజంలో కులాలున్నాయి; మతాలు ఉన్నా ధనం ఉంది; దారిద్ర్యం ఉంది; ఆనందం ఉంది; విషాదం ఉం శ్రమ ఉంది; దోపిడీ ఉంది. వీటన్నింటినీ తన కవిత్వంలో పరిధిలో పాఠకునికి అందేటట్లుగానూ, అతన్ని ఆలోచింప చేసే గాను చిత్రించారు సుమనశ్రీ. "సమ సమాజాన్ని సృష్టి ప్రయత్నంలో పాఠకులలో ఆలోచనను రేకెత్తించటానికీ, సంస్కా వంతుల్ని చేయడానికీ, తద్వారా జనవిప్లవానికి దోహదపడటా కవిత్వం ఒక శక్తివంతమైన సాధనంగా నేను నమ్ముతున్నాను" అంటూ సుమనశ్రీ గారు ఆ మార్గంలో తన కవితారచనను పరిపుష్ట చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

"సుఖంగా కళ్ళుమూసుక నిద్రపోలేని ధనం
ఆకలి కడుపుల నెత్తురుతో
తడిసిన భూముల్లో పండి
కూనిరాగాలు తీస్తూ
ఇనప్పెట్టెలలో మూల్గుతోంది వెచ్చగా"

ఆ ధనాన్ని సమాజపరం చెయ్యటానికే ఈనాటి మేధావులు కవులూ, రచయితలూ, కళాకారులూ కృషి చెయ్యవలసింది.

టి. యల్. కాంతారావు

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 61247.


అమృతాంజన్‌కే
తెలుసు
ఒంటి నొప్పులు
మరియు
బెణుకుల బాధ
మృదువైన మూలపదార్థము వల్ల
ఉపయోగించుట సులభము
క్రొత్త కార్కు అమరిక వల్ల
మందు శక్తికి రక్షణ
AMRUTANJAN
Pain Balm
AMRUTANJAN
PAIN BALM
1984 ఒలింపిక్స్ క్రీడలలో
పాల్గొన్న భారత క్రీడాకారులకు
అధికారపూర్వకంగా పెయిన్ బామ్
సరఫరా చేసినవారు.
అమృతాంజన్
ఏ ఇతర బాధలు కల్గించని
శీఘ్ర నివారిణిని నమ్మండి
OBM 8777 TG